# తెలుగుభాషా బోధన

# (TEACHING OF TELUGU)

## మొదటి సంవత్సరం

**(FIRST YEAR)**

ఆకర గ్రంథం

**(SOURCE BOOK)**

## ఉపాధ్యాయ శిక్షణ డిప్లొమా కోర్సు

**(DIPLOMA IN TEACHER EDUCATION)**

అస్పృశత నేరం

అస్పృశత పాపం

అస్పృశత అమానుషం

**తమిళనాడు పాఠ్యపుస్తక సంస్థ**

కాలేజిరోడ్డు, చెన్నై - 600 006

**TAMILNADU TEXTBOOK CORPORATION,**
**COLLEGE ROAD, CHENNAI - 600 006.**

© Government of Tamilnadu
First Edition - 2008

**CHAIRPERSON**

**K.NARAYANA PILLAI**
DEEO (Retd), Hosur.

**REVIEWER**

**Dr.THUMATI SANJEEVA RAO**
P.G.Asst in Telugu, Chennai.

**CO-ORDINATOR & AUTHOR**

**L.UMA**
Jr. Lecturer, DIET, Krishnagiri.

**AUTHORS**

**M.ETHIRAJULU**
Jr. Lecturer, DIET, Krishnagiri.

**K.BALAKRISHNAN**
Jr. Lecturer, Govt.TTI, Ranipet.

**Price: Rs.**

This book has been printed on 70 GSM paper

This book has been prepared by the Directorate of Teacher Education Research and Training on behalf of the Govt.of TamilNadu.

## Foreword

“**KNOWLEDGE** is that which is acquired
through personal experiences”

**-Thiruvalluvar**

The paramount duty of schools is to provide quality education through a curriculum frame work. Quality education is comprised of dimensions like enriching the innate potential of learners, inculcation of self-discipline, enabling the students to assimilate the best learning experiences in every subject and creating interest in learning among students.

Curriculum is revised from time to time based on the changing needs of learners and their environment.NCERT, New Delhi has designed National Curriculum Frame Work 2005 (NCF 2005) bearing in mind the contextual and professional needs of all the stakeholders of education.

The following five cardinal principles of NCF 2005 have been assimilated into teacher education curriculum and in the source books of Elementary Teacher Education which are to be introduced in 2008-2009.

- Connecting knowledge to life outside the school
- Ensuring that learning shifts away from rote methods
- Enriching the curriculum so that it goes beyond text books
- Making Examinations more flexible and integrating them with classroom life.
- Nurturing an overriding identity informed by caring concerns within the democratic policy of the country.

The Curriculum developed by DTERT is likely to develop the following skills in student –teachers of Elementary Teacher Education:

- The ability to seek knowledge continuously
- Skill of applying acquired knowledge to various situations
- Skill to realize the inner potential and live in harmony with others accordingly and learn to live in coordination with the members of the society
- Mastery of learning in all the subjects
- Skill for doing constructive activities
- The proficiency of student-teachers in innovations doing Research and the ability to think teleological.

The Curriculum has the following objectives:

- To enhance the professionalism of student-teachers and develop their holistic personality
- To nurture values such as national integration, milk of human kindness and moral values
- To give importance to Adolescence Education, Health Education, Life Skills Education, Environmental Education, Road Safety and Peace Education.

To facilitate the realization of the above objectives, eight subjects and nine practicum have been prepared by a team of authors for the two year Diploma in Teacher Training Education Course. They are viz.

| **1st Year** | **2nd Year** |
|---|---|
| Learning Child | Indian Education System |
| Facilitating and Enhancing Learning | Facilitating and Enhancing Learning |
| Teaching of Tamil Language | Teaching of Tamil Language |
| Teaching of Malayalam | Teaching of Malayalam |
| Teaching of Telugu | Teaching of Telugu |
| Teaching of Urdu | Teaching of Urdu |
| Early Childhood Care and Education | Early Childhood Care and Education |
| Teaching of English | Teaching of English |
| Teaching of Mathematics | Teaching of Mathematics |
| Teaching of Science | Teaching of Science |
| Teaching of Social Science | Teaching of Social Science |

**DTE Practicum**

| 1st Year | 2nd Year |
|---|---|
| Child observation and case studies | Projects |
| School Visits | Art Education and Work Experience |
| Story Telling | Computer education |
| Physical Education, Health Education | Physical Education, Health Education, |
| Yoga | Yoga |
| Self-Development Workshop | Self-Development Workshop |
| Teaching of Learning Materials | Teaching of Learning Materials |

Learned and Eminent scholars like Dr.P.S.Balasubramaniyam, Former HOD,Department of Education, University of Madras, Dr.Swaminathapillai, Former Director, Distance Education, Bharathiyar University,Dr.S.Lakshmi, Former Vice-Chancellor, Mother Theresa Women's Univerity,Thiru.V.Ganapathy, Former Professor, IASE, Chennai, Mrs.G.Pangajam, Vice-Chancellor, Gandhigram Rural University,Dindigul, Dr.Subbammal, Former Vice-Chancellor,Vinayaga Missions University, Pondicherry, Dr.Kumaran, Prof&Head, Department of Education,University of Madras and Dr.S.Krishnamoorthy, Annamalai University, Chidambaram have studied different books published by scholars and given simplified instructions to the team for producing quality source books.

Each source book has Educationists from Universities, DTERT, IASE, and Colleges of Teacher Education as authors and reviewers. Prominent educationists have reviewed the source books and refined the books. Regional Coordinators have also contributed to the quality of the books. Besides, Dr.C.K Lilly from Kerala University, S.Syed Sajith, HOD, Department of Urdu, University of Madras, Mrs.Lalitha, Academic Consultant of Adarsh Educational Insitutes, Chennai and K.Narayana Pillai, Former DEEO has served the team as Chairpersons of Minority Language Subject Source Books.

Substantial Contribution has been provided by A.M.Murthy, Former Senate Member of Alagappa University, Karaikudi, Sumitra A.Gowthama, educationist from 'The School' and Educational NGOs such as Amuktha Mahapatra, Balaji Sampath and AID India pvt.limited, Thiru.T.N.Arulanandan, Vedantri Maharisha Association Member, Assistant Professor and T.Parasaraman, Institute of Culture and Languages, Pondicherry.

There is a paradigm shift from teaching to self-learning through Activity Based Learning strategy. These new source books have been designed with self-learning through Activity Based Learning strategy. These new source books have been designed with self-learning activities enabling student teachers to master various concepts and skills. The source books shall guide student teachers to explore library resources to reinforce their teaching strategies to ensure maximum learning among children to improve their skills of observation, classroom management, content knowledge, skill to use TLM and TLE appropriately, Leadership traits and Knowledge of Child Psychology.

Source books are not text books. They are simply guides which show where resources are available for reference and learning. From the identified resources needs are to be expanded. The duties of the teacher educators are to learn understand, analyze, consolidate and evaluate. The duties of the student teachers are to assimilate teaching ideas and learn well to become reflective practitioners.

I commend all the educationists and teacher educators involved in process of preparing the source book and also congratulate the prospective student teachers who are likely to be benefited from the Diploma in Teacher Education Source Books.

**DIRECTOR**
**Directorate of Teacher Education,**
**Research and Training,**
**Chennai – 600 006.**

# ప్రవేశిక

దేశభవిష్యత్తు తరగతిగదిలో నిర్ణయించబడుతుంది. తరగతివాతావరణంలో బోధనకార్య కమాన్ని నిర్వహించే గణనీయమైన పా త ఉపాధ్యాయునిదే. కాబట్టి ఉత్తమఉపాధ్యాయుల్ని తయారుచేయడానికి తమిళనాడులో ఉపాధ్యాయ శిక్షణకేం దాలు సమర్థవంతంగా నిర్వహింపబడు తున్నాయి. నూతనవిద్యాపథకం సార్వజనీనమైన గుణాత కవిద్యను విస్తరించేదిశగా పటిష్ఠమైన ఉపాధ్యాయశిక్షణా పణాళికను రూపొందించింది. నేటిఅవసరాలకు అనుగుణంగా ABL, మొదలైన బోధనఅభ్యసన కృత్యాలను దృష్టిలో ఉంచుకొని, రాష్ట్ర పభుత్వ ఉపాధ్యాయవిద్య పరిశోధన మరియు శిక్షణ సంచాలకుల మార్గదర్శకసూ తాలకు అనుగుణంగా పభుత్వ పాఠ్య గంథసంస్థ తెలుగుభాషాబోధన (మొదటి సంవత్సరం) ఆకర గంథాన్ని వెలువరించింది.

ఈ గంథనిరా ణ కోసం పభుత్వ శిక్షణ కేం దాలలోని ఉపన్యాసకులతో మరియు అనుభవజ్ఞుల తో ఒకకమిటీ ఏర్పాటుచేయబడింది. ఆ కమిటీ విద్యారంగంలోని లబ్ద పతిష్టులైన రచయితల సహ కారాన్ని స్వీకరించి అనుభవజ్ఞులను సం పదించి ఆకర గంథాలను పరిశీలించి ఈ గంథాన్ని తయారు చేయడం జరిగింది.

తెలుగుభాష బోధనలక్ష్యాలను సమర్థవంతంగా సాధించడానికి ఉపాధ్యాయశిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఉపయుక్తంగా ఇది కూర్చబడింది. శిక్షణకార్యకలాపాలలో తరగతిలో నిర్వహించబడే సైద్ధాంతికబోధన చర్చలకు అనుబంధంగా స్వీయఅభ్యసనకృత్యాలు ఇందులో పొందుబరచబ డినాయి. శిక్షణార్థుల జ్ఞానరంగానికి మానసికచలనాత కరంగానికి అన్వయం కుదర్చబడి పటిష్ఠమైన సమ గమైనశిక్షణకు అవకాశం కల్పించబడింది.

ఈ గంథం ఇటు శిక్షణార్థులకు అటు ఉపాధ్యాయులకు ఉపయుక్తంకాగలదని విశ్వసిస్తున్నాం. నిరా ణాత కమైన సూచనలు ఈ పయత్నానికి మరింత పరిపుష్టిని కూర్చగలవని భావిస్తున్నాం.

-రచయితలు

**DIPLOMA IN TEACHER EDUCATION**
**TELUGU LANGUAGE - SYLLABUS**

# మొదటి సంవత్సరం

తెలుగు భాషా సామర్థ్యాలు

ఒకటవ తరగతి నుంచి పదవతగతి వరకు గల తెలుగు పాఠ్య గ్రంథాలలోని వివిధ పాఠ్యాంశాల ప
రిజ్ఞానం ఛా త్రోపాధ్యాయులు కల్గి ఉండాలి.

అ. పద్యకృతులు

1. కవి త్రయం  2. పోతన  3. శ్రీనాథుడు

ఆ. శతకాలు

1. వేమనశతకం  2. సుమతి శతకం  3. దాశరథి శతకం

ఇ. గద్యసాహిత్యం

1. చిన్నయసూరి  2. పానుగంటి లక్ష్మీనరసింహం

ఈ. ఆధునిక సాహిత్యం

1. గురజాడ  2. శ్రీశ్రీ  3. రాయ ప్రోలు సుబ్బారావు.

4. సి.నా.రె.

ఉ. వ్యాకరణం

క్రింది పేర్కొన్న వ్యాకరణాంశాలను గురించిన అవగాహన పొందడంతో పాటు తగిన విధంగా ఉప
ప్రయోగించగల

సామర్థ్యాన్ని పొందగలరు.

1. వర్ణమాల  2. భాషాభాగాలు  3. లింగాలు

4. వచనాలు  5. విభక్తులు  6. కాలాలు

7. క్రియలు

ఊ. సృజనాత్మకత

ఛా త్రోపాధ్యాయులు భాషాసామర్థ్యాలను పెంపొందించుకోవడానికి అభ్యాసాలు చేయడం.

1. కథలు లేదా వ్యాసాలను సంభాషణరూపంలో మార్చడం.

2. కవితలు, కథానికలు వ్రాయడం, నాటకాలు వ్రాయడం.

3. లేఖలు

- వ్యక్తిగత లేఖలు
- వ్యాపారలేఖలు
- సాంఘిక లేఖలు

## మొదటి సంవత్సరం

### అధ్యాయం - 1

| భాష - స్వరూప స్వభావాలు | అభ్యసన కృత్యాలు |
|---|---|
| భాష - అర్థం - నిర్వచనాలు<br>భాష - ఉద్దేశ్యాలు - ప్రయోజనాలు<br>భాష - భావనలు<br>గ్రాంథిక భాష<br>వ్యావహారి భాష<br>మాండలి భాష<br>వాగూపభాష- లిఖిత భాష<br>భాష - సంస్కృతి<br>భాష- సాహిత్యం - రసాస్వాదన<br>భాషాబోధన ద్వారా ఉత్తమ పౌరుడుగా రూపొందించడం. | - గ్రాంథిక రూపంలో ఉన్న (చిన్నయసూరి) నీతిచంద్రిక వంటి వివిధ తరగతి విద్యార్థులకు ఉపయుక్తమైన కథలను సేకరించండం.<br>- ఆధునిక కాలంలోని వ్యావహారిక రూపంలో పిల్లల కథలను కొన్నింటిని సేకరించడం. పైన పేర్కొన్న కథలలోని గ్రాంథిక, వ్యావహారిక శైలీ భేదాలను ఛాత్రోపాధ్యాయులు గుర్తించడం.<br>- ఆయా ప్రాంతీయ మాండలిక పదాలను సేకరించడం, వాటి ఉచ్చారణ భేదం, ప్రయోగ వైశిష్ట్యాన్ని గుర్తించడం. |

### అధ్యాయం - 2

| భాషాబోధన | |
|---|---|
| (అ) తెలుగుభాషాబోధన - ఉద్దేశ్యాలు<br>బోధన మాధ్యమంగా తెలుగు - ప్రయోజనాలు<br>మాతృభాష<br>ప్రథమభాషగా తెలుగు<br>ద్వితీయభాషగా తెలుగు<br>తృతీయభాషగా తెలుగు<br>(ఆ) ధ్వని - ఉత్పత్తి<br>భాషాధ్వనులు - వాగవయవాలు<br>- ధ్వనులు-ఉచ్చారణ-లోపాలు- కారణాలు<br>- నివారణ | - తెలుగుసంస్కృతికి సంబంధించిన ప్రాంతీయ కళలు, పండుగలు/పబ్బాలను గురించి వివరాలను సేకరించడం.<br>- ఉత్తమపౌరునికి ఉండవలసిన లక్షణాలను గురించి చర్చావేదికను నిర్వహించడం. |

## అధ్యాయం - 3

| భాషా నైపుణ్యాలు | |
|---|---|
| శవణం, భాషణ, పఠనం, లేఖనం<br>1) భాషా గహణ నైపుణ్యాలు - శవణ, పఠనాలు<br>2) భావ నైపుణ్యాలు - భాషణ, లేఖనాలు<br>- భాషా నైపుణ్యాలు పెంపొందించుటకు మార్గాలు<br>(అ) శవణ, భాషణ నైపుణ్యాలు పెంపొందించుటకు మార్గాలు - అభ్యాసాలు<br>(ఆ) పఠన నైపుణ్యం పెంపొందించుటకుమార్గాలు- అభ్యాసాలు<br>మౌనపఠనం, పకాశపఠనం<br>క్షుణ్ణపఠనం, విస్తార పఠనం<br>(ఇ) లేఖన నైపుణ్యం పెంపొందించుటకు మార్గాలు- అభ్యాసాలు<br>ఉక్తలేఖనం, దృష్టలేఖనం | - వివిధస్థాయిలలో (అర్థవంతమైన) ఉచ్చారణ భేదాలను విద్యార్థులు గుర్తించేటట్లు క్యాసెట్లు తయారుచేసి వినిపించడం.<br><br>- పిల్లలచేత వివిధ అంశాలను సంభాషింపచేయడం. రికార్డు చేయబడిన నమూనా సి.డి.లను పదర్శించడం, భాషణ లోపాలను గుర్తించడం. వాటి నివారణకు సూచనలు చేయడం.<br><br>- విద్యార్థులకు గంథాలయ పఠనకు సిద్ధపరచడం.<br><br>- ఛా తోపాధ్యాయులు తాము చదివిన పుస్తకాలను సమీక్షించి నివేదికను సమర్పించడం. |

## అధ్యాయం - 4

| భాషాబోధన పద్ధతులు | - పాచీన పసిద్ధమైన, శావ్యంగా ఉన్నపద్యాలు, గేయాల క్యాసెట్టులను సేకరించి వినిపించడం. |
|---|---|
| - గద్యబోధన, ఉద్దేశ్యాలు - లక్ష్యాలు,<br>- పద్యబోధన - ఉద్దేశ్యాలు - లక్ష్యాలు<br>- ఉపవాచకబోధన - ఉద్దేశ్యాలు - లక్ష్యాలు-<br>- వ్యాకరణబోధన<br>ఆగమనపద్ధతి, నిగమనపద్ధతి పాయోగికపద్ధతి | - తెలుగు సంధులు, సంస్కృతసంధులను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడం. |

## అధ్యాయం - 5

| | |
|---|---|
| బోధన సామర్థ్యాలను పెంపొందించడం<br>– ఛాత్రోపాధ్యాయులకు (Student- Teacher)<br>పరిశీలన(Observation) ఆవశ్యకం<br>– పరిశీలన విధానాలు<br>పరిశీలన పత్రాలను పూర్తిచేయడం<br>లోపాలను సరిదిద్దుకోవడం<br>బృందబోధన<br>స్వీయఅభ్యసన<br>సమాచార సేకరణ సామర్థ్యం<br>భాషాబోధన – గ్రంథాలయాలు<br>పఠనాలయాలు<br>మూల గ్రంథాలు<br>పరామర్శ గ్రంథాలు<br>బొమ్మలు వర్ణించడం<br>క్విజ్ | – దిన, వార, మాసపత్రికలలో వెలువడే సాహిత్య వ్యాసాలను సేకరించడం.<br>– చిన్న చిన్న బోధనాంశాలను విద్యార్థి జట్టులకు బోధించి తోటి విద్యార్థుల నుండి అభిప్రాయాలను (Feed Back)సేకరించడం.<br>– ప్రతి అధ్యాయానికి ప్రశ్నలు రూపొందించి క్విజ్ (ప్రశ్నావళి) నిర్వహించడం.<br>– పరామర్శ గ్రంథాలను సేకరించడం – వర్గీకరించడం. |

## అధ్యాయం - 6

| | |
|---|---|
| పాఠపథకం<br>– పాఠపథకం – తయారుచేసే విధానాలు<br>వృత్తిపూర్వ (Pre-Service)<br>వృత్త్యంతర (In-Service)<br>పాఠపథక నిర్మాణంలో ఉన్నభేదాలు<br>పాఠపథకం<br>పద్యభాగానికి<br>గద్యభాగానికి<br>వ్యాకరణానికి<br>ఉపవాచకానికి<br>విడివిడిగా వ్రాయడం | – పాఠ్యపథక సోపానాలను తయారుచేయడం.<br>– ప్రాథమిక స్థాయిలో వివిధ తరగతులకు బోధనోపకరణాలను తయారుచేయడం. |

## ఛాత్రోపాధ్యాయులకు కృత్యాలు

| వ.సంఖ్య | అధ్యాయాలు | ఛాత్రోపాధ్యాయులు చేయవలసిన కృత్యాలు |
|---|---|---|
| 1. | భాషా స్వరూప స్వభావాలు | 1. సరళ గాంధికరూపంలో ఉన్న పరవస్తు చిన్నయసూరి రచన నీతిచంద్రిక వచన గ్రంథం నుంచి వివిధస్థాయిల్లోని తరగతి విద్యార్థులకు (మూడవతరగతి నుంచి 5 వరకు) ఐదేసి కథలను సేకరించి శీరికలను పట్టికగా ఇవ్వండి.<br>2. మీకు తెలిసిన ఒకకథను సరళ గాంధిక భాషలో వ్రాయండి.<br>3. గ్రాంథిక రూపంలోని పదివాక్యాలను సేకరించండి. తర్వాత వాటిని సమానమైన వ్యావహారిక వాక్యాలుగా మార్చి వ్రాయండి.<br>4. వివిధ దినపత్రికలను పరిశీలింపజేసి వ్యావహారికభాషా పదాలనుకనీసం5 0 ని సేకరించి వాటిని పట్టికలో వ్రాయండి.<br>5. తరగతిలోని భిన్నమైన మాండలికంతో మాట్లాడే విద్యార్థుల భాషణాన్ని పరిశీలించి వారి సంభాషణల నుంచి పది వాక్యాలను వ్రాయండి. |
| 2. | భాషా బోధన | 1. వేమన పద్యాలు నాల్గింటిని, సుమతీ శతకపద్యాలు నాల్గింటిని వ్రాయండి. విద్యార్థులలో సత్ప్రవర్తనకు,నైతిక విలువలు పెంపొందించడానికి అవి ఏవిధంగా తోడ్పడుతాయో నివేదికగా సమర్పించండి.<br>2. ముఖయంత్రాన్ని చిత్రించి భాగాలను గుర్తించండి.<br>3. ఉచ్చారణదోషాల నివారణకు కొన్ని కృత్యాలను రూపొందించండి. తరగతిగదిలో వాటిని నిర్వహించండి.<br>4. జట్టులుగా చేరి వాగ్దోషాలకు కారణాలను చర్చించండి. నివారణ మార్గాలను సూచించండి. నియోజనంగా సమర్పించండి.<br>5. మీ తెలుగు వాచకాలలోని పాఠాలలోని అంశాలను విషయజ్ఞానం, భాషాజ్ఞానం, సాహిత్యజ్ఞానం కింద ఏవిధంగా వర్గీకస్తారో చర్చించండి . నియోజనంగా సమర్పించండి. |

| వ.సంఖ్య | అధ్యాయాలు | ఛా తోపా ధ్యాయులు చేయవలసిన కృత్యాలు |
|---|---|---|
| 3. | భాషా నైపుణ్యాలు | 1. వివిధస్థాయిల్లో అర్థవంతమైన ఉచ్చారణ భేదాలను విద్యార్థులు గుర్తించేటట్లు రెండుక్యాసెట్లు తయారుచేసి తరగతిలోవినిపించండి.<br>2. చక్కటి కథలను పదింటిని ఎంపిక చేయండి.తరగతిలో విద్యార్థులకు వినిపించండి. తర్వాత ఒక్కొక్కరిచే కథను సొంతమాటల్లో చెప్పించండి. వాటిని పట్టికగా పేర్కొనండి.<br>3. నాటకీకరణం చేయించడానికిరెండు కథలను సేకరించి చక్కని నటనతో వారిచే పా తాభినయం చేయించండి.<br>4. కొన్ని అంశాలను ఇచ్చి అప్పటికప్పుడే పిల్లలచే ఉపన్యసింపజేయండి.<br>5. తోటి ఛా తోపాధ్యాయులు చేసే లేఖన దోషాలను కొన్నింటిని తెల్పి,వాటి నివారణకు ఐదు చర్యలు వాయండి.<br>6. ఏదేని ఒక శీరిక తీసుకొని వ్యాసరచన చేయండి. రచనదోషాలు లేని ఆదర్శవంతమైన ఆ వ్యాసాన్ని తరగతిగదిలో చార్టుపై పదర్శించండి. |
| 4. | బోధనపద్ధతులు | 1. వివిధ లేఖల నమూనాలను 5వ తరగతి విద్యార్థులను దృష్టిలోపెట్టుకొని తయారుచేయండి.<br>2. మీవాచకంలోని పాచీన సాహిత్యానికి చెందిన ఒకపద్యానికి పూర్ణ పద్ధతిలో బోధించడానికి పాఠ్య పణాళికను తయారుచేయండి.<br>3. ఒక ఆధునికగేయాన్ని తీసుకొని ఖండపద్ధతిలో పాఠ్య పణాళికను తయారుచేయండి.<br>4. పశసంనపద్ధతిలో బోధించడానికి ఏదైనా ఒక పద్యభాగానికి పాఠ్య పణాళిక తయారుచేయండి.<br>5. పాథమిక తరగతుల్లో గద్యభాగంలోని కొత్తపదాలను ఏవిధంగా పరిచయం చేస్తారో వివరించండి.<br>6. తెలుగులోని పసిద్ధమైన గంథాల పేర్లను సేకరించి పట్టికను తయారుచేయండి. |

| వ.సంఖ్య | అధ్యాయాలు | ఛా త్రోపా ధ్యాయులు చేయవలసిన కృత్యాలు |
|---|---|---|
| 5. | బోధనసామర్థ్యాలను పెంపొందించడం | 1.బృందబోధనను తరగతిగదిలో అన్వయించండి. ఫలితాలను పట్టిక పరచండి<br>2.సమాచార సేకరణకు ఉపయుక్తమయ్యే వివిధ ఆధారాలను పట్టిక - పరచి వివరించండి.<br>3. గంథాలయాలు : మీ ఊరి గంథాలయానికి వెళ్ళి పరామర్శక గంథాలను/మూల గంథాల వివరాలను సేకరించండి.<br>4.పది ఆకర గంథాలను సేకరించి పేర్కొనండి, పట్టిక ఇవ్వండి.<br>5. పది పరామర్శక గంథాలను సేకరించి పట్టిక రాయండి.<br>6. సృజనాత కతకు అవకాశమిచ్చే బొమ లను ఐదింటిని సేకరించి వర్ణించి వాటిని తరగతిలో పదర్శించండి.. ఉత్తమమైన వాటిని ఎంపికచేసి పాఠశాల బులెటిన్ బోర్డులో పదర్శించండి.<br>7. 5వ తరగతి విద్యార్థులకు తెలుగులో క్విజ్‌ను నిర్వహించండి. |
| 6. | పాఠపథకం | పద్య,<br>గద్య,<br>ఉపవాచక,<br>వ్యాకరణాంశాలకు - పాఠపథకాన్ని తయారుచేయండి. |

# తెలుగుభాషా బోధన

## విషయసూచిక


| వ.సంఖ్య | వివరాలు | పుటసంఖ్య |
|---|---|---|
| | విభాగం - అ | |
| 1. | భాషా సామర్థ్యాలను పెంపొందించడం. | 1 |
| | విభాగం - ఆ | |
| 1. | భాష - స్వరూప స్వభావాలు | 8 |
| 2. | భాషాబోధన | 26 |
| 3. | భాషా నైపుణ్యాలు | 65 |
| 4. | భాషా బోధనపద్ధతులు | 103 |
| 5. | బోధన సామర్థ్యాలను పెంపొందించడం | 135 |
| 6. | పాఠపథకం | 148 |
| | అనుబంధాలు (**annexure)** | 169 |
| 1. | సమగ్రపథకం (Blue Print) | |
| 2. | మాదిరి ప్రశ్నాపత్రం (Model Question Paper) | |
| 3. | అంతరమూల్యాంకనం (Internal Assessment) | |
| 4. | సహకరించిన గ్రంథాలు (Bibliography) | |

విభాగం : అ

# తెలుగుభాషా సామర్థ్యాలు

కవులు : ఒకపరిచయం.

వాఙ్మయం, సారస్వతం, సాహిత్యం అనే పదాలు సామాన్య జనవ్యవహారంలో సమానార్థ కాలుగా ప్రయోగిస్తున్నారు. వాఙ్మయమనే పదం తక్కిన వాటికంటే విశాలమైనది. గ్రంథస్థము లయ్యే వాటితో పాటు వాగ్రూప రచనలను సంభాషణలు, ఉపన్యాసాలు, పద్దులు, ఉత్తరాలు ఇత్యాదులన్నీ వాఙ్మయంలో చేరుతాయి. ఇది రెండు విధాలు. ఒకటి శాస్త్ర వాఙ్మయం. రెండు కావ్య వాఙ్మయం. శాస్త్రం బుద్ధిగమ్యం. వ్యాకరణం, అలంకారశాస్త్రం మొదలైనవి అభిమానం గలవారు మాత్రమే చదివి జ్ఞానాన్ని పొందుతారు. కావ్యం శాస్త్రం వలె కేవల జ్ఞానార్జన పరిమితం కాదు. విజ్ఞానాన్ని, ఆనందాన్ని కల్గించే రచనలన్నీ కావ్యవాఙ్మయంగానే పరిగణింపవచ్చు.

'రమణీయార్థ ప్రతిపాదకః శబ్దః కావ్యమ్' అని జగన్నాథుడు రసగంగాధరంలో కావ్యాన్ని నిర్వచించి ఉన్నారు. సర్వజనాను రంజకత్వం, సుందర శాబ్దిక రచన, రసానంద జనకత్వము ఈ మూడు లక్షణాలు సమగ్రంగా ఉన్న గ్రంథం చిన్నదైనా, గ్రంథస్థమైనా కాకున్నా, పద్యమైనా, గద్యమైనా, గేయమైనా కావ్యమనిపించు కొంటుంది.

సారస్వతం :

సారస్వత మనే పదం వాఙ్మయ పదమంత విస్తృతమైన అర్థం కలది కాదు. లిఖితమైన లేక గ్రంథస్థమైన సర్వశాస్త్ర కావ్యసమూహమంతా సారస్వత మనబడుతుంది. సరస్వతీ సంబంధమైనది సారస్వతం. సరస్వతి చదువుల తల్లి. సారస్వతం సాహిత్యతుల్యమైనది.

సాహిత్యం :

'సాహిత్యం' వాఙ్మయ సారస్వత పదాల కంటే కొంత పరిమితమైనది. హితేన సహిత్యం సాహిత్యమ్ అనడం చేత సాహిత్యం మేలు కూర్చేదని అర్థం.

నన్నయ :

నన్నయనాటి నుంచి మనకు లిఖిత సాహిత్యం లభిస్తున్నా అంతకు పూర్వం తెలుగులో సాహిత్యం లేదని భావించరాదు. నన్నయకు పూర్వం సామాన్య ప్రజలు పరంపరంగా చెప్పుకొనే కథా సాహిత్యం, ఆనందోత్సాహాలతో పాడుకొనే గేయసాహిత్యం పుష్కలంగా ఉంది. జనం వాడుకలో ఊయలపాటలు, తుమ్మెదపదాలు, గొబ్బిపదాలు, వెన్నెలపదాలు మొదలయినవి ఉన్నాయి. నన్నయకు పూర్వం తెలుగులో కావ్యరచన సాగింది. కానీ ఆధారాలు స్పష్టంగా లభించలేదు. కానీ నన్నయ్యకు ముందు తెలుగులో సాహిత్యం ఉందని స్పష్టంగా చెప్పవచ్చు.

గాసటబీసటగా ఉన్న తెలుగుభాషకు 11వ శతాబ్దంలో స్థిరమైన రూపాన్ని ఏర్పరచినవాడు నన్నయ. సంస్కృతంలోని వ్యాసభారతాన్ని ఆదిపర్వం, సభాపర్వం, అరణ్యపర్వంలో కొంత వరకు తెలుగులోకి అనువదించాడు. నన్నయ్య కవిత్వంలో అక్షరరమ్యత, నానారుచితార్థా సూక్తి నిధిత్వం, ప్రసన్న కథాకలితార్థ యుక్తి కనిపిస్తాయి. వైదికమత ఉద్ధరణ నన్నయ లక్ష్యం. భారతాన్ని అనువంచటంలో కొన్ని చోట్ల పెంచడం, మరికొన్ని చోట్ల తగ్గించడం జరిగింది. కొన్ని చోట్లనూతనభావాలనుకల్పించాడు. వాగనుశాసనుడు, ఆదికవి అనేవి ఆయనకున్న బిరుదులు. ఆయన తన కవిత్వంలో ప్రసన్న కథాకలితార్థయుక్తి( చక్కగాకథను చెప్పడం) అక్షరరమ్యత( మంచి పదప్రయోగం) నానారుచితార్థసూక్తి నిధిత్వం( అర్థవంతమైనసామెతలు, సూక్తులుప్రయోగించడం) అనే3 కవితా లక్షణాలున్నట్లు పేర్కొన్నాడు.

తిక్కన :

రసపోషణలో, అలంకారశిల్పంలో, పాత్రచిత్రణలో, వర్ణనా నైపుణ్యంలో తిక్కన అందెవేసిన చేయి. తిక్కన కవితాశిల్పం తర్వాత కవులకు మార్గదర్శకమయింది. ప్రజలు శైవ, వైష్ణవ భేదాలతోకొట్టుకొనిచస్తున్న కాలంలో హరిహరనాథ ప్రస్తావన తెచ్చి శాంతి సమాజం కోసం కృషి చేశాడు. తిక్కన తొలిరచన నిర్వచనోత్తర రామాయణం. ఈయన భారతంలో సభాపర్వంనుండి స్వర్గారోహణపర్వంవరకు (పదునైదు పర్వాలు) ఆంధ్రీకరించాడు. అతని అనువాదం గ్రంథానికే వన్నెపెట్టింది. ఈయన నాటకీయ పద్ధతిలో కథను నడిపించాడు. ఈయనకు కవిబ్రహ్మ, ఉభయకవిమిత్రుడనే బిరుదులున్నాయి.

ఎర్రన :

14వ శతాబ్దానికి చెందిన ఎర్రన అరణ్య పర్వశేషాన్ని తెలుగులోకి అనువదించాడు. ఎర్రన అద్దంకిని రాజధానికిగా చేసుకొని పరిపాలిస్తున్న ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన విభూషణుడు నన్నయ, తిక్కనలకుతీసిపోకుండా అనువాద నిర్వహణ చేసిన గొప్ప కవి ఎర్రన. ఇంకా ఎర్రన హరివంశం అనే కావ్యం రాసి ప్రబంధ పరమేశ్వరుడనే బిరుదును పొందాడు.

శ్రీనాథుడు :

15వ శతాబ్దానికి చెందిన శ్రీనాథునియుగం సంధియుగమని సాహిత్యకారులంటారు. శ్రీనాథుని పూర్వం వ్యాప్తిలోకి వచ్చినది పురణాకవితామార్గం. శ్రీనాథుని తరువాత వెలసినది ప్రబంధ కవితా మార్గం. శ్రీనాథయుగంలో ఈ రెండు మార్గాల ప్రభావం కనిపిస్తుంది. మరుత్తరార్చరిత్ర, శాలివాహన సప్తశతి, పండితారాధ్యచరిత్ర, శృంగార నైషధం, హరవిలాసం, భీమఖండం, కాశీఖండం, శివరాత్రి మహాత్త్యం, పలనాటివీరచరిత్ర మొదలైన గ్రంథాలు రచించాడు. నిగ్గుదేరినకవితాశైలి, వక్రోక్తులు, ప్రౌఢోక్తులు, సరసోక్తులు, శ్రీనాథుని కవిత్వంలో కనిపిస్తాయి. శైలిలో లంకారికత, అనువాదపద్ధతిలో కొత్తతీరుతెన్నులు, లయబద్ధమైన సీసపద్యరీతులు శ్రీనాథుని సొత్తు. ఈయనకు కవిసార్వభౌముడని బిరుదుంది.

పోతన :

సహజ పాండిత్యుడనే బిరుదున్న పోతన మహాకవి కూడా శ్రీనాథుని యుగంలోనివాడే. భాగవతాన్ని తెలుగులోకి అనువందించటంతోపాటు, వీరభద్ర విజయం, భోగినీ దండకం, నారాయణశతకం కూడా రచించాడు. మధురమైన భక్తిభావాలు శ్రవణప్రేయమైన శబ్దసంధానం, గంభీరగమనశైలి, ప్రవాహధారపోతన కవిత్వంలోని సుగుణాలు.

శ్రీకృష్ణదేవరాయలు (16వశతాబ్దం)

ఆంధ్రసాహిత్య చరిత్రలో 16వ శతాబ్దం స్వర్ణయుగమంటారు. సాహితీ సమరాంగణ సార్వభౌముడు, ఆంధ్రభోజుడు శ్రీ కృష్ణదేవరాయలు. తన ఆస్థానంలో భువన విజయం అనే సభాభవనాన్ని నిర్మించి పెద్దన మొదలైన అష్టదిగ్గజకవీశ్వరులను వెలయింపజేశాడు. పెద్దన, తిమ్మన, . దూర్జటి, మల్లనలు మాత్రమే రాయల ఆస్థానంలో ఉన్నట్లు చరిత్రకారుల అభిప్రాయం.

ఆధునిక యుగం :

19వ శతాబ్ది ద్వితీయార్థంలో ఇంగ్లీషు విద్యవల్ల విశాలభావాలు పెంపొందాయి. సంప్రదాయ కవిత్వం చెప్పేవారు రాజులను, జమీందారులను సందర్శిస్తూ అష్టావధానాలను, శతావధానాలపై మోజును పెంచారు. కందుకూరి వీరేశలింగం సాహిత్యాన్ని సంస్కరణ దిశవైపు మరల్చారు. నవల, నాటకం, ప్రహసనం, చరిత్ర, వ్యక్తుల చరిత్ర, పత్రికా రచన మొదలైన అన్నిగద్య ప్రక్రియలలోనూ ఆయన కొత్త ఒరవడి పెట్టి గద్యతిక్కనగా పేరు పొందారు.

19వ శతాబ్దం చివరి దశాబ్దంలో గురజాడ అప్పారావు సామాజికస్పృహతో కలం పట్టారు. ఆంగ్ల, సంస్కృత నాటకాలకు అనువాద, అనుకరణలు ఎక్కువగా చెలామణిలో ఉండేవి. గురజాడసాంఘిక సమస్యల్ని (కన్యాశుల్కం) వస్తువుగా స్వీకరించాడు. వ్యావహారిక భాషకు పట్టం కట్టారు. ముత్యాలసరాలనే ఛందస్సులో గేయాల్నిరాశాడు. గురజాడ అడుగుజాడలో ఎందరో తర్వాతకాలంలో నడచారు. ఆంగ్ల కవులు (కీట్స్, షెల్లీ మొదలగువారి) ప్రభావంతో ప్రకృతి కవిత్వాన్ని ప్రణయ కవిత్వాన్ని, అమలిన శృంగారం అనే భావనను భావకవిత్వం పేరుతో రాయప్రోలు సుబ్బారావు ప్రారంభించారు. అబ్బూరి రామకృష్ణారావు దేవులపల్లి కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, అడవిబాపిరాజు ప్రభృతులు మంచి భావకవిత్వం రాశారు. ప్రకృతిని ఆరాధించడమే . బావకవిత్వానికి ప్రాతిపదిక.

శ్రీశ్రీ : ఆధునిక కవులు

సామ్యవాదభావాలను బలపరస్తూ శ్రీశ్రీ మహాప్రస్తానం రాశాడు. ఆత్మాశ్రయం ప్రధానంగా సాగే భావ కవిత్వం మీద తిరుగుబాటు చేస్తూ సోషలిస్టు సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూ అభ్యుదయ కవిత్వం 1930 తరువాత ప్రారంభమయింది. అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. కొడవటిగంటి కుటుంబరావు, పాలగుమ్మి పద్మరాజు, కరుణకుమార, గోపిచంద్, బుచ్చిబాబు ప్రభృతులు కథానికలు రాశారు. ఇంకా కుందుర్తి, సోమసుందర్ ఆరుద్ర, దాశరథి, నారాయణరెడ్డి మొదలైనవారు అభ్యుదయ కవిత్వం రాశారు మనిషికి విలువ ఇవ్వడం, మూఢాచారాలను ఖండించడం, సమసమాజాన్ని స్థాపించడం అభ్యుదయ కవిత్వ లక్షణాలు.

డా సి. నారాయణరెడ్డి ఆధునికాంధ్రసాహిత్యం – సంప్రదాయం ప్రయోగం అనే సైద్ధాంతికగ్రం ; దాన్ని రాశారు. వీరి కర్పూరవసంతరాయులు, విశ్వంభర మొదలైనవి ప్రసిద్ధ గేయకావ్యాలు. ఇటీవల వీరు భారతప్రభుత్వ కేంద్రసాహిత్య అకాడమీ బహుమతిని స్వీకరించారు.

| |
|---|
| కవిత్రయం అంటే ఎవరు? ఆంధ్రసాహిత్యానికి వారు చేసిన సేవ ఏమిటి జట్టులుగా చర్చించండి నియోజనంగా సమర్పించండి. |

| |
|---|
| ఆధునిక కవులు వారి కావ్యాలను నియోజనంగా సమర్పించండి. |

## వ్యాకరణం

1. వర్ణమాల

తెలుగు అక్షరములు – 56

అచ్చులు – 16 (ప్రాణ్యక్షరములు)

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఎ ఏ ఐ ఒ ఓ ఔ అం అః

హల్లులు – 36 (వ్యంజనములు)

క ఖ గ ఘ జ చ ఛ జ ఝ ఞ ట ఠ

డ ఢ ణ త థ ద ధ న ప ఫ బ భ మ

య ర ఱ ల ళ వ శ ష స హ క్ష

ఉభయాక్షరములు – 3– 0 ౦ :

అచ్చుల విభాగాలు :

i) హ్రస్వములు ( 7 ) : పొట్టిగా పలుకబడుఅక్షరములను హ్రస్వములు అంటారు.
అ, ఇ, ఉ, ఋ, ఎ, ఒ

ii) దీర్ఘములు ( 9 ) : పొడవుగా పలుకబడు అక్షరములను దీర్ఘములు అంటారు. ఆ, ఈ, ఊ, ౠ, ఏ, ఐ, ఓ, ఔ.

iii) వక్రములు ( 2 ) : ఎ, ఏ, ఒ, ఓ

iv) వక్రతమములు ( 2 ) : మిక్కిలి వంకరగా పలుకబడు అక్షరాలను వక్రతమములు అంటారు. ఐ, ఔ.

హల్లుల విభాగాలు

i) పరుషములు ( 5 ) : పలకడానికి కఠినంగా ఉండేవి. క, చ, ట, త, ప.

ii) సరళములు ( 5 ) : పలకడానికి తేలికగా ఉండేవి. గ, జ, డ, ద, బ.

iii) స్థిరములు ( 5 ) : పరుష సరళములుగాక తక్కినవి హల్లులు. ఇవి వ్యాకరణసూత్రాల చేత మార్పు చెందక స్థిరముగా ఉంటాయి. ఖ, ఘ, ఙ, ఛ, ఝ, ఞ, ఠ, ఢ, ఠ, ఢ, ణ, న, ఫ, భ, మ, య, ర, ఱ, ల, ళ, వ, శ, ష, స, హ, క్ష.

iv) అనునాసికములు( 5 ) : ముక్కు సహాయమున పలుకబడేవి ఙ, ఞ, ణ, న, మ.

v) అంతస్థ్యములు( 5 ) : పెదవులు కలపవలసిన అవసరం లేక నోటి లోపలనే పలుకబడేవి.
య, ర, ఱ, ల, ళ, వ

vi) ఊష్మములు ( 4 ) : ఊది పలుకబడునవి. శ, ష, స, హ

vii) ద్రుతము ( 5 ) : న కారము

viii) వర్గప్రథమములు( 5 ) : క చ ట త ప
వర్గద్వితీయములు( 5 ) : ఖ చ ఠ థ ఫ
వర్గతృతీయములు( 5 ) : గ జ డ ద బ
వర్గచతుర్థము ( 5 ) : ఘ ఝ ఢ ధ భ

వర్గపంచమములు : ఙ, ఞ, మ, న, ణ ( ఇవే అనునాసికాలు)
కంఠ్యములు : అ ఆ క ఖ గ ఘ ఙ హ
తాలవ్యములు : ఇ ఈ చ ఛ జ ఝ ఞ య శ
మూర్ధన్యములు : ఋ, ట ఠ డ ఢ ణ ర ఱ ష ళ
దంత్యములు : త థ ద ధ న ల స చ జ
ఓష్ఠ్యములు : ఉ, ఊ ప ఫ బ భ మ
అనునాసికములు : ఙ, ఞ, ణ, న, మ
కంఠతాలవ్యాలు : ఎ, ఏ, ఐ
దంతోష్ఠ్యము : వ
నాసిక్యము : ం
కంఠౌష్ఠ్యములు : ఒ, ఓ, ఔ

భాషాభాగాలు

తెలుగుభాషలోని పదాలను ఐదు విధాలుగా విభజించవచ్చు.

– నామవాచకములు : పేర్లను తెలిపే పదాలను నామవాచకములు అంటారు.

వీటినే విశేష్యములు అని కూడా అంటారు.

ఉదా  మురళి, జయ, పవన్, నెమలి మొదలగునవి.

- సర్వనామములు : నామవాచకమునకు బదులుగా వాడబడు పదములు

ఉదా  అతడు, ఆమె, అవి మొదలగునవి.

- విశేషణములు : నామవాచకము, సర్వనామముల గుణములను తెలుపు పదాలు విశేషణ ములు ఉదా  తీపి, పొడవైన, తెల్లని మొదలగునవి.

- క్రియలు : పనిని తెలిపే పదాలు క్రియలు

ఉదా  ఆడెను, వెళ్లెను, పాడను మొదలగునవి.

- అవ్యయములు : లింగ, వచన, విభక్తుల చేత మార్పుచెందనివి.

ఉదా  ఔరా ! ఓహో ! పోలె మొదలగునవి.

వాచకములు – లింగములు

తెలుగుభాషలో వాచకములు అనువానిని సంస్కృతభాషలో 'లింగములు' అంటారు. సంస్కృతభాషలో శబ్దమునుబట్టి లింగం ఉంటుంది. ఏ శబ్దం ఏ లింగంలో ఉంటుందో తెలుసుకోవాలి. తెలుగుభాషలో వాచకము అర్థమును బట్టి ఉంటుంది. తెలుగులో వాచకము మూడువిధాలుగా ఉన్నాయి.

- మహద్వాచకము :–

పురుషులను గూర్చి తెలిపే మాటలు, వాని విశేషణములు మహద్వాచకములు.

ఉదా  సుధీరు, అన్న, మంత్రి, సజ్జనుడు, వాడు మొదలగునవి.

2) మహతీవాచకము :– స్త్రీలను గూర్చి తెలిపే మాటలు వాని విశేషణములు

ఉదా  లావణ్య, ఆమె, భర్తురాలు మొదలగునవి.

3) అమహద్వాచకము :– స్త్రీలను, పురుషులనుగాక ఇతరాలను వాని విశేషాలను తెలిపేవి.

ఉదా  ఇల్లు, కొండ, తాబేలు మొదలగునవి.

## వచనములు

తెలుగుభాషలో వచనములు రెండువిధాలు. సంస్కృత భాషలో ఏకవచనం, ద్వివచనం, బహువచనం అని మూడు విధములు కలవు.

1) ఏకవచనము : ఒక్కదానిని తెలుపునది.

ఉదా  బాలిక, గుడి, గది, కలము

నిత్యైకవచనము : ఎల్లప్పుడు ఏకవచనము నందే ఉండే పదములు నిత్యైకవచనములన బడుతాయి. వీటికి బహువచన రూపములుండవు.

ఉదా  వరి, కంచు, ఇత్తడి.

2) బహువచనములు : అనేకములను తెలుపునవి.

ఉదా  బాలికలు, గుడులు, గదులు, కలములు.

నిత్యబహువచనము : ఎల్లప్పుడు బహువచనములో ఉండే శబ్దాలు. వీనికి ఏకవచన రూపములుండవు  ఉదా  అందరు, ఉప్పన బట్టెలు, గుజ్జనగూళ్ళు.

## విభక్తులు – ప్రత్యయములు

వాక్యములో పదాలకుగల పరస్పర సంబంధమును తెలుపునవి విభక్తులు. ఇవి ఎనిమిది విధాలు. ప్రతి విభక్తిలోను కొన్ని ప్రత్యయాలు ఉంటాయి.

| విభక్తులు | | ప్రత్యయములు |
|---|---|---|
| – ప్రథమా విభక్తి | – | డు, ము, వు, లు |
| – ద్వితీయా విభక్తి | – | నిన్, నన్, లన్, కూర్చి, గురించి |
| – తృతీయా విభక్తి | – | చేతన్, చేన్, తోడన్, తోన్ |
| – చతుర్థీ విభక్తి | – | కొఱకున్, కై |
| – పంచమీ విభక్తి | – | వలనన్, కంటెన్, పట్టి |
| – షష్ఠీ విభక్తి | – | కిన్, కున్, యొక్క, లోన్, లోపల |
| – సప్తమీ విభక్తి | – | అందున్, నన్ |
| – సంబోధన ప్రథమా విభక్తి | – | ఓ, ఓయి, ఓరి, ఓసి. |

కారకము : క్రియతో అన్వయింప చేసేది లేక క్రియలను పుట్టించేది కారకము అనబడుతుంది. వీని ననుసరించి విభక్తి కారకమని పేరు. షష్ఠీ విభక్తి క్రియతో అన్వయింపదు.

కాలాలు

క్రియ జరిగిన సమయాన్ని తెలుపునది కాలం ఇవి నాలుగు రకాలు

- భూతకాలము : జరిగిపోయిన కాలాన్ని తెలిపేది.
  ఉదా వచ్చిరి, ఆడెను, కోరెను.
- వర్తమానకాలము : జరుగుతున్న కాలాన్ని తెలిపేది.
  ఉదా వస్తున్నారు, ఆడుతున్నారు, కోరుతున్నారు.
- భవిష్యత్కాలము : జరగబోవు కాలమునకు గూర్చి తెలుపునది.
  ఉదా ఆడగలరు, కోరగలరు, చదువగలరు.
- తద్ధర్మకాలము : పై మూడు కాలముల కంటే వేరై మూడు కాలముల అర్థాన్ని తెలిపేది.
  ఉదా వానలు కురుస్తాయి, పంటలు పండుతాయి, పక్షులు ఎగురుతాయి.

## క్రియలు

చేసే పనిని క్రియ అంటారు. రాము పాట పాడాడు. ఇందులో పాడాడు క్రియ

1) సమాపక క్రియలు :

1. ప్రేరణార్థకము :పనిచేయడానికి ఇతరులను పేరేపించేది. ఉదా చదివించు, నడిపించు.
2. ప్రార్థనార్థకము : పనిచేయుటకు ఇతరులను ప్రార్థించుట. ఉదా.. కాపాడవే, బ్రోవవే.
3. ఆశీరాద్యార్థకము : ఆశీస్సులను తెలిపేది
   ఉదా దేవుడు నిన్ను రక్షించుగాక ! మేలుకావుత.
4. వ్యతిరేకార్థము : వ్యతిరేకార్థాలను తెలిపేది
   ఉదా చదువడు, పాడడు, వెళ్ళడు.
5. ఆత్మనేపదము : క్రియాఫలము కర్తము చెందుట.
   ఉదా చదువుకొంటున్నాడు, పాడుకొంటున్నాడు.

2) అసమాపకక్రియలు :

1. క్త్వార్థకము : భూతకాలిక అసమాపకక్రియ. దీనిలో ధాతవునకు ఇ చేరుతుంది.
   ఉదా తిని, చదివి, ఆడి.
2. వ్యతిరేకక్త్వార్థకము : క్త్వార్థకమునకు వ్యతిరేకముగా ఉండేది. దీనిలో ధాతువునకు అక ప్రత్యయము చేరుతుంది. ఉదా పాడక, వినక, తినక

3.తుమున్నాద్యర్థకము: ఒకపనికి కారణమైన కార్యాన్ని, సమయాన్ని తెలియజేసేది. ఇందులో ధాతువునకు అన్ చేరును. ఉదా చేయన్, చదువన్, వండన్.

4.చేదర్థకము : అగుచో, అయినచో అనే అర్థాన్ని తెలిపేది. దీనిలో ధాతువనకు ఇనన్ చేరుతుంది.ఉదా కురిసినన్, చదివినన్

5.అనంతర్యార్థకము : అనంతరము అనే అర్థాన్ని ఇచ్చేది. దీనిలో ధాతువుకు డున్ చేరుతుంది. ఉదా సూర్యుడు ఉదయించుడున్ బద్మములు వికసించును.

6.శత్రర్థకము : వర్తమానకాల అసమాపకక్రియ దీనిలో క్రియకు చివర చున్ చేరుతుంది.

ఉదా వినుచున్, చదువుచున్.

## విభాగం - ఆ

## అధ్యాయం – 1

# భాష- స్వరూప స్వభావాలు

1.1 పరిచయం

1.2 భాషా నిర్వచనాలు

1.3 భాష - పుట్టుపూర్వోత్తరాలు

1.4 భాష - ఉద్దేశ్యాలు

1.5 భాష - ప్రయోజనాలు

1.6 భాష - స్వరూప స్వభావాలు

1.7 భాషారూప వర్గాలు

1.8 భాష- సంస్కృతి

1.9 భాష- సాహిత్యం రసాస్వాదన

1.10 భాష ద్వారా ఉత్తమ పౌరునిగా రూపొందించడం.

## 1.1 పరిచయం

మానవుని ఇతరప్రాణుల నుండి వేరుచేసేది భాష. మానవునికి లభించిన అత్యుత్తమ వరం భాష.మానవ జాతికి మాత్రమే పరిమితమైనది మానవులందరికి ఉమ్మడిసంపద అయినది భాష. మెదడులోగాని ముఖయంత్రంలోగాని లోపాలున్న కొద్ది మందికి తప్ప మిగిలిన మానవులందరికి మాటలను అర్థం చేసుకొనే శక్తి వుంది. ఇది పుట్టుకతో సంక్రమిస్తుంది. భాష ద్వారా సంస్కృతి, నమ్మకాలు, నాగరికత, విలువలు ఒక తరం నుంచి ఇంకొక తరానికి సంక్రమిస్తాయి. వ్యక్తి మూర్తిమత్వ వికాసానికి,సామాజకీకరణకు భాష కీలకమైంది.మానవుడు తాను నివసించే సమాజంలో ఒక వ్యక్తిగా వికాసంపొంది తన సంస్కృతిని జీర్ణించుకొని సమాజంలో సర్దుబాటు చేసుకోవడానికి, విచక్షణ జ్ఞానం సంపాదించడానికి భాష పాత్ర ప్రముఖమైంది. క్లుప్తంగా చెప్పాలంటే ఒక వ్యక్తికి వ్యక్తిత్వం, సమతౌల్యమూర్తిమత్వం పొందడానికి, సృజనాత్మకత ఏర్పడడానికి సాధారణ పౌరుని ఉత్తమ పౌరునిగా రూపొందిచడంలో భాష కీలకమైనదని చెప్పవచ్చును.

తెలుగు మాధ్యమంలో శిక్షణ పొందే ఛాత్రోపాధ్యాయులు భాషౌన్నత్యాన్ని, ప్రాధాన్యాన్ని గుర్తుంచుకొని బోధించాలి.భాష అంటే ఏమిటి? భాష పుట్టుక, నిర్వచనాలు,భాష-భావసంబంధం, భాషా లక్ష్యాలు, భాషా ప్రయోజనాలు ఏమిటి? భాషా స్వరూపస్వభావాలు, వాగ్రూప - లిఖితభాషలు అంటే ఏమిటి? గ్రాంథిక, వ్యావహారిక, మాండలిక, ప్రామాణిక భాషలు అంటే

ఏమిటి? భాష ద్వారా రసాస్వాదన కలిగించి ఉత్తమ పౌరునిగా రూపొందించడంలో భాష ప్రభావం ఎలా వుంటుంది? భాషాభివృద్ధిలో వ్యక్తుల సమాజాల పాత్ర ఏమిటి? మొదలగు అంశాల గురించి ఛాత్రోపాధ్యాయులు తెలుసుకొన్నప్పుడే వారు మున్ముందు విద్యార్థుల్లో ఆశించిన భాషాభివృద్ధిని సాధించగలరు. ఈ అధ్యాయంలో భాషాపరమైన వివిధ అంశాలను వివరంగా తెలుపడం జరిగింది.

భాష :

భాషింపబడునది భాష. భాషించటం అంటే మాట్లాడడం. వ్యక్తి మరొక వ్యక్తితో సమాచారాన్ని తెలియచేయ డానికి భాష కీలకమైంది. వ్యక్తి తన మనోభావాలు, ఉద్వేగాలు తెలుపడానికి, తెలుసుకో వడానికి ఉపయోగించే సైగలు, చిహ్నాలు భాష కాదు. వాగ్రూపంగా వెలువడే పలురకాల ధ్వనులు కలిసి అర్థవంతమైన పదాలుగా ఏర్పడి, ఆ పదాల కూర్పు ద్వారా భావాన్నికలిగించే వాక్యాలుగా ఏర్పడడం భాష. ఇటువంటి భాష మానవునికి మాత్రమే సాధ్యం. మానవుని నోటినుండి శబ్దంవెలువ డడానికి ఉపయోగపడేది నాలుక. అందుకే ఆంగ్లంలో భాషకు 'టంగ్ '**(Tongue)** అనేది పర్యాయపదం. మాతృభాషను " మదర్‌టంగ్" **(Mother Tongue)** అంటారు. లింగ్వా **(Lingha)** అనే లాటిన్ పదం నుండి లాంగ్వేజ్ **(Language)** అనే ఆంగ్లపదం ఏర్పడింది.'లింగ్వా' అంటే నాలుక,**'Language'** ని తెలుగులో భాష అంటారు.

## 1.2 భాషా నిర్వచనాలు :

వివిధ వ్యక్తులకు వారివారి దృష్టిభేదాన్ని బట్టి భాష వివిధరూపాలుగా కనిపిస్తుంది. సామాన్యునికి బావ ప్రకటన సాధనంగాను, మనస్తత్త్వశాస్త్రజ్ఞునికి మానవ ప్రవర్తనను ఇతర జీవుల ప్రవర్తనల నుంచి వేరు పరుచుకోవడానికి సహకరించే శక్తిమంతమైన ఉపకరణంగాను, వైయాకరణు నికిప్రకృతి, ప్రత్యయ పదరూప సమూహం గాను, మత ప్రచారకునికి వివిధ ఉపదేశాలకు ఉపయో గపడేదిగాను, భాషాధ్యాపకుడు భాషనుఉపయోగించడంలోప్రజలకు అడ్డంకులు తొలగించేదిగా మానవశాస్త్రజ్ఞునికి తానధ్యయనం చేసే సంస్కృతిలో ఒక భాగంగాను అనిపిస్తుంది.పైన పేర్కొన్న అభిప్రాయాలు అన్నీ అర్థవంతమైనవే. భాషావేత్తలు భాషను ఎలానిర్వచించారో పరిశీలిద్దాం.

1. ఎడ్వర్డ్ సపైర్ :

మనిషి తన భావాలను, ఆదేశాలను, అనుభూతులను, కోరికలను వ్యక్తంచేయడానికిఅప్రయత్నంగా ఏర్పరచుకొన్న సాధనం భాష – అని నిర్వచించారు.

2. హాకెట్ :

మాట్లాడే అలవాట్లకు సంబంధించిన సంక్లిష్టవ్యవస్థ భాష – అని నిర్వచించారు.

3. వెలిచాల కొండల రావు :

మనిషిఆలోచనలకు అభివ్యక్తీకరణసాధనమే భాష – అని వెలిచాల కొండలరావు అన్నారు. వ్యక్తికి వ్యక్తికి అవగాహన వాతావరణాన్ని, వ్యక్తికి –సంస్కృతికి మధ్య సంబంధాన్ని కల్పించేదే – భాష అని కూడా ఆయన నిర్వచించారు.

4. జాన్ హగ్స్ :

మానవులు పరస్పరం తమఆలోచనలను, యాదృచ్ఛిక నిర్మాణం కల్గిన వాగ్రూప ధ్వనుల ద్వారా వ్యక్తం చేయగలిగిన విధానం భాష అని నిర్వచించారు.

5. సర్ట్‌వర్ట్ :

యాదృచ్ఛిక నిర్మాణసౌష్ఠవం కలిగి, మానవసమాజంలో భావవినిమయం చేయడానికి, తమమధ్య సహకారానికి, సంస్కృతిని వ్యాప్తి చేయడానికి ఉపకరించే వాగ్రూప ధ్వని సంకేతాల సముదాయం భాష అని నిర్వచించారు.

6. రామచంద్ర వర్మ :

మనస్సులోని భావపరంపరను ఏ పదాలద్వారా, ఏ వాక్యాలద్వారా ఎదుటి వారికి అందిస్తామో ఆ పదాలే, ఆ వాక్యాలే భాష అని వర్మగారి నిర్వచనం. పై నిర్వచనాలన్నీ భిన్న భావాలతోకూడినవి. వీటి లో ఏదీ సంపూర్ణం కాదు. ప్రతిది భాష లక్షణం ఏమిటో తెలుసుకోవడానికి కొంత వరకు ఉపయోగపడుతుంది.

**1.3 భాష- పుట్టు పూర్వోత్తరాలు :**

ఛాత్రోపాధ్యాయులు భాష ఎలాఉద్భవించిందో తెలుసుకోవడం అత్యంత అవసరం. భాష ఎలా ఉద్భవించింది, అనే సందేహాలకు భాషావేత్తలు, పండితులు క్రింది భాషా వాదాలను ప్రతిపాదించారు.

1. దైవదత్తవాదం **(The Divine theory)** :

భాషోత్పత్తి వాదాలలో అతి ప్రాచీనమైనది. ఈవాదం ప్రకారం మానవునితో పాటు భగవంతుడు భాషను కూడా సృష్టించాడు అని తెలుపుతుంది. ఇలాంటి భావాలు బైబిల్‌లోను, ఇతర ప్రాచీన గ్రంథాల్లోను, మన వేదాల్లోను కనిపిస్తాయి.

2. సహజవాదం : **(Natural theory)** :

ప్రముఖ తత్త్వవేత్తలయిన పైథాగరస్, ప్లాటోలు ఈ సిద్ధాంత కర్తలు. మనిషి నాగరికత పెరిగినకొద్ది అవసరాన్ని బట్టి, సహజంగా, సులభంగా భాషను తనకుతాను సృష్టించుకొన్నాడు – అనేదిఈ వాద సారాంశం.

3. భౌ భౌ వాదం : ( ధ్వన్యనుకరణవాదం)

ఈ వాద ప్రతిపాదకుడు లీబ్నిజ్. దీని ప్రకారం ఆదిమానవులు తమచుట్టు ప్రక్కల ఉన్న పశు పక్ష్యాదుల కంఠధ్వనులువిని అనుకరించడంవల్ల భాష ఏర్పడిందనేది వీరివాదన. దీనినే ' ధ్వన్యను కరణవాదం 'ని కూడా అంటారు. ఉదా భౌ భౌ అనే ధ్వనిని కుక్కను సంకేతంగా గుర్తిస్తాం.

4. ఫూ, ఫూ సిద్ధాంతం :

మానవుడు బాధను, భయాన్ని, ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసినప్పుడు ధ్వనుల ద్వారా భాష ఏర్పడిందని ఈ వాద సారాంశం. ఉదా ఆశ్చర్యం కలిగినప్పుడు 'ఆహా ! ఓహో !' అనడం బాధ కలిగి నప్పుడు 'ఆ, అయ్యో! అమ్మా! అని అప్రయత్నంగా అనడం మొదలగునవి. దీనికే ఆశ్చర్యవాదమనికూడా పేరు.

5. యోహిహోవాదం :

ఈవాద ప్రతిపాదన చేసిన వారు నార్వే దేశీయులు. శ్రామికులు, కరకులు తమపనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు గాలి పీల్చడం, వదలడం బరువుగా సాగుతాయని, ఆ సమయంలో కండరాలు బిగిసి, నాదతంత్రులు ఒత్తిడికి లోనై ప్రకంపనాలు చెందుతాయని, తద్వారాభాష పుట్టిందని వీరి అభిప్రాయం. ఉదా బట్టలు ఉతుకుతున్నప్పుడు ఉస్ అనే శబ్దం, బరువులు ఎత్తేటప్పుడు "ఊప్" అనడంగమనించవచ్చును. రైల్వేకూలీలు మొదలగు శ్రామికులు పని చేసేటప్పుడు కొన్ని ప్రత్యేక ధ్వనులు ఉచ్చరించడం ఇందుకు ఉదాహరణంగా పేర్కొనవచ్చు.

6. డింగ్ డాంగ్ వాదం :

★ ఈ వాదాన్ని మాక్స్‌ముల్లర్ అను భాషాశాస్త్రవేత్త ప్రతిపాదించాడు.

★ ధ్వనికి అర్థానికి అజ్ఞాతమయిన సంబంధం ఉందని, మానవుని మనస్సుపై బయటివారివల్ల ఏర్పడిన అభిప్రాయమే ముఖధ్వనులు ద్వారా వ్యక్తమవుతుందని దీని సారాంశం.

★ ఇందులో శాస్త్రీయత లేనందువలన దీనిని అంగీకరించుటకు వీలు లేదు. చకచక, చిటపట, గుసగుస, బుసబుస మొదలగు ఉదాహరణలను పేర్కొనవచ్చును.

7. స్వతస్సిద్ధవాదం :

సంపాదన వాదాన్ని తిరస్కరిస్తూ హేతువాదంతో కూడిన స్వతస్సిద్ధవాదాన్ని నోమ్ ఛామ్స్కీ అను భాషాశాస్త్రవేత్త ప్రతిపాదించారు. ఈ వాదం ప్రకారం మనిషికి ప్రకృతి సిద్ధంగా, జీన్స్ ద్వారా భావాలు, భాష పుట్టుకతోనే కలుగుతాయని ఇతని భావన. అందుకు కారణం మానవ మేధస్సు మిగిలిన జీవుల మెదడుకన్న పెద్దది, విలక్షణమైనది, సంక్లిష్టమైనది మరియు విశిష్టమైనది. ఈ వాదాన్ని చాలా మంది భాషా శాస్త్రవేత్తలు ఆమోదించారు.

## భాష – భావం :

భాష– భావం అనేవి ఒక నాణేనికి బొమ్మ, బొరుసు వంటివి. శబ్దానికి అర్థానికి అవినాభావ సంబంధముంది. భాష బాహ్య సౌందర్యాన్ని తెలుపగా, భావం అంతఃసౌందర్యాన్ని తెలుపుతుంది. భాష – భావం సరియైన పాళ్లల్లో కలిసినప్పుడు తద్వారా పాఠకునికి ఆనందానుభూతి కలుగుతుంది. రచనకు ముఖ్యమైనది అంతః సౌందర్యమే అయినా, బాహ్య సౌందర్యం తోడవ్వడంతో అది ఉత్తమ రచనగా ప్రకాశిస్తుంది. భావలుఎంతోఉన్నతమైన భాషద్వారా సమర్థవంతంగా వ్యక్తపరచినప్పుడే ఆ భావాలు బ్రతుకగలుగుతాయి. భాష శరీరంలాంటిదైతే – భావం ప్రాణం లాంటిది. ప్రాణం లేని శరీరం వ్యర్థం. అలాగే భావం లేని భాష వ్యర్థం. కాబట్టి భాషకు మూలాధారం భావం అని చెప్పవచ్చును.

## 1.4 భాష – ఉద్దేశ్యాలు :

- భావ వ్యక్తీకరణకు, భావ గ్రహణానికి, భావ వినిమయానికి ఉపకరణంగా ఉపయోగడడం.
- సంస్కృతి సంప్రదాయాలను నిల్వ చేసుకొనడం.
- సంస్కృతి, ఆచార సంప్రదాయాలను ఒక తరం నుంచి మరొక తరానికి అందించడం.
- వ్యక్తికి వ్యక్తికి మధ్య, వ్యక్తికి సమాజానికి మధ్య వివిధ సమాజాల మధ్య సంబంధాలను పెంపొందించడం.
- వ్యక్తి ఉన్నతుడు కావడానికి, మానవత్వాన్ని పెంపొందించుకోవడానికి తోడ్పడడం.
- వ్యక్తికి మానసిక చైతన్యాన్ని వృద్ధి చేయడం.
- పాఠకునికి రసానుభూతిని కలిగించడం.
- సామాజికీకరణాన్ని, సమగ్రమూర్తిమత్వాన్ని పెంపొందించడానికి సహకరించడం.
- ప్రజలమధ్య సమైక్యత, దేశభక్తివంటి భావాలను కలుగజేయడం.

## 1.5 భాషా ప్రయోజనాలు :

భాషా ప్రయోజనాలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

అవి (1) వ్యక్తిగత ప్రయోజనాలు (2) సామాజిక ప్రయోజనాలు

(3) జాతీయ ప్రయోజనాలు

**వ్యక్తిగత ప్రయోజనాలు :**

భాష వలన వ్యక్తికి కలిగే ప్రయోజనాలే వ్యక్తిగత ప్రయోజనాలు

అవి (1) భాష మనోవికాసానికి, జ్ఞానసంపాదనకు ఉపకరిస్తుంది.

(2) భాష వ్యక్తుల మధ్య పరస్పర భావవినిమయానికి ఉపకరిస్తుంది.

(3) మాతృభాషవలన పరభాషల అభ్యసనం సులభతరమవుతుంది.

(4) భాష శాస్త్ర, సాంకేతిక, విజ్ఞాన రంగాల అభివృద్ధికి ఉపకరిస్తుంది.

(5) భాష కష్టమయిన విషయాలను కూడా సులభతరం చేస్తుంది.

పైన పేర్కొన్నవి వ్యక్తిగత మేధాపరమైన ప్రయోజనాలు.

ఈ క్రింద ఇవ్వబడినవి వ్యక్తిగత హృదయగత ప్రయోజనాలు :

- సమస్యకు నూతన కోణంలో పరిష్కారాన్ని ఆలోచించే సృజనాత్మకతను పెంపొందిస్తుంది.
- మాతృభాష వ్యక్తుల హృదయాలను కదిలించి ఆనందానుభూతిని కల్గిస్తుంది.
- మాతృభాష వ్యక్తుల్లో సాహిత్యాభిరుచిని, భాషాభివృద్ధిని పెంపొందిస్తుంది.
- భాష వ్యక్తుల్లో సముచితవైఖరుల్ని పెంపొందిస్తుంది.
- భాష మనిషిని జంతువుల నుంచి వేరు చేసి మనిషిలో మానవత్వాన్ని పెంపొందిస్తుంది.
- భాష ద్వారా వ్యక్తులలో ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తుంది.

**సామాజిక ప్రయోజనాలు :**

భాష వలన సమాజానికి కలిగే ప్రయోజనాలే సామాజిక ప్రయోజనాలు

**మేధాపరమైన ప్రయోజనాలు :**

- ఒక జాతి సంప్రదాయాలు, ఆచారాలు, నాగరికతలను రక్షించి, మరొక తరానికి అందించడానికి ఉపకరిస్తుంది
- భాష నూతన పరిశోధనలు జరిపి, ఫలితాలు పొందడానికి సహకరిస్తుంది.
- మానవ సంబంధాలు మెరుగుపరుచుకోవడానికి, సమాజంలో మెరుగైన భావ వినిమయం జరగడానికి భాష ఉపకరిస్తుంది.
- పరిసరాలను అర్థం చేసుకొని సరియైన సర్దుబాటు జ్ఞానం పెంపొందించుకొనడానికి భాష ఉపకరిస్తుంది.
- ప్రజాస్వామ్య పరిజ్ఞానం మెరుగుపడడానికి భాష ఉపకరిస్తుంది.
- ఆర్థికాభివృద్ధి సాధించడానికి భాష తోడ్పడుతుంది.

**హృదయపరమైన సామాజిక ప్రయోజనాలు :**

- ప్రపంచశాంతిని కాపాడుకోవడానికి,సమాజంలో సమైక్యత, శాంతియుత సహజీవనం ఏర్పాటుకు భాష ఉపకరిస్తుంది.
- జాతీయతా భావాన్ని పెంపొందిస్తుంది.
- భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించే ఐక్యమత్య భావనను పెంపొందిస్తుంది.
- భాష మానసిక, సాంస్కృతిక వికాసానికి, సామాజకీకరణకు తోడ్పడుతుంది.
- భాష మంచి చెడ్డలను తెలుసుకొనే విచక్షణజ్ఞానాన్ని అందిస్తుంది.

- భాష ద్వారా ప్రకృతి మీద ప్రేమ కలిగి, కవితాదృష్టి, రసాస్వాదన, ప్రేమ, కరుణ, దయ మొదలగు భావనలు వృద్ధి చెందుతాయి -పైన పేర్కొన ప్రయోజనాలు సామాజిక హృదయగత ప్రయోజనాలు.

**జాతీయ ప్రయోజనాలు :**

- భాష ఐక్యమత్యభావనలను పెంపొందిస్తుంది.
- వీరుల వీరగాథలు భాష ద్వారా నేర్చుకొనడం వలన విద్యార్థుల దేశభక్తి పెంపొందుతుంది.
  ఉదా మహాత్మాగాంధీజీ, నేతాజి సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, వివేకానందుల జీవిత చరిత్రలు
- నీతిశతకాల పఠనం వలన నీతినియమాలు, నిర్మాణాత్మక విలువలు విద్యార్థిలో పెంపొందుతాయి.
  ఉదా సుమతి, వేమన శతకాల వలన నైతిక విలువలు పెంపొందుతాయి.
- ప్రజల మధ్య సోదరభావాన్ని కలిగించి, ప్రపంచశాంతికి సహకరిస్తుంది.
- భాష వలన జాతీయవాదం, జాతీయ సమైక్యం, దేశభక్తి వృద్ధి చెందుతాయి.
  ఉదా 1857 సిపాయిల తిరుగుబాటుకి ఆంగ్లభాషా ప్రభావం ఒక కారణంగా చెప్పవచ్చు.
- స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి అభ్యుదయ భావాలు వృద్ధి చెందడానికి భాష సాధనంగా ఉపకరిస్తుంది.

ఈనాడు ఉపాధ్యాయులు కేవలం మేధాసంబంధ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి హృదయ సంబంధ ప్రయోజనాలకు తక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం వలన సమాజంలో అశాంతి, అల జడులు, హింస, దౌర్జన్యం, తీవ్రవాదం పెరగడానికి కారణమవుతుంది. నేటి భాషాబోధన కేవలం మేధాసంబంధ విషయాలేగాక, హృదయగత ప్రయోజనాలకు కూడా ఆధునికమానవుడుప్రాముఖ్యం ఇవ్వవలసిన అవసరముందనే విషయాన్ని ఉపాధ్యాయులు మరువరాదు. మానవతావిలువలను బోధించాలి. తద్వారా విద్యార్థులు ఉత్తమమానవులుగా తీర్చిదిద్దవచ్చు. లేకుంటే మానవులు యంత్ర సమానులౌతారు. ఉపాధ్యాయుడు భాషను బోధించేటప్పుడు భాషతో పాటు సమయోచితంగా దేశభక్తికి సంబంధించిన గొప్ప ఉదాహరణలు పేర్కొని సాధారణ పౌరుడిని ఉత్తమ పౌరునిగా తీర్చిదిద్దడం తమ బాధ్యత అని మరవరాదు. ఉదా ఛత్రపతి శివాజీ తల్లి అతనికి అతని భాషలో అ ందించిన పురాణాలు, కథల మూలంగా శివాజీని గొప్ప దేశభక్తుడిగా తయారుచేసింది.

భాషను బోధించేటప్పుడు ఇది మన భాషే కదా అని ఉదాసీనత చూపరాదు. విద్యకు జ్ఞానసము పార్జనం పరమావధి కారాదు. పిల్లలజీవితాన్ని తీర్చిదిద్దే శిల్పిగా భాషాచార్యుడు మాతృభాషను బోధించి మరిన్ని ప్రయోజనాలను పెంపొందించాలి.

## 1.6 భాష - స్వరూప స్వభావాలు :

భాష దేశకాల పాత్రలను బట్టి దాని స్వరూపం మారుతు ఉంటుంది. భాష ఒకతరం నుంచి మరొక తరానికి ప్రసరిస్తుంది. మానవునికి ఆహారం వలె ముఖ్యమైన ఒక నిత్యావసరం సంభాషణం. మానవుడు తీరిక సమయాల్లో సంబంధం ఉన్న విషయంతో పాటు సంబంధం లేని విషయాలను గు రించి విచారించడం, తెలుసుకోవడం చేస్తూ ఉండడాన్ని గమనించవచ్చు. తద్వారా జీవితంలో సంభాషణకు గల ప్రాధాన్యం తెలుస్తుంది. మానవులు కాక ఇతర ప్రాణులు వాటికి ప్రమాదం జరిగి నప్పుడు ఒక చోట చేరడం, గుంపులుగా కలిసి జీవించడం చేస్తున్నాయి. అయినా మానవుల వలె అవి మాట్లాడుకోలేవు. మానవ భాషకు లక్షణాలు ఉన్నాయి.

**భాషా స్వభావ లక్షణాలు :-**

మానవ భాషలో రెండు రకాల (ద్వైవిధ్య) నిర్మాణం ఉంది. మానవుని ముఖ యంత్రం

నుంచి వెలువడు కొన్ని ధ్వనులు కలిసి ఒక పదంగా ఏర్పడటం, కొన్ని పదాలు కలసి ఒక వాక్యంగా ఏర్పడటం అన్ని భాషల్లోను మనం గమనించగలుగుతాం.

**సామాజిక సుస్థితిని పెంపొందిస్తుంది :**

మానవులు తమ భావాల్ని ఇతరులకు వ్యక్త పరచటం ఇతరుల భావాల్ని గ్రహించటం వలన భావ వినిమయం జరుగుతుంది. తద్వారా సమాజంలోని వ్యక్తుల ఉమ్మడి ఆలోచనలు, లక్ష్యాలు, ఆశయాలు వృద్ధి చెంది సామాజిక వికాసానికి భాష సహకరిస్తుంది.

**కొత్త వాక్యాల ఉత్పాదక శక్తిని కల్గి ఉంటుంది. :**

గతంలో విన్న వాక్యాల నిర్మాణాన్ని అనుసరించి, అనుభవం ద్వారా అంతకు ముందు ఎన్నడు వినని వాక్యాల్ని కూడా తయారుచేసి వాడగలం. ప్రాథమికదశలో శిశువు భాష నేర్చుకోవడం ఈ శక్తివల్లనే సాధ్యమవుతుంది.

**భాష భావాన్ని కలిగిఉంటుంది. :**

వ్యక్తి తనమనసులో జనిస్తున్న భావాలను వెలిబుచ్చడానికిగాను చేసే అర్థవంతమైన శబ్ద సముదాయాన్ని భాష అంటారు. అర్థవంతమైన పదాల సమూహం వాక్యం అవుతుంది. ఒక్కొక్కసారి ఒక పదం కూడా అర్థవంతమైన వాక్యం కావచ్చు. భావాలను ఆవిష్కరించడానికి అర్థవంతమైన పదాలు కూర్చబడుతాయి. భాషలో వాక్యమే చిన్నభాగం (యూనిట్).

**వాగ్రూపమైన ధ్వని సంకేత సమూహాలతో కూడినది.**

మానవ భావాలకు గుర్తులుగా(సంకేతాలుగా) కంఠధ్వనులు ఉపకరిస్తాయి. ఈ విధమైన వాగ్రూప ధ్వనులతో కూడిన సంకేతాలు భావాన్ని చాలాస్పష్టంగా అందించడానికి ఉపయోగపడతాయి.

**పరిణామాలతో కూడుకొని వుంటుంది.**

భాష పరిణామశీల.

మారుతున్న సమాజానికి తగినట్లు కాల ప్రవాహంలో ధ్వని భేదాలు, అర్థ భేదాలు వస్తుంటాయి. పూర్వకాల పదాల రూపాల్లో ఎన్నో మార్పుల్ని గమనించవచ్చు.

ఉదా  ౖమాను – మాను    ప్రాత – పాత    క్రొత్త – కొత్త    ప్రొద్దు – పొద్దు

పూర్వం 'భజన' అనే మాటను దేవుని 'భక్తితో పూజించడం' అనే అర్థంలో వాడేవారు. నేడు 'భజన' అనే మాటను ఇతరుల్ని పొగడడం అనే అర్థంలోను, అలాగే ప్రాచీన కాలంలో 'అమ్మ' అర్థానికి 'అవ్వ' పదం వాడడం జరిగింది (నన్నయ – నలోపాఖ్యానం – భారతం ).

**అనుకరణకు అనుకూలంగా ఉంటుంది.**

పిల్లలు కుటుంబంలోని తల్లిదండ్రులను, సమాజంలోని వ్యక్తులను అనుకరిస్తూ భాషను క్రమంగా నేర్చుకొంటారు. ఇదే క్రమంలో వ్యక్తులు నూతన భాషలను నేర్చుకోవాలన్నప్పుడు ఆయా భాషను ఉపయోగించే వారిని అనుకరిస్తూ నేర్చుకొంటారు. అనుకరణ ద్వారా ఎన్ని భాషలైనా నేర్చుకోవడానికి వీలవుతుంది. శిశువులు, నిరక్షరాస్యులు కూడా ఈ అనుకరణ వలన భాషను నేర్చుకోగలుగుతారు.

**భాష ప్రేరణ దూరత కలిగి ఉంటుంది.**

జంతువులు వాటికి ప్రమాదాలు, సంతోషాలు, బాధలు వంటి పరిస్థితుల ప్రేరణ కలిగినప్పుడు మాత్రమే శబ్దాలు చేస్తాయి. కాని మానవులు జరుగుతున్న విషయాలను, సంఘటనల్ని, వార్తల్ని గురించేగాక భూత, భవిష్యత్తులను గురించి కూడా మాట్లాడగలరు. అంటే మానవులకు కల్గిన ప్రేరణ వర్తమానానికి సంబంధించింది కాకపోయినా భాషించగలరు.

**సంస్కృతిని ప్రతిబింబిస్తుంది.**

ఒకజాతి తనదైనసంస్కృతిని సంప్రదాయాలను కలిగి ఉంటుంది.వారి భాష ఆజాతి ఆచార సంప్రదాయాలను తెలియజేస్తుంది. ఉదా వివాహ సంబంధమైన పదప్రయోగాలు, వాటికి సంబంధించిన వాక్యాలు ఆ వ్యవస్థను కల్గిన సంస్కృతిని తెలియబరుస్తాయి.పైవన్ని భాష స్వభావ లక్షణాలు.

| |
|---|
| సరళగ్రాంథిక రూపంలో ఉన్న పరవస్తుచిన్నయసూరి రచన నీతిచంద్రిక వచన గ్రంథం నుంచి వివిధ స్థాయిల్లోని విద్యార్థులకు (3–5 తరగతుల వరకు) ఐదేసి కథలను సేకరించి శీర్షికలను పట్టికగా ఇవ్వండి. |

**స్వరూప లక్షణాలు :** భాష కాలానుగుణమైన లక్షణం కలది. మార్పులకు చేర్పులకు లోనవుతుంది. ఒక భాష నుంచి మరెన్నో భాషలు పుట్టాయి. ఆయా భాషల ద్వారా మరో కొత్త భాషకు, కొత్త రూపానికి కారణమయ్యాయి. ఒక నిర్ణీత ప్రాదేశిక పరిధిలో ఉపయోగించే భాషా రూపంలో కూడా ప్రాంతీయ భేదాలు ఉంటాయి. వాటినే మాండలికాలు అంటారు. పైవిధంగా ఒక భాషకే గల పలు రూపాలను గురించి తెలుసుకొందాం.

భాష స్థూలంగా రెండు రకాలుగా పేర్కొనవచ్చు.

1. వాగ్రూపం 2. లిఖిత రూపం

**వాగ్రూపం :**

వాక్(మాటలు) రూపంలో ఉండే భాషను వాగ్రూప భాష అంటారు. అంటే అర్థవంతమైన ధ్వని సంకేతాల ద్వారా తన మనస్సులోని విషయాన్ని భావాన్ని ఇతరులకు తెలియజేయడం. విన్నటువంటివారు అదే విధమైన భావాన్ని గ్రహించడాన్ని 'వాగ్రూప భాష' అంటారు.

**లిఖిత రూపం :**

మానవుడు తనకు ప్రత్యక్షంగా లేని వ్యక్తికి తనభావాలను అర్థవంతమైన లిపిసంకేతాలద్వారా తెలియజేయడం. అటువంటి లిపి సంకేతాల్ని ఇతరులు చదివి,అందలి భావాల్ని ఉన్నది.ఉన్నట్లుగా గ్రహించడాన్ని 'లిఖిత రూపం' అంటారు. ఇలాంటిభాష ముందుతరాల వారికి సహకరిస్తుంది.

**1.7. భాషారూప వర్గాలు :**

సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తే భాషను ప్రధానంగా

1. గ్రాంథిక భాష 2. వ్యావహారిక భాష 3. మాండలిక భాష
4. ప్రామాణిక భాషలుగా వర్గీకరించవచ్చు. వాటిని గూర్చి తెలుసుకొందాం.

**గ్రాంథిక భాష :**

సంప్రదాయబద్ధమైన కొన్ని నిబంధనలకు నియమాలకు లోబడి గ్రంథాలలో వ్రాసే భాషారూపాన్ని గ్రాంథిక భాష అనవచ్చు. ఇది బాగా చదువుకొన్నవారు వ్రాసే భాష. సంస్కృతభాష ఎక్కువగాను, వ్యాకరణ సమ్మతమై నదిగాను ఉంటుంది. ఇలాంటి భాషలో ఆధునికత్వం చోటు చేసుకోవడానికి ముందు కొన్ని శతాబ్దాల పాటు తెలుగు కవులందరు తమ రచనల్లో ఈ భాషను వాడేవారు. ఆ కాలంలో గ్రంథాల్లో విరివిగా వాడబడిన భాష. కాబట్టి దీన్ని గ్రాంథిక భాష అంటారు.

ప్రాచీన కావ్యాల్లోనూ, అష్టదిగ్గజ కవుల కావ్యాల్లోను, కరుణశ్రీ పద్యాల్లోను, "రామాయణ – మహాభారత– భాగవతాల్లోను" ఈ భాషను గమనించవచ్చు. ఇలాంటి గ్రాంథిక భాషకే పరవస్తు చిన్నయసూరి వ్యాకరణం వ్రాసాడు. అదే బాలవ్యాకరణం. ప్రస్తుతం గ్రాంథికభాష చాలావరకు

కనుమరుగైపోయింది. వ్యావహారిక భాషనే ఆధునిక గ్రంథాలలో కూడా వ్రాస్తున్నారు. అయినా ఈనాటి విద్యార్థులకు, ఛాత్రోపాధ్యాయులకు ప్రాచీనభాషా స్వరూపం కూడా తెలుసుకోవడానికి గ్రాంథిక బాషలో వ్రాయబడ్డ పాఠ్యాంశాలను కూడా పాఠ్యపుస్తకాల్లో కొన్నింటిని ప్రవేశపెట్టి బోధించినప్పుడు ప్రాచీనమైన విశిష్ట సాహితి సంపదను కాపాడుకొన్నవాళ్ళమవుతాము.

**గ్రాంథిక భాష - లక్షణాలు :**

1. వ్యాకరణ నియమాలకు లోబడి ఉండడం.
2. నిత్యం వ్యవహారంలో లేని పదాలు ఎక్కువగా ఉండడం.
3. వాడుకకు పలు రూపాలు ఉండడం.
4. ముకారముతో అంతమయ్యే రూపాలు ఉండడం.
   ఉదా ప్రాణము, బాణము, పుష్పము మొదలగు నవి.
5. ఎక్కువగా సంధులు కలిగి ఉండడం.
6. సుదీర్ఘ సమాసాలు ఉండడం.
7. సంస్కృత పదాల్ని అధికంగా ప్రయోగించడం.
8. పటుత్వాన్ని కలిగియుండడం.
9. ద్రాక్ష, నారికేళ, కదళీ పాకాలకు ఉదాహరణంగా ఉండడం.
10. పదాల్ని ఎక్కువగా గుప్పించే (పదగుంభన) శైలి ఉండడం.
11. నిండు సున్నలు, అరసున్నలు చేసిన రూపాలు వాడడం.
    ఉదా వాండు - వాఁడు అరంటి - అరఁటి
    మగండు - మగఁడు
12. పండితులు, కవులు, విమర్శకులు ప్రమాణంగా స్వీకరించడం (అంగీకరించడం)
13. అలంకారాలు కలిగియుండడం.
14. సామాన్య జన భాషా వినిమయానికి దూరంగా ఉండడం.
    ఉదా రామాయణ, మహాభారత, భాగవతాల్లోను, ప్రాచీన పద్య, గద్యాల్లోనుగమనించవచ్చు.

మీకు తెలిసిన ఒక కథను సరళగ్రాంథిక భాషలో వ్రాయండి.

**గ్రాంథిక భాష - ప్రాముఖ్యం :**

- సుమారు 9 శతాబ్దాలకు పైగా (నన్నయ నుండి గురజాడ వరకు) సాహిత్య రచనల్లోని బాషను నిర్దేశించిన (నిర్ణయించిన) భాషారూపం గ్రాంథిక రూపం.
- ఈ గ్రాంథిక భాషలోనే మన ప్రాచీన తెలుగు భాష, సాహిత్యం, గొప్పతనం కన్పిస్తాయి.
- ఈ భాషారూపాన్ని, సాహిత్యాన్ని పూర్తిగా అర్థం (అవగాహన) చేసుకోవాలంటే చక్కని సమగ్ర వ్యాకరణ జ్ఞానం, సాహిత్యశాస్త్ర నిబంధనల జ్ఞానం, సంస్కృత భాషాజ్ఞానం తప్పకుండా ఉండాలి. భాషమీద గొప్ప అధికారం (పట్టు) సంపాదించడానికి గ్రాంథికభాష సహకరిస్తుంది.
- గ్రాంథిక భాషకు వ్రాసిన వ్యాకరణజ్ఞానం ఏ భాషా రూపానికైనా వ్యాకరణ నిర్మాణానికి సహకరిస్తుంది.
- అనువాదం, ఇతర భాషల నుంచి చేస్తున్నప్పుడు సరియైన పదాల్ని, పదబంధాల్ని, సమాసాల్ని
- గ్రాంథిక భాష నుంచి స్వీకరించడం జరుగుతుంది.

| |
|---|
| గ్రాంథిక రూపంలోని పదివాక్యాలను సేకరించండి.<br>వాటిని సమానమైన వ్యావహారిక వాక్యాలుగా మార్చి వ్రాయండి |

**వ్యావహారిక భాష :**

నిత్య వ్యవహారంలో సామాన్యజనం వాడుకొనే భాషను వ్యావహారికభాష అంటారు. దీనినే వాడుక భాష, ప్రజల భాష, జీవద్భాష అంటారు. దాదాపు తొమ్మిది శతాబ్దాల సాహిత్య సృష్టికి కారణమైన గ్రాంథిక భాష నిత్య వ్యావహారిక భాషా రూపానికి దూరంగా ఉందని గుర్తించిన గిడుగు రామ్మూర్తి

పంతులు వ్యావహారిక భాషావాదాన్ని ప్రతిపాదించి ఆభాషా రూపానికి గౌరవ ప్రతిష్టలను, సాహిత్య గౌరవాన్ని సంపాదించి పెట్టాడు. గిడుగు రామ్మూర్తి పంతులు వ్యావహారిక భాషా వాదాన్ని ఉద్యమ వ్యాప్తి కోసం 'తెలుగు' అనే మాస పత్రికను ప్రారంభించాడు. ఆనాడు గిడుగు లేకపోతే ఈనాడుఆధునిక సాహిత్యంలేదు.ఈ భాషా వాదాన్ని గురజాడ అప్పారావు,కందుకూరి వీరేశలింగం,తాపీ ధర్మారావు మొదలగువారు సమర్ధించారు. ఆంగ్లేయులైన లార్డ్‌కర్జన్, J.A.యేట్స్ వంటి వారు కూడా ఈ వాదాన్ని వ్యాప్తి చేశారు. వ్యావహారిక భాషను కొన్ని రకాలుగా వర్గీకరించవచ్చు.

- పండితులు, కవులు, సభల్లో మాట్లాడే భాషను శిష్టవ్యావహారికం అని అంటారు. ఈనాడు చదువుకొన్నవారు కూడా ఈ వ్యావహారిక రూపాన్ని నియోగిస్తున్నారు. ది గ్రాంథిక భాషకు దగ్గరగా ఉంటుంది.

**గ్రామ్యభాష :**

భాషా సంస్కారం (సామర్థ్యం)సాధారణ స్థాయిలో కూడా విద్యలేని వ్యక్తులు వ్యవహరించే భాషను గ్రామ్యభాష అన్నారు. ప్రస్తుతం ఏ విద్యాస్థాయి వ్యక్తులైనా/ అవిద్యావంతులైనా వ్యవహరించే భాషను వ్యావహారిక భాషగానే భావిస్తున్నారు.

**సరళ వ్యావహారికం :**

ఆధునిక కాలంలోని వచనకవిత్వం, పాఠ్యపుస్తకాలు,కథానికలు, నవలలు, పత్రికారంగంలోను, దూరదర్శన్ రంగంలోను ఈ వ్యావహారిక భాషనే ఎక్కువగా వాడుతున్నారు. ఈ సరళ వ్యావహారిక భాషలో ప్రజలు నిత్యం ఉపయోగించే సామెతలు, పదప్రయోగం, జాతీయాలు, వాక్య నిర్మాణ విన్యాసం ఉన్నప్పుడే ప్రామాణిక వ్యావహారిక భాషవృద్ధి చెందుతుంది.

ఉదా

* ఆ పాత్ర కడుమలినాత్మకంబై యొప్పుచున్నది - గ్రాంథికం.

* ఆ పాత్ర బాగా మలినమైంది - శిష్ట వ్యావహారికం.

* ఆ చెంబంతా మడ్డైందే - సామాన్య వ్యావహారికం.

దినపత్రికలను పరిశీలింపచేసి వ్యావహారిక భాషపదాలను కనీసం 50ని సేకరించి వాటిని పట్టిక పరచండి.

**వ్యావహారిక భాషా లక్షణాలు :**

- ప్రజల దైనందిన వ్యవహారానికి ఉపయోగించేది.
- గ్రాంథిక భాషకన్నా సరళంగా ఉంటుంది.
- ప్రాచీన వ్యాకరణ సూత్రాలకు చాలా వరకు సరిపడనిది.
- అన్యభాషా పదాలను ఇముడ్చుకొని, సామెతలు జాతీయాలను కలిగి ఉంటుంది.
- ఉచ్చారణకు సరళమై, సహజ సౌందర్యం కలిగి ఉంటుంది.
- సులభంగా అవగాహన అవుతుంది.
- ధ్వని ఉచ్చారణల కనుగుణంగా వ్రాత రూపం కలిగి ఉంటుంది.
- మారే కాలానికి అనువైనది.
- సందర్భం, అవసరాన్నిబట్టి ఇతరభాషాపదాలను ఉపయోగిస్తుంది.
- సహజ వాక్య నిర్మాణం కలిగి ఉంటుంది.

**వ్యావహారిక భాష - ప్రాధాన్యం :**

- మానవుల హృదయాలను ప్రతిబింబించే భాష ఇది.
- సృజనాత్మక శక్తి కలిగిన వారందరు రచయితలుగా, కవులుగా అభివృద్ధి చెందడానికి వ్యావహారిక భాష ఉపకరిస్తుంది.
- ప్రజలు నిత్యజీవితంలో మాట్లాడుకొనేది వ్యావహారిక భాష. ఈ భాషలో వ్రాయడం, మాట్లాడడం చేసినప్పుడే భావాలు స్పష్టంగా వ్యక్తపరచవచ్చు.
- ఎలాంటి తడబాటు లేకుండా వ్యక్తులు సహజంగా అప్రయత్నంగా మాట్లాడే భాష ఇది.
- నేటి సాహిత్యాన్ని ( ఆధునిక సాహిత్యాన్ని) సాధారణ వ్యక్తులు కూడా చదివి ఆనందించడానికి రసానుభూతిని పొందడానికి కారణం వ్యావహారిక భాష.

1958లో వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు (వ్యావహారిక భాషా వ్యాకరణం) పేరుతో వ్యావహారిక భాషకు వ్యాకరణం రచించాడు..వ్యావహారిక భాషను మాండలిక భాష, ప్రామాణిక భాష అని రెండు రకాలుగా విభజించవచ్చును

**మాండలిక భాష :**

ఒక భాష మాట్లాడే ప్రజలు అన్ని ప్రాంతాల్లోను ఒకే విధమై భాషను మాట్లాడడం జరగదు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా మాట్లాడడం జరుగుతుంది. సమాజాల చారిత్రక, భౌగోళిక, సాంఘిక లేదా సాంస్కృతిక అంశాలు భాషా వైవిధ్యానికి కారణమవుతాయి. ఉదా తమిళనాడులో కృష్ణగిరి జిల్లాలో మాట్లాడే తెలుగుభాష, తిరువళ్లూరు జిల్లాలో వ్యవహరించే తెలుగుభాష, వేలూరుజిల్లాలో బాషించే తెలుగుభాష ఇదంతా వ్యావహారిక భాషే. కాని ఒక ప్రాంతానికి, ఇంకొక ప్రాంతానికి భాషలో వ్యత్యాసం తప్పకుండా కనిపిస్తుంది. తిరువళ్లూరు జిల్లాలో కందిపప్పు అంటే, హోసూరు ప్రాంతంలో కందిబేడలు అంటారు. ఈ విధంగా ఒకే భాషను మాట్లాడే ప్రజలు పలు రకాల తేడాలతో మాట్లాడడం గమనించవచ్చు.

ఒక ప్రదేశంలో లేదా ప్రాంతానికి సంబంధించిన ప్రజలు నిత్యవ్యవహారాల్లో వాడబడే భాషను గాని లేదా ప్రజానీకం చేసే వృత్తినిబట్టి,వ్యాపారాన్ని బట్టి ఏర్పడిన ఒకవర్గం ప్రజలు వ్యవహరించే భాషాభేదాన్ని 'మాండలికం' అంటారు. అదే విధంగా అన్ని భాషల్లోను మాండలికాలు ఉంటాయి. క్లుప్తంగా చెప్పాలంటే ప్రతి వ్యక్తి నిత్యవ్యవహారంలో మాండలిక భాషనే మాట్లాడుతాడు. మాండలికాల సమాహార రూపమే భాష. మాండలికమే భాష సహజ స్థితి.

మాండలిక వైవిధ్యాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. ధ్వని భేదం 2. రూప భేదం

**మాండలిక భాష - ధ్వని విభేదాలు :**

ఆంధ్రప్రదేశ్‌లో కోస్తాజిల్లాలో వచ్చాడు అంటారు. తెలంగాణాలో వచ్చిండు అంటారు. రాయలసీమ జిల్లాలో వచ్చినాడు అంటారు. ఇక్కడ వచ్చినాడు, వచ్చాడు, వచ్చిండు అనే క్రియపదాల్ని ధ్వని భేదంతో వాడడం జరిగింది.

**మాండలిక రూప భేదాలు :**

ఒకేవిధమైన అర్థం తెలియజేసే భిన్న పదాలు లేదా రూపాలు పలు ప్రాంతాల్లో వినియోగంలో ఉన్నాయి. వేలూరు, తిరువళ్ళూర్ ప్రాంతంలో పార అనే పనిముట్టును హోసూరు ప్రాంతంలో చెనక అంటారు. ఈ విధమైన మాండలిక భాషలో నామిని సుబ్రమణ్యంనాయుడుచే వ్రాయబడ్డ మిట్టూరోడి కథల్లో పచ్చనాకు సాక్షిగా అనే కథానికను మంచి ఉదాహరణంగా పేర్కొనవచ్చును.

**మాండలిక భాష - లక్షణాలు :**

* దీనిపరిధి తక్కువ ప్రాంతానికే ఉంటుంది.
* ప్రాంతీయమైన తేడాలు ఉంటాయి.
* మార్పులకు సులభంగా వీలవుతుంది.
* శాశ్వతమైన శైలి లేకపోవడం.
* కొన్ని చోట్ల ఉచ్చారణకు, వ్రాతకు సంబంధం ఉండక పోవడం.
* ఈ భాషకు స్వతంత్ర సాహిత్యం తక్కువగా ఉండడం.
* మాతృభాషలోని యాస మాతృభాష తీయదనాన్ని గుర్తించడానికి రసానుభూతి పొందడానికి ఉపకరిస్తుంది.
* విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో విద్యను బోధించడానికి ఈ మాండలిక భాష ఎక్కువగా సహకరిస్తుంది.
* సాంఘిక, రాజకీయ ఆచార వ్యవహార పరిస్థితుల్ని తెలుసుకోవచ్చు.
* సృజనాత్మకమైన కవితలు వ్రాయడం, పాటలు పాడడానికి మాండలిక భాష ఉపయోగపడుతుంది.

* రచయిత ఏ ప్రాంతపు వ్యక్తి అని తెలుసుకొనవచ ఉపాధ్యాయులు ప్రామాణిక భాషను దృష్టిలో ఉంచుకొని మాండలిక భాషల్లోని పదాలకు సమాన ప్రామాణిక భాషా పదాలను సందర్భం, స్థాయికి తగినట్లు ఉదాహరణల ద్వారా నేర్పించే సామర్థ్యాన్ని కలిగిఉండాలి. తద్వారా అభ్యాసకులు మాండలిక భాష నేర్చుకొంటూనే ప్రామాణిక భాషలో పరిజ్ఞానం పొందడానికి వీలవుతుంది.

ఆధునిక కాలంలో ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడడం, దూరదర్శన్, సినిమాలు, రేడియో, వార్తాపత్రికల రంగాలు అభివృద్ధిచెంది వ్యాప్తిచెందడం వలన మాండలిక భేదాలు తగ్గడానికి కారణం అయింది.

**తెలుగు భాషలో గల కొన్ని మాండలిక భేదాలు :**

– కృష్ణగిరి జిల్లా, హోసూరు, తళి ప్రాంతీయుల కన్నడ భాషా ప్రభావంతో కూడిన మాండలికం.

| ఉదా | ప్రామాణికం | | మాండలికం |
|---|---|---|---|
| | పప్పులు | – | బేడలు |
| | తలుపు | – | వాకిలి |
| | పునాది | – | తలాది, అస్తివారం |
| | సెలవు | – | రజ |
| | పండిస్తారు | – | పండుతారు. |

– తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి, మాదరపాకం ప్రాంతీయుల మాండలికం

| ఉదా | ప్రామాణికం | | మాండలికం |
|---|---|---|---|
| | వచ్చాను | – | వచ్చినాను/ వస్తిని |
| | వచ్చారు | – | వ్రచి , వచ్చినారు |
| | ఇచ్చారు | – | ఇస్త్రి , ఇచ్చినారు |

– మధురై, సేలం, ఈరోడు, ధర్మపురి జిల్లాల ప్రాంతీయులు తమిళ భాషా ప్రభావంతో కూడిన మాండలికం

| ఉదా | | | |
|---|---|---|---|
| | గుడి | – | కోయిల్ |
| | ఎన్ను | – | కదురు |

> తరగతిలోని భిన్నమైన మాండలికంతో మాట్లాడే విద్యార్థుల భాషణాన్ని పరిశీలించి వారి సంభాషణల నుంచి పది వాక్యాలు వ్రాయండి

**ప్రామాణిక భాష :**

నేటి వార్తా పత్రికల సంపాదకీయాలలో ఆధునిక సాహిత్య ప్రక్రియల రచనల్లో రేడియో, దూరదర్శన్,వార్తల్లో విద్య వైజ్ఞానిక చర్యల్లో ఉపయోగించే భాష 'ప్రామాణిక భాష'గా చెప్పవచ్చు. నేడు పాఠ్య గ్రంథాల నిర్మాణంలో వాడే భాష కూడ అదియే.

ఒకే రాష్ట్రంలోని భాషకు ఆయా ప్రాంతాలను బట్టి మాండలిక భాషాభేదాలు ఉన్నాయి. కాబట్టి అన్ని ప్రాంతాల వారికి అర్థమయ్యే సామాన్యభాష అవసరం ఉంది. అన్ని మాండలికాల వారికి అర్థమయ్యే విధంగా ఆమోదయోగ్యంగా శైలి ఉన్న భాష, ప్రామాణిక భాష. ప్రామాణిక భాష ఒక మాండలిక భాషాశైలికి సామీప్యంగా ఉన్నా అది ఏ ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం కాదు.

అధిక సంఖ్యాకులు అంగీకరించి వ్యవహరించే భాషా రూపాన్ని ప్రామాణిక భాష అంటారు. మొదట మాండలిక రూపాలు వ్యావహారికమై,వ్యావహారికం శిష్టవ్యావహారికమై,శిష్ట వ్యావహారికం ప్రామాణిక రూపం పొందుతుంది. ఈ పరిణామక్రమంలో ప్రామాణిక భాష పరిణతి పొందిందని భాషావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

సమాజంలో చక్కని భాషాజ్ఞానం ఉన్న వ్యవహర్తలందరు పలికే భాషా రూపాలన్ని ప్రామాణికాలే. ఈ ప్రామాణిక భాషలనే పత్రికలు వాడుతున్నాయి. ఈ రకమైన భాషలోనే ప్రభుత్వ కార్యాలయాల్లో వ్యవహారాలు (ఉత్తర, ప్రత్యుత్తరాలు) జరుపుతున్నారు. ఈ భాషనే ఆధునిక రచయితలు శిష్ట వ్యావహారిక భాష అంటున్నారు.

అన్నిరకాల మాండలికాలను సమన్వయం చేసుకొంటూ సమగ్ర, శాశ్వత గుణాల్ని గడిస్తూ సమాచార, ప్రసారాది సమస్తమైన కార్యకలాపాలకు, సాహిత్య, సాంస్కృతిక అంశాల వ్యక్తీకరణలకు సహకరిస్తూ ఎల్లప్పుడూ అభివృద్ధి పథంలో సాగే భాష 'ప్రామాణిక భాష'.

**ప్రామాణిక భాషాలక్షణాలు :**

* నిర్దిష్ట ప్రమాణాలకు లోబడి ఉండడం.
* నిత్యవ్యవహారానికి సామీప్యం కలిగిఉండడం.
* పరిణామశీలత కలిగిఉండడం.
* నిరంతరం అభివృద్ధి (వికాసం) చెందుతూ ఉండడం.
* సమగ్రతను, స్థిరత్వాన్ని సాధించడం.
* శాశ్వతత్వం సాధించి ఉండడం.

**ప్రామాణిక భాష - ప్రాముఖ్యం :**

* రాష్ట్రంలోని అన్ని తెలుగు మాండలికాలు ప్రజలకు అర్థవంతమవుతాయి.
* ఆధునిక సాహిత్య రూపాలయిన కథానిక, నాటిక, గేయం, వ్యాసం, విమర్శ మొదలగు ప్రక్రియలకు చక్కగా ఉపయుక్తం అవుతుంది.
* ప్రచార, ప్రసార రంగాలకు బాగా ఉపయోగపడుతుంది.
* అన్ని మాండలికాల మధ్య సమన్వయం కుదిర్చి సమైక్యాన్ని కల్గిస్తుంది.
* కృత్రిమత్వానికి దూరంగా ఉంటూ క్లేశరహితంగా సహజ స్థితిలో వ్యక్తులకు జ్ఞానార్జన చేయడానికి దోహదపడుతుంది.

**ఆధునిక భాష - ప్రాధాన్యత** :

ప్రాచీన తెలుగుభాష 9 శతాబ్దాల ( 10 నుండి 18వ శతాబ్దం వరకు) కాలం పాటు గ్రాంథిక బాషకు అత్యధికంగా ప్రాధాన్యతఇవ్వడంధ్వారా సామాన్య జనజీవనానికి అందుబాటులో లేక కేవలం పండితులకు, చదువరులకు, అధికారులకు, రాజులకు మాత్రమే పరిమితమయింది. ఆ మధ్య

కాలంలో వెలసిన గొప్ప పురాణాలు, కావ్యాలు ప్రబంధాలలో సామాన్య ప్రజలు అర్థం చేసుకోవడాని కి వీలుపడని గ్రాంథిక భాష వాడడం జరిగింది. ఉదాహరణకు శ్రీ కృష్ణదేవరాయలచే రచింపబడిన "ఆముక్తమాల్యద" గ్రంథంలోని గ్రాంథిక భాష సామాన్య విద్యావంతులకు అర్థం కాకుండా ఉంది. ఇటువంటి పరిస్థితులను నివారించి సామాన్యులకు అవగాహన కలిగే భాషాశైలి అవసరాన్ని గిడుగు రామూర్తి పంతులుగారు గుర్తించారు. అతని వ్యావహారిక భాషోద్యమం ద్వారా గొప్పమార్పు జరిగింది. గురజాడ అప్పారావు గారి ప్రోత్సాహంతో పాటు ఆంగ్లేయులైన J.A. యేట్స్, లార్డ్ కర్జన్ వంటి వారు ఈ వాదాన్ని వ్యాప్తి చేశారు.

ఈ వ్యావహారిక భాషావాదం ప్రారంభంలో ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్నా, చివరకు విజయం సాధించింది. క్రమంగా విద్యావేత్తలు, పండితులు కూడా శిష్ట వ్యావహారికం వైపు మొగ్గు చూపారు. నే డు పత్రికలు, దూరదర్శన్ మొదలగు సమాచార రంగాల్లోను, విద్యారంగం ఈ వ్యావహారిక భాష ప రిపూర్ణంగా వాడబడుతుంది.

తెలుగు సాహిత్యంలో వ్యావహారికభాష తర్వాత చెప్పుకోదగింది మాండలికభాష. ప్రస్తుతం ఆయ ా మాండలికాల శబ్దాల్లోనే కవులు విరివిగా రచనలు చేస్తున్నారు. ఈ వ్యావహారిక భాషలో మొదటిసా రిగా పాత్రకు ఉచితమైన భాషను వేదం వేంకటరాయశాస్త్రి నాగానందం లో ప్రయోగించాడు.

గురజాడ అప్పారావుగారు పూర్తిగా పాత్రోచిత (వ్యావహారిక) భాషలో వ్రాసిన మొదటి నాటకం 'కన్యాశుల్కం' ఈ నాటకంరచించి ఒకశతాబ్దం గడిచినా ఇంకను అందులోని పాత్రలు ప్రయోగించిన భాష నేటి సమాజంలో సజీవంగా ఉన్నాయి.

నేడు పత్రికారంగంలో ప్రామాణిక భాషను వాడుతున్నారు. ఆధునిక కాలంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో వాటి ప్రాధాన్యం పెరిగింది. ఆంగ్లభాషకు సమానంగా తెలుగుభాషను రూపొందించడానికి పరిరక్షించుకోవడానికి, సుసంపన్నం చేసుకోవడానికి రకరకాల నిర్వచనాలను, సిద్ధాంతాలను, పారి భాషిక పదకోశాలను, సాంకేతిక పదజాలాన్ని స్పష్టంగాతర్జుమా చేసుకోవడం కోసం తెలుగుభాషను ఆధునికీకరణం చేసుకోవలసిన అవసరు ఉంది.

**ఆధునిక భాషకు కారణాలు :**

- సమాచార, సాంకేతిక విజ్ఞానంలో వచ్చిన గుణాత్మకమైన మార్పులు మరియు పరిశోధనలు.
- వీలైనంత తక్కువ సమయంలో ఎక్కువ భాషల్ని నేర్చుకోవాలనే కోరిక ఏర్పడడం.
- భాష ద్వారా సంబంధ బాంధవ్యాలను వ్యాప్తి చేసుకోవాలనే ఆసక్తి పెరగడం.
- రేడియో, టి.వి., కంప్యూటర్లు, ఇంటర్‌నెట్, ఉపగ్రహ వ్యవస్థ మొదలగు రంగాలు విస్తరించడం
- పత్రికారంగంలో భాషను వ్రాసే విలేకరులు, సంపాదకులు కూడా కారణమవుతున్నారు.

**ఆధునిక భాషా లక్షణాలు :**

- ఒకే రూపాన్ని కలిగి ఉండడం : అన్ని ప్రాంతాల వారు ఒకే విధమైన శైలిని పాటించాలి.
- క్లుప్తత : విషయాన్ని సాగతీయకుండా వీలైనన్ని తక్కువ పదాల్లో చెప్పగలగాలి.
- సరళంగా ఉండాలి : దీర్ఘసమాస భూయిష్ఠంగాను, కఠిన పదప్రయోగాలతో కూడిన, అన్వయ క్లిష్టతతో కూడిన, గ్రాంథికశైలి వంటిది కాకుండా సహజంగా ఉండాలి.
- అర్థంలో స్పష్టత కలిగిఉండాలి : తెలుగు ప్రజలందరికి అర్థం అయ్యేలా ఉండాలి.
- తేలికగా అర్థం కాగలగాలి, రచన సుబోధకంగా ఉండాలి.
- అనువాదానికి అనుకూలంగా ఉండాలి : ఇతర భాషల నుంచి అనువదించడానికి వీలు కలిగి ఉండాలి.

**ప్రాంతీయ భాష :**

భాషా స్వరూప విశ్లేషణలో ప్రాంతీయభాష అనేది ఒక భేదం. మాతృభాష కానిది, ప్రాంతీయుల్లో ఎక్కువ మంది వ్యవహరించేభాషను ప్రాంతీయభాష అని చెప్పవచ్చు. తమిళనాడులో ప్రాంతీయ భాష తమిళం. ఈ రాష్ట్రంలో తమిళం మాట్లాడే వారెక్కువ. తమిళనాడులో తెలుగువారు, కన్నడిగులు, మలయాళీలు, మహమ్మదీయులు ఉంటున్నారు. వారు తమ ఇళ్లల్లో తమ తమ మాతృభాషల్ని సహజంగా నేర్చుకొంటారు. ఆ కుటుంబాల్లో పుట్టిన పిల్లలు రెండు మూడేండ్ల ప్రాయం వచ్చేసరికి పరిసరాల్లో ఉన్న ఇతర శిశువులతో, ఆడుకొనేటప్పుడు ఎక్కువ మంది మాట్లాడే తమిళాన్ని నేర్చుకోవలసి వస్తుంది. బడిలో ప్రవేశించిన తరువాత ఇతర శిశువులతో సంబంధాలు కొనసాగించుకోవడానికి తమిళాన్ని కూడా నేర్చుకొంటారు. ఉదా మహమ్మదీయులు తమ మాతృభాష ఉర్దూ నేర్చుకొంటూ, ప్రాంతీయభాష అయిన తమిళాన్ని కూడా నేర్చుకొంటారు.

మాతృభాష- ప్రాంతీయభాష వేరువేరుగా ఉండే వారిని భాషాపరంగా (LINGUISTIC MINORITIES) అల్పసంఖ్యాక వర్గాలంటారు. అలాచూస్తే తమిళనాడులో నివసిస్తున్నతెలుగు, కన్నడం మొదలగుభాషలు మాతృభాషలుగా కలిగినవారు భాషాల్పసంఖ్యాక వర్గాలవారవుతున్నారు.

**జాతీయ భాష :**

మనది భారతజాతి. ఈ జాతీయత కులాలకు, భాషలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతమైనది. భిన్నత్వంలో సాధించిన ఏకత్వమే మన భారతజాతి. ఈ జాతి ఆదర్శాలను, ప్రణాళికలను, సంస్కృతిని ఆధారంగా చేసుకొని జాతి ప్రయోజనాలు సాధించడానికి ఒక సామాన్య భాష మన దేశానికి ఉంది. అదే హిందీ భాష. ఆ భాషే కేంద్ర ప్రభుత్వ భాషగా నిర్దేశించడం జరిగింది. ఆ భాషనే 'జాతీయ భాష' అంటున్నారు. రష్యా దేశంలో పలు రాష్ట్రాల్లో మాట్లాడే విభిన్న భాషలన్నింటిని ఆ ప్రభుత్వం గుర్తించినప్పటికి దేశపరిపాలన సౌలభ్యం కోసం రష్యా భాషను మాత్రమే 'అనుసంధాన' భాషగా స్వీకరించడం జరిగింది.

అలాగే భారతదేశంలో భిన్నభాషలున్నప్పటికి కేంద్ర ప్రభుత్వం తనపరిపాలన కార్యక్రమాల్ని ఆ . బాషలన్నింటిలోనిర్వహించడం కుదరదు. కనుక దేశభాషల్లో ఒకటైన హిందీని అనుసంధాన భాషగా ఉపయోగించు కోవాలని అనుకొంటున్నారు.

**అంతర్జాతీయ భాష :**

ప్రతి దేశ పౌరుడు తన ప్రాంతీయ భాషను నేర్చుకొంటాడు. దేశ పౌరుడుగా జాతీయ భాషను నేర్చుకోవడానికి ప్రయత్నిస్తాడు. ప్రపంచీకరణ నేపథ్యంలో విశ్వకుటుంబ భావన రూపొందుతున్న ఈ కాల పరిస్థితుల్లో విశ్వవ్యాప్తమైన మనకు పరిచయమైన ఆంగ్లభాషనే మనం అంతర్జాతీయ భాషగా గుర్తించాము. ఆ భాషకు మన విద్యారంగంలో తగిన స్థానం ఇవ్వడం జరిగింది.

స్వాతంత్ర్య సమరకాలంలో భిన్న భాషీయులైన భారతీయుల్ని కలుపగలిగింది ఆంగ్లభాషే. ఆంగ్ల భాషా పఠనం, ప్రయోగం వల్ల జాతీయ భావాలను నాయకులు వ్యాప్తం చేయగలిగారు. ఆధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞాన విప్లవాన్ని దృష్టిలో ఉంచుకొని నేడు ఈ భాషను నేర్చుకోవలసిన ఆవసరం ఎంతైనా ఉంది.

తెలుగు సాహిత్యంపైన ఆంగ్లభాషా ప్రభావం పడింది. తత్ఫలితంగా నవల, వ్యాసం, కథానిక, విమర్శ మొదలైన కొత్త ప్రక్రియలెన్నో తెలుగులో ప్రవేశించాయి. ఆంగ్ల ప్రభుత్వాన్ని నేనుద్వేషిస్తాను, కాని నేను ఆంగ్లభాషను ద్వేషించను అని మహాత్మాగాంధీజి చెప్పిన మాటల్లోని లోతును ఈ సందర్భంలో మనం గుర్తు చేసుకోవడం సమంజసం.

**1.8 భాష - సంస్కృతి :**

విద్యార్థులు సంస్కృతి – సంప్రదాయాల్ని తెలుసుకొంటారు. ఇది భాషా బోధనలో ఒక లక్ష్యం. విద్యార్థులు సంస్కృతి సంప్రదాయాల్ని తెలుసుకొని తద్వారా తమ సంస్కృతిని పరిరక్షించుకో గలుగుతారు. ఈ లక్ష్య సాధనకు క్రింది స్పష్టీకరణలు ఉపకరిస్తాయి.

ఎ) విద్యార్థులు రచనల్లోని ఆచార వ్యవహారాల్ని తెలుసుకొంటారు.
బి) విద్యార్థులు రచనల్లోని కాలభేద ప్రభావాన్ని గ్రహిస్తారు.
సి) విద్యార్థులు పురాణేతిహాసాల్లోని కథా వస్తువు సాంఘిక, నైతిక విశేషాల్ని వివరిస్తారు.
డి) విద్యార్థులు సంస్కృతిని విశదీకరిస్తారు.
ఇ) విద్యార్థులు రచనల్లోని నీతిని గ్రహిస్తారు.

**1.9 భాష - సాహిత్యం - రసాస్వాదన :**

విద్యార్థులు రసానుభూతిని పొందుతారు. రసానుభూతిని పొందడం భాషాబోధనలక్ష్యాల్లో ఒకటి. ఇది ప్రధానంగా పద్యబోధన ద్వారా సాధించబడుతుంది. సాహిత్యవిజ్ఞానం లోతుగా కలిగితే దాని ప్రతిఫలంగా రసానుభూతిని పొందడం జరుగుతుంది. ఇది హృదయగతమైన ఆర్ద్రత, తన్మయతకు సంబంధించింది. తనకు నచ్చిన, అంశంలోమనసులీనం కావడం సహజం. భాషా సౌందర్యాన్ని ఆకళింపు చేసుకొన్న వ్యక్తి, పదజాల గారడిని గ్రహించిన వ్యక్తి అందలి భావనా సముద్రంలో తేలియా డుతాడు. రసానుభూతిని, ఆనందానుభూతిని కల్గించడానికి క్రింది స్పష్టీకరణలు ఉపకరిస్తాయి.

- విద్యార్థులు రసభేదాలను తెలుసుకొంటారు : పాఠశాల స్థాయి రచనల్లో ప్రధానంగా హాస్యం, కరుణ, వీరం మొదలైనవి ఉంటాయి.
- విద్యార్థులు తాము చదివే పుస్తకాల్లో రసవద్ఘట్టాలను గుర్తిస్తారు.
- విద్యార్థులు అలంకారాల గొప్పదనాన్ని తెలుసుకొంటారు.
- విద్యార్థులు రచనల్లోనిశైలీ భేదాన్ని గ్రహిస్తారు.
- విద్యార్థులు రచనల్లోని పాత్రల ఔచిత్యాన్ని గ్రహిస్తారు.

– విద్యార్థులు ధ్వన్యర్థాన్ని ఆస్వాదిస్తారు. అంటే పదం సాధారణ అర్థం కాకుండా, పదాన్ని పలికే తీరు ఒత్తిడిని ఆధారంగా చేసుకొని భావనలను అర్థం చేసుకోవడం, ధ్వని – ఊనిక, ఉచ్చారణ తీరు మొదలైనవి అర్థం బేదాలను కల్గిస్తాయి. ధ్వనిని కావ్యాత్మకంగా కూడా భావిస్తారు. ఇది విశిష్టార్థం కావచ్చు. వ్యంగ్యార్థం కావచ్చు.

– విద్యార్థులు రచయితల ఆత్మీయతలను సూచించే సన్నివేశాల్ని పేర్కొంటారు.

**భాషాబోధన ద్వారా ఉత్తమ పౌరునిగా రూపొందిచడం :**

○ ప్రాథమిక బాధ్యతలను నిర్వహించడానికి పూనుకొంటాడు.

○ హక్కులను, వాటి పరిమితులను తెలుసుకొంటాడు.

○ స్వేచ్ఛా శీలత వర్థిల్లుతుంది.

○ సమానత్వ భావనను అంగీకరిస్తాడు.

○ సమైక్య భావన ఏర్పడుతుంది.

○ జాతీయ భావన కలుగుతుంది.

○ సహన భావం పెంపొందుతుంది.

○ పరస్పర సహకార భావాన్ని పెంపొందిస్తాడు.

○ భాషా సాహిత్యం తెలుసుకోవడం వల్ల విద్యార్థుల్లో విస్తృత గ్రంథపఠనం చేయాలనే అభిరుచులు ఉద్భవిస్తాయి.

○ పంచతంత్ర కథల్ని చదవడం ద్వారా లోకజ్ఞానాన్ని పెంపొందించుకొంటాడు.

○ భాష ద్వారా సంస్కృతి, సంప్రదాయాల్ని గౌరవించడం నేర్చుకొంటాడు.

○ భాషలోని ఉత్తమ సాహిత్య పఠనం ద్వారా విద్యార్థుల్లో మంచి విలువలు, వైఖరులు వృద్ధి చెందుతాయి.

○ ఉదా తెలుగుభాషలోని నీతి శతకాల్ని చదవడం వలన సాధారణ విద్యార్థులు ఉత్తమ విద్యార్థులుగా ఎదగడానికి ఉపకరిస్తుంది.

○ భాషకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సభలు, క్రీడలు నిర్వహించడం ద్వారా ఐకమత్యం, దేశ భక్తి, సమానత్వం, భిన్నత్వంలో ఏకత్వం వంటి ఉత్తమ గుణాలు పెంపొందడానికి భాష ఉపకరిస్తుంది.

○ భాషద్వారా విద్యార్థులకు తల్లిదండ్రులపై గౌరవాన్ని, గురుభక్తిని, దేశభక్తిని పెంపొందించడానికి వీలుకలుగుతుంది.

○ క్లుప్తంగా చెప్పాలంటే శైశవ దశ నుండి వృద్ధాప్యం వరకు మానసిక వికాసానికి, సామాజిక వికాసానికి, ఆర్థిక, రాజకీయాభివృద్ధికి, నైతిక విలువలు పెంపొందడానికి, హక్కులు బాధ్యతలు తెలుసుకోవడానికి, తగిన సర్దుబాటు పొందడానికి, సృజనాత్మకత కలగడానికి, సమతౌల్య మూర్తిమత్వం అభివృద్ధి జరిగి ఉత్తమ పౌరుడుగా రూపొందడానికి భాష కీలకమైనది.

## అధ్యాయం - 2

# భాషా బోధన

2.1 పరిచయం

2.2 భాషా బోధన - ముఖ్య ఉద్దేశ్యాలు

2.3 బోధనా లక్ష్యాలు

2.4 భాషతోపరిచయం - నేర్చుకోవడం - ప్రయోగించడం సహజంగా జరిగే ప్రక్రియ

2.5 బోధన మాధ్యమంగా తెలుగు - ప్రయోజనాలు

2.6 మాతృభాష

2.7 తెలుగు భాషా బోధన - విలువలు

2.8 ప్రథమ భాషగా తెలుగు

2.9 ద్వితీయ భాషగా తెలుగు

2.10 తృతీయ భాషగా తెలుగు

2.11 ధ్వని - ఉత్పత్తి

2.12 భాషాధ్వనులు - వాగవయవాలు

2.13 ధ్వనులు - ఉచ్చారణ - లోపాలు - కారణాలు - నివారణ

2.1. పరిచయం

భాష మానవుల భావవ్యక్తీకరణగ్రహణలకు ఒక విశిష్ట మాధ్యమం. శ్రవణ, భాషణ, పఠన, లేఖనా లకు ఉపకరించే సాధనం. విద్యా విధానంలో ఉపాధ్యాయశిక్షణ ప్రణాళిక ప్రవేశపెట్టినప్పటి నుండి మిగతా విషయాలతో పాటు భాషా బోధన విషయంలో కూడా శాస్త్రీయ దృష్టితో బోధనాపద్ధతులకు రూపకల్పన జరిగింది.

విద్యార్థుల సమగ్ర మూర్తిమత్వ వికాసానికి భాషాబోధన విశిష్ట పాత్ర వహిస్తుంది. అటువంటి బోధనకు, నిర్దిష్టమైన లక్ష్యాలను రూపొందించాలి. విద్యార్థుల వివిధ విద్యాదశలను దృష్టిలో ఉంచుకొని ఈ లక్ష్యాలను క్రమంగా సాధించవలసి ఉంటుంది. ఇవి భాషాపరంగా, వ్యక్తిపరంగా నిర్ణయించబడిఉండాలి. ఈ విధంగా నిర్ణయించేటప్పుడు విద్యార్థిలో వివిధ దశలలో కలిగే ప్రవర్తనా పరమైన మార్పులను పరిగణించాలి.

విద్యార్థి తనకు పరిచయం లేని విషయాలను నూతనంగా నేర్చుకొనేటప్పుడు పంచేంద్రియాల, ప్రమేయం ఉంటుంది. తనకు పరిచయంలేని కొత్త విషయాలను మొదటగా వినడం, చూడడం, దాన్ని గురించి ఆలోచించడం, పూర్వజ్ఞానంతో సమన్వయపరచుకోవడం, సంబంధిత కార్యక్రమాల లో పాల్గొనడం మొదలైన దశలలో పంచేంద్రియాల ప్రమేయం పటిష్ఠంగా ఉంటుంది.

ఒక్కొక్క ఇంద్రియాన్ని జ్ఞానానికి ఒక్కొక్క సింహద్వారంగా **(Senses are gateways of knowledge)** మాంటిసోరి వంటి విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. రెండు, మూడు ఇంద్రియాలు

నూతన జ్ఞానార్జనలో పాల్గొనేటప్పుడు విద్యార్థికి కలిగే జ్ఞానం అధికంగాను, స్థిరంగాను ఉంటుందని మనస్తత్వ శాస్త్రవేత్తల అభిప్రాయం. చైతన్యవంతంగా విద్యార్థులు పాల్గొనేటట్లు అనేక కృత్యాలు పాఠ్యప్రణాళికలో పొందుపరచడం జరుగుతుంది.

ప్రాతిపదిక లక్ష్యాలు :

భాషాపరమైన లక్ష్యాలలో నిశితమైన శ్రవణం, నిర్దుష్టమైన ఉచ్చారణతో భాషణం, స్పష్టమైన ఉచ్చారణతో కూడిన అర్థవంతమైన పఠనం, దోషరహిత లేఖనం ముఖ్యమైనవి. భాషా రంగమంతా ఈ నాలుగు భాషా నైపుణ్యాలలో విస్తరించి ఉంది. ఈ నాల్గింటిని ప్రాతిపదిక లక్ష్యాలు అంటారు.

ప్రాతిపదిక లక్ష్యాలలో మొదటిది శ్రవణం. ఐదేండ్లు నిండిన బాలబాలికలు ప్రాథమిక పాఠశాల లో అడుగిడుతారు. పాఠశాలకు వచ్చే సరికి పిల్లలకు శ్రవణంలో నేర్పు ఉంటుంది. తమ ఇంటి వాతావరణం, చుట్టూ ఉన్న పరిసరాలు పిల్లలకు శ్రవణంలో అనుభవం కలగడానికి తోడ్పడుతాయి. ఈ అనుభవం యొక్క ప్రభావం వారి భాషణంపై కూడా ఉంటుంది. శ్రవణ, భాషణాలపై అవగాహన కలిగిన పిల్లలు పాఠశాలలో ప్రవేశిస్తారు. పాఠశాలలో శ్రవణ భాషణాలను నియంత్రణంలో ఉంచి పెంపొందించడం జరుగుతుంది. మిగిలిన పఠన, లేఖన సామర్థ్యాలను సాధించడం ప్రధానంగా ఉపాధ్యాయుని కృషిపై ఆధారపడి ఉంటుంది. శ్రవణ భాషణ సామర్థ్యాలను అభివృద్ధి పరచడంతో పాటు విద్యార్థులకు పఠన, లేఖన సామర్థ్యాలను కలిగించడం ద్వారా సమాజంలో వారి స్థాయిని ఇనుమడింపజేయడం భాషా బోధన ప్రధాన ఉద్దేశ్యంగా చెప్పవచ్చు. భాషను బోధిస్తున్నప్పుడు గుర్తించుకోవలసిన ముఖ్యమైన ఉద్దేశ్యాలను క్రింది విధంగా పేర్కొనవచ్చును.

## 2.2. తెలుగు భాషా బోధన - ముఖ్య ఉద్దేశ్యాలు :

వైయక్తిక లక్ష్యాలన్నా, సామాజిక లక్ష్యాలన్నా ఒక్కటే. మానవులు తాము జీవిస్తున్న సమాజంలో గుర్తింపు కలిగి గొప్పగా రాణించాలనుకోవడమే వైయక్తిక లక్ష్యం. సమాజంలో వ్యక్తికి కావలసిన వ్యాపకాలు వృత్తిపరంగా, జ్ఞానార్జన సంబంధంగా, వినోద సంబంధంగా, సాంస్కృతిక, నైతిక సంబంధంగా ఉంటాయి. కాబట్టి ఈ లక్ష్యాలను క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

* జీవనోపాధి లక్ష్యం
* జ్ఞానార్జన లక్ష్యం
* సౌందర్యానుభవ లక్ష్యం
* సాంస్కృతిక లక్ష్యం

జీవనోపాధి లక్ష్యం :

జీవనోపాధి లక్ష్యం ప్రధానమైంది. ఏదైనా ఒకవృత్తి చేసిన జీవించడానికి ఆవశ్యకమైన భాషా సామర్థ్యం విద్యార్థులకు చేకూర్చాలి. ఈ విధంగా చేకూర్చనిదే తక్కిన ఉన్నత లక్ష్యాలను సాధించడం సాధ్యం కాదు. జీవితానికి ఉపయోగపడనిది ఏది విషయ ప్రణాళిక (Curriculum) లో ఉండడానికి వీలులేని పరిస్థితులు వచ్చాయి. నేర్పే భాషా అంతా జీవితానికి సంబంధించింది, జీవనోపాధికి ఉపయోగపడేదే అనేభావన విద్యార్థుల్లో కలగకపోతే ప్రేరణ లోపిస్తుంది. ఫలితం ఉండదు.

జ్ఞానార్జన లక్ష్యం :

ప్రాచీన విద్యకు ఆధ్యాత్మిక వికాసం పరమావధిగా ఉండేది. నేటి విద్యావిధానంలో జ్ఞానసముపార్జన ముఖ్యమైన లక్ష్యంగా వుంది. భాషాపరమైన జ్ఞానాన్ని విద్యార్థులు పొందాలి. ఈ జ్ఞానం విద్యార్థుల్లో బుద్ధి వికాసం కలిగిస్తుంది. మానవుడు సమాజంలో ప్రత్యేకత పొందడానికి ఈ జ్ఞానార్జన ప్రధానమైన ఆయుధం. మానవుడు తన జీవితాన్ని సక్రమంగా నిర్మించుకోవడానికి జ్ఞానం అవసరం. విద్యావంతులుగా విద్యార్థులకు గుర్తింపు నిచ్చేది జ్ఞానం. జ్ఞానాన్ని ఆర్జించుకోవాలన్న జిజ్ఞాస విద్యార్థులకు కలిగించే విధంగా ఉండాలి.

సౌందర్యానుభవ లక్ష్యం :

మానవుడు వివేచనాత్మక జీవి అని తర్కశాస్త్రజ్ఞులంటారు. కేవలం మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవడం మాత్రం అతనికి జీవిత పరమావధికి కాదు. జీవనావశ్యకాలు ఆహారం, వస్త్రం, నివాసం మొదలైనవి సమృద్ధిగా సమకూర్చుకొన్న పిమ్మట ఆహ్లాదం, వినోదం కలిగించే వ్యాపకాలపై అతని మనస్సు పాకుతూ వుంటుంది. అటువంటి సౌందర్యానుభవానికి భాషకు మించిన సాధనంలేదు. మధురమైన పాటలు, కథలు, పద్యాలు, గేయాలు, నాటికలు, సామెతలు లోకోక్తులు, చమత్కారాలతో కూడిన ప్రహసనాలు, కావ్యాలు, ప్రబంధాలు ఇవన్నీ విద్యార్థి భాషాభ్యసన ప్రక్రియలో చేర్చవలసినఅంశాలు. వీటిని చదవడం వల్ల విద్యార్థికి హృదయ ఆహ్లాదం కలిగి మనోవికాసం ఏర్పడుతుంది. తీరిక సమయాన్ని సద్వినియోగపరచుకోగలుగుతారు. విద్యార్థుల్లో సత్ప్రవర్తన తీసుకురావడానికి ఈ లక్ష్యం దోహదకారిగా ఉంటుంది. పద్య, గద్య, నాటకాలు బోధించే పద్ధతులు వివరించే సందర్భంలో దీనిని గురించిన వివరాలు చేర్చబడినాయి. భాష ద్వారా కలిగే సౌందర్యానుభూతి (Aesthetic appeal) భౌతిక సౌందర్యానుభూతి కంటే సూక్ష్మమైనది. విశిష్టమైనది.

సాంస్కృతిక లక్ష్యం :

మిగతా వాటికంటే ఉన్నతము, సూక్ష్మము అయిన లక్ష్యం సాంస్కృతిక లక్ష్యం . సత్యం, దయ, ధర్మం, త్యాగం, నీతి నియమాలు మొదలైనవి ఇందులో ఇమిడివుంటాయి. పురాణాలు, కావ్యాలు ఇతర రచనల ద్వారా ఇవి ప్రబోధింపబడ్డాయి. ఇవి చదివినప్పుడుహృదయంలోని కల్మషం, క్షాళనం కావించబడి నిర్మలవుతుంది. విద్యార్థులలో విలువలను పెంపొందించడానికి ఎంతగానో ఈ లక్ష్యం ఉపయోగపడుతుంది. ఈ లక్ష్య సాధన విద్యార్థులు సన్మార్గంలో పయనించడానికి దోహదపడుతుంది. ప్రవర్తనలో మార్పులు చోటు చేసుకొంటాయి. మంచి, చెడుల మధ్య భేదాన్ని గ్రహించి తమకు అవసరమైన మంచిని విద్యార్థులు అనుసరించేటట్లు చేయాలి. సత్యహరిశ్చంద్రుని కథ ప్రభావం గాంధీజీ జీవితంపై ఎంతగానో ఉండేదని పేర్కొనేవారు. తల్లి ద్వారా వీరగాధలు విన్న శివాజీ, ధైర్య సాహసాలకు మారుపేరు. ఈ విధమైన సత్ప్రవర్తనను తీసుకురావడానికి ఈ లక్ష్యం ఎంతగానో దోహదపడుతుంది.

మన సంస్కృతికి రామయణం, మహాభారతం, మహాభాగవతం, పట్టుకొమ్మలవలె నేటికీ నిలిచాయి. వీటిని చదివేటప్పుడు పాఠకులకు కలిగే సంస్కారం వారి జీవితాలను ఆదర్శంగా మలచుకునేందుకు ఎంతగానో ఉపకరిస్తాయి.

| |
|---|
| **వేమనపద్యాలు నాల్గింటిని సుమతి శతకపద్యాలు నాల్గింటిని వ్రాయండి. విద్యార్థులలో సత్ప్రవర్తనకు, నైతిక విలువలు పెంపొందించడానికి అవి ఏవిధంగా తోడ్పడు తాయో నివేదికగా సమర్పించండి.** |

ప్రతిలక్ష్యంలోను ఇమిడి ఉండవలసిన లక్ష్యం జ్ఞాన పిపాస. ఇందుకు ఉపాధ్యాయుని మూర్తిమత్వమే ఆధారం. పాఠాన్ని బోధించడంతో ఏవో కొన్ని నూతన విషయాలు తెలియ చెప్పడంతో అతని పాత్ర పూర్తికాదు. అనంతమైన జ్ఞానం సంపాదించడానికి విద్యార్థికి కావలసిన చొరవ, మార్గం చూపించడంలో అతనికి గల నైపుణ్యమే కారణమవుతుంది. అనుకరణ, అనుసరణ ఈ రెండు విద్యార్థి దశలో ఎక్కువగా ఉంటాయి. విద్యార్థులు ఉపాధ్యాయులను అనుసరించడం సాధారణంగా జరుగుతుంటుంది. విద్యార్థులలో సత్ప్రవర్తనను తీసుకొనిరావడానికి అనుకరణనను సాధనంగా మలచుకోవచ్చు.

పాఠశాల దశలో మౌల్యవిద్య (ValueEducation) ను ఖచ్చితంగా బోధించాలని దానికంటు ఒకటి రెండు పీరియడులు (Periods)కేటాయించడం జరిగింది. సాంస్కృతిక లక్ష్యం నెరవేర్చడానికి మంచి అవకాశంగా ఉపాధ్యాయులు మౌల్య విద్యను ఉపయోగించకోవచ్చును.

ఉపాధ్యాయుడు అన్ని విషయాలలో ఆచరణ రూపంలో విద్యార్థికి ఉదాహరణంగా నిలిచి అతని సత్ప్రవర్తను తీర్చిదిద్దాలి. ఇది ఇతర విషయాలను **(Subjects)** బోధించే ఉపాధ్యాయుల కంటే భాషోపాధ్యాయునికి విద్యార్థులను ఉత్తమ వ్యక్తులుగా తీర్చిదిద్దే బాధ్యత ఎక్కువ . ఎందుకంటే గణితం, విజ్ఞానశాస్త్రం మేధోసంబంధమైనవి కాగా భాషా సాహిత్యాలలోనే ఎక్కువ సాంస్కృతిక విలువల గురించి పాఠాలు చదివే అవకాశాలు ఉంటాయి. గణితం, విజ్ఞానశాస్త్ర విషయాలుగల తరగతుల కంటే భాషాతరగతుల కోసం విద్యార్థులు ఆత్రుతగా ఆసక్తిగా ఎదురుచూడడానికి ఇవే కారణాలు. సాహిత్య బోధన హృదయ సంబంధమైనది. భాష విద్యార్థులలో శీల నిర్మాణానికి దోహద పడుతుంది. విద్యార్థిలో జ్ఞానపిపాస తోపాటు గురుభక్తి కలిగించవలసిన బాధ్యత కూడా ఉపాధ్యాయునిపై ఉంది.

| |
|---|
| గణితం, విజ్ఞాన, సాంఘికశాస్త్రాల విషయాల కంటే (Subjects) భాష ప్రత్యేకమైన విషయం (subject)ఎందుకు? చర్చించండి. నివేదికను సమర్పించండి. |

## 2.3 బోధన లక్ష్యాలు :

భాష నేర్చుకోవడం శ్రవణం, అనుకరణ, అభ్యాసం అనే మూడు అంశాల ద్వారా జరుగుతుంది. వీటిని సంబంధించిన పరిజ్ఞానం ఉపాధ్యాయులకు నిర్దిష్టంగా ఉండాలి. అభ్యసనంలో అభిరుచి(Interest), అవధానం (Attention),చైతన్యం (Awareness)విద్యార్థులకు కలిగించాలి. అభిరుచి కలిగించాలంటే ప్రేరణ అవసరం. ఇది వరకు విద్యాబోధన లక్ష్యం పరీక్షలో ఉత్తీర్ణత పొందడం. ఈ ఉత్తీర్ణతనే ప్రేరణంగా ఉపయోగించేవారు. ప్రస్తుతం నూతన విద్యావిధానాన్ని అనుసరించి పరీక్షల స్థానాన్ని జ్ఞానం ఆక్రమించింది. మూల్యాంకనం అనే భావన ప్రవేశించింది. విద్యాశాఖ నూతన మూల్యాంకన విధానాన్ని రూపొందించింది. విద్యార్థులు పొందవలసిన భాషా సామర్థ్యాలు ఇందులో పొందుపరచబడ్డాయి.

బెంజమిన్ బ్లూమ్ (BenjaminBloom) విశ్లేషించిన బోధన లక్ష్యాల ఆధారంగా ఈ రూపకల్పన జరిగింది. భాషా సామర్థ్యాలను విశ్లేషించి వాటిని మూడు రంగాలుగా విభజించారు.

1. జ్ఞానాత్మక రంగం (Cognitive domain)
2. భావావేశ రంగం (Affective domain)
3. మానసిక చలనాత్మక రంగం (Psychomotor domain)

పై మూడు రంగాలలో భాషా సామర్థ్యాలు, నైపుణ్యాలు వ్యక్తమవుతూ ఉంటాయి.
భావగ్రహణం (Reception) ధారణ (Retention) అభివ్యంజనం(Expressions) అనే అంశాలు ప్రతిరంగంలోనూ జరుగుతూనే ఉంటాయి. బోధకులు సహజంగా జరిగే ఈ అంశాలను క్రమబద్ధం చేసి, ఉత్తమ సంస్కారం కల్గించడానికి కృషి చేస్తారు. ఒక్కొక్క రంగంలో భాషా బోధన – ఉద్దేశ్యాలు స్థూలంగా ఉంటాయి. ఈ మూడు రంగాల గురించి తెలుసుకోవడానికి ముందు గమ్యం (Goals), ఉద్దేశం (Aim) లక్ష్యం –(Objectives) స్పష్టీకరణం (Specification) అనే పదాల నిర్వచనాలు, వాటి మధ్య గల సంబంధాల గురించి తెలుసుకోవలసిన అవసరం ఉంది.

1. గమ్యాలు / ధ్యేయాలు (Goals) :

ఆశయాలు, ఉద్దేశ్యాల విస్తృత వ్యక్తీకరణలే గమ్యాలు. ఇవి విద్యా విధాన ప్రాధాన్యాలను నిర్ణయించి ప్రణాళికా రూపకల్పనకు ఉపకరిస్తాయి. ఇవి సుదీర్ఘకాలంలో విద్యాప్రణాళిక (Curriculum) మొత్తంపై సాధించవలసిన ప్రవర్తనాపరమైన మార్పుల మొత్తాలు. వీటినే ధ్యేయాలు అని కూడా వ్యవహరిస్తారు. ఉదా ప్రాథమిక స్థాయి విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించి స్వతంత్ర పాఠకులుగా వారిని తయారు చేయడం.

2. ఉద్దేశ్యాలు (Aims) :

గమ్యాలనుండి ఆవిర్భవించి పాఠ్యప్రణాళికల (Syllabus) రూపకల్పనకు, పాఠ్యాంశాల ఎంపికకు ఉపకరించేవి ఆయా పాఠ్యాంశాల ద్వారా విద్యార్థుల్లో సాధించవలసిన స్థూలమైన, ప్రవర్తనాపరమైన మార్పుల్ని వివరించేవి ఉద్దేశ్యాలు. ఇవి ఒక్కొక్క విషయానికి (Subject)సంబంధించి ఉంటాయి. ఒక ప్రత్యేక పాఠ్య ప్రణాళిక చివర ఒక సంవత్సరకాలంలో నయి నా విద్యార్థుల్లో సాధించే ప్రవర్తనామార్పుల మొత్తాలు. ఇవి సామాన్య ఉద్దేశ్యాలు (General aims), ప్రత్యేక ఉద్దేశ్యాలు (Specific aims) అని రెండువిధాలుగా విభజింపబడ్డాయి. విషయం (Subject) ప్రక్రియకు సంబంధించి సాధించేవి సామన్య ఉద్దేశ్యాలు. ఆయా పాఠ్యాంశాలకు సంబంధించి సాధించే ప్రత్యేక ప్రయోజనాలు ప్రత్యేక ఉద్దేశ్యాలు ఇవి దీర్ఘకాలంలో సాధించేవి.
ఉదాహరణ :మూడవతరగతి విద్యార్థులు సామాన్యమైన కథల పుస్తకాల చదవడం, బాలసాహిత్యంపై ఆసక్తి కలిగి చదవడం. బొమ్మల బాలరామాయణం, బొమ్మల రామాయణం మొదలైనవి చదవడం.

3. లక్ష్యాలు (Objectives) :

గమ్యాలు, ఉద్దేశ్యాల నుండి ఆవిర్భవించి, తరగతి బోధనకు మార్గదర్శకత్వం వహించి ఆయా పాఠ్యాంశాల ద్వారా విద్యార్థుల్లో ఆశిస్తున్న సూక్ష్మ ప్రవర్తనాపరమైన మార్పుల్ని సూచించేవి లక్ష్యాలు. వీటినే బోధన లక్ష్యాలు ( Instructional objectives) అని వ్యవహరిస్తారు.
ఉదా నాలుగవ తరగతి విద్యార్థులకు శతక పద్యాలను బోధించాలి. దీనిని ఎందుకోసం బోధిస్తున్నామో తెలిపేవే బోధన లక్ష్యాలు.

4. స్పష్టీకరణాలు (Specifications) :

బోధన లక్ష్యాల సూక్ష్మరూపాలు స్పష్టీకరణాలు. ఏదైనా ఒకే ఒక బోధనాంశం చివర విద్యార్థుల్లో ఆశిస్తున్న ప్రవర్తనలో మార్పు స్పష్టీకరణం. ఇది స్వల్పకాలంలో సాధింపబడుతుంది. ప్రతి లక్ష్యంలోని సూక్ష్మభావనలే స్పష్టీకరణాలు. ఇవి బోధన లక్ష్యాలను ప్రవర్తనల రూపంలో వివరిస్తాయి. ఇవి బోధన కార్యానికి అభ్యసనానికి సాక్ష్యాలు. ఇవి లక్ష్యాల అర్థాలను పరిమితం చేస్తాయి. వివిధ లక్ష్యాలలోని భేదాలను చెప్పడానికి సహాయపడతాయి. బోధనాభ్యసన కృత్యాలకు ఇవి ప్రాతిపదికలు. బోధన, అభ్యసన సన్నివేశాల్లోకి అంతరదృష్టిని సాధించడానికి మూల్యాంకనంలో ప్రశ్నల తయారికి ఇవి తోడ్పడుతాయి.

ఉదా 'నీతికథ'లను ఐదవతరగతి విద్యార్థుకు బోధించాలి. ఈ పాఠ్యాంశాల ఆధారంగా మనం కృత్యాలను కార్యక్రమాలను నిర్వహిస్తాం. ఇవి ఎందుకు నిర్వహిస్తున్నాం. వీటి ద్వారా విద్యార్థుల నుండి ఏమి ఆశిస్తున్నాం ? అని పరిశీలిస్తే

★ కథను విని అవగాహన చేసుకుంటారు.
★ కథను చదివి అవగాహన చేసుకుంటారు.
★ కథను సొంత మాటల్లో చెప్పుతారు.
★ మిత్రులు వ్రాసిన కథలను చదువగల్గుతారు. అవగాహన చేసుకుంటారు.
★ పాఠంలోని నూతన పదజాలం గుర్తించి వివరిస్తారు. వాటిని సొంతవాక్యాలలో ఉపయోగిస్తారు.
★ విరామచిహ్నాలు ఉపయోగించి కథను సొంతమాటల్లో వ్రాయగలుగుతారు.
★ పాఠంలోని నూతన పదాలకు నిఘంటువులో అక్షరాలు వెదుకుతారు మొదలైనవి.

'నీతికథ'ల ద్వారా విద్యార్థులలో పై అంశాలను సాధించాలని ఆశిస్తాం. వీటినే ప్రవర్తనలో మార్పులుగా పేర్కొంటారు. ఇవే స్పష్టీకరణలు లేదా సామర్థ్యాలు.

బోధన వ్యవస్థలో గమ్యాలు, ఉద్దేశ్యాలు, లక్ష్యాలు, స్పష్టీకరణాలు ఒకదాని నుంచి మరొకటి ఉద్భవించి స్థూలరూపం నుండి సూక్ష్మరూపానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. బెంజమిన్‌బ్లూమ్ (Benjamin Bloom) విశ్లేషించిన లక్ష్యాలను నిర్ణయించుకొనే ముందు క్రింది అంశాలను కూడా దృష్టి యందుంచుకోవాలి.

i) విద్యార్థులు కనబరచవలసిన ప్రవర్తనల రూపంలో ఇవి చెప్పబడాలి.

ii) పాఠ్యబోధనకు రూపకల్పన చేయడానికి ముందే వీటిని నిర్వచించుకోవాలి.

iii) అసంపూర్ణంగాకాక పూర్తి వాక్యాలలో స్పష్టంగా ఇవి వ్రాయబడాలి.

iv) పాఠ్యాంశాలలో ఇవి అన్వయించబడాలి.

మానవ ప్రవర్తన జ్ఞానాత్మక (Cognitive), భావావేశ (Affective), మానసిక చలనాత్మక (Psychomotor) రంగాల (domains) లోని ప్రతిస్పందనల ప్రతిరూపం. బోధనా లక్ష్యాలు ఈ మూడు రంగాలకు సంబంధించినవి. వీటిలో ఒకటి స్పష్టమైన అనుసంబంధం, (Hierarchy) వారసత్వం ఉంటుంది. ఈసంబంధాన్ని క్రిందివిధంగా సూచించవచ్చు.

| | | |
|---|---|---|
| మూల్యాంకనం<br>Evaluation | గుణీకరణం<br>Characterising | స్వాభావికీకరణం<br>Naturalisation |
| ↑ | ↑ | ↑ |
| సంశ్లేషణ<br>Synthesis | వర్గీకరణం<br>Organising | సమన్వయీకరణం<br>Co-ordination |
| ↑ | ↑ | ↑ |
| వినియోగం<br>Application | మౌల్యీకరణం<br>Valueing | ఆధిపత్యం<br>Control |
| ↑ | ↑ | ↑ |
| అవగాహనం<br>Comprehension | ప్రతిస్పందించడం<br>Responding | అనువర్తించడం<br>Manipulation |
| ↑ | ↑ | ↑ |
| జ్ఞానం<br>Knowledge | గ్రహించడం<br>Receiving | ఉద్వేగం<br>Impulsion |
| ↑ | ↑ | ↑ |
| జ్ఞానరంగం | భావావేశరంగం | మానసిక చలనాత్మకరంగం |
| ↑ | ↑ | ↑ |
| Cognitive domain | Affective domain | psychomotor domain |

పై మూడురంగాల గురించి కొన్నివివరాలు తెలుసుకొందాం.

**I. జ్ఞానాత్మక రంగం (Cognitive domain) :**

విద్యార్థులు అంతకముందు తెలియని కొన్ని విషయాలను కొత్తగా తెలుసుకొంటారు. పూర్వం తనకున్న జ్ఞానం సహాయంగా, జ్ఞాపకంలో ఉన్న అంశాల ఆధారంగా కొత్తవిషయాలను అర్థంచేసుకుంటారు. వీటిని తనపూర్వ జ్ఞానంతో(Preknowledge) సమన్వయం చేసుకొంటారు. ఇటువంటి కృషి ద్వారా జరిగే భాషాభ్యసనం జ్ఞానాత్మకరంగానికి చేరింది. దీనికనుగుణంగా ఈ క్రింది ఉద్దేశ్యాలను పేర్కొనవచ్చు.

**I. జ్ఞానం (Knowledge) :**

ఈ ఉద్దేశానికి స్పష్టీకరణలు ఈ క్రింది విధంగా ఉంటాయి.

అ) విషయ పరిజ్ఞానం :

భాష నేర్చుకోవాలంటే ఏదైనా ఒక విషయం ద్వారానే నేర్చుకోవలసి ఉంటుంది. పురాణాలు, చరిత్ర, కావ్య నాటకాదుల నుంచిగాని, గద్య పద్య గేయాది రచనలలో ఒకదాని ఆధారంగా బోధించ వలసి ఉంటుంది.

విషయం లేకుండా భాషకు స్థానం లేదు. అదేవిధంగా భాషా శూన్యమైన స్థితిలో విషయం ఉండదు. భాష ఒక శరీరం వంటిది. విషయం దానిలోని జీవం వంటిది. పాఠ్య విషయానికి సంబంధించిన ఇతివృత్తం, కవిపరిచయం, పూర్వగాథలు విశేషాంశాలు ఇవన్నీ విషయపరిజ్ఞానం క్రిందికే వస్తాయి. ప్రపంచజ్ఞానం కలిగించే చరిత్ర, విజ్ఞానం, భూగోళం, పరిశ్రమలు, వ్యవసాయం, కళలు మొదలైన అనేక విషయాలు వాచక పుస్తకాలలో పద్యాలు, గేయాలు, కథలు, వ్యాసాలు, నాటకాలు, సంభాషణ రూపాలలో పొందుపరుస్తున్నారు. విద్యార్థి పొందే భాషాసామర్థ్యం ఒక సాహిత్యరంగానికే పరిమితంకాక సామాజిక వ్యక్తిత్వం విద్యార్థికి కలుగజేసి, ఆదర్శపౌరునిగా తీర్చిదిద్దేందుకు ఉపకరిస్తుంది.

ఆ) భాషాజ్ఞానం :

భాషలో విషయానికంటే భాషకు ఎక్కువప్రాధాన్యం ఉంటుంది. విషయం కేవలం ఆలంబనకోసమే ఉపయోగపడుతుంది. భాషకు సంబంధించిన జ్ఞానం భాషాజ్ఞానం. ఇందులో క్రింది అంశాలు చేరుతాయి.

1. వాక్యభేదాలు : సామాన్య వాక్యం, సంశ్లిష్ట వాక్యం,
   సంయుక్త వాక్యం మొదలగునవి.
2. జాతీయాలు – నుడికారాలు

ఒక జాతికి సంబంధించినది జాతీయం. ఒక భాషప్రత్యేకత, విశిష్టమైన పలుకుబడి అనేఅర్థంలో జాతీయ పదాన్ని వాడుతున్నాం. పదాలలోఉన్నఅర్థంకాక ఒకవిశిష్టార్థం ఈజాతీయాలకుంటుంది. భాషా సంప్రదాయాలు తెలిసిన వారికే వీటి అర్థం తెలుస్తుంది.

'నుడి' కారం అంటే మాటలలోని సొగసు సరసత్వం అందలి చమత్కారం.

ఉదా ★ ప్రౌఢి బరికింప సంస్కృత భాషయుండ్రు
పలుకు నుడికారమున నాంధ్రభాష యుండ్రు
శ్రీనాథుని (భీమఖండం ఆ–15)

★ నీవుపల్కు నుడికారపు మాటలెల్ల నాతడాడును. జాతీయాలనే పదబంధాలు, నుడికారాలు, పలుకుబళ్ళ అనికూడా అంటారు. కొన్ని ఉదాహరణలు.

★ చెవికోసుకొనుట = వినుటకు ఇష్టపడటం (కథలు)

★ అందవేసిన చేయి/ కొట్టినపిండి = ఏదైనా విద్యలో పూర్తిప్రజ్ఞ ఉండటం.

బాషాజ్ఞానం............

3. మంగళం పాడుట/స్వస్తి చెప్పుట = ముగించటం
4. జంటపదాలు - * పైరుపచ్చలు * రాత్రింబవళ్ళు * మంచిచెడులు
 * కలిమిలేములు
5. ధ్వన్యనుకరణ పదాలు
 * జర జర * టక టక * చర చర * కట కట * గబ గబ
6. పదభేదాలు - ప్రకృతి - వికృతులు

ప్రకృతులు - తత్సమపదాలు ఉదా రాముడు, పుస్తకము

వికృతులు - తద్భవాలు ఉదా గోడ, జముడు

దేశ్యాలు - నిత్యవ్యవహార పదాలు ఉదా ఊరు, పేరు

గ్రామ్యాలు - లక్షణ విరుద్ధమైనది ఉదా వస్తాడు, తెస్తాడు

అన్యదేశ్యాలు - ఇతర భాషాపదాలు ఉదా గ్లాసు, రోడ్డు

7. పర్యాయపదాలు -సమానార్థక పదాలు

రాజు : నృపతి, నరపతి, మహీపతి, ప్రభువు, పృధ్వీపాలుడు
భూపాలుడు, చంద్రుడు

నానార్థాలు - ఒక పదానికి వేరువేరు అర్థాలు వచ్చే పదాలు.

కరము = చేయి, మిక్కిలి, తొండము, పన్ను

వ్యుత్పత్యర్థాలు = (వి+ ఉత్పత్తి + అర్థాలు )

ఒక పదానికి ఉండు ఉత్పత్తి ఆ పదం ఎలా పుట్టిందో దాని పూర్వోత్తరాలు తెలిపే అర్థం

పంకజము = బురద నుండి పుట్టినది (తామర)

సామాన్య వ్యాకరణాంశాలు, సంధులు, సమాసాలు మొదలగునవి

ఉచ్చారణ, వర్ణక్రమం,విరామస్థానాలు

ఊనిక, నొక్కిచెప్పడం(Stress),స్వరబలం (Accent)మొదలైన సాంకేతిక విషయాల పరిజ్ఞానం, విద్యార్థికి ప్రత్యేకంగా బోధిస్తే మాత్రం అలవడుతుంది. తెలుగుతో కలిపివాడే సంస్కృతపదాలు, అన్య దేశీయాలు ఏ విధంగా చేరుతాయో దంత్య 'చ, జ' ల ఉచ్చారణ ఎటువంటిదో న, ణ, ఞ, ఙ మొదలైన అనునాసికాల ఉచ్చారణలో గల సూక్ష్మ భేదాలు పాటించడం నేర్పాలి. ప్రసన్నశైలి, సంస్కృతభూయిష్ఠమైన శైలి, అచ్చ తెలుగు రచన మొదలైన వాటికి ఉదాహరణలను విద్యార్థులకు పరిచయం చేయడం ఇదంతా భాషాపరిజ్ఞానం పరిధిలోని వహిస్తుంది.

| మీ తెలుగువాచకాలలోని పాఠాలలోని అంశాలను విషయజ్ఞానం, భాషాజ్ఞానం, సాహిత్యజ్ఞానం క్రింద ఏవిధంగా వర్గీకరిస్తారో చర్చించండి నియోజనంగా సమర్పించండి. |
|---|

ఇ) సాహిత్యజ్ఞానం :

సాహిత్యానికి సంబంధించిన జ్ఞానం సాహిత్యజ్ఞానం, సహితాల యొక్క భావం సాహిత్యం. సహితం అంటే హితమైన దానితో కూడుకున్నది. `రమణీయార్థ ప్రతిపాదకఃశబ్దం కావ్యం' - జగన్నాథపండితరాయలు.హృదయానికి ఆహ్లాదం కలిగించేవిధంగా విషయాన్ని ప్రతిపాదించడం సాహిత్య

బోధనలోని ముఖ్యాంశం. దీనినే రమణీయత అంటారు. ఈ రమణీయతను విద్యార్థి గ్రహించేటట్లు చేయడానికి కావ్యాలలోని రసవత్తరాలైన ఘట్టాలను పాఠ్యపుస్తకాలలో చేరుస్తూ ఉంటారు.వాటిలోని సారాన్ని విద్యార్థులకు బోధపడేటట్లు ఉపాధ్యాయుడు ప్రయత్నం చేస్తాడు.సాహిత్య జ్ఞానంలో క్రిందివి చేరుతాయి :

1.శైలి : ఒక రచనలో భాషనుపయోగించే శక్తినీ నేర్పునూ, ప్రత్యేకతను శైలి అనవచ్చు. భాషా ప్రయోగనైపుణ్యం, రచనావిధానాన్ని కూడా శైలి అంటారు.

2. రసం, పాకం 3. ధ్వని 4. చమత్కారం 5. కవితాశిల్పం 6. అలంకారాలు 7. చమత్కారం 8. గద్య పద్య గేయ నాటకాది స్వరూపాలు 9 ఔచిత్యం 10. నాటక లక్షణాలు ఇతిహాస, పురాణాలు,కావ్యాలు, నాటకాలు మొదలైన సాహిత్య ప్రక్రియల పరిచయం విద్యార్థికి మాధ్యమిక దశలో కలిగించాలి. భవిష్యత్తులో జీవితాన్ని అర్థవంతంగా గడపడానికి వ్యక్తిని తీర్చిదిద్దడంలో, సమాజంలో ఉత్తమ పౌరుడుగా రాణించడానికి సాహిత్యజ్ఞానం ఉపకరిస్తుంది.

2. అవగాహన **(Understanding).**

జ్ఞానం ప్రాతిపదికగా ఏర్పడేది అవగాహన (Understanding). ఒక కొత్త పదానికి అర్థం,నిర్వచనం మొదలైనవి జ్ఞాపకశక్తి వల్లగాని, శ్రుతపాండిత్యం వల్లగాని విద్యార్థి చెప్పవచ్చు. అది జ్ఞానం. కాని ఆ పదాన్ని వివరించగలిగే శక్తి తనకు ఏర్పడినప్పుడు అది అవగాహన అవుతుంది. ఉదాహరణగా ప్రజాస్వామ్యం, విప్లవం, స్వాతంత్ర్యం మొదలైన వాటిని తరగతి స్థాయిని అనుసరించి వివరించవలసి ఉంటుంది. ఈ వివరించగల్గిన శక్తియే అవగాహన అని చెప్పవచ్చు. దీనికి ఉపాధ్యాయునికి లోకజ్ఞత చాలా అవసరం.

3. అనుప్రయుక్తం **(application)**

జ్ఞానం, అవగాహన ద్వారా గడించిన సామర్థ్యాన్ని వాచికంగానూ, లిఖితంగానూ విద్యార్థి ప్రకటించగలగడమే అనుప్రయుక్తం. మొదటి రెండు లక్ష్యాల ప్రభావం దీనిపై ప్రసరిస్తుంది. ఉచ్చారణదోషాలు, వ్యాకరణదోషాలు, భావదోషాలు లేకుండా మాట్లాడడం, చదవడం, నిర్దుష్టంగా వ్రాయడం, సొంతమాటలలో భావాలను వివరించడం అనుప్రయుక్తం క్రిందికి వస్తాయి.

**II** భావావేశ రంగం **(Affective domain)**

జ్ఞానం, అవగాహన అనే రెండింటిద్వారా కలిగిన సంస్కారం విద్యార్థిని ఒక భావావేశరంగంలో ప్రవేశపెడుతుంది.ఈ ప్రవేశం ఏక్షణంలో కలుగుతుందో చెప్పలేం.నూతన విషయాలు గ్రహించేటప్పుడు అవగాహన చేసుకొనేటప్పుడు విద్యార్థిలో కొన్ని అభిరుచులు, అనుభూతులు, వైఖరులు అంకురిస్తాయి. వీటి ఫలితంగా కొన్ని కార్యక్రమాలలో పాల్గొంటాడు. అటువంటి ప్రవర్తన పరమైన మార్పులే స్పష్టీకరణాలు.

1. అభిరుచులు **(Interest)**

భాషా సాహిత్యాల పరిచయంవల్ల ఉపాధ్యాయుని బోధననైపుణ్యంవల్ల విద్యార్థిలో విస్తార గ్రంథపఠనం చేయాలనే అభిరుచి కలుగుతుంది. ఇందువల్ల తనకు నచ్చిన కొన్ని గ్రంథాల నుంచి కొన్ని పద్యాలను ఎన్నుకొని కంఠస్థం చేయడం, చర్చలలో పాల్గొనడం, వక్తృత్వపు పోటీలకు వ్యాసరచన పోటీలకు సంసిద్ధులు కావడం మొదలైన లక్షణాలు విద్యార్థిలో కలిగి అభివృద్ధిచెందుతాయి.

2. రసానుభూతి (Appreciation) :

ఇది హృదయానికి సంబంధించిన రసానందస్థితి. సాహిత్యంలో తనకునచ్చిన సన్నివేశాలను

హృదయంలో భావించుకొని ఆనందించడం,శైలిని మెచ్చుకోవడం ఆయారచనా విధానాలలోని తారతమ్యం గ్రహించడం, కావ్యాలలో ధ్వనించే సందేశాన్ని గ్రహించడం, అలంకార భేదాలను తెలుసుకొని ఆనందించడం . మొదలైన అంశాలు రసానుభూతికి కొన్ని ఉదాహరణలు.

3 . వైఖరులు (Attitudes) :

వీటినే ధోరణులని కూడా అనవచ్చు. భాషా కౌశలం, సాహిత్యాభిరుచి, ఉత్తమ గ్రంథపరిచయం మొదలైన సంస్కారాల వల్ల విద్యార్థులలో కొన్ని వైఖరులు రూపొందుతాయి. సంఘంలో ఇటువంటి వైఖరులు గల వ్యక్తుల ఆదరణ వల్లనే గ్రంథరచనలు, సాహిత్యసభలు, అష్టావధానాలు, సాంస్కృతికోత్సవాలు జరుగుతూ ఉంటాయి. కవులు, రచయితలు అంటే అభిమానం మాతృభాషాభిమానం, ఇతర భాషల పట్ల గౌరవం వంటి వైఖరులు విద్యార్థులలో కలిగించడం బోధనా ఉద్దేశ్యాలలో ఒక ముఖ్యాంశం.

**III** మానసిక చలనాత్మక రంగం (Psychomotor domain)

ఈ రంగంలోజరిగే కృషి, జ్ఞానాత్మక భావావేశ రంగాలలో విద్యార్థిసంపాదించిన సామర్థ్యాలకు ఫలితం వంటిది. రచనలు అధ్యయనం చేసి, వాటిలోని సారంగ్రహించి, వివిధ రచనల అధ్యయనం చేసి గ్రహించిన మీదట విద్యార్థిలో సృజనాత్మకశక్తి అంకురించడానికి అవకాశం కలుగుతుంది. ఈ పరిణామం ఉన్నట్టుండి కలిగేదికాదు. ఇది ఉత్తమ కథాశ్రవణం, మనన సమయాలలోనో, తాత్పర్య గ్రహణ సందర్భంలోనో కలుగవచ్చు. ఇటువంటి నిర్మాణాత్మక కృషికి సందర్భోచితంగా ఉపాధ్యాయుడు విద్యార్థులలో ప్రేరణ కలిగించాలి. ఇందుకు ప్రాతిపదికగా కొన్ని అభ్యాసాలు విద్యార్థుల చేత చేయించవచ్చు. కొన్ని నీతివాక్యాలనిచ్చి సంబంధించిన కథలను అల్లించవచ్చు. అసంపూర్ణ కథలను పూరింపచేయవచ్చు.

> జ్ఞానాత్మక, భావావేశ, మానసిక చలనాత్మక రంగాలలోని అంశాలను ప్రాథమిక తరగతులలో తెలుగు వాచకాలకు అన్వయించి చూడండి. జట్టులుగా చేరి చర్చించండి.
> నివేదికను సమర్పించండి.

తెలుగుభాషా బోధనకు కింది బోధన లక్ష్యాలను స్పష్టీకరణాలను నిర్ణయించడం జరిగింది.

అవి 1. జ్ఞానం 2. అవగాహన 3. అనుప్రయుక్తం 4. నైపుణ్యాలు5. భాషాభిరుచి

6. రసానుభూతి – సంస్కృతి సంప్రదాయాలు 7. సముచితమనోవైఖరులు

8. సృజనాత్మకత – భాషాంతరీకరణం.

బోధనలో ప్రతిరోజు అన్నిలక్ష్యాలను తీసుకోవడం సాధ్యంకాదు. ప్రతి కాలవ్యవధి (పీరియడు) లో సాధించడానికి వీలైన నాలుగు లేదా ఐదు లక్ష్యాలను తీసుకొని పాఠాన్ని బోధించవచ్చు. కొన్నిప్రక్రియలను బోధించేటప్పుడు వాటికి సంబంధించిన లక్ష్యాలను తీసుకోవడానికి మాత్రమే వీలవుతుంది. భాషాజ్ఞానానికి సంబంధించిన రచనను బోధించేటపుడు సాహిత్య జ్ఞానాన్ని తీసుకోవడానికి వీలుకాదు. పద్యాలను బోధించేటపుడు జ్ఞానం, అవగాహన, వాగ్రూపవ్యక్తీకరణ, అభిరుచి వైఖరులకు అవకాశముంటుంది.

## 2.4 భాషతో పరిచయం – నేర్చుకోవడం – ప్రయోగించడం – సహజంగా జరిగే ప్రక్రియ :

భాషను మాట్లాడటం అంటే శబ్దాలు పలకడం మాత్రమేకాదు. భావాలను ఇతరులకు అందించడం. ఇతరుల నుండి అందుకోవడం. సహజంగానే భాషను నేర్చుకునే శక్తిని అందరు కలిగి ఉంటారు. పరిసరాలు అందించే ఏ భాషనైనా, ఎన్ని భాషలనైనా పిల్లలు నేర్చుకొంటారు. నేర్చుకొంటున్నామనే భావన లేకుండా భాష నేర్చుకొంటారు.

పిల్లలు మొదట అనుకరించి ధ్వనుల్ని నేర్చుకోరు. పసితనంలో వాళ్ళు ధ్వనుల్ని సృష్టించుకుంటారు. తరువాత మాత్రమే మన మాటలను అనుకరిస్తారు. పిల్లలు చేసే ప్రతిధ్వనిలో ఏవో అనుభూతులు, కోరికలుదాగి ఉంటాయి. అందుకే వారు భాషను తేలికగా నేర్చుకోగలుగుతారు. ఈ అనుభూతులు, కోరికలు లేకపోతే పిల్లలు భాషను నేర్చుకోలేరు. ఈ అనుభూతులు, కోరికలు పిల్లల్లో ఉన్నత స్థాయిలో ఉంటాయి. కాబట్టి ఆదశలో భాషను తేలికగా నేర్చుకోగలుగుతారు. పిల్లలు భాషను ప్రయోగించడంలో ప్రారంభంలో ఎన్నో పొరబాట్లు చేస్తూ భాషను నేర్చుకొంటారు. క్రమంగా పొరబాట్లు లేకుండా మాట్లాడగలుగుతారు.

నిరక్షరాస్యుడైన యాభైయేళ్ళ వయసు గల సామాన్య రైతుకు దాదాపు 5000 పదాల పరిచయం ఉంటే 2000–2500 పదాలు వ్యావహారికంగా ఉపయోగిస్తాడు. గృహవాతావరణం నుండి వచ్చిన ఆరేళ్ల వయస్సు గల పిల్లలకు 2000 పదాల పరిజ్ఞానం ఉండి 1500 పదాలపై వ్యావహారిక అనుభవం ఉంటుంది. పసిబిడ్డలుచేసే సంభాషణల్లో తల్లి తప్పుల్ని పట్టదు. పిల్లల పలుకుల్ని వింటుంది. బిడ్డతో మాట్లాడేటపుడు ఆబిడ్డగా మారిపోతుంది. ఆస్థాయి పదాలు, వాక్యాలు మాట్లాడుతుంది. పిల్లలు 'అమ్మ' అంటేఅది వాక్యమే. అమ్మని రమ్మని పిలవడం అని అర్థం. 'పాలు' అంటే పాలు కావాలి అని సంపూర్ణమైనఅర్థం.

ఈ విధంగా ఒకేపదంతో పిల్లలువారిభావాల్ని తెలుపుతారు. పిల్లలు భాషను నేర్చుకోవడం ఈవిధంగా ప్రారంభమవుతుంది. తమ పిల్లలను పెంచుతూ వారికి భాషను నేర్పుతున్నారు. పిల్లలు అద్భుతంగా నేర్చుకుంటున్నారు. ఈ అసమాన బోధన కళ నిరక్షరకుక్షులైన తల్లిదండ్రులకు కూడా సులభ సాధ్యమే.

గృహవాతావరణం నుండి పూర్వపరిచయంలేని పాఠశాల వాతావరణానికి పిల్లలు ప్రవేశించడం జరుగుతుంది. బడిలో మొదట పిల్లలను మాట్లాడనివ్వాలి. వారు ఇష్టపడే వాటిని గురించి, పరిచయమైన వాటి గురించి మాట్లాడనివ్వాలి. తోటి పిల్లలతో మాట్లాడుకోనివ్వాలి. సహజమైన పరిస్థితులలో పిల్లలు మాట్లాడం నేర్చుకొంటారు. ఉపాధ్యాయులు అమ్మలా పిల్లలస్థాయికి దిగి పిల్లల ప్రపంచంలోకి ప్రవేశించి మాట్లాడాలి. సమాజంలో పాల్గొనే కొద్దీ ఎంతబాగా భాష మాట్లాడాలో వాళ్లే తెలుసుకొంటారు. భాష కంఠస్థం చేయించి నేర్పేది కాదు. ఉపాధ్యాయులు వారితో మిత్రులుగా వ్యవహరించాలి.

భాష నేర్చుకోవడం అంతా సందర్భాన్ని బట్టి ఉంటుంది. భాష ఉనికి, బతుకు, పెరుగుదల, ఉపయోగం, అంతా సందర్భం నుంచే వస్తుంది. ప్రతి బిడ్డ మూడేళ్ళ వయసులో భాష నేర్చుకోవడం జరుగుతుంది. ఇదొక సార్వజనీన సూత్రం. పిల్లలు భాషను నేర్చుకొనేటప్పుడు క్రమంగా నేర్చుకోరు. అక్షరాలు, పదాలు, వాక్యాలు అలాంటి వరుసక్రమం ఉండదు. దీర్ఘాలు, ద్విత్వాలు, సంయుక్తాలు అని తెలియదు. కానీ ఉపయోగిస్తారు. అభ్యసన క్రమంలో ఏమి మాట్లాడారన్నది ప్రధానం కాదు. ఏదైనా మాట్లాడవచ్చు. ముందు చిన్న చిన్న సరళ వాక్యాలు మాట్లాడుతారు. తరువాత వ్యతిరేక వాక్యాలు వస్తాయి. ఆ తర్వాత ప్రశ్నార్థకాలు మాట్లాడుతారు. భిన్నార్థాల మాటలను సందర్భాన్ని బట్టి పిల్లలు అర్థం చేసుకొంటారు. తమకు తెలిసిన పరిమిత పదాలలోనే వేలాది వాక్యాలు తయారు చేసుకోగలుగుతారు. ఇరుగు పొరుగు పిల్లలతో, వారితోటి పరిచయాలతో అన్యభాషలు కూడా నేర్చుకోగలుగుతారు. దీనికి భాషాశాస్త్రవేత్తలు చెప్పిన కారణం – ఆసక్తికర వాతావరణంలో పిల్లలు భాష నేర్చుకోవడం.

ఒక పరిశీలన ప్రకారం ప్రపంచంలో ఏ భాషల పిల్లలయినా మొదట త, ప, బ, మ ధ్వనులను పలకడానికి ఇష్టపడుతారు. వాటిని పలుకుతుంటే పాప, బాబు, అమ్మ మొదలైన పదాలుగా మనకు వినిపిస్తాయి. శిశువుల జ్ఞాపకశక్తిపై ఎరిక్ మాడ్సన్‌పలు పరిశోధనలు చేసారు. పసి మెదడు జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని అసాధారణంగా స్వీకరించి నిలువచేసుకుంటుంది. వీటిని తరువాత ఉపయోగించుకొనేందుకు దాచి పెడుతుందని వారి మెదడుకు అద్భుతమైన సంగ్రహణ శక్తి ఉంటుందని ఆయన నిరూపించాడు.

| పిల్లలు భాషను ఎలా నేర్చుకుంటారు. తరగతిగదికి అన్వయించి చర్చించండి. |
|---|

## 2.5 బోధన మాధ్యమంగా తెలుగు ప్రయోజనాలు :

బోధన మాధ్యమం, బోధన వాహిక అనేవి **Medium of Instruction** అనే ఆంగ్ల పదబంధానికి తెలుగులో సమానార్థకాలు. ఎదుటి వ్యక్తి భావాలను గ్రహించడానికి తన భావాలను ఎదుటివారికందించడానికి భాష మాధ్యమంగా పనిచేస్తుంది. తొలిభావనలకు రూపమిచ్చిన మాతృభాష బాహ్య ప్రపంచావగాహనకు తొలి మాధ్యమం. మానవుని మూర్తిమత్వవికాసంలో కూడా మాతృభాషయే ముఖ్యపాత్ర పోషిస్తుంది. ప్రతి వ్యక్తి మాతృభాష ద్వారానే సులభంగా వివిధ విషయాలను నేర్చుకుంటాడన్నది విశ్వసత్యం. మాతృభాష మాధ్యమంగా విద్యాభ్యాసం చేసిన వారికి, అన్యభాషా మాధ్యమంగా విద్యాభ్యాసం చేసిన వారికి పూర్తిగా భేదాలుంటాయని విద్యావేత్తల అభిప్రాయం. బోధన మాధ్యమంగా మాతృభాషయే ఉత్తమమని పలు విద్యావేత్తలు, మానసిక శాస్త్రజ్ఞులు, అంతర్జాతీయ స్థాయి విద్యావిషయక సంఘాలు **(Educational Commissions)** నొక్కి చెప్పాయి. కారణం మాతృభాష తల్లిపాలవంటిది. పరభాష పోతపాలవంటిదన్నది అందరికి తెలిసినదే.

1835వ సంవత్సరంలో థామస్‌బాచింగ్టన్ మెకాలే 'మినిట్ ఆన్ ఎడ్యుకేషన్' అనేపత్రంలో ఇలా పేర్కొన్నాడు. "We must at present do our best to form a class who may be interpreters between us and millions whom we govern, a class of persons, Indians in blood and color, but English in taste, in opinions in morals, and in intellect" శరీరఛాయ, ఆకారంలో భారతీయులుగాను, అభిరుచులు, అభిప్రాయాలు, బుద్ధులలో ఇంగ్లీషువారి లాగా ప్రవర్తించే ఒక వర్గాన్ని మనం తయారు చేయాలి. వారి ద్వారామనం ఈ దేశాన్ని పాలించవచ్చు.

1835సం లో లార్డ్ మెకాలే భారత దేశ విద్యాలయాల్లో ఆంగ్లాన్ని బోధనభాషగా ప్రవేశపెట్టాడు. ఈ విషయాన్ని ఫ్రెడరిక్ జాన్‌రోడ్, లార్డ్ డ్రెమండ్, లార్డ్ విల్సన్ వంటి ఆంగ్లేయ మేధావులు వ్యతిరేకించారు. దేశాల అభివృద్ధికి ఆయా దేశభాషలే బోధన మాధ్యమాలుగా ఉండాలని ఫ్రాన్స్, రష్యా, జర్మనీ దేశాలు వైజ్ఞానికంగా అభివృద్ధి చెందడానికి వారి మాతృభాషలు బోధన భాషలుగా ఉండటమే కారణమని వారు చెప్పారు. రెండవ ప్రపంచ యుద్ధంలో అన్నీకోల్పోయినా సాంకేతిక పరిజ్ఞానంలో ముందంజ వేసిన జపాన్‌లో కూడా జపనీస్ భాష మాధ్యమ భాష. 1906 సం లో కాంగ్రెసుపార్టీ ఏర్పాటు చేసిన జాతీయ విద్యామండలి(National Council for Education) లో సభ్యులైన గురురాజ్‌బెనర్జీ, రాసబీహారీబోస్, రవీంద్రనాథఠాగూర్, బిపిన్‌చంద్రపాల్, చిత్తరంజన్‌దాస్ మొదలైన వారు బోధనభాషలుగా భారతీయ భాషలకు ప్రాధాన్యం ఇవ్వాలని సిఫార్సు చేశారు.

1910సం లో గోపాలకృష్ణగోఖలే ప్రవేశపెట్టిన విద్యావిషయక బిల్లు 1916సం లో కాశీహిందూ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో మహాత్మగాంధి ఉపన్యాసం 1918సం లో కలకత్తా విశ్వవిద్యాలయ కమీషన్ నివేదిక, 1929 సం లో హర్టాగ్‌విద్యాకమిటి నివేదిక, 1936సం లో వుడ్ ఎబ్బట్ నివేదిక కూడా బోధనభాషగా మాతృభాష ప్రాధాన్యాన్నే నొక్కిచెప్పాయి. అయినా లార్డ్ మెకాలే వాదన నెగ్గింది. స్వాతంత్ర్యం పొందిన తొలి రోజుల్లో ఏర్పాటు చేసిన రాధాకృష్ణన్ కమీషన్, లక్ష్మణ

స్వామి ముదలియార్ కమీషన్‌లు కూడా మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని నొక్కి చెప్పాయి. 1962 సం లో భారతీయ జాతీయ సమైక్యతా సమితి, 1964-66 కొఠారి విద్యాసంఘం దేశభాషల్లోనే అన్ని దశల్లో బోధన నిర్వహించాలని పునరుద్ఘాటించాయి. నేడు ప్రాథమిక దశనుండి కళాశాల స్థాయి వరకు మాతృభాషలో బోధన జరుగుతున్నది. అయినా విశ్వవిద్యాలయాల స్థాయిల మాతృభాషలో నేర్చుకునే అవకాశం ఇంకా సంపూర్ణస్థాయిలో లేదు. విశ్వవిద్యాయాలగ్రాంట్ల కమీషన్ (UGC) ఏర్పడిన నాటి నుండి బోధన భాష విషయంలో సంపూర్ణ నిర్ణయాధికారం ఆయా విశ్వ విద్యాలయాలకు ఇవ్వడం జరిగింది.

తమిళనాడులో ప్రాథమికదశ నుండి ఉన్నత పాఠశాల దశ వరకు తెలుగును కూడా మాధ్యమంగా ప్రవేశపెట్టడం జరిగింది. ప్రాథమికదశ నుండే ఆంగ్లమాధ్యమ పాఠశాలలకు ఎక్కువ ప్రాచుర్యం వచ్చింది. తల్లిదండ్రులకు ఆంగ్లమాధ్యమంపై మోజు ఎక్కువైంది. ఆంగ్లమాధ్యమంలో పాఠాలు పిల్లలు ఎంత వరకు అవగాహన చేసుకొంటున్నారు. అది ఎంత మేరకు లాభిస్తుందని ఆలో చించడం లేదు.

ఆంగ్లేయుల పరిపాలనాకాలంలో భారతీయులు ఇంగ్లీషు మాధ్యమంలోచదువుకోవలసివచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మాతృభాష మాధ్యమం అమలులోకి వచ్చింది. కాని ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో పూర్వ ప్రాథమిక పాఠశాల(Pre- kindergarten) నుండే ఆంగ్ల మాధ్యమం విశ్వరూప ప్రదర్శన మొదలు పెట్టింది. పాఠశాల దశలో విద్య మాతృభాషా మాధ్యమంలో కొనసాగా లనే భావన తల్లిదండ్రులలో కలగాలి. మాతృభాషా మాధ్యమ ప్రయోజనాలను, వాస్తవాలను తల్లిదం డ్రులు అవగాహన చేసుకోవాలి.

స్వాతంత్ర్య పూర్వ విద్యకు స్వాతంత్ర్య అనంతర విద్యకు గల భేదాలు ఏవి ?
స్వాతంత్ర్యానంతరం విద్యా విధానంలో కలిగిన మార్పులు ఏవి ?
జట్టులుగా చేరి చర్చించండి. నియోజనాలుగా సమర్పించండి.

**తెలుగు భాష మాధ్యమంగా బోధన – ప్రయోజనాలు :**

మాతృభాష మాధ్యమంగా బోధన జరిగితే ఈ క్రింది ప్రయోజనాలు చేకూరుతాయి.

1. సామాజిక అవగాహన :

మాతృభాషా మాధ్యమంలో వివిధ విషయాలు(Subjects) నేర్చుకోవడం ద్వారా విద్యార్థికి సామాజికఅవగాహన, స్పృహ పెరుగుతాయి. తాను నేర్చుకుంటున్న పాఠాలలోని విషయాలను సమా జంలోని సంఘటనలతో, సందర్భాలతో సమన్వయం చేసుకుంటాడు. అందువలన వ్యక్తిగత వికాసంతో పాటు సామాజిక వికాసాన్ని కుడా పొంది మంచి పౌరుడుగా రూపొందగలడు. ఆంగ్లమాధ్య మంలో చదవడం వల్ల విషయాలు కేవలం జ్ఞానదృష్టి వరకే పరిమితమై ఉంటాయి. సమాజ స్థితిగతు లను అవగాహన చేసుకోగల నైపుణ్యం ఆంగ్లం మాధ్యమంగా కల్గిన విద్యార్థుల కంటె మాతృభాష మాధ్యమంలో చదువుకొనే విద్యార్థులకు చాలా పటిష్టంగా ఉంటుంది.

2. స్పష్టమైన అవగాహన :

మాతృభాషలో వివిధ విషయాలు(Subjects) నేర్చుకోవడం సహజంగా, అర్థవంతంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. ప్రతిచిన్న అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. సులభంగా అర్థమైన పాఠ్యాంశాలను వివిధ రూపాలలో స్పష్టంగా వ్యక్తీకరించగలుగుతాడు. ఆంగ్ల మాధ్యమంలో విద్యభారంగా అనిపిస్తుంది. మాతృభాషా మాధ్యమంలో విద్యార్థులకు మానసిక శ్రమ ఉండదు.

3. విశ్లేషించగల నైపుణ్యం :

మాతృభాషా మాధ్యమంలో విద్యార్థులలో విశ్లేషించగల నైపుణ్యం పెరుగుతుంది. తాను నేర్చుకొన్న విషయాలను వివిధ కోణాలలో ఆలోచించగలుగుతారు. నేర్చుకొన్న విషయాలలో నిర్మాణాత్మక ప్రయోజనాలను సాధించగలుగుతారు. అవసరమైనపుడు ఆయా అంశాలకు గల పరిమితులను కూడా అర్థం చేసుకోగలగుతారు. మంచి చెడులను విశ్లేషించగల నైపుణ్యం పెంపొందించుకోవడం వలన నైతిక విలువలు ఏర్పరచుకోవడానికి అవకాశాలు ఉన్నాయి.

4. సృజనాత్మక శక్తి :

మాతృభాషా మాధ్యమంలో చదవడం వలన విద్యార్థులలో సృజనాత్మక శక్తి పెరుగుతుంది. ఉన్న విషయాలను యథాతథంగా అనుసరించక కొత్త అంశాలను రూపొందించుకొంటారు. సృజనాత్మకశక్తి కలగడం ద్వారా నూతన భావాలను ఏర్పరచుకొంటారు. ఇతరుల కంటే ప్రత్యేకంగా ఉండాలనుకోవడం, తమ ప్రతిభను చాటుకోవాలను కోవడం కూడా సృజనాత్మకశక్తి ద్వారానే ఏర్పడుతుంది.

5. పరిశోధన సామర్థ్యం :

అవగాహన చేసుకొన్న విషయాలను వివిధ కోణాల్లో ఆలోచించగలుగుతారు. తాము నేర్చుకొన్న విషయాలకు అనుభవంలో తెలుసుకొన్న విషయాలను జోడించగలుగుతారు. సత్యం, అసత్యం తేల్చుకోవాలనే జిజ్ఞాసతో పరిశోధన చేస్తారు. దీని మూలంగా వివిధ విషయా**(Subjects)** లలో పరిశోధనలు చేసి గొప్పశాస్త్రవేత్తలుగా తయారయ్యే అవకాశాలున్నాయి. న్యూటన్, ఐన్‌స్టీన్ మొదలగువారు శాస్త్రజ్ఞులు మాతృభాషలో అభ్యసనం చేశారన్నది గమనారం.

6. సమగ్రమూర్తిమత్వ వికాసం :

విద్యార్థి శారీరకంగా, మానసికంగా, నైతికంగా, సామాజికంగా వికాసం పొందడాన్నే సమగ్ర మూర్తిమత్వం అంటారు. విద్యార్థులలో సమగ్ర మూర్తిమత్వ వికాసం పొందేటట్లు చేయడం మన విద్యాప్రధాన లక్ష్యాలలో ఒకటిగా పేర్కొనవచ్చు. సమాజంలో ఉత్తమ పౌరుడుగా రాణించడానికి సమగ్ర మూర్తిమత్వం అవసరం. ఇలాంటి మూర్తిమత్వ వికాసం చెందడానికి మాతృభాష మాధ్యమం మాత్రమే దోహదపడుతుంది.

7. సమైక్యతా భావనలు :

జాతీయసమైక్యత, దేశసమైక్యత, ప్రాంతీయసమైక్యత, భాషాసమైక్యత అనే పదాలను మనంతరుచుగా వింటుంటాం, ఉపయోగిస్తుంటాం. ఈ భావనలను విద్యార్థుల్లో పెంపొందించాలంటే మాతృభాష మాధ్యమంలో మాత్రమే సాధ్యమవుతుంది.

8. నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలు :

సామాజిక వికాసమే దేశాభివృద్ధికి ఆధారం. ప్రపంచదేశాల నాగరికత సంస్కృతి సంప్రదాయాలపై మంచి అవగాహన విద్యార్థులకు కలిగితేనే సామాజిక వికాసం సాధ్యమవుతుంది. మాతృభాషా మాధ్యమంలో చదవడం వలన విద్యార్థులలో ఈ అవగాహన పటిష్టంగా కలుగుతుంది.

9. విశ్వకుటుంబ భావన :

వ్యక్తి సాంఘికీకరణ చెందడానికి సమాజంలో తన పాత్రను గుర్తించడానికి ఉత్తమ పౌరుడుగా రూపొందడానికి, 'వసుధైక కుటుంబ' లక్ష్యంగా ముందుకు సాగడానికి తగిన విలువలను

మాతృభాషద్వారా చక్కగా పొందవచ్చు. తల్లిదండ్రులపై ఆదరాభిమానాలు కలిగి ఉండడం, పెద్దలను గౌరవించడం, తోటి వారితో మర్యాదగా నడుచుకోవడం, సభామర్యాదలు తెలిసి ఉండడం మొదలైన మంచి గుణగణాలను అలవరచుకోవచ్చు.

మాతృభాష మాధ్యమంగా బోధనలో ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయి.

నేనుసైతం ప్రపంచాబ్జపు
తెల్లరేకై పల్లవిస్తాను
నేనుసైతం ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ధారపోస్తాను
నేనుసైతం విశ్వవీణకు
తంత్రినై మూర్ఛనలు పోతాను
నేనుసైతం విశ్వఘోషకు
వెర్రిగొంతుక ధారపోస్తాను
నేనుసైతం భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను – శ్రీశ్రీ (మహాప్రస్థానంలో) విశ్వకుటుంబ భావనను ఆవిష్కరించాడు.

| బోధనా మాధ్యమంగా తెలుగు ప్రయోజనాలు – చర్చావేదికను నిర్వహించండి. |
|---|

## 2.6 మాతృభాష

మాతృభాష అంటే తల్లిభాష. భాషలన్నింటిలోను మాతృభాషకు ఒకవిశిష్ట స్థానం ఉంది. మాతృభాష సహజంగా అలవడుతుంది. తల్లి ద్వారా నేర్చుకున్న భాష కాబట్టి దీన్ని మాతృభాష అన్నారు. ఇది ఎలాంటి ఇబ్బందులు లేకుండా అప్రయత్నంగా నేర్చుకోబడేది. 'మాతృభాష' ద్వారా మాత్రమే విద్యాబోధన జరగాలని పలువురు విద్యావేత్తలు పేర్కొన్నారు. మాతృభాష ద్వారా నేర్చుకునే విషయాలు వ్యక్తితో చిరకాలం ఉంటాయి.

శిశువు మొట్టమొదట నేర్చుకునే భాష మాతృభాష. శిశువు పుట్టినప్పటి నుంచి ఏ భాషా వాతావరణంలో పెరుగుతాడో ఆ భాష అతనికి సహజంగా అలవడుతుంది. కానీ భాషను నేర్చుకోవాలనే కోరిక, పట్టుదల, శ్రమ ఏ మాత్రం లేకుండా తాను భాషను నేర్చుకుంటున్నాను అనే భావన లేకుండా సహజరీతిలో నేర్చుకొనే భాష మాతృభాష. తన భావాలను ఇతరులకు తెలియజేయాలనే కుతూహలంతో నేర్చుకోబడే భాష మాతృభాష. మాతృభాషలో భావాలను సులభంగా వ్యక్తీకరించగలరు. క్లిష్టమైన విషయాన్ని కూడా అర్థమయ్యేటట్లు చెప్పగలరు. వక్తలు మాతృభాషలో మాట్లాడగలిగినంత, సులభంగా ఇతర భాషలలో మాట్లాడలేరు. ప్రతి వ్యక్తి మాతృభాషను సునాయాసంగా నేర్చుకోగలడు. మాతృభాషలో ఉన్న సామెతలు, జాతీయాలు, నానుడులు, పలుకుబడులు అతనికి సహజంగా అలవడుతాయి. మాతృభాష అనే పదానికి దేశభాష స్థానికభాష, ప్రాంతీయ భాష, ప్రథమ భాష తల్లి భాష అనేపదాలు కూడా వ్యవహారంలో ఉన్నాయి. ఒక వ్యక్తి ఎన్నిభాషలు నేర్చుకొన్నప్పటికీ అతని జీవితంలో మాతృభాషకు ప్రత్యేక స్థానం ఉంటుంది. మాతృభాషపై గౌరవం, మమకారం ఉంటుంది.

మనదేశంలో అనేక భాషలున్నాయి. అనేక రాష్ట్రాలు ప్రాంతాలు ఉన్నాయి. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క భాష మాట్లాడేవారు ఉన్నారు. మనదేశం ఆంగ్లేయుల పాలనలో చాలాకాలం మగ్గడం వల్ల మాతృభాషలు అభివృద్ధి చెందలేదు. ఆంగ్లభాషకే ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. స్వాతంత్ర్యం పొందిన తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రాంతీయ భాషలకు

ప్రాధాన్యం కల్గింది.

మాతృ భాష నిర్వచనాలు :

శిశువుకు మొదటి గురువు తల్లి. మాతృదేవతకు ఎంత ప్రాధాన్యం ఉంటుందో మాతృభాషకు అంత ప్రాధాన్యం ఉంటుంది. మాతృభాషద్వారా విద్యాభ్యాసం చాలా సులభం అని విద్యావేత్తలు నొక్కి చెప్పారు. మాతృభాషను నిర్వచించడం చాలా కష్టంతో కూడుకొన్న పని.

తల్లి దగ్గర నేర్చుకొనే భాష మాతృభాష – సామాన్య నిర్వచనం

– పుట్టినప్పటి నుంచి ఊహ బాగా తెలిసే వరకూ పరిసరాల నుండి అప్రయత్నంగా నేర్చుకునేది మాతృభాష అనేది ఒక నిర్వచనం.
– ఆనందాది ఉద్రేకాలకు, ఆలోచనలకు, కలలకు మూలమైనది మాతృభాష.
– శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు తోడ్పడినట్లుగా మానసిక వికాసానికి తోడ్పడేది మాతృభాష
– వ్యక్తి తాను భాషను అభ్యసిస్తున్నాననే స్పృహ లేకుండా అలవరచుకున్న భాష మాతృభాష.
– శిశువు ప్రవర్తనను ఏ భాష తీర్చిదిద్దుతుందో అది అతని మాతృభాష. మాతృభాష అంటే స్వీయ భాష లేదా సొంత భాష అని కొందరు విద్యావేత్తలు పేర్కొన్నారు.
– మానవజాతి తరతరాల నుండి సాధించిన అనుభవ సంపదను విద్య రూపంలో అందించే నిధి మాతృభాష.
– మానవుల మానసిక, నైతిక, సామాజిక వికాసాలకు తోడ్పడేది మాతృభాష.

ప్రతి ఒక్కొరికి నిత్యజీవన వ్యవహారంలో మాతృభాష అవసరమవుతుంది. వ్యక్తిని పరిపూర్ణ మానవుడిగా, ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దేది మాతృభాష. మాతృభాష మీద తగినంత అధికారం ఉంటేనే ఏ వ్యక్తి అయినా సమాజంలో ప్రతిభావంతుడుగా కాగలడు.

భారతదేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం విద్యాబోధన ఆంగ్లమాధ్యమంలో జరుపబడేది. కాని నేడు మన పాఠశాలలో మాతృభాషా మాధ్యమంగా విద్యాబోధన జరుపుతున్నారు. మాతృభాషలో విద్యాబోధన చాలా ఉత్తమమైందని, మానసిక వికాసానికీ, సంపూర్ణమూర్తిమత్వానికి మాతృభాష తోడ్పడినంతగా పరభాష తోడ్పడదని విద్యావేత్తలు చెబుతున్నారు. విద్యాబోధన అంతామాతృభాష ద్వారా సాగిననాడే దేశాభివృద్ధి, మానవాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పవచ్చు.

* మాతృభాష అధ్యయనం ద్వారా క్రింది ప్రయోజనాలను పొందవచ్చు.
* భాషలో పదజాలాలను పెంపొందించుకొని భాషపై అధికారాన్ని సంపాదించకోవచ్చు.
* జ్ఞానార్జనకు పునాదిగా ఉండి, జ్ఞాన పరిధులను విస్తరించుకోవచ్చు.
* సమగ్ర మూర్తిమత్వాన్ని రూపొందించుకోవచ్చు.
* భాషపై అభిరుచిని, ఆసక్తిని పెంపొందించుకోవచ్చు.
* ఇతర భాషలను సులభంగా నేర్చుకోవచ్చు.
* సాహిత్యాభిరుచితో పాటు సృజనాత్మక పెంపొందించవచ్చు.
* భాషేతర విషయాలను (other than Language subjects) సులభంగా అధ్యయనం చేయవచ్చు.
* నూతన విషయాలను సులభంగా అర్థం చేసుకోవచ్చు.
* భావగ్రహణ, భావవ్యక్తీకరణకు శక్తివంతమైన సాధనంగా మలచుకోవచ్చు.
* భాషాంతరీకరణ సామార్థ్యాన్ని సాధించుకోవచ్చు.
* సముచితమైన మనోవైఖరులు పెంపొందించుకోవచ్చు.
* మాతృభాషపై ప్రేమాభిమానాలు పెంపొందించడం వలన దేశాభిమానాన్ని కలిగించవచ్చు.
* సంస్కృతి సంప్రదాయాలను అవగతం చేసుకోవచ్చు.

* మాతృభాష ద్వారా రసానుభూతి, ఉత్తమ సంస్కారం, మానవతా విలువలు పెంపొందించవచ్చు.
* విద్యార్థులలో దేశభక్తి, త్యాగం మొదలయిన భావాలను పెంపొందింవచ్చు.

| మాతృభాష ప్రయోజనాలను నియోజనంగా సమర్పించండి. |
|---|

## 2.7 తెలుగు భాషాబోధన- విలువలు

మాతృభాషను బోధించడం వల్ల అనేకవిలువలను సాధించవచ్చు. చారిత్రక అవసరాలను బట్టి సామాజిక స్థితిగతులనుబట్టి కొన్ని ప్రత్యేకమైన విలువలను మాతృభాష సాధించవలసిన అవసరం ఉంది. విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దడంలో విలువలు ముఖ్యపాత్ర వహిస్తాయి. విలువలను ఆనందానుభూతి, నైతిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక , సృజనాత్మక, జ్ఞానాత్మక, వృత్తిపరమైన, ప్రజాస్వామ్య విలువలు – అని వీటిని పలురకాలుగా వర్గీకరించి పరిశీలించవచ్చు.

1. ఆనందానుభూతి విలువలు :

సృష్టిలోని సౌందర్యాన్ని అనుభవించే సామర్థ్యాన్ని మాతృభాష పెంపొందిస్తుంది. ప్రకృతిని మించిన సౌందర్యం వేరొకటి లేదు. మానవునికి ప్రకృతితో సహజమైన అనుబంధం ఉండటంలోనే నిజమైన ఆనందానుభవం ఉంది. ప్రకృతిని, ప్రేమను మానవునిలో పెంపొందించడానికి మాతృభాష తోడ్పడుతుంది. కవిత్వంలోని భావుకత– ప్రకృతి చిత్రణ మనసుకు ఆనందానుభూతిని అందజేస్తాయి. ప్రాచీన కావ్యాలలో పాటు ఆధునిక కవిత్వంలోని భావకవిత్వం కూడా ఆనందానుభూతి విలువలను అధికంగా అందజేస్తుంది.

2. నైతికవిలువలు :

నీతినియమాలకు సంబంధించినది నైతిక విలువ. నైతికవిలువలు అంటే ఒక వ్యక్తి మరొక వ్యక్తికి అసౌకర్యం కలిగించకుండా ప్రవర్తించడం. దౌర్జన్యం, దురాచారాలు, స్వార్థం, కపటం పెరిగిపోవడానికి కారణం ప్రజలలో నైతిక విలువలు లోపించడమే. సత్యం, ధర్మం, నీతి, న్యాయం, అహింస మొదలైన విలువలను విద్యార్థులలో పెంపొందించాలి. తెలుగు సాహిత్యంలోని వేమన శతకం, సుమతిశతకం, భాస్కర శతకం, సుభాషిత పద్యాలు మొదలైనవి బోధించాలి. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడం వలన సమాజం శాంతియుతంగా మనగలుగుతుంది.

3. సాంస్కృతికవిలువలు :

ఒకజాతి అభివృద్ధి కోసం అనుసరించే రీతిని సంస్కృతి అని అనవచ్చు. తరచుగా సంస్కృతి నాగరికతశబ్దాలను సమానార్థకాలలో ఉపయోగిస్తుంటారు. సంస్కృతి ఆంతరధర్మం, జాతియొక్క విశ్వాసాలు, సంప్రదాయాలు, ఆలోచనావిధానం మొదలైనవి. నాగరికత బాహ్య ధర్మం వేషధారణ, వస్తుసంపత్తి, సుఖమయ జీవిత విధానం మొదలైనవి.

మానవుడు అవతరించి ఎన్ని యుగాలు గడిచినా మానవ సంస్కృతి నిరంతరాయంగా ప్రవహిస్తూనే ఉన్నది. తరతరాలుగా వస్తున్న మంచి సంప్రదాయాలే మన సంపద. అదే మన సంస్కృతి. అలాంటి సంస్కృతిని సాహిత్య పఠనం వలన విద్యార్థులు పెంపొందించుకోగలుతారు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ, భారతీయ సంస్కృతిగా గోచరిస్తుంది. మంచి విషయాలపై ప్రేమ, చెడు విషయాలపై ఆగ్రహం విద్యార్థులకు చిన్నప్పటి నుంచే పెంపొందించాలి. మనఇతిహాస, పురాణాలుఎంతగానోఉపకరిస్తాయి. జీవితంలోసర్వమూ కోల్పోయినా, సత్యాన్నివిడనాడని హరిశ్చంద్రుని కథ, తండ్రి మాట జవదాటకపోవడం, ఏకపత్నీవ్రతుడుగా కొనసాగడం, ప్రజల్ని కన్నబిడ్డల్లాగా పరిపాలించడం మొదలైన రాముని లక్షణాలన్నీ భారతీయ సంస్కృతిలోని అంతర్భాగాలే.

4. ఆధ్యాత్మికవిలువలు :

చాలామంది అనుకొంటున్నట్లు ఆధ్యాత్మికత దైవసంబంధమైనది భావన మాత్రమే కాదు. మనసులోని స్వార్ధానికి కళ్ళెంవేసి, మనిషిలోని శక్తియుక్తుల్ని నిర్మాణాత్మకంగా పెంపొందించి, వెలుపలకు తీసుకొని వచ్చేవే ఆధ్యాత్మిక విలువలు. పుట్టుక కారణంగా గొప్పతనంరాదని, కృషి ఉంటే మనషులు, ఋషులు కావచ్చు అనే భావన ఆధ్యాత్మిక సంబంధమైనదే. వాల్మీకి మహరి అయ్యారు. ఏకలవ్యుడు ఇలాంటి పాత్రలు ఆధ్యాత్మిక భావజాలాన్ని విద్యార్థులకు అందజేస్తాయి.

5. సృజనాత్మకవిలువలు :

మానవునిలోని నిర్మాణాత్మకశక్తి వివిధ రీతులుగా వ్యక్తం చేయబడటం వల్ల అది సమాజానికి అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. మానవుని మనసులోని రకరకాల ఆలోచనలు వెలువరించడానికి మాతృభాషలోని సాహిత్య పఠనం ప్రేరణ కలుగుజేస్తుంది. సృజనాత్మక లక్షణాలుపెంపొందిన విద్యార్థులు నిర్మాణాత్మక కార్యక్రమాల వైపే మొగ్గ చూపుతారు. కాని విధ్వంసపూరిత స్వార్థపూరిత కార్యకలాపాలవైపు వెళ్ళరు. అణుశక్తిని ఆటంబాంబులను తయారు చేయడం కంటె మానవకళ్యాణ ఉపయోకరమైన కార్యకలాపాలకు ఉపయోగించడానికి ప్రయత్నిస్తారు. సాహిత్యంలోని అనేక ప్రక్రియలు, అనేక ఉద్యమాలు విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తియుక్తులను వెలుపలకు తీయగలుగుతాయి. పద్యం, గద్యం గేయం వచన కవిత మినీ కవిత మొదలైన ప్రక్రియల్లో విద్యార్థులకు ప్రవేశం కలుగుతుంది. పౌరాణికభావాలు, చారిత్రకభావాలు, భావకవితాభావాలు, అభ్యుదయభావాలు, విప్లవభావాలు మొదలైన వివిధ విషయాల పట్ల అభిరుచిని పెంపొందించుకొని సాహిత్య సృష్టి చేయగలుగుతారు.

6. జ్ఞానాత్మక విలువలు :

మాతృభాషలోని గ్రంథాలు చదవడంవల్ల, వాటిని అవగాహన చేసుకోవడం తద్వారా విద్యార్థుల జ్ఞానం విస్తారమవుతుంది. పరిపూర్ణ జ్ఞాన సంపన్నులు కావడానికి మాతృభాషలోని సాహిత్యం బాగా ఉపకరిస్తుంది.

7. వృత్తి విలువలు :

చక్కగా మాట్లాడడం. లేఖనాసామర్థ్యం మొదలైన భాషా నైపుణ్యాలు మనిషిని తనవృత్తిలో ఉన్నతస్థితి చేరడానికి ఉపయోగపడతాయి. ఉత్తమఉపాధ్యాయుడుగా రాణించేందుకు గొప్ప న్యాయవాదిగా పేరు గడించడానికి మంచి నాయకుడుగా ప్రసిద్ధి పొందడానికి భాషానైపుణ్యాలు చాలా అవసరం. మాతృభాషను శ్రద్ధగా అభ్యసించడం వలన చక్కని భాషా నైపుణ్యాలు విద్యార్థులలో పెంపొందుతాయి. ఉత్తరోత్తరవారు సమాజంలో ఉన్నతస్థాయిని సాధించగలరు.

8. ప్రజాస్వామ్య విలువలు :

బాధ్యతలను నిర్వర్తించడం, హక్కులను సద్వినియోగం చేసుకోవడం, ఉత్తమ పౌరుడిగా వ్యవహారించడం. సమతాభావాలు పెంపొందించుకోవడం మొదలైన మంచిలక్షణాలకు అవసరమైన విశాల దృక్పథాన్ని మాతృభాష పెంచి పోషిస్తుంది. కావ్య రసాస్వాదన అహంకారాన్ని పారద్రోలడానికి మాతృభాష ఉపకరిస్తుంది. విద్యారంగంలో ఏ విలువలను సాధించాలన్నా ఆ విలువలను మాతృభాష సునాయాసంగా విజయవంతంగా సాధించగలదు.

## 2.8 ప్రథమ భాషగా తెలుగు

విద్యార్థులసర్వతో ముఖవికాసానికి భాష మూలధారం. మాతృభాషలో తగిన సామర్థ్యాలను పెంపొందించుకొని మాతృభాషలో చదువుకొనేందుకు అవకాశం కల్పిస్తే విద్యార్థుల జ్ఞానపరిధి

విస్తరిస్తుంది. ప్రాథమిక తరగతుల్లో మాతృభాషలో అభ్యసించడంవల్ల విద్యార్థులు సహజంగా అభ్యసించగలుగుతారు. తమచుట్టూ ఉండే సామాజిక వాతావరణంలోని నిత్యజీవితంలో విద్యార్థులు తమకు నచ్చిన మాతృభాషను విడిచిపెట్టి అన్యభాషపై మోజు చూపితే విద్యార్థులు బాల్యంనుండి కృత్రిమంగా చదువుకుంటారు. విద్యార్థుల ఆలోచనలను సృజనాత్మకతను, మాతృభాషలో వ్యక్తీకరించినట్లు పరాయిభాషలో వ్యక్తీకరించలేరు. మాతృభాషలో అధ్యయనం చేయడం వల్ల ఆశించిన లక్ష్యాలను శక్తివంతంగా, వేగవంతంగా, చురుకుగా పిల్లలు సాధించగలుగుతారని పరిశోధనలమూలంగా వెల్లడయ్యింది.

పసితనంలోనే పరిచయమై తనదైన అనుభవాలను, భావాలను వ్యక్తంచేయడానికి శిశువుకు ఉపయోగపడేది మాతృభాష. విద్యావేత్తలు మాతృ అనే పదాన్ని తల్లి అనే అర్థంతో గ్రహించక, స్వయంగా అనే అర్థంతో గ్రహిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతారు. కారణం చాలా సందర్భాలలో శిశువులు తల్లికన్న ఎక్కువగా ఇతరులద్వారా పరిసరాల ద్వారా భాషను నేర్చుకుంటారు. మనోవికాసానికి మాతృభాషకన్న మించిన సాధనం లేదన్నది వాస్తవం. పరభాషలో మనోగత భావాలను సంపూర్ణంగా వ్యక్తం చేయలేకపోవడమే దీనికి కారణం.

మాతృమూర్తి, మాతృభాష, మాతృభూమి, మమత, మానవత, మనుగడలకు ఆలవాలాలు. వ్యక్తులందరికి ఈ మూడింటిపై అపరిమితానురాగముండాలి. వ్యక్తుల సహజ స్వభావాలు భాష చేత ఉదాత్తాలై పరిసరాల ప్రభావంచే వైవిధ్యం పొందుతాయి. వ్యక్తులు తమ ప్రవృత్తులను సంస్కరించుకోవడానికి మాతృభాష తోడ్పడుతుంది.

విద్యార్థుల శ్రవణ, భాషణ సామర్థ్యాలకు మెరుగుపెట్టడంతో పాటు వారికి పఠన, లేఖన సామర్థ్యాలు కలిగించడం ద్వారా పదుగురుమెచ్చే భాషా ప్రయోక్తలుగా వారిని తీర్చిదిద్దడం మాతృభాషను ప్రథమభాషగా బోధించడంలోని ప్రధాన ఉద్దేశ్యంగా చెప్పవచ్చు. భాషావేత్తల, విద్యావేత్తల అభిప్రాయాలను అనుసరించి ప్రథమభాషగా తెలుగును బోధిస్తున్నప్పుడు దృష్టియందు ఉండవలసిన ప్రధాన ఉద్దేశ్యాలను క్రింది విధంగా క్రోడీకరించవచ్చు.

అ) అర్థగ్రహణం :

భాషను విని అర్థం చేసుకోవడం, చదివి అర్థం చేసుకోవడం. అర్థంచేసుకోవడంలో వేగం, సమయోచిత ప్రజ్ఞప్రధానాలు.

ఆ) అభివ్యక్తి :

అభివ్యక్తి అంటే వ్యక్తీకరణ. ఇది స్పష్టమైన వ్యక్తీకరణ, లోపరహిత వ్యక్తీకరణ, ఈ వ్యక్తీకరణ మౌఖికంగానూ, లిఖితరూపంలోనూ ఉంటుంది.

ఇ) గుణవివేచన :

సాహిత్య పరిచయంవల్ల అందులోని శైలి, రసం, భావుకత, అలంకారు మొదలైన అంశాల గుణవివేచన ఈ ఉద్దేశ్యం పరిధిలోకి వస్తాయి.

పైప్రధాన ఉద్దేశ్యాలతో పాటు క్రింది ఉద్దేశ్యాలు కూడా దృష్టి యందుండాలి.

- విద్యార్థులు తాముసులువుగాను, సరిగాను, స్పష్టంగానూ వ్రాయడం.
- మనసులోని భావాలను స్పష్టంగా చెప్పడం.
- క్రమబద్ధమైన ఆలోచనలను పెంపొందించడం.
- వాస్తవాంశాలను ఊహించగల శక్తిని పెంపొందించడం.
- భాషా సంప్రదాయాలను సంస్కృతిని గుర్తించునట్లు చేయడం.
- వివేచనాశక్తిని పెంపొందించడం.

- భాషపై భాషా వ్యవహర్తలపై సద్వైఖరిని పెంపొందించడం.
- మాతృభాష, మాతృభూమి, మాతృమూర్తులపై గౌరవాన్ని పెంపొందించడం.
- పఠనాభిలాషను పెంపొందించడం.
- విస్తారమైన విషయ గ్రహణశక్తిని పెంపొందించడం.
- స్వతంత్రంగా ఆలోచించడాన్ని ప్రోత్సాహించడం.
- మాతృభాష ద్వారా ఇతర భాషల అధ్యయనాన్ని సులభం చేయడం.

## 2.9 ద్వితీయ భాషగా తెలుగు

భాషణప్రక్రియలో భావాభివ్యంజన వ్యక్తీకరణ సాధనంగా ఉపయోగపడేది భాష. భాష అనేది దృశ్య, శ్రవ్య సంకేతరూపంలో ఉంటుంది. ఈ విధంగా భాషాభావాలు పరస్పరాశ్రయాలు. వీటిలో భావం ప్రథమమైనది. భాషద్వితీయమైనది. భాష వల్లనే మానవుడు తరతరాల వైజ్ఞానిక వారసత్వ సంపదను పొందగలుగుతున్నాడు. దీనివల్ల భాష అనేది మానవుడికి పరంపరాగతంగా ప్రాప్తించిన సాంస్కృతిక వస్తు విశేషమని చెప్పవచ్చు. మానవుడి ఔన్నత్యం, సభ్యత, సంస్కృతి ఆలోచనా సరళి, ఉదాత్తమైన భావ సంపన్నతధార్మిక, నైతిక, ఆధ్యాత్మిక విషయ సంపత్తి భాషా సాహిత్యంలో ప్రతిబింబిస్తుంది. భాష మనసామాజిక, సాంస్కృతిక, ధార్మిక, జాతీయజీవనానికెంతగానో తోడ్పడుతుంది.

భౌగోళిక, సామాజిక, సాంఘిక, చారిత్రక పరిస్థితులకు అనుగుణంగా మానవజాతికంతటికి ఒకే రకమైన భాష ఉపకరించదు. కాబట్టి ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో అనేక భాషలు వర్ధిల్లాయి. విశాలమైన ఉద్దేశ్యాలతో మనం భాషలను మూడు రకములుగా చెప్పవచ్చు.

1. ప్రాచీన భాషలు(**Classical Languages)**
2. ప్రాంతీయ భాషలు **(Regional Languages)**
3. విదేశ భాషలు **(Foreign Languages)**

మనభారతరాజ్యాంగంలో 18 భాషలు ప్రాంతీయ భాషలుగా గుర్తింపబడ్డాయి. ఈ భాషలను మాట్లాడే ప్రాంతాల్లో అనేకులు ఇతర భాషీయులు నివసిస్తున్నారు. వారందరు మనప్రజాస్వామ్య సిద్ధాంతాలననుసరించి స్వేచ్ఛగా వారివారి మాతృభాషలను అభ్యసించడానికి సౌకర్యాలు రాజ్యాంగ రక్షణలు ఉన్నాయి. కాని, ఒక ప్రాంతంలోని పరభాషీయులు అల్పసంఖ్యాకులైనపుడు, వారు మాతృభాషతో పాటు జీవన వ్యాపారాలు సాగించడం కోసం ప్రాంతీయభాషను కూడా అభ్యసించవలసిన ఆవశ్యకత ఏర్పడుతుంది. ఇట్టిపరభాషీయుల సంఖ్య చాలా అల్పమైనపుడు వారు ప్రాంతీయభాషనే విద్యాబోధన సాధనంగా కూడా గ్రహించవలసి ఉంటుంది.

ఆయా ప్రాంతాలలో ఉన్న పరభాషీయుల సౌకర్యం కోసం మన ప్రాంతీయ భాషలనన్నింటిని పరభాషలుగా బోధించడానికి పద్ధతులను పరిశోధించి రూపుదిద్దవలసిన అగత్యం నేటి ముఖ్య విద్యా సమస్యల్లో ఒకటి. ఉదాహరణకు ఈనాడు ఆంధ్రరాష్ట్రంలోని పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ఉర్దూ, కన్నడ,మరాఠీ, హిందీ, గుజరాతీ మాతృభాషలుగా (ప్రథమభాషగా) గల విద్యార్థులకు తెలుగును ద్వితీయభాషలుగాబోధించడం జరుగుతూవుంది. పాఠశాలల్లో ఏవిషయాన్ని బోధించినా దానినెందుకు బోధిస్తున్నాం? అనేదాన్నిగురించి ఉపాధ్యాయుడికి స్పష్టమైన భావన ఉండాలి. మాతృభాషా బోధన లక్ష్యాలు చాలా విశాలమైనవి. విలువలు విస్తృతమైనవి.

ఫ్రెంచి అనే బ్రిటిషు భాషావేత్త ద్వితీయభాషా లక్ష్యాలను ఈ విధంగా వివరించాడు.

- శ్రవణం – అవగాహన — భాషించడం – అర్థం చేసుకోవడం.
- పఠించడం – అవగాహన చేసుకోవడం. — లిఖించడం – అర్థం చేసుకోవడం.

ప్రథమ, ద్వితీయభాషల ఉద్దేశ్యాలను లక్ష్యాలను అవి వ్యక్తికి చేకూర్చే ప్రయోజనాల 'విలువలు' అని చెప్పవచ్చు. అవి విలువలను ఈ విధంగా వివరించవచ్చు.

| **ప్రథమభాషాబోధనలో విలువలు** | **ద్వితీయభాషాబోధనలో** |
|---|---|
| విస్తృత విలువలు | పరిమిత విలువలు |
| 1. శాశ్వత విలువలు | 1. తాత్కాలిక విలువలు |
| 2. అలంకారప్రాయాలు | 2. ఔపచారికాలు |
| 3. ఆధునికాలు | 3. సంప్రదాయాలు |
| 4. సామాజికాలు | 4. వైయక్తికాలు |

ద్వితీయభాషగా తెలుగునుబోధించేటపుడు పాఠ్యనిర్మాణంలో
ఎలాంటి మార్పులు తీసుకోరావాలి చర్చించండి

తెలుగును ద్వితీయభాషగా బోధించడానికి విస్తృతవిలువలు కాకుండా పరిమిత విలువలు సాధిస్తే చాలు. మొదట మనం పరిమిత విలువల్ని సాధిస్తే విస్తార విలువల్ని సాధించడానికి అవకాశమేర్పడుతుంది. కాబట్టి విస్తారవిలువల్లో పరిమితవిలువలు ఇమిడి ఉన్నాయనడం గమనారం. విద్యార్థుల సర్వవిద్యాకృషికి, జీవితయాత్రకు మాతృభాషే సాధనం. విద్యార్థి మాతృభాష అతని విద్యాభ్యాసానికి, సాహిత్యానందానికి, జీవితసంస్కారానికి ఉద్దేశింపబడింది. మాతృభాష విద్యార్థికి తల్లి పాలవంటిది. పరభాష పోతపాలవంటిది. సామాజిక, సాంస్కృతిక, వ్యక్తిగత ప్రయోజనాలను పొందడం, సంభాషణలలో ఆలోచనలలో, అభిప్రాయాలలో, భాషా నైపుణ్యాలైన శ్రవణ, భాషణ, పఠన, లేఖనాలలో స్పష్టత, నిర్దిష్టత కలగజేసి సంతృప్తికరమైనఫలితాలను పొందేటట్లు చేయడం అనేది మాతృభాషాలక్ష్యమై ఉండగా, విన్నది గ్రహించగలిగి భాషింపగలిగి ఉండటం, భాషించినది అర్థం చేసుకొని వ్రాయగలిగి, చదువగలిగి ఉండటమనేది ద్వితీయ భాషా లక్ష్యాలు. ద్వితీయ భాషా ప్రయోజనాలు చాలా పరిమితమైనవి. ఇవి తన ప్రాంతీయలతో సహదేశీయులతో కలిసిమెలిసి జీవించడానికి నిత్యవ్యవహారాలను నిర్వహించుకోవడానికి మాత్రమే తోడ్పడుతాయి.

ముఖ్యంగా ద్వితీయభాషను బోధించడంలో గల ముఖ్యబోధనోద్దేశ్యాలు, భావంలో, ఆచరణలో సంకుచితత్వాన్ని పోగొట్టడం, సౌభ్రాతృత్వం, సహనం, సహృదయతను పెంపొందించడం, విభిన్న తరగతులకు చెందిన వారి మధ్య సన్నిహితత్వాన్ని కలుగజేయడం, ప్రాంతీయ, అంతర్జాతీయ అవగాహనను కలిగించడం, ఆర్థిక, సాంకేతిక, రాజకీయ, సాంఘీక, సాంస్కృతిక రంగాల్లోని సంబంధాలను అభివృద్ధిచేయడమని చెప్పవచ్చు.

ఈ విధంగా లక్ష్యశుద్ధి ఏర్పడిన తరువాత ఆ లక్ష్యాలను సాధించడానికి బోధించవలసిన అంశాలేవో నిర్ణయించుకోవాలి. అట్టి నిర్ణీతాంశాల సముదాయమే ప్రణాళిక. ఉపాధ్యాయుడు తరగతిగది బోధన సాగించేటపుడు మొదట నిర్ణయించుకొన్న ఏ లక్ష్యాన్ని సాధించడానికి ప్రణాళికలోని ఏ అంశాన్ని పురస్కరించి కృషి చేస్తున్నాడో స్పష్టంగా తెలిసి ఉండాలి.

1. ద్వితీయ భాషగా తెలుగులో ఉండవలసిన అంశాలు :-

ద్వితీయ భాషగా తెలుగు వాచకాన్ని తయారుచేయడంలో కూడా తగినజాగ్రత్తలు తీసుకోవాలి. పాఠాల్లో సమాన సాంస్కృతిక, సామాజిక అంశాలు మాత్రమే ఉండాలి. వర్ణవ్యవస్థను ఆదర్శంగా

చూపే పాఠ్యాంశాలు ఉండరాదు. స్త్రీలను కించపరచే (gender difference) పాఠాలుండరాదు. కవిపరిచయాలు కూడా కుల,మత ప్రసక్తిలేకుండా చూడాలి.

సమతాభావం, జాతీయ సమైక్యత, సర్వమతాలను కులాలను సమానంగా చూసిన రామకృష్ణప రమహంస, వివేకానందుడు, కబీర్‌దాసు, అక్బరు, మహాత్మాగాంధి, సమాజిక సంస్కరణలకు కృషి చేసిన గురజాడ, వీరేశలింగం, రాజారామమోహనరాయులు, మహిళాభ్యున్నతికి పాటుపడిన దుర్గా బాయిదేశ్‌ముఖ్, అనాథలకు ఆశ్రయమిచ్చిన మాతృశక్తి థెరసా, జాతీయభావాలను వ్యాప్తి చేసిన స్వా తంత్ర్యసమరవీరుడు సుభాష్‌చంద్రబోస్, లాలాలజపతిరాయ్, అబ్దుల్‌కలాం ఆజాద్, సామాజిక అంశాలు వారి ఆదర్శాలు పాఠాలుగా ఉండాలి. జాతీయ పర్వదినాలు,పర్యావరణం, దర్శనీయచారి త్రక స్థలాల వంటి అంశాలను చేర్చవచ్చు. జాతీయగీతాలు, మాతృభక్తిని, పితృభక్తిని, దేశభక్తిని కలిగించే పద్యాలు, గేయాలు ప్రతితరగతిలో ఉండాలి.

తరగతి బోధన సాగించడానికి ఉపాధ్యాయుడికి ఉన్న ముఖ్య సాధనం పాఠ్యగ్రంథం. ఉపాధ్యాయుడికి ఆ గ్రంథాన్ని ఎలా బోధించాలో తెలిసివుండాలి. తెలుగును పరభాషీయులకు బోధించడానికి అనువైన పద్ధతులను తెలుసుకుంటేగాని,ఉపాధ్యాయుడు తన వృత్తిధర్మంలో కృతకృ త్యుడు కాలేడు.

2.ద్వితీయభాషగా తెలుగుభాష బోధనలో ఉపాధ్యాయుడు పాటించవలసిన ముఖ్య విష యాలు:

1.ద్వితీయభాషను బోధించేటప్పుడు పాఠ్యాంశానికి సన్నిహితమైన జీవితంలోని సన్నివేశాలను కొ న్నింటిని సమన్వయపరచి బోధన జరపాలి.ఇట్టికల్పితసంఘటనలను విద్యార్థులు గ్రహించడానికి ఉ పాధ్యాయుడు తగిన విధంగా బోధన సాగించాలి.

2. భావ సంగ్రహణకు సులభంగా ఉండే గద్యపరిచ్ఛేదాలను పాఠ్యభాగాలుగా బోధించాలి.

3.బోధన సమయంలో ఉపాధ్యాయుడు పూర్తిగా తానేవ్యాపించి విద్యార్థులను స్తబ్ధులుగా ఉంచకూడదు. చైతన్యవంతమైనవాతావరణాన్ని కలిగించాలి. దీనివల్ల అభిరుచులు,పరిశీలన, శ్రద్ధ, అభ్యసనాలుపెరుగుతాయి.

4. వాక్యపద్ధతిలో భాషను బోధించాలి. సరళమైన చిన్నవాక్యాలనే బోధించడం మంచిది.

5. పద్యబోధన అన్నప్పటికి సులభంగా బోధపడే పద్యాలనే బోధించడం జరగాలి.

6. తెలుగులిపిలో ద్విత్వసంయుక్తాక్షరాల వల్ల క్లిష్టత కలుగుతుంది. కాబట్టి వారికి చెప్పబోయే వాక్యానికి సంబంధించిన గుణింతాలను సరళబోధన ద్వారా ప్రవేశపెట్టి తర్వాత ద్విత్వ, సంయుక్తాక్షరాలనుప్రవేశపెట్టాలి.

7. తప్పనిసరి అయితేనే పదాల మధ్య సంధిచేయాలి.

8. విరామ చిహ్నాలను సరయినరీతిలో ఉపయోగించేటట్లు బోధకులు ప్రయత్నించాలి. ప్రశ్నోత్తర, అనువాద పద్ధతులకంటే వాక్యనిర్మాణ పద్ధతిబోధన ఉత్తమమైనది.

9.వ్యాసరచనలో వ్యాసాంశాలను సేకరించడానికి సేకరించిన అంశాన్ని క్రమపద్ధతిలో పెట్టుకొనే సామర్థ్యాన్ని కలుగచేయాలి. ఇది విద్యార్థి తనభావాలను ప్రకటించడానికి నిర్మాణాత్మక అభ్యాసానికి ఎంతగానో తోడ్పడుతుంది.

10.దోషరహితమైన రచనాశక్తిని, సంభాషణాశక్తిని, పెంపొందించడానికి వ్యాకరణాంశాలను కర్త, కర్మ,క్రియ లింగవచనాదులను గురించిన జ్ఞానాన్ని కలిగించాలి.

11. పాఠ్యగ్రంథాలు మతరహిత అంశాలను కలిగి, వైజ్ఞానిక, వాస్తవిక, నైతిక,దృక్పథంలో కూడుకొని విద్యార్థులకు అనుకూలంగా ఉన్న భాషలో వ్రాయబడి ఉండటం ఉచితం.

2.10. తృతీయ భాషాగా తెలుగు :

తెలుగుబోధన అంటే తెలుగుభాషా బోధన. త్రిభాషాసూత్రం అమలులో ఉన్న హర్యానా మొదలైన రాష్ట్రాలలో తెలుగు తృతీయ భాషగా బోధింపబడుతుంది. ఒకభాషను మాతృభాషగా మాట్లాడే వారిలో కూడా ఆభాష మీద వారి వారి సామర్థ్యం వేరు వేరు స్థాయిలలో ఉంటుంది. మాతృభాషను మాట్లాడే ప్రాంతంలో కాక, మరొక భాషా ప్రాంతంలో నివసించే వారిలో తమ మాతృభాష మీద సామర్థ్యం తక్కువగానూ కొన్ని సందర్భాలలో నామమాత్రంగానూ ఉంటుంది.

తెలుగును మాతృభాషగా గలవారు ఆంధ్రరాష్ట్రంలోనేకాక సరిహద్దు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఒరిస్సారాష్ట్రాలలో నివసిస్తూ ఉన్నారు. చాలా తక్కువ మంది తదితర రాష్ట్రాలలో నివసిస్తున్నారు.

ఇతర రాష్ట్రాలలో స్థిరపడిన తెలుగువారిపై స్థానిక భాషాప్రభావం ఎక్కువగా ఉంటుంది. తృతీయ భాషగా తెలుగును బోధించేటపుడు ఆప్రభావాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవలసివుంటుంది. దానికి తగినట్లు పాఠ్యగ్రంథాలను నిర్మించడంలోను బోధన పద్ధతులలో కొన్ని వ్యూహాలను పాటించాలి. ఇవి పాటించడంవల్ల భాషాబోధన సులభతరమవుతుంది. తృతీయభాషగా తెలుగును బోధించేటపుడు వ్యాకరణ సంబంధమైన అంశాలకంటే ఆయా సందర్భాలలో తగిన భాషా వ్యవహారాన్ని పాఠ్యాంశాలుగా రూపొందించడం మంచిది. తృతీయభాషగా తెలుగులో రెండు రకాలైనఅంశాలు పరిగణనలోకి తీసుకోవాలి. ఒకటి భాషకు సంబంధించిన సామాజిక అంశాలు. రెండు భాషా నిర్మాణానికి సంబంధించిన అంశాలు.

ఆంధ్రప్రదేశ్ వ్యవహరించే భాష మాత్రమే మంచిది అనే అభిప్రాయం కలిగించకూడదు. భాష అనేది ఎన్నో మాండలిక భేదాలను కలిగి ఉంటుంది. మాండలికాలలో ఒకటి ఎక్కువ మరొకటి తక్కువకావని స్పష్టంగా తెలియజేయాలి. వారు మాట్లాడే మాండలికంలోని వాడుకపదాలను ఎక్కువగా ఉపయోగించాలి. ఉచ్చారణలో కూడా స్థానిక ఉచ్చారణను గౌరవిస్తూనే తగిన సూచనలు చేస్తూ మార్పులు తీసుకోరావడానికి ప్రయత్నించాలి. తృతీయ భాషగా నేర్పడంలో తెలుగును మాట్లాడగలగడమే ప్రధానం. అంతేకాని ప్రమాణ భాషలోనే మాట్లాడటం ప్రధానం కాదు. త్రిభాష విధానమున్న రాష్ట్రాలలో ఒక విద్యార్థి పదవతరగతి పూర్తిచేసేసరికి మూడుభాషలలో తనభావాలను వ్యక్తీకరించే సమర్థుడవుతాడు.

| |
|---|
| మాతృభాషకాకుండా ఇతర ఏవైనా భాషలను ద్వితీయ భాషగా తృతీయభాషగా అభ్యసించేవారిని సంప్రదించి వారి అభిప్రాయాలను, అనుభవాలను అభ్యసనా వివరాలను సేకరించండి. |

## 2.11. ధ్వని - ఉత్పత్తి

భాష వాగ్రూప ధ్వని సంకేతమయం. మానవుడు తన ముఖ యంత్రంలో అనేక ధ్వనులను ఉత్పత్తి చేయగల సమర్థుడు. మానవుల మధ్య పరస్పరం జరిగే సంభాషణ విడి విడి ధ్వనుల రూపంలో కాకుండా బహువిధ ధ్వని సముదాయ సమన్వితంగా ధారా రూపంగా వుంటుంది. వాగ్ధ్వనులు క్షణికమయినా భౌతికం. నోటిలో పుట్టి చెవులకు వినిపించే వాగ్ధ్వనుల సముదాయమే భాషా నిర్మాణ స్వరూప పరిశీలనకు అనువుగా గ్రహించగలిగిన భౌతిక పదార్థం. వాగుత్పత్తి క్రమంలో వాగవయవాల ప్రమేయాన్ని గుర్తించి మానవుడు ఉచ్చరించగల అనేకానేక ధ్వనుల భేద సాదృశ్యాలను సూక్ష్మంగా, సప్రమాణంగా నిర్ణయించి పర్గీకరించి వివరించే శబ్ద పరిజ్ఞానమే ధ్వని విజ్ఞానం (Phonetics)వాగవయవాల ద్వారా ఉచ్చరించగలిగిన అన్ని ధ్వనులను మానవుడు భాషలో ఉపయోగించ లేడు. కొన్నింటిని మాత్రమే ఉపయోగించుకొంటాడు. భాషా పరంగా ఉపయోగించిన ధ్వను

లను భాషా ధ్వనులని (Linguistic Sounds) పేర్కొనవచ్చును. ఈధ్వనులను అనేకవిధాలుగా అధ్యయనం చేసివాటి స్వరూపతత్త్వాన్ని గ్రహించవచ్చు. భాషా ధ్వనులనే Phones( ధ్వనులు) అనిఅంటారు. వీటి అధ్యయనమేధ్వని విజ్ఞానం (Phonetics) భాషల్లో ధ్వనులు పరిమితంగానే వుంటాయి. అవి చాలా భాషల్లో ఒకే విధంగా ఉండవచ్చు. ధ్వనుల ఉచ్చారణలో మాత్రమే భేదముండవచ్చు. ఆ ధ్వనులు అందించే భావనలు కూడా ఆయా భాషల్లో వేరు వేరుగా ఉండవచ్చు. ఒకే ధ్వనిని స్వరభేదంతో (హెచ్చు స్థాయిలో, తగ్గు స్థాయిలో, సమ స్థాయిలో) ఉచ్చరించటం వలన కూడా ఆ ధ్వని వ్యక్తీకరించే భావనల్లో భేదం కనబడవచ్చు.

పరిమిత సంఖ్యలోని ధ్వనులు, వాటి ఉచ్చారణ భేదం చేత అపరిమత ధ్వనులుగా చెలామణి కావడం, ఆయా సందర్భానికి తగిన భావనలు తెలియచెప్పడం భాషల్లో నిరంతరంగా జరిగేదే. వేరు వేరు భాషలు మాట్లాడే వారు ఒక ధ్వనికి తమ తమ సొంత అర్థాలు ఏర్పరచుకొంటారు. ఒకే భాష మాట్లాడే వారు కూడా తాము చేసే ధ్వనికి ఒకే అర్థంకాక వేరు వేరు అర్థాలు ఆపాదించుకొంటారు. అందువల్ల భాషలోని ధ్వని, ఆధ్వని ఉచ్చారణ, దాని అర్థబోధక శక్తి, ఆ ధ్వనులు చేసే వ్యక్తులను బట్టి, ఆ ధ్వనులను విని వక్తభావనలను గ్రహించగలిగే శ్రోతలను బట్టి కలుగుతుంది.

**ధ్వని శాస్త్ర పరనం - భాషోపాధ్యాయుడు**

భాషా బోధనలో ధ్వనులు, వాటి ఉచ్చారణలు అర్థంలో భేదకత కల్గించే అంశాలను గూర్చి భాషోపాధ్యాయులు సంపూర్ణంగా తెలుసుకొంటే తప్ప నిజమైన భాషా బోధన సాధ్యం కాదు. ఇందు కోసం భాషోపాధ్యాయులకు ( భాషను గురించి తెలిపే శాస్త్రమైన) భాషా శాస్త్ర పరిచయం అవసరం.

కొన్ని ధ్వనులు అర్థభేదక సమర్థకాలు మరికొన్ని ధ్వనులు అర్థభేదక అసమర్థకాలుగా వుంటాయి. మొదటి రకం భేదాలు ప్రధానమైనవి. రెండో రకం ప్రధానమైనవి కావు. అందువల్ల సాధారణ వ్యవహర్తలు ప్రధాన భేదాలను మాత్రమే గుర్తించ గల్గుతారు. ఆ ప్రధాన భేదాలను సాధారణంగా వ్యవహర్తలు గుర్తించలేరు. పై అంశాలను బట్టి క్రింది విషయాలను గ్రహించవచ్చు.

* ఒకే విధమైన ధ్వని వివిధ భాషల్లో కనబడవచ్చు.

* ధ్వనులకు అర్థ భేదక సామర్థ్యం ఉంది.
 ఉదా కాలం - గాలం

* ఉచ్చారణను బట్టి ధ్వనుల మధ్య భేదాన్ని గుర్తించవచ్చు

* ధ్వనులు పరిమిత సంఖ్యలోనే ఉంటాయి. వాటి ఉచ్చారణను బట్టి అవి అపరిమితమవుతాయి.

* ధ్వనుల ఉత్పత్తికి సహకరించే స్థాన కరణాలనుబట్టి వాటిని విభజించవచ్చు.

* ధ్వనుల ఉచ్చారణకు చేసే ప్రయత్నాన్నిబట్టి వాటిని విభజించవచ్చు.

ధ్వని - ఉత్పత్తి

మానవులు పశు పక్ష్యాదులు ధ్వనులు చేస్తారు. ఆ ధ్వనులమధ్య కొన్ని పోలికలు ఉండవచ్చు. కాని పశు పక్ష్యాదులు చేసే ధ్వనులు పరిమితంగానే ఉంటాయి. మానవులు నియమిత సంఖ్యలోనే ధ్వనులను ఉపయోగిస్తారు. ఒక భాషలోని ధ్వనులు వేరొక భాషలో ఉండవచ్చు. ఉండక పోవచ్చు. రెండు భిన్న మూలీయ భాషల్లో సాదృశ్యమున్న ధ్వనులుండవచ్చు. అందువల్ల భాషల నిర్మాణ స్వరూపాన్ని గురించి పూర్తిగా అర్థం చేసుకోవాలంటే ఆభాషా ధ్వనుల ఉచ్చారణ విధానాన్ని గూర్చి అర్థం చేసుకోవడం అవసరం. ఈ అంశాలను వివరించేదే ధ్వని విజ్ఞాన విభాగం

ధ్వని విజ్ఞానం (Phonetics) లో మూడు ముఖ్య భాగాలు ఉంటాయి.

1)	ఉచ్చారణాత్మక ధ్వని విజ్ఞానం (Articulatory Phonetics)

2)	ధ్వని తరంగ విజ్ఞానం (Acoustic Phonetics)

3)	శ్రవణ ధ్వని విజ్ఞానం (Auditory Phonetics)

## ఉచ్చారణాత్మక ధ్వని విజ్ఞానం (Articulatory Phonetics)

ముఖయంత్రంలో ధ్వనులు, ఉత్పన్నమయ్యే విధానాన్ని, వాటి ఉత్పత్తికి సహకరించే వాగవయవాలు, అవి నిర్వహించే పని మొదలైన అంశాలను గూర్చి తెలిపేది ఉచ్చారణాత్మక ధ్వని విజ్ఞానం.

" Ariculatory Phonetics is the branch concerned with the study of sounds usable in speech in terms of the mechanisms of their production by the human vocal apparatus "

Gleoson H.A. - " An introduction to descriptive Linguistics

మానవ ముఖయంత్రంలోని భాగాలు అనేక ధ్వనులను ఉత్పత్తి చేయగలుగుతాయి. సాధ్యమైనంత వరకు ధ్వని విజ్ఞానం భాషా ధ్వనులన్నింటిని వాటి ఉత్పత్తి స్థానాన్ని బట్టి, ప్రయత్న భేదాన్ని బట్టి వివరించ గలుగుతుంది. భాషా ధ్వనుల ఉత్పత్తి సామాన్యంగా ఉచ్ఛ్వాస/ నిశ్వాసలను బట్టి ఉంటుంది. సాధారణంగా గాలి ఊపిరితిత్తుల నుండి బయటకు లోపలకు రావటం నిశ్శబ్దంగానే జరుగుతుంది. వాయుకుహరం(Larynx) నుండి పెదవుల వరకు ఉన్న విభాగంలో వాయు ప్రహహానికి ఆటంకం కలిగించినప్పుడు ధ్వనుల ఉత్పత్తి జరుగుతుంది. భాషా ధ్వనుల ఉత్పత్తికి ఈ విభాగంలో సులభంగా అధీనంలో ఉండే (Easily Controllable obstructions) అడ్డంకులు కావాలి. సామాన్యంగా ప్రతి భాషలో గుర్తించదగిన ధ్వనులు, అచ్చులు, హల్లులు అని రెండు రకాలు. వాటినే మనం స్వరాలు, వ్యంజనాలు అని కూడా వ్యవహరిస్తాం.

నాద తంత్రుల నుండి పెదవుల దాకా ఉన్న విభాగంలో అడ్డంకి కలుగచేస్తే ఏర్పడేవి హల్లులు(Consonants). అలా కాకుండా వాయు ప్రవాహాన్ని నాదతంత్రుల నుండి(Vocal Chords) పెదవుల దాకా, ఆ పైన ఎలాంటి అడ్డంకి కలిగించకుండా నిరాటంకంగా వెళ్ళనిస్తే ఏర్పడేవి అచ్చులు. భాషా ధ్వనులలో హల్లును ఉచ్చారణ దృష్ట్యా వివరించడానికి గుర్తించవలసిన అంశాలు మూడు

1)	స్థానం (Point of articulations)

	కరణం (Articulatory)

2)	ప్రయత్నం (Manner of articulation)

3)	శ్వాసమా – నాదమా (Whether the vocal chords are vibrating or not)

ముఖయంత్రంలో ఏ స్థానంలో అయితే కరణంతాకుతుందో లేక గరిష్ఠసంకుచిత అవకాశం ఏర్పాటు చేస్తుందో దానిని స్థానం అన్నారు. ధ్వనులఉత్పత్తిలో ఏఅవయవం అయితే స్థానంవైపు పయనించి వాయుప్రహహాన్ని ఆపి వదలడం కాని లేక స్థానం దగ్గర సంకుచిత అవకాశం ఏర్పాటు చేయడం కాని, కంపించడం కాని చేస్తుందో దాన్ని కరణం అన్నారు. ముఖయంత్రంలో మాములుగా కదలికకలిగిన అవయవాలన్నీ కారణాలే. ఊపిరితిత్తుల నుండి వెలువడే వాయు ప్రవాహం కాకలం (Glottis) అంటే నాద తంత్రులు ఉండే ప్రాంతం నుండి, పెదవుల దాకా ఉన్న విభాగంలో స్థాన కరణాల సహాయం పొందే వివిధరకాలయిన మార్పులను ప్రయత్న భేదం అంటారు.

ఉదా వాయుప్రవాహాన్ని స్థాన కరణాల సహాయంతో ఆపివదిలితే అది స్పర్శప్రయత్నం. అలాకాక వాయుప్రవాహాన్ని స్థాన కరణాల సంకుచిత అవకాశంద్వారా ఒరుసుకొని వెళ్లేట్టు చేస్తే అది ఊష్మ ప్రయత్నం. ఇలా వివిధ రకాలయిన ప్రయత్న భేదాలు ఉంటాయి.

ముఖయంత్రంలో శబ్దతరంగాన్ని ఏ విధమైన ప్రయత్నంలో ఉత్పన్నం చేస్తామో దాన్ని ప్రయత్నభేదం అంటారు. అంటే వాయుప్రవాహాన్ని నిరోధించి వదలడం, సంకుచిత అవకాశం ద్వారా పంపడం లేక కరణాన్ని కంపింపచేయడం ఇలాంటి భేదాల్నే ప్రయత్న భేదాలంటారు.

వాయుప్రవాహం ఊపిరితిత్తులనుండి Larynx ద్వారా అంటే నాదతంత్రులున్న మార్గంగుండా కంఠబిలంలోకి వస్తుంది. నాద తంత్రులు Larynx లో ముందు భాగంలో అతుకుకొని వెనుక భాగంలో విడివడి ఉన్న పెదవుల లాంటి విభాగాలు.

ఉచ్ఛ్వాసనిశ్వాలప్పుడు అవి పూర్తిగా తెరుచుకొని ఉంటాయి. అలాంటప్పుడు పైన ఎలాంటి ధ్వని ఉత్పన్నమయినా అది శ్వాసము(Voiceless sound) అలా కాక నాదతంత్రులు దగ్గరా తీసుకొని వచ్చి వాయు ప్రవాహంతో వాటిని కంపింపజేసి ధ్వనిని ఉత్పన్నం చేస్తే అది నాదము అవుతుంది. ఉదా పగలు.

ఈ పదంలోని మొదటి శబ్దం ప అన్నది. రెండు పెదవులను స్పర్శింప జేసి గాలిని ఆపి వదలడం అన్న ప్రక్రియ వల్ల ఏర్పడ్డద్ది. ఈ ధ్వని ఉచ్చారణలో పై పెదవి స్థానంగా, కింది పెదవి కారణంగా పని చేసాయి. గాలిని నిరోధించి, వదలడం ద్వారా ఈ ధ్వని ఉత్పన్న మయింది. అందువల్ల ఈ ప్రయత్న భేదాన్ని స్పర్శ ప్రయత్న భేదం (Stop or plosive) అన్నారు. ఉదా బలం

ఈ పదంలోని మొదటి ధ్వని బ ఉచ్చారణలోను కూడా క్రిందిపెదవి, పైపెదవి ఒకటి కరణంగాను కూడా క్రిందిపెదవి, పైపెదవి ఒకటి కరణంగాను, ఒకటి స్థానంగాను పని చేస్తాయి. స్పర్శ ప్రయత్నంలో ధ్వని ఉత్పన్నమయినది. అయితే మొదటి పదంలోనిది ప గాను రెండవ పదంలోనిది బ గాను ఉచ్చరింపబడ్డాయి. అందుకు కారణం ప ఉచ్చరించినప్పుడు స్వరపేటికలోని నాదతంత్రులు (Vocal Chords) కంపించలేదు. బ ఉచ్చారణలో స్వరపేటికలోని నాదతంత్రులకు కంపనం కలిగింది. అందుచేత ప అన్న ధ్వనిని శ్వాసధ్వని అని బ అనే ధ్వనిని నాదధ్వని అన్నారు. ఈ విధంగా ధ్వనులలో శ్వాస, నాదభేదాలు గుర్తించగలం. ధ్వనుల ఉచ్చారణలో ఊపిరితిత్తుల నుండి వచ్చే వాయుప్రవాహం స్థాన కరణ ప్రయత్నభేధాల వల్ల వివిధ రకాలయిన ధ్వనులుగా మార్పు చెందుతుంది.

## ధ్వని తరంగ విజ్ఞానం (Acoustic Phonetics)

ఈ విభాగం ధ్వని తరంగాల అధ్యయనానికి సంబంధించినది.

**"Phonetics is the actual study of the sounds of a language. Acoustic phonetics deals with the studies of physical structure of the sounds used in the language"**

**- Bertil Malbery**

ధ్వనుల భౌతిక నిర్మాణం గురించి వివరించేది ధ్వని తరంగ శాస్త్రం. మనం ఉచ్చరించేధ్వనులు గాలిలో వివిధ తరంగరూపాలలో అతివేగంగా పయనించి శ్రవణేం ద్రియాన్ని చేరి శబ్ద స్ఫూర్తిని కలిగిస్తాయి. గాలిలేకుంటే శబ్దం ప్రయాణం చేయలేదు. దానికి అస్తిత్వం సిద్ధించదు. భాషా ధ్వనుల వాయుతరంగ రూపాలను Kymograph,Spectrograph,Oscallograph వంటి ప్రత్యేకపరికరాల ద్వారా ప్రత్యక్షీకరించుకొని (రేఖాచిత్రములను చూసి) వాటి భేద సాదృశ్యాలను పరిశీలించి నిరూపించే శాస్త్రమే ధ్వని తరంగశాస్త్రం. ధ్వనులు శబ్దతరంగాలుగా పయనిస్తాయి. గాలిలో ధ్వనులు సుమారు ఒక సెకనుకు 110 అడుగులు ప్రయాణం చేస్తాయి. అంతేకాకుండా శబ్దతరంగాలు కంపనం (Vibration) వల్ల ఏర్పడ్డాయి. అదేవిధంగా ఊపిరితిత్తుల నుండి వచ్చే వాయు ప్రవాహం వాగింద్రియంలో ఉన్న అవయవాలకంపనం వల్ల ముఖకుహరం (Oral Cavity), నాసికా కుహరం (Nasal cavity), కంఠబిలం (Pharynx) మొదలైన వాటిలోని ఆకారంలో మార్పుల వల్ల (Change in the shape of the cavity) వివిధ తరంగాలు ఏర్పడుతాయి. అందువల్లనే వివిధ రకాలయిన భాషాధ్వనులు

ఉత్పన్నమవుతాయి. ఒక ధ్వనిని ఉత్పత్తి చేయడానికి ఒక కంపితఅవయవం కావాలి. ఆ కంపితఅవయవాన్ని (Vibrating Medium) చలింపచేయడానికి శక్తి కావాలి.

ఉదా మానవ వాగవయవాలలో(VocalChords) నాదతంత్రులు నుండి వచ్చే వాయుప్రవాహం పనిచేస్తుంది. ఉత్పత్తి అయిన శబ్దతరంగం కంఠబిలం, ముఖ కుహరం, నాసికా కుహరాల ఆకారాలలో మార్పు వలన, ఆ కుహరాల ఆకారాలలో మార్పుల వలన, ఆ కుహరాలు (Resonating Cavities) ప్రతి స్పందించడం వల్ల వివిధ నాద ధ్వనులుగా మారుతుంది.

ధ్వనితరంగాలు ఏర్పడడానికి కంపనంకారణం. ఒక సెకనుకు ఎన్ని కంపనాలు ధ్వనితరంగం కలిగి ఉంటుందో దాన్ని పౌనఃపున్యం (Frequency) అంటారు. కంపనాలు ఎక్కువైతే ఆ ధ్వని స్థాయి ఎక్కువవుతుంది. ఈ కంపనాలు క్రమబద్ధంగా ఉంటే శ్రావ్యమైన సంగీత పరమయిన ధ్వనులు - Musical Notes -వింటాము. అలా కానప్పుడు అవి కేవలం చప్పుళ్ళు (Noises) గా వినిపిస్తాయి. కంపనాలకు మూలమైన శక్తిని బట్టి దాని తీవ్రత (Intensity) మారుతు ఉంటుంది. మానవ . బాషాధ్వనులను కూడా ఈ మూడుఅంశాల ఆధారంగా భౌతికంగా వివరించవచ్చు. భాషా ధ్వనుల భౌతిక లక్షణాలను Spectograph అనే యంత్రం ద్వారా క్షుణ్ణంగా విశ్లేషించవచ్చును.

**శ్రవణ ధ్వని విజ్ఞానం (Auditory Phonetics)**

ధ్వని విజ్ఞాన విభాగాలు మూడింటిలోను భాషాశాస్త్రపరంగా ఇంకను అభివృద్ధి చెందవలసినది ఉంది. (Auditory Phonetics) శ్రవణ ధ్వని విజ్ఞానం. ఈ విభాగంలో ధ్వనుల ఉత్పత్తికి ప్రేరణ అయిన నరాలు, మెదడు, నాడీ మండలం ఎలా పనిచేస్తాయి ? ధ్వనుల ఉత్పత్తి అయిన తరువాత శ్రోత శ్రవణేంద్రియాలు ఆధ్వని తరంగాలను ఎలా గ్రహిస్తాయి? తిరిగి అవి శ్రోత నాడీ మండలం ద్వారా మెదడుకు ఎలా పయనిస్తాయి. అనే విషయాలను గురించి, మెదడు ఎలా ప్రతిస్పందించి నాడీ మండలానికి అక్కడ నుండి శ్రోత వాగవయవాలకు సందేశాలు ఎలా పంపిస్తుంది. వీటిని గురించి ఈ శాస్త్రం చర్చిస్తుంది. ధ్వని భాషను బోధించే ఉపాధ్యాయులు విధిగా భాషాధ్వని విజ్ఞానంలోని పై మూడు ప్రధాన భాగాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే తప్ప భాషా బోధనకు న్యాయం చేకూర్చలేరు.

## స్థాన కరణాలు వాటికి సంబంధించిన వివిధ ధ్వనులను పరిశీలిద్దాం

| | స్థానం | కరణం | ఏర్పడే ధ్వని | ఉదాహరణ | |
|---|---|---|---|---|---|
| 1. | పై పెదవి | కింది పెదవి అధరము | ఉభయోష్ఠ్యాలు | ప, బ, మ | p,b,m, |
| 2. | కింది పెదవి | పై దంతాలు | దంత్యోష్ఠ్యాలు | వ | (v) f |
| 3. | పై దంతాలు | జిహ్వాగ్రం నాలుక కొస | దంత్యాలు | త, ద, | t,d |
| 4. | దంత మూలం | పూర్వ జిహ్వా | దంత మూలీయాలు | న, ల, ర, | n,l,r, |
| 5. | మూర్థం (అంగిలి) | పూర్వజిహ్వా | మూర్థన్యాలు | ట, డ, ళ | t,d,l, |
| 6. | కఠిన తాలువు (దౌడలు) | మధ్య జిహ్వా | తాలవ్యాలు | చ, జ, | ts, dz |
| 7. | మృదు తాలువు (దౌడల మూలం) | పశ్చిమ జిహ్వా | కంఠ్యాలు | క, గ | k,g |
| 8. | హనుమూలం | పశ్చిమజిహ్వా | హనుమూలీయాలు | | |
| 9. | కంఠబిలం | జిహ్వా మూలం | కంఠ మూలీయాలు | | |
| 10. | కాకలం | నాదతంత్రులు | నాద తంత్రీయాలు | హ | h |

## 2.11 continuation,

క్రిందిపెదవి కరణంగా, పై పెదవి స్థానంగా ఉభయోష్ఠ్య ధ్వనులు ఏర్పడుతాయి. జిహ్వాగ్రం కరణంగా దంతాలు స్థానంగా దంత్య ధ్వనులు ఏర్పడుతాయి.ఈ విధంగా వివిధ స్థాన కరణాల వలన వివిధ రకాలయిన ధ్వనులు ఏర్పడుతాయి. నాద తంత్రుల కంపన గతిని బట్టి ఉదాత్తానుదాత్తాది స్వరభేదం సిద్ధిస్తుంది.సంగీత మాధుర్యం నాదతంత్రుల కంపన గతి మీద ఆధారపడి ఉంటుంది. ఉచ్చారణలో పిల్లలకు, పెద్దలకు గల భేదాన్ని పురుష, స్త్రీ, కంఠ భేదాన్ని వ్యక్తం చేసే లక్షణం కూడా నాదతంత్రులకు సంబంధించినదే పురుషుల స్వరపేటికలోని నాదతంత్రుల కన్న, స్త్రీ స్వరపేటికలోని నాద తంత్రులు కొంత పొట్టిగా ఉంటాయి. అందువల్లనే స్త్రీల ఉచ్చారణ పురుషుల కన్న .
బిన్నంగా వినిపిస్తుంది.

### 2.12 భాషాధ్వనులు – వాగవయువాలు

ఉచ్చారణ వ్యక్తుల యొక్క ముఖ యంత్రానికి దగ్గరి సంబంధం ఉంది.స్వరయంత్ర చలనం ద్వారా ఉత్పన్నమైన ధ్వని ముఖయంత్రంలోనికి చేరి నిర్దిష్టమైన ఆకృతిని పొందుతుంది. ఇందుకు ముఖంలోని వివిధ అవయవాలు సహకరి స్తాయి. ఈధ్వనిని ఉత్పత్తి చేయడానికి సహకరించు ముఖభాగాలు స్థాన,కరణాలువీటిలో స్థానమైనభాగాలు ముఖంలోని కదలని భాగాలైన పై దవడ, పై దవడలోని దంతాలు మొదలైనవి. క్రింది దవడ, నాలుక మొదలైన భాగాలు కదిలేవి. కదలని అవయవ భాగాలు స్థానాలు, కదిలే అవయవ భాగాలు కరణాలు. ధ్వనికి ఆకృతి కల్పించడానికి జరిగిన ప్రేరణ, తద్వారా పుట్టిన కోరికయే ప్రయత్నం. ఈ విధంగా స్థానకరణ ప్రయత్నాల ద్వారా ధ్వని ఉత్పత్తి అవుతుంది.

**వాగవయవాలు**




1. నాసికారంధ్రం, 2. నాసికాకుహరం 3. ఓష్ఠము 4. వర్త్స్యం 5. బర్స్వం 6. మూర్ధం 7. తాలువు 8. కాకలం 9. ఓష్ఠము 10. 10(A) దంతం 11. జిహ్వాగ్రం 12. జిహ్వామధ్యం 13. జిహ్వాప్రష్ఠం 14. గళగర్తం 15. జిహ్వామూలం 16. గోజిహ్వాక 17. స్వరపేటిక 18. నాదతంత్రికలు 19. శ్వాసనాళిక 20. ఆహారనాళిక.

ప్రయత్నాల్లో కొన్ని సామాన్యమైనవి. కొన్ని విశిష్టమైనవి. సామాన్య ప్రయత్నాలను శ్వాసాలని , నాదాలని, అల్పప్రాణాలని మహాప్రాణాలని అంటారు. ఇవి విస్తృత ప్రయోజనం కలవి.

- శ్వాసం అంటే నాద తంత్రులను కంపింపజేయకుండా నిర్గమించే ఊపిరి (వాయువు)
- నాదం అంటే నాదతంత్రులను కంపింప జేస్తూ నిర్గమించే ఊపిరి.
- అల్పప్రాణం అంటే నిర్దిష్ట కాలంలో స్వాభావికోచ్చారణలో వెలువడే ఊపిరి.
- మహాప్రాణం అంటే నిర్దిష్ట కాలంలో స్వాభావికం కంటే ఎక్కువ ఒత్తిడితో వెలువడే ఊపిరి.
- నాదం నిర్గమిస్తున్నప్పుడు రెండు చెవులు మూసుకుంటే గుయ్ మనే ధ్వని కంపనం వినపిస్తుంది. ఇక నాసికా రంధ్రాల ద్వారా నాదవంతంగా గాలిని నిర్గమింపజేస్తే అది అనునాసిక్యమనే ప్రయత్న భేదమవుతుంది. విశిష్ట ప్రయత్నాల వల్ల క్రింది ధ్వని భేదాలు ఏర్పడతాయి.

ముఖ యంత్రాన్ని చిత్రించి భాగాలను గుర్తించండి.

## హలులో రకాలు

హల్లులను స్పర్శాలు, ఊష్మాలు, స్పర్శోషాలు, అనునాసికాలు, కంపితాలు, తాడితాలు, పార్శ్వికాలు అంతస్థాలుగా విభజించవచ్చు.

1. స్పర్శాలు : కంఠబిలం నుంచి పెదవుల వరకు ఉండే భాగంలోని ఏదో ఒక స్థానంలో వాయు ప్రవాహాన్ని క్షణకాలం నిరోధించి వెలువరించడం వల్ల ఏర్పడే ధ్వనులు స్పర్శాలు. వీటిలో

శ్వాస, నాద భేదంతో పాటు అల్పప్రాణం, మహాప్రాణం భేదం కూడా ఉంది. నిర్దిష్టకాలంలో స్వాభావికోచ్చారణలో ఉచ్చరించే హల్లు అల్పప్రాణం - (క), నిర్దిష్ట కాలంలో స్వాభావికోచ్చారణకు మించిన గాలిని వెలువరిస్తూ ఉచ్చరించే హల్లు మహాప్రాణం (ఖ)

| ప | ఫ | బ | భ |
|---|---|---|---|
| శ్వాసం<br>అల్పప్రాణం<br>ఉభయోష్ఠ్య స్పర్శం | శ్వాసం<br>మహాప్రాణం<br>ఉభయోష్ఠ్య స్పర్శం | నాదం<br>అల్పప్రాణం<br>ఉభయోష్ఠ్య స్పర్శం | నాదం<br>మహాప్రాణం<br>ఉభయోష్ఠ్య స్పర్శం |
| **త**<br>శ్వాసం<br>అల్పప్రాణం<br>దంత్యస్పర్శం | **థ**<br>శ్వాసం<br>మహాప్రాణం<br>దంత్యస్పర్శం | **ద**<br>నాదం<br>అల్పప్రాణం<br>దంత్యస్పర్శం | **ధ**<br>నాదం<br>మహాప్రాణం<br>దంత్యస్పర్శం |
| **ట**<br>శ్వాసం<br>అల్పప్రాణం<br>మూర్ధన్యస్పర్శం | **ఠ**<br>శ్వాసం<br>మహాప్రాణం<br>మూర్ధన్యస్పర్శం | **డ**<br>నాదం<br>అల్పప్రాణం<br>మూర్ధన్యస్పర్శం | **ఢ**<br>నాదం<br>మహాప్రాణం<br>మూర్ధన్యస్పర్శం |
| **క**<br>శ్వాసం<br>అల్పప్రాణం<br>కంఠ్యస్పర్శం | **ఖ**<br>శ్వాసం<br>మహాప్రాణం<br>కంఠ్యస్పర్శం | **గ**<br>నాదం<br>అల్పప్రాణం<br>కంఠ్యస్పర్శం | **ఘ**<br>నాదం<br>మహాప్రాణం<br>కంఠ్యస్పర్శం |

2. ఊష్మాలు :

ఊపిరితిత్తుల నుంచి వచ్చే వాయు ప్రవాహం స్థానిక నిరోధం లేకుండా స్థాన కరణాల సంకుచిత

అవకాశం ద్వారా ఒరసుకొని రావటం వల్ల ఏర్పడే ధ్వనులు ఊష్మాలు. ఈ అవకాశం ఎంత చిన్నదైతే ఊష్మధ్వని తీవ్రత అంత ఎక్కువగా ఉంటుంది.

| శ | ష | స | హ |
|---|---|---|---|
| శ్వాసం<br>తాలవ్య ఊష్మం | శ్వాసం<br>మూర్ధన్య ఊష్మం | నాదం<br>దంత మూలియ ఊష్మం | నాదం<br>కంఠ్య ఊష్మం |

3. స్పర్శోష్మాలు: స్పర్శ ప్రయత్నం, ఊష్మ ప్రయత్నం రెండూ కలసి ఉచ్చరించే ధ్వనులు ఇవి స్పర్శ ప్రయత్నంలో గాలిని వెలువరిస్తే ఏర్పడేవి. "స్పర్శోష్మధ్వనులు"

| చ | జ | చ | ఛ | జ | ఝ |
|---|---|---|---|---|---|
| శ్వాసం<br>అల్పప్రాణం<br>దంత్యం<br>స్పర్శోష్మం | నాదం<br>అల్పప్రాణం<br>దంత్యం<br>స్పర్శోష్మం | శ్వాసం<br>అల్పప్రాణం<br>తాలవ్యం<br>స్పర్శోష్మం | శ్వాసం<br>మహాప్రాణం<br>తాలవ్యం<br>స్పర్శోష్మం | నాదం<br>అల్పప్రాణం<br>తాలవ్యం<br>స్పర్శోష్మం | నాదం<br>మహాప్రాణం<br>తాలవ్యం<br>స్పర్శోష్మం |

4. అనునాసికాలు : స్పర్శ ప్రయత్నంలో లంబిక ముఖ కుహరాన్ని మూసి వేస్తే వాయు ప్రవాహం ముఖ కుహరం ద్వారా కాకుండా నాసికా కుహరం ద్వారా వెళ్ళటం వల్ల ఉత్పత్తి అయ్యే ధ్వనులు అనునాసికాలు ఙ, ఞ, ణ, న, మలకు బదులుగా నాగరలిపిలో ఆయా వర్గాక్షరాల ముందు "ం" వాడుతారు

| ఙ | ఞ | ణ | న | మ |
|---|---|---|---|---|
| నాదం<br>కంఠ్యం<br>అనునాసికం | నాదం<br>తాలవ్యం<br>అనునాసికం | నాదం<br>మూర్ధన్యం<br>అనునాసికం | నాదం<br>దంత్యం<br>అనునాసికం | నాదం<br>ఉభయోష్ఠ్యం<br>అనునాసికం |

5. కంపితాలు : కరణం (జిహ్వాగ్రం) అనేక సార్లు కంపించటం వల్ల ఏర్పడే ధ్వనులు కంపితాయి.

ఱ – దంత మూలీయం, కంపితం.

6. తాడితం: కరణం (జిహ్వాగ్రం) ఒక్కసారిగా వెనుక్కు వచ్చి పై నున్న స్థానాన్ని ఒక్కసారిగా తాకి క్రిందికి కొట్టినట్లు పడిపోవడం వల్ల ఏర్పడే ధ్వనులు తాడితాలు.

ర– దంతమూలీయం, తాడితం.

7. పార్శ్వికాలు :

కరణమైన నాలుకను పై స్థానానికి స్పర్శింప చేసి రెండు వైపులా లేదా ఒక్క వైపు ద్వారా గాలిని వెలువరించడం వల్ల ఏర్పడే ధ్వనులు పార్శ్వికాలు.

ల–నాదం దంతమూలీయం పార్శ్వికం

ళ–నాదం మూర్ధన్యం పార్శ్వికం

8. అంతస్థాలు:

ఊష్మధ్వనుల కంటే ఒరిపిడి లేకుండా స్థానానికి సంబంధించిన కండరాలకు బిగువు కలిగిస్తూ ఉచ్చరించే ధ్వనులు అంతస్థాలు. ఇవి కొన్ని చోట్ల అచ్చులుగాను, మరికొన్ని చోట్ల హల్లులుగాను వ్యవహరిస్తాయి.

వ–దంతోష్ఠ్యం అంతస్థం

య–తాలవ్యం అంతస్థం

హల్లుల వైవిధ్యం స్థాన కరణ ప్రయత్న భేదాలను బట్టి ఏర్పడుతుంది. స్పర్శాలతోను,

ఊష్మాలతోను సామాన్యంగా శ్వాసనాద భేదం కనిపిస్తుంది. స్పర్శహల్లులో మాత్రమే అల్పప్రాణ, మహాప్రాణ భేదం ఉంది. కంపితాలు, తాడితాలు, పార్శ్వికాలకు మహాప్రాణం ఉండదు. అనునాసికాలు, అంతస్థాలు సామాన్యంగా నాదధ్వనులై ఉంటాయి. భాషను బోధించే ఉపాధ్యాయుడు దీనిని గుర్తించాలి.

**అచ్చులు**

ఊపిరితిత్తుల నుంచి వచ్చే వాయు ప్రవాహానికి ముఖ కుహరంలో ఎలాంటి నిరోధాన్ని గాని, ఒరిపిడిగాని కలిగించకుండా ఉచ్చరించే ధ్వనులు అచ్చులు. అయితే నోటి ఆకారాన్ని మార్చటం వల్ల, పెదవుల స్థితి మార్చటం వల్ల నాలుకను పైకి కిందికి నిలపడం వల్ల వివిధ రకాల అచ్చులు పుడుతున్నాయి. స్థాన, కరణ, ప్రయత్న భేదాలు హల్లుల వర్గీకరణకు ముఖ్యమైతే అచ్చుల వర్గీకరణలో కింది అంశాలు ముఖ్యమైనవి.

1. పూర్వాచ్చు, మధ్యాచ్చు, పశ్చిమాచ్చు

జిహ్వాగ్రం కఠిన తాలువు వైపు తీస్తే పుట్టే అచ్చులు పూర్వాచ్చులు (తాలవ్యాచ్చులు) జిహ్వామధ్యం మూర్ధం వైపు లేస్తే పుట్టే అచ్చులు మధ్యామచ్చులు (మూర్ధన్యాచ్చులు) జిహ్వామూలం మృదు తాలువు వైపు లేస్తే పుట్టే అచ్చులు పశ్చిమాచ్చులు (కంఠ్యాచ్చులు)

2. వివృతం – అర్ధవివృతం – సంవృతం – అర్ధసంవృతం

ఉచ్చరించేటప్పుడు పెదవులు పరస్పరం చాలా దూరంగా ఉన్నప్పుడు పుట్టే అచ్చులు వివృతాచ్చులు. పెదవులు కొంచెం సన్నిహితంగా ఉన్నప్పుడు పుట్టే అచ్చులు అర్ధ వివృతాచ్చులు. పెదవులు అర్ధ వివృతాచ్చులు పెదవులు అర్ధ వివృత స్థితి కంటే మరింత దగ్గరగా వుంటే పుట్టే అచ్చులు అర్ధవివృతాచ్చులు.పెదవులు అర్ధవివృత స్థితి కంటే మరింత దగ్గరగా ఉంటే పుట్టే అచ్చులు అర్ధ సంవృతాచ్చులు. పెదవులు దాదాపు పూర్తిగా మూసుకొని ఉన్నప్పుడే పుట్టే అచ్చులు సంవృతాచ్చులు.

3. వర్తులితం – అవర్తులితం

పెదవులు గుండ్రంగా ఉన్నప్పుడు పుట్టే అచ్చులు వర్తులితాలు. వీటిని ఓష్ఠ్యాచ్చులని కూడా అంటారు. పెదవులు విడిగాఉన్నప్పుడు పుట్టేవి అవర్తులితాలు. వీటిని నిరోష్ఠ్యాచ్చులని అంటారు.

**అచ్చుల వర్గీకరణ**

| అ, ఆ | ఇ, ఈ, | ఉ, ఊ | ఎ, ఏ | ఒ, ఓ. |
|---|---|---|---|---|
| పశ్చిమాచ్చు<br>వివృతం<br>అవర్తులితం<br>(కంఠ్యం) | పూర్వాచ్చు<br>సంవృతం<br>అవర్తులితం<br>(తాలవ్యం) | పశ్చిమాచ్చు<br>సంవృత్తం<br>వర్తులితం<br>( ఓష్ఠ్యం) | పూర్వాచ్చు<br>అర్ధసంవృతం<br>అవర్తులితం<br>(కంఠతాలవ్యం) | పశ్చిమాచ్చు<br>అర్ధ సంవృతం<br>వర్తులితం<br>(కంఠోష్ఠ్యం) |

బర్రె లోని ఎ – పూర్వాచ్చు, అర్ధవివృతం, అవర్తులితం

ఐ, ఔలు (ఐ = అయ్. ఔ – అవ్) – సంయుక్తధ్వనులు

ఋ, ఋ ( ఋ= రు, = లు) హల్లులతో సమానం

అచ్చులన్నీ సామాన్యంగా నాదాలై ఉంటాయి. మామూలుగా ఉచ్చరించే కాలం కంటే ఎక్కువ కాలం ఒక అచ్చును ఉచ్చరిస్తే అది దీర్ఘాచ్చు అవుతుంది. మాతృభాషోపాధ్యాయుడు ధ్వనుల ఉత్పత్తి విధానాలు తెలుసుకొని వాటిని విద్యార్థులు తెలుసుకొనేలా చేసి ఉచ్చారణ దోషాలు తొలగించవచ్చు.

## 2.13. ధ్వనులు - ఉచ్చారణ - లోపాలు - కారణాలు - నివారణ

విద్యార్థులు వాచికచర్య సందర్భంలో సాధారణంగా చేసే దోషాలను స్థూలంగా మూడు విధాలుగా విభజింపవచ్చు.

1. భావ దోషాలు　　2. భాషా దోషాలు　　3. ఉచ్చారణ దోషాలు

1. భావ దోషాలు :- భావ దోషాలు విషయ పరిజ్ఞానానికి సంబంధించినవి. వీటికి సంబంధించిన కారణాలు రెండు. మొదటిది విద్యార్థికి తెలిసిన అంశమే తప్పుగా ఉండటం. రెండోది సభాకంపం లేదా ఇతర కారణాల వల్ల కలిగిన తొట్రుపాటు.

ఉపాధ్యాయుడు సరియైన విషయ జ్ఞానాన్ని విద్యార్థికి అందించడం ద్వారా మొదటి కారణం వల్ల కలిగినా భావదోషాన్ని అరికట్టవచ్చు. రెండో కారణం వల్ల కలిగిన భావదోషాన్ని ఉపాధ్యాయుడు విద్యార్థికి ధైర్యాన్ని, ప్రోత్సహాన్ని కలిగించటం ద్వారా తొలగించవచ్చు. సాధ్యమైనంతవరకు భావోద్రేకానికి లోనుగాకుండా నెమ్మదిగా మాట్లాడమని విద్యార్థులకు సూచించడం ద్వారా అలాంటి దోషాన్ని సవరించవచ్చు.

2. భాషా దోషాలు : విద్యార్థికున్న భాషాజ్ఞానం సరియైనది కాక పోవడం వల్ల జరిగే దోషాలివి. విద్యార్థి ఎవరిని అనుకరించి భాషను నేర్చుకున్నాడో వారి భాషా జ్ఞానం సరైనది కాక పోవడం, సరిగా భాషను అనుకరించలేక పోవడం, సభాకంపం వల్ల ఈ దోషాలు ఏర్పడవచ్చు. ఉపాధ్యాయుడు దోషాన్ని విద్యార్థికి తెలియజేసి దాని సరైన రూపాన్ని తెలియచెప్పాలి. భాషా ప్రయోగంలో వాక్యాలు, చిన్నవిగాను, సరళంగాను నిరాడంబరంగాను ఉండేట్లు చూసుకోమని సలహా ఇవ్వాలి. సభాకంపంగానీ, భావోద్రేకంగానీ కారణమైనప్పుడు భావ దోష నివారణ సందర్భంలో చేపట్టిన నివారణ చర్యల్ని పాటించడం.

3. ఉచ్చారణ దోషాలు :- ఇవి జాగ్రత్తగా సవరించవలసిన దోషాలు. వీటిని ప్రాథమిక దశలోనే సవరించాలి. లేనిచో అవి వర్ణక్రమ దోషాలకు దారి తీస్తాయి. ఈ ఉచ్చారణ దోషాలను ఐదు రకాలుగా చెప్పుకోవచ్చు.

1. వేగోచ్చారణ దోషం　　2. సమవేగ రాహిత్య దోషం
3. సమస్వర రాహిత్య దోషం　　4. ధారళంగా మాట్లాడలేని దోషం
5. ధ్వనులను తారుమారు చేయు దోషం

| విద్యార్థుల ఉచ్చారణను గమనించండి. లోపాలను గుర్తించండి. తప్పు ఒప్పుల పట్టికగా తయారు చేయండి. |
|---|

1. వేగోచ్చారణ దోషం : వినేవారు స్పష్టంగా అనుసరించలేనంత వేగంగా మాట్లాడడం వల్ల ఎదుటి వారు మనమేమి మాట్లాడుతున్నామో అర్థం చేసుకోలేరు. దీనికి భయంగానీ, సందేహంగానీ కారణాలై ఉంటాయి. విద్యార్థులలో ఆత్మ విశ్వాసాన్ని, ధైర్యాన్ని పెంపొందించడం వల్ల ఈ దోషాన్ని సవరించవచ్చు. ఉపాధ్యాయుడి ఉచ్చారణ ఆదర్శ ప్రాయంగా ఉండి దాన్ని విద్యార్థి అనుకరించి సవరించుకొనేట్లు చేయడం ద్వారా కూడా ఈ దోషాన్ని నివారించవచ్చు.

2. సమవేగరాహిత్య దోషం : కొందరు మాట్లాడేటప్పుడు నిదానంగా ఆరంభించినప్పటికీ పోనుపోను వేగం ఎక్కువచేసి చివరలో అస్పష్టంగా, అర్థరహితంగా మాట్లాడుతారు. సమవేగ రాహిత్యం అనేది ఈ వాగ్దోషానికి కారణం. వేగోచ్చారణదోషాన్ని సవరించినట్లే ఈ దోషాన్ని సవరించవచ్చు.

3. సమస్వరరాహిత్య దోషం : కొందరు మాట్లాడేటప్పుడు మొదట బాగా వినపడేటట్లు మొదలు

పెట్టినా చివరకుపోయే కొద్దీ స్వరాన్ని తగ్గించి వినపడకుండా మాట్లాడుతారు. సమస్వర రాహిత్యం అనే ఈ ఉచ్చారణ దోషాన్ని విద్యార్థిలో ధైర్యాన్ని, ఉత్సాహాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడం ద్వారా నివారించవచ్చు.

4. ధారళంగా మాట్లాడ లేని దోషం: కొందరు విద్యార్థులు ధారళంగా మాట్లాడలేక మధ్యమధ్యఏవో నిరర్థకమైన ధ్వనులనుపలకడంగానీ, చివరి పదాన్ని మళ్ళీ అందుకొని మాట్లాడంగానీ చేస్తుంటారు. భావాలు వెంటవెంట స్ఫురించక పోవడం స్ఫురించినా వాటికి తగిన మాటలు దొరకక పోవడంగానీ, సభాకంపంగానీ, ధారళంగా మాట్లాడ లేకపోవడం అనే ఈ దోషానికి కారణం కావచ్చు. విద్యార్థికి సేకరించుకొన్న అంశాన్ని సరైనక్రమంలో అమర్చుకొనేట్లు చేయడం భాషా జ్ఞానాన్ని పెంపొందించడం, సభాకంపానికి లోనుకాకుండా చూడటం అనేవి ఈ దోషానికి నివారణ మార్గాలు.

5. ధ్వనులను తారు మారు చేయు దోషం : పై నాలుగు విధాలైన ఉచ్చారణదోషాలకంటే ఎక్కువ శ్రద్ధతో సవరించ వలసింది ధ్వనులను తారుమారు చేయడం అనేదోషం. దీన్ని మళ్ళీ కింది విధంగా వర్గీకరించవచ్చు.

1. అచ్చులకు హల్లులు పలకడం
   - ఋణం – రుణం
   - ఎక్కడ – యెక్కడ
   - ఉలవలు – వులవలు
   - ఊరు – వూరు

2. హల్లులకు అచ్చులు పలకడం
   - వెంకన్న – ఎంకన్న
   - వీరయ్య – ఈరయ్య
   - వినాయక – ఇనాయక

4. మహా ప్రాణాలకు అల్ప ప్రాణాలు పలకడం
   - ఖచ్చితము – కచ్చితము
   - ఘనమైన – గనమైన
   - కంఠము – కంటము
   - భారతదేశము – బారతదేశము
   - ధర్మము – దర్మము

3. అనునాసిక దోషాలు
   - జ్ఞాపకం – గ్నాపకం
   - ఆనకట్ట – ఆణకట్ట
   - మునగ – ములగ
   - నాణ్యత – నాన్యత
   - గణపతి – గనపతి

5. అల్ప ప్రాణాలకు మహాప్రాణాలు
   - విద్య – విధ్య
   - విద్యార్థి – విధ్యార్థి
   - పద్యము – పధ్యము
   - కుటంబము – కుటుంభము

6. చ, శ, ష, స, లను తారుమారు చేసి ఉచ్చరించడం.
   - చూపు – సూపు
   - చదువు – సదువు
   - వేషం – వేసం
   - మనిషి – మనిసి
   - చంపు – సంపు
   - చక్కగా – సక్కగా
   - ఉష – ఉస
   - దేశం – దేసం

* అంతస్థాలలోని య,వ. అనే వర్ణాలు పదాదిలో వచ్చినప్పుడు వాటిని పలుకక పోవడం.

ఉదా యజ్ఞము – ఎగ్నము వెలుగు – ఎలుగు

* పదాదిన అచ్చులు పలుక వలసిన చోట య.వ.– లను అంతస్థాలను పలకడం.

ఎలుక – యలుక ఏమి – వేమి

* సంయుక్తాక్షరాలను ద్విత్వాక్షరాలుగా పలకడం.

ఉదా సంక్షేమం – సంచ్చేమం స్వామి – స్సామి

పర్యవేక్షణ – పరివ్వేక్షణ వైద్యశాల – వైదశ్యాల

పశ్చిమం – పచ్చిమం

| ఉచ్చారణ దోషాల నివారణకు కొన్ని కృత్యాలను రూపొందించండి తరగతి గదిలో వాటిని నిర్వహించండి. |
| --- |

* ళను సరిగా ఉచ్చరించలేక పోవడం

వేళ – వేల, పెళ్ళి – పెల్లి సరళ – సరల, మంజుల – మంజుళ, కల – కళ

పళని – పలని, కళ్ళు – కల్లు

* దంత్య తాలవ్యాలను తారుమారుగా ఉచ్చరించడం.

ఉదా చాప – చాప, చలి – చలి, జల్లెడ – జల్లెడ

* ఊష్మాక్షరాలను ఒక దానికి బదులు మరొకటి ఉచ్చరించడం.

ఉదా ఉష – ఉస, కషాయము – కసాయము

దేశము – దేసము వేషము – వేసము

* ఒత్తులు (మహాప్రాణాలను) తారు మారు చేయడం.

ఉదా బోధన – భోదన భేదం – బేధం

* వర్ణ మార్పిడి దోషాలు

మిగిలిన – మిలిగిన చాలా – చాన బద్ద – దబ్బ

విద్యార్థి ఉచ్చారణ దోషాలను చేస్తున్నాడని గుర్తించిన ఉపాధ్యాయుడు ఆ దోషాలను చేయడానికి గల కారణాలను తెలుసుకోవాలి. వాగింద్రియాల లోపం చేత ఉచ్చారణ దోషం కలుగవచ్చు. వాగింద్రియాలు ధృడంగా ఉండక పోవడం వల్ల కూడా ఉచ్చారణ దోషం కలుగవచ్చు.

ఉదా రాలేదు – లాలేదు, అడ్డం – అద్దం, కొట్టు – తొట్టు మొదలగునవి.

కొందరు విద్యార్థులకు ముక్కు లోపలి భాగంలో లోపంవల్ల మరికొందరు విద్యార్థులకు పై పెదవి లో సందు ఏర్పడటం వల్ల ఇంకను కొందరికి చెవి సరిగా పనిచేయక పోవడంవల్ల వర్ణాలుచ్చరించ డంలో దోషాలు ఏర్పడతూ ఉంటాయి. వాగింద్రియ (అవయవ) దోషాలు అంటారు. వాగింద్రి యాలు గట్టి పడిన తరువాత కొన్ని దోషాలు సవరింపబడుతాయి. అవయవ లోపాల వల్ల కలిగిన దోషాలను ఉపాధ్యాయుడు సవరించలేడు. కాబట్టి విద్యార్థుల తల్లిదండ్రులకు ఆ విషయాన్ని తెలి యజేసి వైద్య సహాయంతో ఆయా లోపాలను సవరించడానికి వీలవుతుందేమో ప్రయత్నించవలసినది గా సూచించాలి.

పరిసర ప్రభావ జనితాలైన దోషాలను ఉపాధ్యాయుడు మొదటగా నిర్ధారించుకోవాలి. విద్యార్థి తప్పుగా ఉచ్చరించిన వర్ణాన్ని ఉపాధ్యాయుడు స్పష్టంగా ఉచ్చరించి విద్యార్థికి వినిపించాలి. ముఖ యంత్ర భాగంలో ఆవర్ణం ఉత్పత్తి అయ్యే విధానాన్ని విద్యార్థి జాగ్రత్తగా గుర్తించేట్లు చేయాలి.

విద్యార్థిలో నిరాసక్తత చోటు చేసుకోకుండా చూడాలి. విద్యార్థికి ఉత్సాహాన్ని కల్పించి తిరిగి అదేవి . దంగా ఉచ్చరించడానికి ప్రోత్సహించాలి. కొన్ని సందర్భాలలో పదాన్ని విడిదీయించి పలికించాలి. విద్యార్థులకు కొన్ని ఉచ్చారణ, అభ్యాసాలను ఇవ్వాలి. విద్యార్థులు చేసే సాధారణ దోషాలకు సంబంధించిన పదాలను, వర్ణాలను ఒక అట్టపై వ్రాసి ఉంచి వాటిని తరచుగా విద్యార్థుల చేత చదివి ంచాలి. ఉచ్చరింప చేయాలి. ఇన్ని నివారణోపాయాలతో పాటు ఉపాధ్యాయుడు తన ఉచ్చారణను విద్యార్థులకు ఆదర్శప్రాయంగా ఉండేటట్లు జాగ్రత్త వహించాలి.

| జట్టులుగా చేరి వాగ్దోషాలకు కారణాలను చర్చించండి. నివారణ మార్గాలను సూచించండి నియోజనంగా సమర్పించండి. |
| --- |

## అధ్యాయం - 3

## భాషా నైపుణ్యాలు

3.1 పరిచయం

3.2 శ్రవణం

3.3 భాషణం

3.4 పఠనం

3.5 లేఖనం

3.1 పరిచయం :

మానవుడు సంఘజీవి. సాంఘిక జీవనంలో అతడు ఇతరుల అభిప్రాయాలు తెలుసుకోవడానికి, తన భావాలను ఇతరులకు తెలియజెప్పడానికి అతనికి సహకరించేది భాష. భాష ప్రాథమిక ప్రయోజనం భావ వినిమయం. భాషను సమగ్రంగా నేర్చుకొని,దైనందిన కార్యక్రమాలను సరిగానిర్వహించుకోగలిగినప్పుడే మానవుడు అర్థవంతమైన ఆహ్లాదకరమైన జీవితాన్ని పొందగలడు.

భావ గ్రహణం, భావ వ్యక్తీకరణం స్పష్టంగా జరగాలంటే భాషపై కొంత అధికారం అవసరం. ఆ అధికారాన్ని సంపాదించడానికి విద్యార్థికి భాషా నైపుణ్యాలను సాధించడానికి తర్ఫీదు చాలా అవసరం. భాషపై సమగ్రమైన అధికారాన్ని కలుగజేసేవి భాషా నైపుణ్యాలు.ఈ నైపుణ్యాలు నాలుగు అవి: 1) శ్రవణం 2) భాషణం 3) పఠనం 4) లేఖనం ఈ చతుర్విధ నైపుణ్యాలు భాషా సౌధానికి నాలుగు మూల స్తంభాల వంటివి. ఈ నైపుణ్యాలు చతుష్కం పరస్పర సంబంధం కలిగిఉంటాయి. ఈ నాలుగు కౌశలాల్లో ఏ ఒక్కటి సరిగా సాధించలేకపోయినా భాషాభ్యసనం సమగ్రతను పొందదు.

మాతృభాషాబోధనలో ఈలక్ష్యాలు ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత స్థాయిలవరకు ఉన్నప్పటికీ, ప్రాథమిక దశలోని విద్యార్థులకు ఇవే ముఖ్య లక్ష్యాలు అవుతాయి. ఈ లక్ష్యసాధన దిశగా మాతృభాష బోధన అభ్యసన కృత్యాలు రూపొందించబడుతాయి. శ్రవణం, భాషణం, పఠనం, లేఖనం అనే నాలుగు నైపుణ్యాలు ప్రాథమిక నైపుణ్యాలు. ఈ ప్రాథమిక భాషా నైపుణ్యాలన్నింటిని పిల్లలకు నేర్పడం ఒకేసారి ప్రారంభించకూడదు. ' Easy to difficult, simple to complex, known to unknown' అనే మనోవిజ్ఞానపరమైన శాస్త్రీయ విధానం ప్రకారం శ్రవణ, భాషణ, పఠన, లేఖన కౌశలాలను ఒక క్రమంగా నేర్పించడం ప్రారంభించాలి, అలా చేయడం వల్ల విద్యార్థులకు అభ్యసనం శ్రమ అనిపించదు.మాధ్యమిక ఉన్నత దశలలో లక్ష్యాలుగా నిర్ణయించుకొనే వినియోగ నైపుణ్యం, వ్యక్తీకరణ నైపుణ్యం, సృజనాత్మక నైపుణ్యం అనేవి మిశ్రమ నైపుణ్యాలే. వినియోగ నైపుణ్యం భాషణకు, లేఖనానికి రెండింటికి సంబంధించినది. అట్లే వ్యక్తీకరణ నైపుణ్యం కూడా భాషణ రూపంలోను, లేఖన రూపంలోను ఉండే మిశ్రమ నైపుణ్యం. సృజనాత్మక నైపుణ్యంలో లేఖన నైపుణ్యమే ఎక్కువ. భాషణ నైపుణ్యం, ఉత్తమ రచనల పఠన నైపుణ్యం కూడా కొంత కలిగి ఉంటుంది. కాబట్టి ఇది కూడా మిశ్రమ నైపుణ్యమే.కనుక ప్రాథమిక భాషా నైపుణ్యాలలో పిల్లలకు మొదట సమగ్రమైన తర్ఫీదు ఇవ్వడం, ప్రాథమిక దశలో అత్యంత అవసరం.

## 3.2 శ్రవణం

శ్రవణేంద్రియాలద్వారా జరిగే భాషాప్రక్రియను శ్రవణం అంటారు. దీనినే వినడం లేదావినుట అని అనవచ్చు.మానవుడు దినసరి పలురకాలైన ధ్వనుల్ని,మాటల్ని,పాటల్ని,వృత్తాంతాలను వ్యక్తుల నుండి వింటున్నాడు. అట్లే రేడియో,టేప్‌రికార్డర్,టెలివిజన్ మొదలగు ప్రసార సాధనాల ద్వారా

కూడా పలు అంశాలను విని ఆ భావాలను గ్రహిస్తున్నాడు. భాష అనుకరణ వలన నేర్చుకోవడం శైశవదశలో ప్రధానంగా కనిపిస్తుంది. ఇతరుల మాటలలోని ఆయా ధ్వనులను పదాలను చాలా శ్రద్ధగా అవధానంతో వినడం జరుగుతుంది. ఎదుటి వారి భాషను ఎంత జాగ్రత్తగా వింటే అనుకరణ అంత సులభ సాధ్యమవుతుంది. మంచి ఉచ్చారణ గల పరిసరాలలో పెరిగిన పిల్లల భాషణం నిర్దుష్టంగా ఉండడానికి కారణం చక్కగా వినడమే. దీనిని బట్టి ఏ భాషా విషయంలోనైనా మొట్ట మొదట జరిగే భాషా ప్రక్రియ శ్రవణం అని తెలుస్తుంది. ఈ నైపుణ్యాన్ని ప్రధాన నైపుణ్యంగా గుర్తించాలి. కారణం శ్రవణ నైపుణ్య ఉద్దేశ్యం భావ గ్రహణం మాత్రమే గాకుండా భాషణలో స్పష్టత, నిర్దుష్టతను అలవరచి సరియైన భాషణానికి, నిర్దుష్టమైన భాషణం స్పష్టమైన పఠనానికి, సరియైన పఠనం నిర్దుష్టమైన లేఖనానికి దోహదం చేస్తుంది. శ్రవణ నైపుణ్యం మీదనే ఇతర నైపుణ్యాలు ఆధారపడి ఉన్నాయన్నది స్పష్టంగా అవగతం అవుతుంది. ఉత్తమ శ్రవణ శక్తి గల వారే గొప్ప . బాషావేత్త కాగలరని చెప్పవచ్చును.

స్పష్టీకరణలు :

ఇతరులు మాట్లాడుతున్నపుడు జాగ్రత్తగా వివిధ రకాలైన ధ్వనులను గుర్తించాలి. స్వర భేదాన్ని బట్టి ఊనికను బట్టి భావాన్ని గ్రహించాలి, ఊహించాలి. వివిధ ధ్వనులనుఉచ్చరించేటప్పుడు వాటి ఉత్పత్తి విధానాన్ని గమనించాలి. నాన్చి నాన్చి సాగదీసి గాని అధిక వేగంతో కాని ఇతరులు మాట్లాడు తున్నప్పుడు చాలా అవధానంతో భావాన్ని గ్రహించగలగాలి. ఇవి శ్రవణ నైపుణ్య లక్ష్యానికి ప్రధాన స్పష్టీకరణలు.

శ్రవణ నైపుణ్య ప్రాముఖ్యం :

శిశువు పాఠశాలలో ప్రవేశించక మునుపే కొంతవరకు, మాతృభాషలో శ్రవణ నైపుణ్యాన్ని కలిగి ఉంటుంది. శిశువు పుట్టుక నుండి మిగిలిన ఇంద్రియాలతో పాటు, చెవులు కూడా వాటి పనులను నిర్వహించడం ప్రారంభిస్తాయి. అవి బాహ్యధ్వనులను వినగలుగుతాయి. తన అవసరాలను బట్టి ఆకలి, బాధ మొదలైనవి కలిగినపుడు ఏడుపు లాంటి ధ్వనులు పలుకుతుంది. మూడు, మాసాల వయస్సు వచ్చే సరికి ఏడ్వడం మాత్రమే కాకుండా మిగిలిన సమయాలలో కూడా ఆ, ఊ మొదలైన ధ్వనులను, మరికొన్ని నెలలకు క, త, ప, మ, ల వంటి ధ్వనులను శిశువు పలకడానికి నేర్చుకొంటుంది. అత్త, అక్క మొదలైన పదాలను పలకడానికి నేర్చుకొంటుంది. తల్లిదండ్రులు కూడా ఆయా పదాలను మాటిమాటికి ఉచ్చరించడం వల్ల శిశువు వాటిని విని అనుకరిస్తుంది. ఐదేండ్లు నిండి శిశువు పాఠశాలలో ప్రవేశించేనాటికి శ్రవణ నైపుణ్యం కొంత వరకు కలిగిఉన్నప్పటికి, ఆ నైపుణ్యాన్ని పెంపొందించటంలో భాషా బోధకుడు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవలసి ఉంటుంది. శిశువు భాషణ స్పష్టంగా ఉండడమన్నది ఆ శిశువు యొక్క సామాజిక భాషా వాతావరణంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి మాతృభాషోపాధ్యాయుడు విభిన్నమైన భాషా పరిసరాల నుంచి వచ్చినపిల్లలకు మార్గదర్శకతను వహించాలి. ఉపాధ్యాయుడు స్పష్టమైనఉచ్చారణను, సరియైన భాషను విద్యార్థులకు వినిపించాలి. విద్యార్థులు ఉపాధ్యాయుని విని అనుకరించి, తమ శ్రవణ నైపుణ్యాన్ని అభివృద్ధి పరచుకొని తద్వారా మంచి భాషను నేర్చుకొంటారు. కాబట్టి విద్యా సముపార్జనలో, పటిష్ఠమైన శ్రవణ నైపుణ్యానికి ప్రాముఖ్యం ఎంతైనా ఉంటుంది.

శ్రవణం – ఉద్దేశ్యాలు :

ఎ) ఇతరులను అవధానంతో విని విషయాన్ని గ్రహించేటట్లు చేయడం.

బి) శిశువులలో అనుకరణ స్వభావాన్ని పెంపొందించడం ధ్వనులను, అక్షరాలను, పదాలను, వాక్యాలను జాగ్రత్తగా వినేటట్లు చేయడం.

సి) ఇతరులు మాట్లాడేటప్పుడు రకరకాలైన ధ్వనుల్ని గుర్తించేటట్లు చేయడం.

డి) వివిధ ధ్వనుల్ని ఉచ్చరించేటప్పుడు వాటి ఉత్పత్తి విధానాన్ని గమనించేటట్లు చేయడం.

ఎఫ్) ఊనికను (Stress), స్వరభేదాన్ని (Accent), బట్టి భావాన్ని గుర్తించేటట్లు చేయడం.

జి) తనకు ముందే పరిచయమున్న ధ్వనులను గుర్తించి, అవి ఏ భాషా ధ్వనులో నిర్ణయించుకొనేటట్లు చేయడం.

హెచ్) అర్థవంతమైన, అర్థంకాని ధ్వనుల మధ్య భేదాన్ని గుర్తించేటట్లు చేయడం. రణగొణ ధ్వనుల మధ్య కూడాఅవసరమైన ధ్వనులను విని గుర్తించేటట్లు చేయడం.

ఐ) చాలా చిన్న, చాలా పెద్ద ధ్వనుల్ని కూడా అవధానంతో విని గ్రహించడం.

శ్రవణ ప్రయోజనాలు :

- ✓ విశేషమైన జ్ఞానాన్ని వినడం వల్లనే వ్యక్తి పొందగలడు.
- ✓ చక్కని శ్రవణం వలన స్పష్టమైన భాషణం, పఠనం, లేఖనం పెంపొందించుకోవచ్చు.
- ✓ వినడం వలన అవధానం పెరుగుతుంది.
- ✓ అనుకరణ స్వభావాన్ని పెంపొందించుకోవచ్చు.
- ✓ అభ్యాసం వల్ల శ్రవణేంద్రియ సామర్థ్యం అభివృద్ధి చెందుతుంది.

శ్రవణ లోపాలకు కారణాలు, నివారణలు :

జ్ఞానేంద్రియ లోపం వినడానికి ఉపయోగపడేవి చెవులు. ఈ చెవుల్లోని భాగాల్లో లోపాలు ఉంటే వినికిడి శక్తి తగ్గవచ్చు లేదా పూర్తిగా వినబడకపోవచ్చు. చక్షురింద్రియం కంటే శ్రవణేంద్రియం ద్వారా అధిక జ్ఞానార్జన చేయవచ్చు. పుట్టుక నుండి చూపు లేని వారు కూడా కవులుగా రాణించడానికి వారి శ్రవణేంద్రియ జ్ఞానమే కారణం. కర్ణభేరి చెవి లోని ఒక పలుచని పొర. అది పగిలిపోతే శబ్దాలు వినిపించవు. పిల్లలు పెన్సిలు, పుల్లలు ప్రక్క పిన్నులు మొదలగు వాటితో చెవులుగుచ్చుకోవడం ద్వారా కర్ణభేరికి ప్రమాదం కలుగవచ్చును. కాబట్టి విద్యార్థులకు చెవులను శుభ్రపరచు కోవడానికి తోచిన వాటిని ఉపయోగించకూడదని సూచనలు ఇవ్వాలి.

1) శ్రవణేంద్రియ లోపం ఉన్న శిశువులకు వైద్యసహాయం అందించాలి.

2) మాట్లాడే వారి కంఠస్వరం తక్కువ స్థాయిలో ఉండడం.

3) ఎదుటి వ్యక్తి కంఠధ్వని తగ్గస్థాయిలో ఉన్నప్పుడు లేదా మరీ దూరంగా ఉన్నప్పుడు కూడా శ్రవణం సరిగ్గా సిద్ధించదు.

4) (విషయ కాఠిన్యం) పిల్లల స్థాయికి మించిన విషయాల పట్ల ఆసక్తి లోపిస్తుంది. అందువల్ల కూడా పిల్లలు సరిగా వినలేరు. కాబట్టి విద్యార్థులకు అర్థవంతమైన, ఆసక్తికరమైన అంశాలను వినిపించాలి.

5) ఏకాగ్రతలేని విద్యార్థులు చెబుతున్న విషయంపై ఎక్కువసేపు అవధానాన్నిఉంచలేరు. కాబట్టి ఉపాధ్యాయుడు వారు చెబుతున్న విషయాన్ని మధ్య మధ్యలో ఆపి ప్రశ్నించాలి.

6) ఆసక్తి లేని ఉపాధ్యాయుని బోధనను వినడానికి కొందరు విద్యార్థులు శ్రద్ధ వహించరు. ఆ కారణంగా వారు సరిగా వినరు. తత్ఫలితంగా భావగ్రహణం జరుగదు. కాబట్టి ఉపాధ్యాయుడు ఆసక్తిని కలిగించేటట్లుగాబోధన పద్ధతులను, బోధనోపకరణాలను ఉపయోగించాలి.

వివిధదశలలో శ్రవణశక్తిని అభివృద్ధిపరచడం :

వివిధ దశలలోని విద్యార్థుల శ్రవణ నైపుణ్యాన్ని పెంపొందించడానికి వారి భాషాస్థాయి, భావ స్థాయి, శారీరక స్థాయి, మానసిక స్థాయిని అనుసరించి వివిధ కార్యక్రమాలను రూపొందించాలి.

ప్రాథమిక స్థాయి :

బడిలో ప్రవేశించిన పిల్లలు అప్పటికే తమ గృహ వాతావరణంలో, పరిసర వాతావరణంలో శ్రవణ నైపుణ్యం మాతృభాషలో పరోక్షంగా గడించి ఉంటారు. అయినప్పటికి బడిలో శ్రవణ నైపుణ్యాన్ని పెంపొందించడానికి తగు కృత్యాలను ఉపాధ్యాయుడు చేపట్టాలి. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఆటలు, పాటలు, చిన్నచిన్నకథలు, చాలా ఇష్టం. వారికి బాలగేయాలు పరమానందయ్య శిష్యుల కథలు, తెనాలి రామలింగని కథలు, ఆలీబాబా 40 దొంగల కథలు, అల్లావుద్దీన్ అద్భుత దీపం కథలు, పంచతంత్రం, ఈసఫ్ మొదలైన నీతిదాయకమైన కథలు వినిపించాలి. పద క్రీడలను రూపొందించి వారి శ్రవణ నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాలి. శబ్దమాధుర్యమున్న శైశవగేయాల్ని అభినయిస్తూ నేర్పే గేయాల్ని పిల్లలకు వినిపించాలి.

> వివిధ స్థాయిల్లో అర్థవంతమైన ఉచ్చారణ భేదాలనువిద్యార్థులు గుర్తించేటట్లు రెండు క్యాసెట్లను తయారుచేసి వినిపించండి

మాధ్యమిక దశ :

ఈ దశలో విద్యార్థులకు సరళమైన మంచి పద్యాలను అధ్యాపకుడు అర్థవంతంగా, లయబద్ధంగా శ్రావ్యంగా వినిపించాలి. ఇందుకుగాను వేమన, సుమతి శతక పద్యాలు, కరుణ అద్భుత భక్తి రసాలతో కూడిన రసవత్తరమైన ఘట్టాల నుండి పద్యాలను, పాటలను, దేశభక్తి గీతాలను ఉపాధ్యాయుడు శ్రావ్యంగా పాడి వినిపించాలి. అట్లే రేడియో, టేప్‌రికార్డరు వంటి సాధనాల ద్వారా విద్యార్థులకు తగిన పద్యాలు, పాటలు, కథలు, వార్తలు, ప్రసంగాలు వినిపించాలి. ఆపై వాటిని గూర్చి ప్రశ్నించాలి. ఇవిగాక శ్రవణనైపుణ్యాన్ని పెంపొందించడానికి పదక్రీడలు, పద్యపఠన పోటీలు నిర్వహించాలి.

ఉన్నత దశ :

పైన పేర్కొన్న రెండు దశల విద్యార్థులకు పాఠ్య గ్రంథాల్లోని నీతి పద్యాలను, భర్తృహరి వంటి శతక పద్యాలను, ప్రధాన గ్రంథాలలోని రసవత్తరమైన పద్యాలను ఉపాధ్యాయుడు ఆలపించి వినిపించవచ్చు. టేప్‌రిక్డార్ ద్వారా కూడా వినిపించవచ్చు.

తరగతి గదిలో ఉపాధ్యాయుడు అనుసరించవలసిన అంశాలు :

✧ శ్రవణ లోపం గల విద్యార్థులను గుర్తించి వైద్య సహాయం అందించడం అటువంటి వారి పట్ల సానుభూతితో వ్యవహరించడం. తోటి విద్యార్థులు హేళన చేయకుండా చూడడం.

- ధ్వనులను స్పష్టంగాఉచ్చరించడం.
- సులభమైన ధ్వనుల నుండి కఠినమైన ధ్వనుల వరకు పరిచయం చేయడం.
- సంయుక్తాక్షరాలను, ద్విత్వాక్షరాలను తరచుగా ఉచ్చరించడానికి అభ్యాసం చేయించడం.
- విద్యార్థుల అవధానాన్ని పరీక్షించడానికి మధ్య మధ్య ప్రశ్నించడం.

ఈ విధంగా శ్రవణశక్తి విద్యార్థులకు సహజ శక్తి అయినప్పటికి, దానిని అభివృద్ధి పరచడానికి లోపసవరణ చేసి పలుకృత్యాల ద్వారా శ్రవణ నైపుణ్యాన్ని అభివృద్ధి చేయవలసిన బాధ్యత భాషోపాధ్యాయునిదే.

# 3.3 భాషణం

పరిచయం :

నిత్యజీవితంలో మాటలరూపంలో భావ ప్రకటనకు జీవనవ్యాపారాలు నిర్వహించడానికి మనకు . బాషణం చాలా అవసరం. దీనినే వాచిక చర్య అని కూడా అంటారు. వచ్ అనే సంస్కృత ధాతువు నుంచి వచనం,వాక్కు,వాచకం అనే పదాలు ఏర్పడ్డాయి.సాంఘిక జీవితంలో జీవన వ్యవహారాల్లో విద్య, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో వ్యక్తి రాణించాలంటే భాషణనైపుణ్యం చాలా అవసరం. ఎంతటి సమస్యాపూరి తమైన కార్యాన్నైనా సులభంగా సాధించడానికి వాక్సామర్థ్యం ఆవశ్యకం అవసరం. సాధారణంగా ఈ సామర్థ్యం ప్రతి వ్యక్తికి ఉంటుంది. లేనివారు ఇతరుల ముందు మాట్లాడడానికి జంకుతారు.కొందరు ఉన్నత స్థాయి విద్య కలవారు కూడా నలుగురి మధ్యలో గాని,సభలోగాని చక్కగా మాట్లాడలేకపోవడం గమనించవచ్చు. అవిద్యావంతులైన వారు కూడా వ్యాపార రంగంలో గాని రాజకీయాలలో గాని రాణించడానికి వారి భాషణ సామర్థ్యమే కారణం. కాబట్టి ప్రాథమిక దశ నుండి విద్యార్థుల భాషా నైపుణ్యాన్ని అభివృద్ధిపరచడానికి భాషోపాధ్యాయుడు మిక్కిలి కృషి చేయవలసిఉంది.

లక్ష్యాలు : ఈ విభాగాన్ని అధ్యయనం చేయడం వల్ల ఛాత్రోపాధ్యాయుడు క్రింది విషయాలను వివరించగలడు.

- భాషణం అంటే ఏమిటి ?
- మానవుని జీవితంలో భాషణ ప్రాముఖ్యం.
- విద్యార్థుల భాషణాభివృద్ధికి ఉపాధ్యాయుని కృత్యాలు,వాగింద్రియాల నిర్మాణం,వాగుత్పత్తి స్థానాలు
- వర్ణమాలలోని వర్ణాల వర్గీకరణ.
- దోషనివారణకు చర్యలు

మన అభిప్రాయాలను ఇతరులకు మాటల రూపంలో వ్యక్తీకరించడాన్ని భాషణం అంటారు. మాట్లాడేటప్పుడు భావానికి అనుగుణమైన స్వరభేదం పాటించడాన్ని వాచికాభినయం అంటారు. ముఖభంగిమలతో కరచరణాది అంగాల సహాయంతో అభినయించడాన్ని ఆంగికాభినయం అంటారు. భాషణ సందర్భంలో ఈ రెండు రకాల అభినయాలను గుర్తించవచ్చు.

శిశువు భాషా ధ్వనులను విని అనుకరించడం ద్వారా భాషణాన్ని ప్రారంభిస్తుంది. ఈ అనుకరణ సామర్థ్యంలో కూడా వ్యక్తిగతభేదాలు ఉంటాయి.అనుకరణద్వారానే ఇతరుల మాటలను, పాటలను ఆంగిక చలనాలను అనుకరించడం జరుగుతుంది. శిశువు ఇంటి వద్ద పరిసరాలలో మాట్లాడబడే భాషను విని, అనుకరించి ఉచ్చారణను నేర్చుకొంటుంది. కొందరు భాషోచ్చారణ వంశపారంపర్య లక్షణంగా భావిస్తారు. ఇది అశాస్త్రీయమైన భావన. శిశువు ఏ భాషా వాతావరణంలో పెరిగితే అలాంటి భాషనే నేర్చుకొంటాడు.

వివిధసాంఘిక పరిసరాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థుల భాషణం స్వచ్ఛంగా ఉంటుందనుకోవడానికి వీలు లేదు. కాబట్టి భాషోపాధ్యాయుడు నిర్దుష్టమైన, స్పష్టమైన భాషణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి విద్యార్థులకు ప్రాథమిక దశ నుండి తగిన తర్ఫీదు ఇవ్వాలి. తద్వారా వారి భాషణ సామర్థ్యం పెంపొందించుకోవచ్చు.

**భాషణ – ఉద్దేశ్యాలు – ప్రయోజనాలు :**

- ☆ స్పష్టమైన, నిర్దుష్టమైన ఉచ్చారణను కలిగించడం.
- ☆ స్వచ్ఛమైన భాషను, సహజంగా మాట్లాడే సామర్థ్యాన్ని కలిగించడం.

☆ ధారాళంగా, దోషరహితంగా మాట్లాడేటట్లు చేయడం.

☆ తగిన వేగంతో, సమతతో, భావాను క్రమంతో మాట్లాడే నేర్పును కలిగించడం.

☆ సమయస్ఫూర్తిగా, సందర్భోచితంగా మాట్లాడే పద్ధతిని అలవరచుకొనేటట్లు చేయడం.

☆ సభాకంపం లేకుండా మాట్లాడేశక్తిని కలిగించడం.

☆ భావానుగుణమైన వాచికాభినయంతో, ఆంగికాభినయంతో మాట్లాడడానికి శిక్షణ ఇవ్వడం.

☆ జాతీయాలు, సామెతలు, సూక్తులు ఉపయోగించి మాట్లాడేటట్లు చేయడం.

☆ సముచితమైన భాషను ఉపయోగించి, భావానుగుణమైన పద్ధతిలో ఆలంకారికంగా మాట్లాడే సామర్థ్యాన్ని కలిగించడం.

☆ ఆకరణీయమైన తనదైన శైలిని అలవరచుకొని ఆమోదయోగ్యమైన రీతిలో భాషించేటట్లు చేయడం జరగాలి

☆ వ్యక్తిని గొప్ప వ్యక్తిగా తీర్చిదిద్దడం.

పైన పేర్కొన్న భాషణోద్దేశ్యాలు నెరవేరినప్పుడే అవి భాషణ ప్రయోజనాలుగా మారుతాయి. విద్యార్థి సమర్థవంతమైన, స్పష్టమైన, నిర్దుష్టమైన, భావానుగుణమైన, ఆకరణీయమైన, ఆమోదయోగ్యమైన, భాషణ నైపుణ్యాన్ని అలవరచుకొని గొప్ప వ్యక్తిగా పరిణమించగలడు.

**ఉత్తమభాషణం లక్షణాలు ( వివిధ దశల్లో)**

**ప్రాథమిక దశ :**

1. స్పష్టంగా మాట్లాడడం.
2. దోషాలులేకుండా మాట్లాడడం.
   ఎ) ధ్వనిదోషాలు లేకుండా మాట్లాడడం.
   బి) భాషాదోషాలు లేకుండా మాట్లాడడం.
   సి) విషయదోషాలు లేకుండా మాట్లాడడం.
3. సభాకంపంలేకుండా ధైర్యంగామాట్లాడడం.
4. తగినవేగంతో ధారాళంగామాట్లాడడం.

చక్కటి కథలను పదింటిని ఎంపికచేయండి. తరగతిలో విద్యార్థులకు వినిపించండి. తర్వాత ఒక్కొక్కరిచే కథను సొంత మాటల్లో చెప్పించండి. వాటిని పట్టిక పరచండి.

**మాధ్యమిక దశ :**

1. భావాలను క్రమపరచి మాట్లాడడం.
2. సమతతో మాట్లాడడం.
3. భావానుగుణమైన ఊనిక, స్వరభేదం పాటిస్తూ మాట్లాడడం.
4. సందర్భానుసారంగా ఔచిత్యంతెలిసి మాట్లాడడం.

**ఉన్నత దశ :**

1. భావానికితగిన భాషనుఎన్నుకోవడం.
2. భావానుగుణమైన వాచికాభినయంతో పాటు ఆంగికాభినయంచేస్తూ మాట్లాడడం.
3. అవసరమైన సందర్భాల్లో జాతీయాలను, సామెతలను, లోకోక్తులను ఉపయోగించి మాట్లాడడం
4. ఆలంకారికంగా (ఉపమ, అతిశయోక్తి మొదలైనవి) మాట్లాడడం.
5. ఆకరణీయమైన సొంతశైలిలో మాట్లాడడం.

ఉదా  చికాగో నగరంలో వివేకానందుని ప్రసంగానికి శ్రోతలు మంత్ర ముగ్ధులయ్యారు. కొందరు చేదైనఅంశాలను కూడా నాజూకుగా మాట్లాడి ఎదుటివారిని ఆకట్టుకోగలరు. అందుకు ఉదా  రాయబారసందర్భంలో సంజయుని వాక్చాతుర్యాన్ని ధర్మరాజు మెచ్చుకోవడం.

6. చెప్పదలచినభావం వినేవారికి అర్థమయ్యేటట్లు మాట్లాడడం.

**విద్యార్థుల భాషానైపుణ్యాన్ని పెంపొందించే కృత్యాలు :**

ప్రాథమిక దశ :

1.ఈ దశలోని పిల్లల భాషణాభివృద్ధికి ఉపాధ్యాయుడు బాలగేయాలు, అభినయగీతాలు పాడించాలి. చిన్న చిన్న సంభాషణలు, కథలుచెప్పించి పద్యాలనుకంఠస్థంచేయించాలి.

2. పరిచయమున్న వస్తువులు, జంతువులు, పక్షులు, ఆటలు మొదలయిన వాటిని గురించి వారిచే చెప్పించాలి.

3. వారికిఅనుభవంలో ఉన్న అంశాలగురించి తెలిసినవాటినిగురించి వర్ణింపజేయడం.

4. చిన్నచిన్ననాటికలను వారిచేత ప్రదర్శింపజేయడం.

మొదలైన క్రియల్ని చేపట్టాలి.

**సంభాషణలు**

పిల్లలు బడిలోప్రవేశించగానే అక్షరాలనుదిద్దించే ఆచారం ప్రాచీనమైనది.ఈ పద్ధతి అర్థరహితం, అసహజం మరియు అశాస్త్రీయం. ఆధునిక అధ్యాపనశాస్త్ర బోధనపద్ధతిని అనుసరించి భాషాబోధన వాచిక చర్యతో ప్రారంభం కావాలి. కాబట్టి ప్రాథమిక దశలోని పిల్లలకు, భాషా బోధనలో సంభాషణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. పిల్లలు ఇతరులతో మాట్లాడటానికి సిగ్గు, సంకోచం, భీతి కలిగియుంటారు. కాబట్టి ఉపాధ్యాయుడు స్నేహపూర్వకంగా, ఆప్యాయంగా వారితో ఉండాలి. అటువంటి వైఖరి కలిగి ఉండడంతోపాటు మృదుస్వరంతో పిల్లలనుబుజ్జగించి మాట్లాడడాన్ని ప్రోత్సహించాలి.పిల్లలుతనకు సన్నిహితంగా, ఆత్మీయంగా, ప్రేమగావున్న ఉపాధ్యాయులతో, తోటిపిల్లలతో మాట్లాడడానికి ఆసక్తి చూపిస్తారు.

పిల్లలుకు పరిచయమున్న,ఆసక్తికరమైన, అభిరుచికిఅనుగుణమైన, అర్థవంతమైన అంశాలను, ఇంటి పరిసరాల్లో పాఠశాలలో నిత్యంవారుచూసేఅంశాలను సంభాషణకు ప్రాతిపదికగాతీసుకోవడం సముచితంగా ఉంటుంది. ఉదా పెంపుడు జంతువులు : కుక్క, పిల్లి, ఆవు, మేక మొదలగునవి.

- ❖ మిఠాయిలు, పండ్లు మొదలగు తినుబండారాలు.
- ❖ ధాన్యాలు, కూరగాయలు, పాలు మొదలగు ఆహార పదార్థాలు.
- ❖ దీపావళి, రంజాన్, క్రిస్‌మస్ మొదలగు పండుగలు.
- ❖ చేతిబంతి, కబాడి మొదలగు క్రీడలు.

❖ ఉపాధ్యాయుడు విద్యార్థితో సంభాషణలు కొనసాగించవచ్చు. అదేవిధంగా విద్యార్థి తోటి విద్యార్థులతో కూడా సంభాషణ సాగించవచ్చు. ఇందువలన అనేక ప్రయోజనాలున్నాయి.క్రొత్తశబ్దాల పరిచయం, ఉచ్చారణ నైపుణ్యం, భావవ్యక్తీకరణ కౌశలం ఏర్పడుతుంది.సిగ్గు,సంకోచం,భయం తొలగి స్వేచ్ఛగా, ధారాళంగా సహజంగా మాట్లాడడం అలవాటు పడుతుంది.ఉపాధ్యాయుడు విద్యార్థులతో మాట్లాడడంవల్ల కుటుంబం పరిసరాలప్రభావం పిల్లలపై ఎంతఉందో తెలుస్తుంది. వారి మనః ప్రవృత్తులను తెలుసుకోవడానికి వీలుకలుగుతుంది. పిల్లల భాషణ సంబంధమైన దోషాలను గుర్తించడానికి, వాటిని సవరించడానికి, వీలు కలిగే విధంగా ఉపాధ్యాయుడు మొదటి నాలుగైదు మాసాలు ఇందుకుగాను కేటాయించాలి.

**బాలగేయాలు :**

వీటినే శిశుగీతాలు అని అంటారు.బాలగేయాలను పిల్లలకు వినిపించడంవలన శ్రవణనైపుణ్యంఅభివృద్ధి చెందడంతో పాటు వాటిని పాడించడంవల్ల భాషణాభివృద్ధికి, ఉచ్చారణపెంపుదలకు కృషి

చేయవచ్చు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులతో సంభాషణప్రక్రియ కొనసాగిస్తూనే సమాంతరంగాబాలగేయాలనుకూడా వారిచేతపాడించవచ్చు.

**బాలగేయాల లక్షణాలు :**

1. శిశుగీతాల్లోని అంశాలు విద్యార్థులకు ఆసక్తి కలిగించేవిగా ఉండాలి.
2. లయబద్ధంగా ఉండాలి.
3. చిన్నచిన్న వాక్యాలలో ఉండాలి.
4. భాష సరళగ్రాంథికంగాని, వ్యావహారికంగాని ఉండాలి.
5. యతి, ప్రాసలు మొదలైనవి ఉండాలి.
6. భావ ప్రధానమైన గేయాలు పిల్లల స్థాయికి తగినట్లుగా ఉండాలి.
7. భావప్రధానంకాకున్నా శబ్ద ప్రధానమైనవి కావచ్చు.

ఉదాహరణ : 1) కాళ్ళ గజ్జి కంకాళమ్మా
వేగు చుక్కా వెలగ మొగ్గా
మొగ్గా కాదు మోదుగ చెట్టు
చెట్టూ కాదు చేమంతి పువ్వు.........

2) చెమ్మా చెక్కా చారడేసి మొగ్గ
అట్లు పోయంగా ఆరగించంగా
ముత్యాల చెమ్మ చెక్క ముగ్గు లేయంగా
రత్నాల చెమ్మ చెక్క రంగు లేయంగా
సుబ్బరాయని పెండ్లి
చూచి వద్దాం రండి !
మన ఇంట్లో పెండ్లి
మళ్లీ వద్దాం రండి !

ఉపాధ్యాయుడు అనేక శిశుగీతాలను సేకరించి తరగతిగదిలో లయబద్ధంగా, స్పష్టంగా, నిర్దుష్టంగా పాడి వినిపించాలి. విద్యార్థులచేత కూడా వాటిని చక్కగాపాడించాలి. అందువల్ల పిల్లలు వాటినిఅప్రయత్నంగా నేర్చుకొంటారు. సంకోచం లేకుండా వాటిని పిల్లలు పాడుతారు. శిశు గీతాలను ఉపాధ్యాయుడు ఎన్నుకోవడంలో శబ్దప్రాధాన్యంగలవి, భావప్రాధాన్యం గలవి, ఉభయప్రాధాన్యం గలవి గుర్తించి వర్గీకరించుకోవాలి. వాటిని పిల్లల స్థాయికితగినట్లుగా నేర్పడంలో క్రమాన్ని పాటించాలి.

**అభినయ గేయాలు :**

వాచికాభినయంతో పాటు ఆంగికాభినయంచేస్తూ పాడేపాటల్ని అభినయగీతాలంటారు. ఇవి కూడా బాల గేయాలే. భావ ప్రధానమైన గేయాలను అభినయిస్తూ పాడడంవల్ల విద్యార్థుల్లో సహజత్వం ఏర్పడుతుంది. సిగ్గు బిడియం, న్యూనతాభావం తొలగిపోతాయి. అభినయగేయాలు కేవలం శబ్దప్రధానంగా ఉండి భావంలేనపుడు అభినయించడానికి అవకాశం ఉండదు. కాబట్టి అభినయగేయాలు భావప్రధానంగా కూడాఉండాలి.

ఉదాహరణ : వానా వానా వల్లప్ప
చేతులు చాచు చెల్లప్ప
తిరుగు తిరుగు తిమ్మప్ప
తిరుగలేనూ నరసప్పా !

**కథాకథనం :**

పిల్లలు కథలంటే చెవికోసుకొంటారు. ఇంటివద్ద పిల్లలు అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతయ్యలదగ్గర గుమికూడడానికి కారణం వారికిఉన్న కథాసక్తియే. పిల్లలకు కథలుచెప్పి, వారిచేత తిరిగిచెప్పిస్తూ తరగతి వాతావరణంలో భాషణ నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఉపాధ్యాయుడు ప్రయత్నిస్తాడు. కథలనుచెప్పి, చెప్పించడాన్ని, కథాకథనపద్ధతి అంటారు. ఒకటి, రెండవ తరగతుల విద్యార్థులకు కాల్పనికతకు,ఊహకు, భావానికి ప్రాధాన్యంగల కథలను చెప్పాలి. పిల్లల మనస్సులను ఆనందింపజేసేవిగా, ఉత్సాహపరిచేవిగా, వినోదాత్మకంగా ఉండాలి. అభూత కల్పనలు పిల్లలు మనస్సులను బాగా ఆకట్టుకొంటాయి.

అనగా అనగా ఒక రాజు ఆ రాజుగారికి ఏడుగురు కొడుకులు, చీమ – పావురం, కాకి – నక్క, కొంగ – నక్క, కోతి – మొసలి, నక్క – ద్రాక్ష మొదలైన కథలను, అవాస్తవికమైన కాల్పనికకథలను ఉదాహరణలుగా గ్రహించవచ్చు.మూడు, నాలుగు, ఐదవ తరగతుల విద్యార్థులకు నీతి కథలు, అద్భుత కథలు చెప్పాలి. నైతిక విలువల్ని, సందేశాలను, సంస్కృతి ఔన్నత్యాన్ని తెలియజేసే కథలను చెప్పవచ్చు.

హరిశ్చంద్రుడు, కర్ణుడు, బలిచక్రవర్తి, శిబి చక్రవర్తి మొదలైన పురాణ పురుషుల కథలను, అభిమన్యుడు, బాలచంద్రుడు మొదలైన బాలవీరుల కథలను, గాంధీజీ, వివేకానందుడు మొదలైన మహాత్ముల బాల్యదశలోని సంఘటనలను చిన్నకథలుగా మలిచి ఉపాధ్యాయుడు చెప్పవచ్చు. ఆ తరావ్రాత పిల్లలచేత వారి సొంత శైలిలో కథను తిరిగిచెప్పించవచ్చు.

1. ఉపాధ్యాయుడు ఆసక్తి కరమైనకథలను మాత్రమే చెప్పాలి.
2. విద్యార్థులస్థాయికి తగిన పదజాలాన్ని, భాషను ఉపయోగించాలి.
3. విద్యార్థులను మధ్యలో ప్రశ్నిస్తూ వారిఅవధానాన్ని గుర్తించి, అవగాహననుకూడా తెలుసుకోవడానికి ప్రయత్నించాలి.
4. కథ చెప్పడానికి కావలసిన బోధనోపకరణాలను ఉపయోగించవచ్చు.

ఆవు – పులి, సింహము – నాలుగు ఎద్దులు, కుందేలు – సింహం, కుక్క – గాడిద, చీమ – పావురం, –వేటగాడు, నాయనా పులివచ్చే మొదలైన కథలు, చారిత్రిక కథలు (శివాజీ, వీరపాండ్య కట్టబొమ్మన్, అల్లూరి సీతారామరాజు, పల్నాటి బ్రహ్మనాయుడు).

ఈ కథాకథన ప్రక్రియవల్ల ఆశించిన ప్రయోజనాన్ని సాధించడంతో పాటు వివిధ పాత్రల ప్రవర్తనలను పరిశీలించుటకు తద్వారా సత్ప్రవర్తన, ధైర్యం, వీరం, సాహసం మొదలైన గుణాలు అలవడుతాయి. భావాలను క్రమమైన పద్ధతిలో వ్యక్తీకరించే భాషణ నైపుణ్యంఅలవడుతుంది.

నాటకీకరణం చేయించడానికి రెండు కథలను సేకరించి చక్కని నటనతో (అభినయంతో) వారిచే పాత్రాభినయం చేయించండి.

**కథా చిత్రాలు :**

పిల్లలచేత కథలను చెప్పించడానికి ఉపాధ్యాయుడు కథాచిత్రాలను కూడా ఉపయోగించవచ్చు. కథలోని ముఖ్యసంఘటనలను చిత్రించి 4, 5 తరగతుల విద్యార్థుల ఎదుటఉంచి, ఆచిత్రాల ఆధారంగా వారిచేత కథను చెప్పించవచ్చు. విద్యార్థులు చెప్పలేని అంశాలను ఉపాధ్యాయుడే చెప్పి, తదు పరి పిల్లల చేత చెప్పించాలి. చిన్న చిన్న ప్రశ్నలను ఒకక్రమపద్ధతిలోవేసి కథనురాబట్టవచ్చు. కథలోనినీతిని, సందేశాన్ని పిల్లల నుండి రాబట్టవచ్చు.

కథాకథనంద్వారా విద్యార్థుల ఉచ్చారణ మెరగవుతుంది. భావాలను క్రమపద్ధతిలో వ్యక్తీకరించే సామర్థ్యం పెరుగుతుంది. పదజాలం అభివృద్ధిచెందుతుంది. నిర్భయంగా మాట్లాడే సామర్థ్యం,

సృజనాత్మకత అభివృద్ధి అవుతాయి. కథాచిత్రాలు భాషానైపుణ్యాన్ని పెంపొందింపజేయడానికి ఉపయోగపడే ఒకప్రత్యేక సంవిధానం కావు. భాషా క్రీడలు అనే ప్రత్యేక సంవిధానాలను నిర్వహించే టపుడు సహాయపడే ఉపకరణాలే చిత్రపటాలు.

ఉదా కుందేలు – సింహం కథ. చిత్ర పటాలు చూపిస్తూ వరుసగా కథ చెప్పడం.

**భాషా క్రీడలు :**

భాషాబోధన కృత్యాలను ఆటలుగా మలచుకొని విద్యార్థులకు ఆసక్తికరంగా రూపొందించబడినవే భాషా క్రీడలు. తరగతిలోని విద్యార్థులను జట్లుగావిభజించి కూడా ఈ క్రీడలను నిర్వహించవచ్చును.

ఉపాధ్యాయుడు ఒకపదాన్నిచెప్పి, ఆ పదంలోని మొదటి అక్షరాన్నితొలగించి, మరోక్రొత్తఅక్షరాన్ని చేర్చి క్రొత్త పదాన్ని చెప్పించవచ్చు. సరియైన సమాధానం చెప్పిన విద్యార్థికి మార్కులను( గుణములను) ఇవ్వవచ్చు.

| | | | |
|---|---|---|---|
| 1. | చి | ల | క |
| 2. | ప | ల | క |
| 3. | గి | ల | క |

**అంత్యాక్షరి :**

ఒక విద్యార్థి చెప్పిన ఒకపదంలోనే చివరిఅక్షరంతో మొదలయ్యే మరోపదాన్ని ఒకరితరువాతఒకరుగా విద్యార్థులచే చెప్పించవచ్చు.

ఉదా వనజ
↙
జలజ
↙
జడ
↙
డంక
↙
కడవ

| కృత్యం : ఈ విధంగా 20 పదాలను సేకరించి , తరగతిలో చెప్పించడం. | | | |
|---|---|---|---|
| | | | |

**పొడుపు కథలు :**

ఒక జట్టు వారిని పొడుపుకథను చెప్పమని వేరొకజట్టుచేత అందుకు సమాధానం చెప్పించవచ్చు.

చింపిరి చింపిరి గుడ్డలు
ముత్యాల వంటి బిడ్డలు – మొక్క జొన్న ఎన్ను
తండ్రి గరగర, తల్లి పీచు పీచు,
బిడ్డలు రత్నమాణిక్యాలు – పనసపండు

ఈ క్రీడలో విజేతలను అభినందించడంతోపాటు అప్పుడప్పుడు బహుమతులప్రదానం చేయడం ద్వారా విద్యార్థులను ప్రోత్సహించవచ్చు.

**ప్రసంగాలు :**

విద్యార్థులభాష, భాషణసామర్థ్యాన్ని కొంతపెంపొందించిన తరువాత 3,4,5 తరగతి విద్యార్థుల చేత ప్రసంగాలు చేయించాలి.వారి భావ స్థాయికి తగిన ఆసక్తికరమైన చిన్నచిన్న అంశాలపై సంక్షిప్తమైన ప్రసంగాలు చేయించి వారిభాషణాభివృద్ధికి సహకరించాలి.

**నాటకీకరణం :**

బోధించిన పాఠ్యాంశాన్ని సంభాషణరూపంలోనికి మార్చి,విద్యార్థులచేత మాట్లాడించడం

నాటకీకరణం అవుతుంది. దీనికిగాను ప్రత్యేకమైనరంగస్థలం, వేషధారణ అవసరంలేకుండా అప్పటిక ప్పుడే తరగతి గదిలో విద్యార్థుల చేత నాటకీకరణం నిర్వహించవచ్చును.

కథలోని పాత్రలకు తగిన వాచికాభినయం, ఆంగికాభినయం చేయగల విద్యార్థులను ఉపాధ్యా యుడు ఎన్నుకోవాలి. స్పష్టమైన, నిర్దుష్టమైన, గంభీరమైన ఉచ్చారణ గల విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వాలి. పాత్రలు సంభాషణలుచేసేటప్పుడు ఉపాధ్యాయుడు వారి ఉచ్చారణదోషాలను సవరించి భాషణాభివృద్ధికి ప్రయత్నించాలి.

బాలగేయాలను కథాకథనం వలన సాధించే ప్రయోజనాలను ఈ నాటకీకరణం ద్వారా సాధించవ చ్చు. పాత్రోచితమైన సంభాషణ చాతుర్యాన్ని పిల్లలు పొందగలరు.

**మాధ్యమిక దశ :**

ఈ దశలోని విద్యార్థులు శారీరకంగాను మానసికంగాను ఎదిగి ఉంటారు. కాబట్టి బాలగేయా లు, అభినయ గేయాలు అనేరెండు కృత్యాలను తగ్గించి,మిగిలిన ప్రక్రియలను విద్యార్థుల భాషణా . భివృద్ధి కోసం నిర్వహించాలి. మాట్లాడే నైపుణ్యంలో స్థాయిని పెంచడానికి మాధ్యమిక,ఉన్నత దశలో ని విద్యార్థులకు ఈ క్రింద పేర్కొన్న ప్రక్రియల్లో శిక్షణ ఇవ్వవచ్చు.

**వక్తృత్వ శిక్షణ :**

ఏదేని ఒక అంశాన్ని గురించి తక్కువ వ్యవధిలో సహజంగా, ధారాళంగా, స్వీయశైలిలో మాట్లాడ డాన్ని వక్తృత్వం అంటారు. దీనినే ఉక్తరచన అని కూడా అనవచ్చు. వక్తృత్వశిక్షణలను ఏర్పాటుచేసి పోటీలను నిర్వహించి విద్యార్థుల భాషణ నైపుణ్యాన్ని పెంపొందించాలి.

వారికి తెలిసిన పండుగలు, ఉత్సవాలు, ఆరోగ్య సూత్రాలు, వార్తలు మొదలైన అంశాలపై చిన్న చిన్న వ్యాసాలను వ్రాయించి తరగతిగదిలో ప్రసంగింపజేయాలి. ఈ ప్రసంగాలు విద్యార్థులకు ఆసక్తి నికలిగించేవిగా ఉండాలి. ఇటువంటి ప్రసంగాలవల్ల విద్యార్థుల శబ్దజాలం,సృజనాత్మకత పెంపొందు తాయి. విద్యార్థుల చేత స్థాయికి తగినట్లుగా చారిత్రక పౌరాణిక కథలతోపాటు, సాహసగాథలను కూడా చెప్పించాలి. దోషాలున్నపుడు తోటి విద్యార్థులు హేళనచేయకుండా క్రమశిక్షణ పాటించేటట్లు ఉపాధ్యాయుడు ఆదేశించాలి.

సాధ్యమయినంత వరకు కాగితంచూచి చదువకుండా స్వయంగా ఉపన్యసించేటట్లు చూడాలి. ఉపన్యాసానికి ప్రారంభం, విషయ వివరణలతోపాటు మంచిముగింపు కూడా ఉండేటట్లు శిక్షణ ఇవ్వాలి. నాన్నమ్మలు, తాతయ్యలు, ఇతరులు వ్రాసిఇచ్చిన వ్యాసాలను కంఠస్థం చేసి, పోటీలలో ఉపన్యసించి కొందరు బహుమతులు పొందడానికి ప్రయత్నిస్తారు. ఆ బహుమతులు వారి అరతకు మించినవి కాగలవు. ఇటువంటి లోపాలను తొలగించాలంటే అప్పటికప్పుడే శీరికలను ఇచ్చి ఉపన్యసించమని కోరవచ్చు. వక్తృత్వపోటీలవలన విద్యార్థులు అనేక ఆకరగ్రంథాలను పరిశీలించే అవ కాశం ఉంది. ఈ శిక్షణల వలన విద్యార్థులలో స్వయంకృషి, ఆత్మవిశ్వాసం నాయకత్వలక్షణాలు పెంపొందుతాయి.

**ఉన్నత దశ :**

ఈ దశ విద్యార్థుల భాషాభివృద్ధికి ప్రసంగాలు, నాటకీకరణం, వక్తృత్వ శిక్షణ, కాకుండా వాటికి అదనంగా గోష్ఠులు, సారస్వతసమావేశాలు ప్రముఖ పాత్రను వహిస్తాయి. ఈ దశ విద్యార్థులకు ఉన్న తమైన జ్ఞానం, సామర్థ్యం మాధ్యమిక దశ విద్యార్థుల కంటే అధికంగా ఉంటుంది. కార్యకారణ సం బంధం, విమర్శన శక్తి, తార్కికశక్తి వారిలో అప్పుడప్పుడే ఉద్భవించడం మొదలుపెడుతాయి. కనుక వారి స్థాయికి తగిన కథలను చెప్పాలి.వినోదాన్ని మాత్రమే కాకుండా విజ్ఞానాన్ని కలిగించేవిగా

ఉండాలి. కథలలో నవరసాలు ఉండాలి. ముఖ్యంగా హాస్య, శృంగార రసాలు, సున్నితంగా ఉండేట ట్లు చూడాలి. అతి సర్వత్ర వర్జయేత్ అన్నారు అనుభవజ్ఞులు. నాటకీకరణం ఈ దశలో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. సంభాషణలో కలిగే ఉచ్చారణ దోషాలను వెనువెంటనే సవరించాలి. ఏదైనా అంశాన్నిచ్చి ఆశువుగా ఉపన్యసింపజేయాలి. ఆధునిక సమాజంలోని జనాభా సమస్య, నిరుద్యోగ సమస్య, విద్యార్థులు – క్రమశిక్షణ, విద్యార్థులు – రాజకీయాలు మొదలయిన సమస్యల్ని కేంద్రంగా తీసుకొని సంభాషణ చేసేటట్లు చూడాలి. ప్రసంగానంతరం గుణదోషాలను చర్చించాలి. దోషాలను తగు విధంగా సవరించాలి. ఉచ్చారణ స్పష్టత, ఊనిక స్వరభేదం మొదలైన అంశాలను గమనించాలి. శబ్దప్రయోగం, ఔచిత్యంమొదలగు అంశాలపై పట్టును ఏర్పరచాలి. వక్తృత్వపు పోటీలను ప్రతి నెల నిర్ణీత కాల వ్యవధిలో నిర్వహించి భాషణ అభివృద్ధికి కృషి చేయాలి.

**ఒక విద్యార్థి చెప్పిన ఒక పదంలోని చివరి అక్షరంతో మొదలయ్యే మరో పదాన్ని ఒకరి తరువాత ఒకరుగా విద్యార్థులచే చెప్పించడం.**

## గోష్ఠులు :

ఇది ఉన్నత దశ విద్యార్థుల భాషణాభివృద్ధి కోసం నిర్వహించే కృత్యాలలో ముఖ్యమయినవి. ఏదైనా ఒక అంశాన్ని తీసుకొని విద్యార్థులు దాని మీద వాదోపవాదాలు చేస్తారు.

ఉదా  స్త్రీ – పురుషునికి సమానమా ?

విజ్ఞానశాస్త్రం – లాభనష్టాలు.

విద్య గొప్పదా – ధనం గొప్పదా ? మొదలగు శీరికలపై వాదోపవాదాలు నడుపవచ్చు. ఇందులో విద్యార్థులు తమతమ అభిప్రాయాలను సమర్థించుకోవడానికి గట్టిగా వాదించవలసి వస్తుంది. ఇటువంటి చర్చాగోష్ఠులలో పాల్గొనడం వలన విద్యార్థులకు కావలసిన పరిశీలనా దృక్పథము, హేతు–బద్ధమయిన విమర్శన శక్తి, తార్కికశక్తి మొదలగునవి అబ్బడంతో పాటు ఉచితమైన పదప్రయోగం, శక్తి మంతమయిన భావ ప్రకటన సామర్థ్యం అలవడుతుంది. తమిళంలోని పట్టి వంద్రం ఆ భాషలోని ఒక విశిష్టమైన చర్చా ప్రక్రియగా ప్రసిద్ధమన్నది ఈ సందర్భంలో గుర్తు చేసుకోవడం ఆవశ్యకం.

## సారస్వత సమావేశాలు :

సరస్వతీ సంబంధమైన భాషా కార్యక్రమాలను నిర్వహించడాన్ని సారస్వత సమావేశాలుగా చెప్పవచ్చు. పాఠశాల 'సహ విద్యా ప్రణాళికా సంబంధిత కార్యక్రమాల (Co-Curricular Activities)లో ఇది ఒకటి. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక సమావేశాలందు ఉపన్యాసాలు, చర్చలు, పద్య పఠనం, స్వీయ కవితాగానం, కవి సమ్మేళనాలు, కవి సన్మానాలు, ఏక పాత్రాభినయాలు మొదలైనవి ఏర్పాటు చేయవచ్చు. ఇటువంటి కార్యక్రమాలలో ఉన్నత దశలోని విద్యార్థులు పాల్గొని భాషణ నైపుణ్యాన్ని ఉన్నత స్థాయికి పెంపొందించుకోగలరు. తెలుగు సారస్వత సంఘ కార్యక్రమాలలో భాషలలోని వివిధ సాహితీ ప్రక్రియలపైన, శాస్త్రాల (విజ్ఞానం, వ్యాకరణం, అలంకారం, ఛందశ్శాస్త్రం) పైన సమీక్షా ప్రసంగాలు చేయవచ్చు. వక్తలు సభామర్యాదను అనుసరించి ముఖ్యాతిథులను ఉద్దేశించి ప్రసంగించే సంప్రదాయాలను తెలుసుకొనడానికి ఈ కార్యక్రమాల ద్వారా మాతృ భాషాధ్యాపకుడు శిక్షణ ఇవ్వవచ్చు.

### ప్రయోజనాలు :

1. భాషణ నైపుణ్యం అభివృద్ధి చేయవచ్చు.
2. భావానుగుణమైన వాచికాభినయం, ఆంగికాభినయం పెంపొందించవచ్చు.

3. వివిధ అంశాల మీద మాట్లాడటం కోసం విద్యార్థులు పరామర్శ గ్రంథాలను**(Reference Books)** పరిశీలించడానికి అలవడుతారు.

4. వివిధ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక అంశాలను గురించి అధ్యయనం చేయడం జరుగుతుంది.

5. స్వీయశైలిని అభివృద్ధి పరచవచ్చు.

6. కార్యక్రమాల నిర్వహణ సామర్థ్యం పెరుగుతుంది.

7. నాయకత్వ లక్షణాలు పెంపొందించవచ్చు.

కొత్తకొత్తపదాలతో పరా యపదాలతో మాట్లాడించడానికి అలవాటుచేయాలి

**వాగ్దోషాలు - నివారణోపాయాలు :**

మానవులందు వైయక్తిక భేదాలు ఉన్నట్లే ఉచ్చారణలోను తేడాలు ఉంటాయి. సమాజాన్ని బట్టి, ప్రాంతీయతను బట్టి, వంశపారం పర్యాన్ని అనుసరించి, అన్యభాషా ప్రభావం మొదలైన అంశాలు ఉచ్చారణ దోషానికి కారణాలు. భాషోపాధ్యాయుడు ఉచ్చారణ దోషాలను గుర్తించి, విశ్లేషించి విద్యార్థులకు అభ్యాసాల ద్వారా తర్ఫీదు ఇచ్చి, ఉచ్చారణ దోషాలను సవరించాలి. అది ముందు వారి దోష రహిత లేఖనానికి దోహదపడుతుంది.

భాషోపాధ్యాయునికి వాగుత్పత్తి, వాగింద్రియ నిర్మాణం గురించిన జ్ఞానం ఎంతో అవసరం. స్థాన, కరణ, ప్రయత్నాల త్రివిధ కార్యసంయోగం వల్ల వాగుత్పత్తి అవుతుంది. వాగింద్రియాలలో స్థానం ధ్వని పుట్టుక స్థానం పైపెదవి, దంతం, దంతమూలం, మూర్ధ, తాలువు, కంఠమనే భాగాలు స్థానాలు. ఇవి కదలిక లేక స్థిరంగా ఉంటాయి. వీటిని క్రింద ఉన్న కరణాలు ( క్రింది పెదవి, దంతం, జిహ్వాగ్రం, జిహ్వామధ్యం, జిహ్వా పృష్ఠం, జిహ్వామూలం, గళగర్తం) తాకడం వల్ల ఆ అక్షరాల భౌతిక రూపం ఏర్పడుతుంది. ఊపిరితిత్తుల నుంచి వచ్చి గాలి నాదతంత్రుల మీదుగా వచ్చి స్థాన, కరణ, సంయోగాన, అక్షరాల ధ్వని కలుగుతుంది. ఇందులో కరణాలు స్థిరంగా ఉండక, కదలిక కలిగి ఉంటాయి. ఉచ్చారణకు స్థాన కరణాలను సంయోగపరచేది ప్రయత్నం. వాగింద్రియ వ్యాపారం వల్ల కలిగే భేదాలను బట్టి వర్ణసమామ్నాయంలోని అక్షరాలు ఏర్పడుతాయి. వాటినిఅచ్చులు, హల్లులు అని రెండు వర్గాలుగా విభజించారు. వీటినే క్రమంగా స్వరాలు, వ్యంజనాలు అంటారు.

ఎ) అచ్చులు ( అ నుండి ఔ వరకు)

బి) హల్లులు ( క నుండి హ వరకు)

సి) ఉభయాక్షరాలు ం ః

మొత్తము 56 (16+37+3=56)

విద్యార్థులో వాచికచర్యను ( భాషణాన్ని) అభివృద్ధి చేయడానికి వారు తరగతి గదిలో స్వేచ్ఛగా మాట్లాడుకొనే వాతావరణాన్ని సన్నివేశాలకు పది అంశాలను సేకరించి తరగతిలో మాట్లాడించాలి.

అచ్చులు స్వతంత్రంగా పలుకగలిగిన అక్షరాలు, హల్లులు అయితే అచ్చుల సహాయంతో పలుకడానికి వీలైనవి. హల్లుల ఉత్పత్తి వాటి స్థానాన్ని బట్టి వర్గీకరించడం జరిగింది.

వాగుత్పత్తి వర్ణాలకు సంబంధించిన జ్ఞానం గల ఉపాధ్యాయుడు విద్యార్థుల ఉచ్చారణ దోషాలను గమనించి, వాటిని సరియైన పద్ధతిలో సవరించగలడు. ఉచ్చారణదోషాలు సవరించబడితే లిఖితరచనలో కూడా వర్ణ క్రమదోషాలు ఉండవు. ఉచ్చారణ దక్షత గల వ్యక్తి భాషించినా, పఠించినా శ్రోతలకు ఆహ్లాదకరంగా ఉంటుంది.

భాషణదోషాలను మూడు రకాలుగా విభజించవచ్చును.

1. భావ దోషాలు 2. భాషా దోషాలు 3. ఉచ్చారణ దోషాలు

1. భావ దోషాలు : ఇవి విషయ పరిజ్ఞానానికి సంబంధించినవి. ఇందుకు కారణాలు

* విద్యార్థికి తెలిసిన అంశమే తప్పుగా ఉండుట * సభాకంపం లేదా తొట్రుపాటు

ఉపాధ్యాయుడు సరియైన విషయజ్ఞానాన్ని అందివ్వడం వల్ల మొదటి కారణం వల్ల కలిగిన భావ దోషాన్ని తొలగించవచ్చు. విద్యార్థికి ధైర్యాన్ని, ప్రోత్సాహాన్ని కలిగించడం ద్వారా రెండవ కారణం వల్ల కలిగిన భావ దోషాన్ని తొలగించవచ్చు. భావోద్రేకానికి లోను కాకుండా నెమ్మదిగా మాట్లాడమని విద్యార్థులకు సూచించడం ఎంతైనా అవసరం.

**భాషా దోషాలు :**

విద్యార్థి భాషా పరిజ్ఞానం సరియైనది కాకపోవడం వల్ల జరిగే దోషాలివి. భాషా సంస్కారం లేని వారిని అనుకరించి భాషను నేర్చుకోవడం వల్ల, శ్రద్ధగా ఉపాధ్యాయులను అనుకరించకపోవడం వల్ల, సభాకంపం వల్ల ఈ దోషాలు ఏర్పడవచ్చు. ఉపాధ్యాయుడు విద్యార్థికి దోషాలను తెలియజేసి, దాని నిర్దుష్టమైన రూపాన్ని తెలియజేయాలి. ఆరంభ దశలో భాషా ప్రయోగంలో వాక్యాలు చిన్నవిగాను, సరళంగాను, సహజంగాను ఉండేటట్లు శిక్షణ ఇవ్వాలి. సభాకంపం, భావోద్రేకం మొదలైనవి కారణాలైనపుడు విద్యార్థికి తగిన ధైర్యాన్ని, ప్రోత్సాహాన్ని, సూచనలను ఇవ్వాలి.

**ఉచ్చారణ దోషాలు :**

ఇవి చాలాజాగ్రత్తగా, సున్నితంగా సవరించవలసిన దోషాలు, పిల్లలు బడిలో ప్రవేశించిన దశలోనే వీటిని సవరించకపోతే, అవి స్థిరపడి వర్ణ క్రమ దోషాలకు హేతువులవుతాయి. ఉచ్చారణ దోషాలను 5 రకాలుగా విభజించవచ్చు.

**వేగోచ్చారణ దోషం :**

శ్రోతలు సరిగా అనుసరించలేనంత వేగంగా మాట్లాడడం వల్ల ఎదుటి వారికి వక్తభాషణ అర్థం కాదు. ఇందుకు కారణం – భయం కాని, సందేహం కాని కావచ్చు. ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో ధైర్యాన్ని, నమ్మకాన్ని పెంపొందించడం వల్ల ఈ దోషాన్ని సవరించవచ్చు. అధ్యాపకుని ఆదర్శమైన ఉచ్చారణ కూడా ఈ దోష నివారణకు కారణం అవుతుంది.

**సమవేగ రాహిత్యం :**

కొందరు భాషించేటప్పుడు మెల్లగా ఆరంభించినప్పటికి, రానురాను వేగాన్ని పెంచి చివరకు అస్పష్టంగా, అర్థరహితంగా ముగిస్తారు. సమవేగరాహిత్యమే ఈ వాగ్దోషానికి కారణం. వేగోచ్చారణ దోషాన్ని సవరించినట్లే ఈ లోపాన్ని కూడా సవరించవచ్చు.

**ధారళంగా మాట్లాడలేని దోషం :**

కొందరు విద్యార్థులు ధారాళంగా మాట్లాడలేక మధ్య మధ్యలో నిరర్థకమైన ధ్వనులను కాని, వ్యర్థమయిన ఊత పదాలను (మరి...... కాబట్టి........నేని చెప్పేదేమంటే....... గనుక, మొదలైనవి) కాని, చివరి పదాన్ని మళ్లీ అందుకొని మాట్లాడటం గాని చేస్తుంటారు. భావాలు క్రమంగా గుర్తుకు

రాకపోవడం లేదా అందుకు తగిన పదజాలం స్ఫురణకు రాకపోవడం, సభాకంపం అనేవి ధారాళంగా మాట్లాడలేక పోవడానికి కారణాలు కావచ్చు.

విద్యార్థి మాట్లాడవలసిన అంశాన్ని క్రమపరచుకొనేటట్లు చేయడం. పదజాలంపై అధికారాన్ని పెంపొందించడం సభాకంపాన్ని తొలగించడానికి సూచనలివ్వడం అనే చర్యలు ఈ దోష నివారణకు సహకరిస్తాయి.

**సమస్వర రాహిత్య దోషం :**

కొందరు విద్యార్థులు ఆరంభంలో స్పష్టంగావినబడేటట్లు మొదలుపెట్టి, తుదకు స్వరాన్ని తగ్గిస్తూ వినపడకుండా మాట్లాడుతారు. సమానమైన స్వరం లేని ఈ ఉచ్చారణ దోషాన్ని విద్యార్థిలో ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంచడం వల్ల తొలగించవచ్చు.

**ధ్వని వ్యత్యయ దోషం :**

ధ్వనులను తారుమారు చేయడాన్నే ధ్వని వ్యత్యయ దోషం అంటారు. పైనచెప్పబడిన ఉచ్చారణ దోషాల కంటే అధిక శ్రద్ధతో ఈ దోషాన్ని సవరించవలసి ఉంది. ఈ దోషాలను క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

| | |
|---|---|
| 1) అచ్చులకు హల్లులు పలకడం. | 2) హల్లులకు అచ్చులు పలకడం |
| ఋతువు – రుతువు | వెంకన్న – ఎంకన్న |
| ఊరు – వూరు | హరి – అరి |
| | వీడు – ఈడు |
| 1) మహాప్రాణాలకు అల్ప ప్రాణాలు పలకడం | 2) అల్పప్రాణాలకు మహాప్రాణాలు పలకడం |
| ముఖం – ముకం | బాధ – భాధ |
| భార్య – బార్య | విద్య – విధ్య |
| 3) అనునాసిక దోషాలు | 4) చ, శ, ష, సలను తారుమారు చేసి పలకడం |
| ఆజ్ఞ – ఆగ్న | చాప – సాప    శని – సని |
| జ్ఞానము – గ్నానము | చక్కెర – సక్కెర    షావుకారు – సావుకారు |
| నివారణ – నివారన | తెలుసు – తెలుచు    షికారు – సికారు |
| | దేశం – దేసం    మనిషి – మనిసి |

5) అంతస్థలలోని య, వ, అనే వర్ణాలు పదాదిలో వచ్చినపుడు వాటిని పలుకక పోవడం.

యాస – ఏస
వేసవి – ఏసవి
వేప – ఏప

పదాదిని అచ్చులు పలుకవలసిన చోటే య, వలను అంతస్థాలను ఉచ్చరించడం.

ఏమరుపాటు – వేమరుపాటు
ఎక్కడ – యెక్కడ

| | |
|---|---|
| 6) ళ ను సరిగా ఉచ్చరించలేక పోవడం | 7) సంయుక్త అక్షరాలను ద్విత్వాక్షరాలుగా పలకడం. |
| శుభవేళ – శుభవేల | పక్షము – పచ్చము |
| కళ – కల | సాక్షి – సాచ్చి |
| పళని – పలని | |

**ఉచ్చారణ దోషనివారణకు సూచనలు :**

ఈ వాగ్దోషాలకు కారణాలు వాగింద్రియ లోపం, పరిసరాల ప్రభావం, అన్యభాషా సంపర్కం మొదలైనవి. ఉపాధ్యాయుడు విద్యార్థి ఉచ్చారణ దోషాలను వాటికి గల కారణాలను తెలుసుకోవాలి. వాగింద్రియాలు దృఢంగా లేకపోవడం వల్ల ఈ దోషాలేర్పడవచ్చు. కొందరికి ముక్కు లోపలి భాగంలో కండరాలు పెరగడం వల్ల మరికొందికి పై పెదవిలో దొ(ర ఏర్పడడం వల్ల కొందరికి శ్రవణేంద్రియం సరిగ్గా పనిచేయకపోవడం వల్ల ఉచ్చారణ దోషాలు ఏర్పడతాయి. వాగింద్రియాలు పటిష్ఠమైన తరువాత కొన్ని దోషాలు సవరింపబడుతాయి.

రాముడు – లాముడు జ్ఞానము – గ్నానము

ఉపాధ్యాయుడు అవయవలోపాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి వైద్య సహాయంతో ఆయా లోపాలను సవరించడానికి ప్రయత్నించవలసిందిగా సూచించాలి. అంత వరకు ఆ విద్యార్థితో స్నేహ పూర్వకంగా సానుభూతితో ఉపాధ్యాయుడు మరియు తోటి విద్యార్థులు వ్యవహరించాలి. తప్పుగా ఉచ్చరించిన వర్ణాన్ని ఉపాధ్యాయుడు స్పష్టంగా ఉచ్చరించి విద్యార్థికి వినిపించాలి. ముఖయంత్రంలో ఆ వర్ణం ఉత్పత్తి అయ్యే విధానాన్ని విద్యార్థి జాగ్రత్తగా గుర్తించేటట్లు చేయాలి. విద్యార్థుల చేత నిర్దుష్టమైన ఉచ్చారణను పదే పదే చేయించాలి. అవసరమైన సందర్భాలలో క్లిష్టమైన పదాలను, పద బంధాలను విడదీసి పలికించాలి. ఉచ్చారణ పరమయిన అభ్యాసాలను కొన్నింటిని ఇవ్వాలి. విద్యార్థులు చేసే సాధారణ దోషాలకు సంబంధించిన పదాలను వర్ణాలను ఒక అట్టపై వ్రాసి ఉంచి, తరగతి గోడపై వ్రేలాడదీసి తరచుగా విద్యార్థుల చేత చదివించాలి.

పై చెప్పబడిన నివారణ మార్గాలతో పాటు అతి ముఖ్యమయినది ఉపాధ్యాయుల ఆదర్శవంతమైన ఉచ్చారణ, ఉపాధ్యాయుడు మంచి వక్తల సంభాషణలను టేపురికార్డరు ద్వారా వినిపించాలి. విద్యార్థులకు రేడియో, టి.వీల నుండి వార్తలు వినడాన్ని ప్రోత్సహించాలి.

మాటలను బట్టి మనిషియొక్క మూర్తిమత్వాన్ని పసికట్టవచ్చునన్నది ఒక లోకోక్తి.

## 3.4. పఠనం

పరిచయం : విశేషమైన జ్ఞాన సముపార్జనకు వినుట, మాట్లాడుట అనే భాషా నైపుణ్యాలు చాలవు. లిఖిత రూపంలో ఉన్న పదాలను, వాక్యాలను చూసి వాగింద్రియాల సహాయంతో చదివి భావాన్ని గ్రహించడాన్ని పఠనం అంటారు. భాషా నైపుణ్యాలలో మూడవది పఠనం. ఉత్తమ శ్రవణం పై నిర్దుష్ట భాషణం, నిర్దుష్ట భాషణంపై నిర్దుష్ట పఠనం, నిర్దుష్ట పఠనంపై స్పష్టమైన దోషరహితమైన లేఖనం ఆధారపడి ఉంటాయి. బాహ్య పఠనానికి భాషణంతో పోలిక ఎక్కువగా ఉంటుంది. బాగామాట్లాడడంవల్ల బాగాచదవగలశక్తి అభివృద్ధి చెందుతుంది. అట్లే పఠనశక్తి అభివృద్ధి పరచుకోవడం వల్ల భాషణశక్తి మరింత వృద్ధి చెందుతుంది. ఈ పఠన కారణంగా దూర ప్రాంతంలో ఉన్న వ్యక్తుల భావాలు సమాచారాలు లేఖల ద్వారా తెలుసుకోవచ్చు. మేధావుల భావసంపద కలిగిన గ్రంథాల సారాన్నిగ్రహించవచ్చు. మానవజాతి పరిణామాన్ని అవగాహన చేసుకోవడానికి సమకాలీన వార్తలను పత్రిక ద్వారా గ్రహించడానికి, మూర్తిమత్వ వికాసాన్ని సాధించడానికి పఠనం చాలా అవసరం. లోకాన్ని చూడడానికి కన్ను ఎంత అవసరమో, లోకజ్ఞానానికి పఠనం కూడా అంత అవసరం. కాబట్టి ప్రతి విద్యార్థి పటిష్టమైన, అర్థవంతమైన పఠనాన్ని నేర్చుకోవడానికి ఉపాధ్యాయుడు ప్రాథమిక స్థాయి నుండి సరియైన శిక్షణ ఇవ్వవలసిఉంది.

**ఉత్తమ పఠన లక్షణాలు :**

ప్రాథమిక దశ :

1. స్పష్టంగా చదవడం.
2. దోషాలు లేకుండా చదవడం.
   - ధ్వని దోషాలు లేకుండా చదవడం.
   - భాషా దోషాలు లేకుండా చదవడం.
   - విషయ దోషాలు లేకుండా చదవడం.
3. భావాన్ని గ్రహిస్తూ చదవడం.
4. ధారాళంగా చదవడం.
5. ధైర్యంగా చదవడం.

మాధ్యమిక దశ :

పరిచయం ఉన్న అంశాలను ఇచ్చి విద్యార్థులచేత వర్ణింపచేయడం

1. సమతతో చదవడం

(తగిన సమానమైన స్వరస్థాయితో చదవడం. అక్షరాల మధ్య పదాల మధ్య, వాక్యాల మధ్య, భావాల మధ్య తగినటువంటి సమానమైన విరామం ఇస్తూ చదవడం)

2. భావానుగుణమైన వాచకాభినయంతో చదవడం.

(భావానికి తగిన ఊనిక, స్వరభేదాన్ని పాటిస్తూ చదవడం)

3. సందర్భానికితగిన అంశాలనే చదవడం.
4. ప్రక్రియానుగుణంగా చదవడం.

(పద్యం, వచనం, గేయం, రచన, కవిత మొదలైన భిన్న సాహిత్య ప్రక్రియలను లయబద్ధంగా, భావానుగుణంగా చదవడం)

ఉన్నత దశ :

1. భావానికి తగిన వాచికాభినయంతో పాటు ఆంగికాభినయంతో చదవడం.
2. మాట్లాడుతున్నట్లు చదవడం.
3. రసానుభూతితో చదవడం.
4. సొంత శైలిలో చదవడం.
5. మౌనపఠనాసక్తి విద్యార్థులలో కలిగించడం.
6. జ్ఞానతృష్ణను పరిశీలన, పరిశోధనాశక్తిని పెంపొందించే విస్తారపఠనాసక్తిని విద్యార్థులకు కలిగించడం.
7. క్షుణ్ణపఠనం ద్వారా వివిధ కవుల, రచయితల భిన్న రచనాశైలిని అవగాహన చేసుకొని తనదైన శైలిని పాటించేటట్లు చేయడం.

పఠన ప్రయోజనాలు :

1. భాషణలో చక్కనిఉచ్చారణ సౌలభ్యం ఏర్పడుతుంది.
2. రచనా నైపుణ్యం సిద్ధిస్తుంది.
3. గ్రంథపఠనం ద్వారా విజ్ఞానాన్ని పొందవచ్చు.
4. మౌనపఠనం అలవరచుకోవడానికి ఉపయోగపడుతుంది.
5. లిఖిత భావాలను, భాషను గ్రహించడం వల్ల, స్వీయ భావాలను ప్రకటించుటకు కావలసిన భాష అలవడుతుంది.
6. కావ్య సౌందర్యాన్ని మెచ్చుకొని ఆనందాన్ని పొందవచ్చు.

పైన పేర్కొనబడినవన్నీ బాహ్య పఠన స్పష్టీకరణాలే. శీఘ్రంగా చదువుట, అతి దీర్ఘంగా చదువుట, తల ఊపుతూ చదువుట మొదలైనవి పఠన దోషాలు.

చదివిన వాడజ్ఞుండగు

చదివిన సదసద్వివేక చతురతన్ కల్గున్ అని చక్రవర్తి కుమారుడైనను విద్య నేర్పనిదే గొప్పదనం లేదని అంటాడు ప్రహ్లాదుడు.

స్వదేశే పూజ్యతే రాజా
విద్వాన్ సర్వత్ర పూజ్యతే

(రాజు తన రాజ్యంలో మాత్రమే గౌరవించబడుతాడు. కాని బహుగ్రంథ పఠనం వల్ల కలిగిన పాండిత్యం కలవాడు, స్వదేశంలోనే కాక విదేశాలలో కూడా పూజించబడుతాడు.) చదవడం అనే నైపుణ్యం మనిషిని మహోన్నతునిగా మార్చగలదు.

**పఠన బోధన పద్ధతులు :**

విద్యార్థులకు పఠనాన్ని బోధించడానికి కొన్ని పద్ధతులు ఉన్నాయి. అవి ఐదింటిగా పేర్కొనవచ్చు.

అక్షర పద్ధతి :

పఠనం భాషా నైపుణ్యాలతో ఒకటి. విద్యార్థిచేత ప్రాచీన విద్యా విధానం ప్రకారం అక్షరాలను దిద్దించడం చేసేవారు. అనగా లేఖనం నేర్పేవారు, అక్షరాలను దిద్దుతూ మొదటలేఖనం వెనువెంటనే పలుకుతూ పఠనంపిల్లలకు నేర్పేవారు. ఈ విధంగా వర్ణమాలలోని అక్షరాలను క్రమంగా నేర్పిన తరువాత గుణింతాలు నేర్పుతారు. గుణింతాల తరువాత పదాలు వ్రాయడం, చదవడం నేర్పుతారు. విద్యార్థులు అక్షరాలు ఏయే ధ్వనులకు చిహ్నాలో గుర్తించి, ఆయా ధ్వనులను ఉచ్చరించే నేర్పు పొందుతారు. లిపి జ్ఞానం వల్ల కొత్త వాక్యాలను కూడా చదువుగలుగుతారు.

భాషా నైపుణ్యాలను క్రమ పద్ధతిలో కాకుండా ఒకేసారిగా అన్నింటిని పెంపొందించాలని ప్రయత్నించేవారు. గురువు చెప్పిన అక్షరాన్ని వింటూ దానిని దిద్దుతూ చదువుతూ నేర్చుకొనేవారు. ఆ దశలో ఈ క్రియా సాంకర్యం వల్ల పిల్లలు అలసటకు **(Fatigue)** విసుగుకు గురి అయ్యేవారు. ఈ పద్ధతి మనో విజ్ఞానశాస్త్ర విరుద్ధమైనది. విద్యార్థి పాఠశాలకు వచ్చేసరికి భాషించడం తెలుసుకొంటాడు. ఆ భాషణంతో సంబంధం కలది. పఠనమే కాని, లేఖనం కాదు. భాషణలో వలనే ప్రకాశపఠనంలో వాగింద్రియాలు పనిచేయాల్సి ఉంటాయి. కాబట్టి భాషణ, పఠనాలకు చాలా దగ్గరి సంబంధం కలదని చెప్పవచ్చు. లేఖనక్రియలో చేతివేళ్ళకు మాత్రమే పని వాగింద్రియ సంబంధం దానికి ఉండదు. కాబట్టి అలవడి ఉన్న భాషణంతో సంబంధపరచి, పఠనాన్ని సులభంగా నేర్పవచ్చు.

అక్షర పద్ధతిలో ఈ అభ్యసన కృత్యం పిల్లలకు ఆసక్తిని కలిగించదు. ఈ అక్షరాలకు అర్థమేమి ఉండదు. ప్రాథమిక దశలో శిశువులకు చేతివ్రేళ్ళు లేఖనానికి తగిన పటుత్వాన్ని కలిగి, వ్రాయడానికి సిద్ధంగా ఉండవు. అందువల్ల వ్రాయడం కంటే చదవడం ముందు నేర్పాలి.

భాషానైపుణ్యాలలో లేఖనం మిగిలినవాటికంటే కష్టతరమైంది. కాబట్టి విద్యార్థులు సులభంగా నేర్చుకోవడానికి వీలైన పఠనాన్ని ముందు నేర్పించి తరువాత కష్టతరమైన లేఖనాన్ని నేర్పించడం ఎంతైనా సముచితం.

పైన పేర్కొనబడిన వివిధకారణాల వల్ల ప్రాచీనవిధానంలోని లేఖనానికంటే ఆధునిక కాలంలో పఠనానికే ప్రాథమిక విద్యావిధానంలో ప్రధానస్థానం ఇవ్వబడింది.

**ప్రాచీన పఠన నైపుణ్య బోధనలో లోపాలు :**

1. ప్రాథమిక దశలో భాషా నైపుణ్యాలను ఒక క్రమ పద్ధతిలో నేర్పించేవారు కారు. అన్ని నైపుణ్యాలను ఒకేసారి నేర్పించేవారు.
2. వర్ణమాలలోని అక్షరాలను క్రమంగా నేర్పించేవారు. అన్ని అక్షరాలను నేర్పడానికి ఎక్కువ కాలయాపన జరిగేది. విద్యార్థుల్లో అభ్యసనలో అనాసక్తత కలుగుతుంది.
3. లిపిలో పోలిక లేని అక్షరాల క్రమాన్ని నేర్పించేవారు. వాటిని గుర్తించుకోవడం కష్టం.
   ఉదా ఇ – ఈ, క– ఖ, జ– ఝ, ట– ఠ, త– థ, మొదలగునవి.

4. వర్ణాలు, తరచుగా ప్రాథమికదశలో ప్రయోగించని ఋ, ఙ, ఞ మొదలైనవి నేర్పేవారు. సంయుక్త మైన క్ష వర్ణాన్ని వర్ణమాలలో చివరిగా చేర్చి నేర్పేవారు.

5. బోధన, అభ్యసనలందు క్రీడా పద్ధతి ఉపయోగింపబడేది కాదు.

6. బోధనోపకరణాలను విరివిగా ఉపయోగించేవారు కారు.

కొందరు ప్రాచీన అక్షర పద్ధతిలోని లోపాలను తగ్గించడానికిగాను అక్షరాలను ఆకార సామ్యాన్ని బట్టి కొన్ని వర్గాలుగా విభజించి నేర్పుతారు. ఉదా

1. అ, ఆ, ట, త, ల, ఱ
2. ఉ, ఊ, డ, ఢ
3. ఒ, ఓ, ఔ
4. చ, ఛ, జ, బ, భ,
5. ఠ, ర, ఝ
6. ఎ, ఏ, ఐ, గ, ప, ఫ, మ, వ, హ
7. ధ ద, థ
8. న, స, గ
9. శ, ళ

ఆకారంలో పోలిక లేని మిగిలిన వర్ణాలు ఇ, క, ణ ప్రత్యేక వర్గంగా చదివిస్తారు. ఋ, ఙ, ఞ వంటి అక్షరాలు ప్రాథమిక దశలో అవసరం లేదు. కాబట్టి బోధించరు.

ఒక్కో వర్గంలోని అక్షరాలను చదివించిన తరువాత ఆ వర్గంలోని అక్షరాలతో ఏర్పడే పదాలను చదివి పిదప గుణింతాలు, పదాలు, వాక్యాలను క్రమంగా చదివిస్తారు. ఈ పద్ధతిలో లిపి సామ్యం, అనవసరమైన వర్ణాలు నేర్పించకపోవడం అనే రెండు గుణాలు తప్ప ఈ కొత్త అక్షర పద్ధతిలో ప్రాచీనమైన అక్షర బోధన విధాన లోపాలన్నీ అట్లే ఉన్నాయి.

**పద పద్ధతి**

అక్షరాల కూడిక వలన అర్థవంతమైన పదం ఏర్పడుతుంది. అర్థవంతమైన పదాలతో పఠనం నేర్పించడాన్ని పదపద్ధతి అంటారు.

ఈ పద పద్ధతిలో ఒకటవ తరగతిలో శిశువుకు సాధారణంగా ఈ క్రింది పదాలను బొమ్మల సహాయంతో నేర్పిస్తారు.

అమ్మ, ఆవు, ఇల్లు, ఈగ, ఉడుత, ఊయల, ఎలుక, ఏనుగు, ఐదు, ఒంటె, ఓడ, ఔషధము అనే పదాలను సాధారణంగా చదివిస్తారు. వీటి ద్వారా అచ్చులను గుర్తు పట్టడానికి సులభమవుతుంది. ఉపాధ్యాయుడు బొమ్మను చూపి, బొమ్మకు మాటకు మధ్య సంబంధాన్ని కలుగజేస్తాడు. పదాలతో విద్యార్థులకు చక్కని పరిచయం ఏర్పడిన తరువాత వాటి ఆధారంగా అచ్చులను, హల్లులను నేర్పిస్తాడు. పదాలు నేర్చిన తరువాత వాక్యాలు చదవడం నేర్పడం జరుగుతుంది.

ఉదా తాత, పిలక, బావి, గిలక, కమల, నడక,

తాతపిలక,

బావిగిలక

కమల నడక.

ఉపాధ్యాయుడు పిల్లలు చేసే భాషణదోషాలను తెలుసుకొని భాషణదోషాల పట్టికనుతయారుచేయాలి

పదాల ఆధారంతో పఠనాన్ని బోధిస్తే పిల్లలు ఉత్సాహంగా నేర్చుకొంటారు. ఈ పద్ధతికి ఉపాధ్యాయుడు మెరుపు అట్టలను ఉపయోగించాలి. బొమ్మ దానికి సంబంధించిన పదం

ఉన్నటువంటి మెరుపు అట్టలను ఉపయోగించవచ్చు. రెండక్షరాల పదాలు, తరువాత మూడక్షరాల పదాలు – క్రమంగా విద్యార్థులకు పఠించడానికి అలవాటు చేయాలి. వర్ణాలు పూర్తయిన తరువాత గుణింతాలను రెండేసి, మూడేసి అక్షరాలున్న పదాలను చదివించవచ్చు. ( కాయ, తాత, వాన, కాకర, తామర, జాతర మొదలైనవి) క్రమంగా ద్విత్వాలు, సంయుక్తాలు ఉన్న పదాలను చదివించవచ్చు. ఈ విధంగా పలు రకాలైన సంవిధానలతో(Techniques) ఎఠన నైపుణ్యాన్ని ఆకరణీయంగా, ఆసక్తికరంగా అభివృద్ధి చేయవచ్చు.

ఈ పదపద్ధతి అక్షర పద్ధతి కంటే అర్థవంతమైనది. ఆసక్తికరమైనది. అర్థం లేని అక్షరాలను నేర్ప డం కంటే అర్థవంతమైన పదాలను పలకడం నేర్పిన తరువాత వాక్యాలను నేర్చుకొంటారు. బాలురు లకు మొదట పదాలను చదవడం నేర్పి, పిదప వాటి భాగాలైన అక్షరాలను చూపి, అవి ఏయే ధ్వనులను సూచించడానికి ఏర్పడిన గుర్తులో బోధించాలి. పదపద్ధతిలో విద్యార్థులకు బాగా పరిచయ ంమైన పదాలతోనే పఠన నైపుణ్యం పెంపొందించి అభ్యాసాలు ఇవ్వాలి. తెలిసిన దాని నుంచి తెలియని దానికి, మూర్తం నుండి అమూర్తానికి, సులభం నుంచి కఠినానికి బోధన జరగాలి అనే మనోవైజ్ఞానిక సూత్రాన్ని ఈ సందర్భాన గుర్తించుకోవాలి. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని మొదట తరగతి తెలు గువాచక నిర్మాణం జరగాలి.

**పదపద్ధతి ప్రయోజనాలు :**

1. పఠనాభ్యసనం అర్థవంతంగాసాగుతుంది.
2. లేఖనాన్ని విడిచిపెట్టడం వల్ల పిల్లలకు శ్రమ ఉండదు.
3. బొమ్మలు ఆకరణీయంగా పఠనాసక్తికి దోహదపడుతాయి.
4. అక్షరపద్ధతి కంటే తక్కువ సమయంలో విద్యార్థి పదాలను చదవడం నేర్వగలడు.

వాక్య పద్ధతి :

వాక్యం భాషకు మూలం. ఆదిమానవుడు తన భావాన్ని ఏవో కొన్ని ధ్వనుల సముదాయం ద్వారా సూచించేవాడు. ఆ ధ్వనుల సముదాయాన్ని విడగొట్టి పదాలు అక్షరాలుగా రాను రాను గుర్తించడం జరిగింది. ఒక సంపూర్ణ భావాన్ని పదం కన్నా వాక్యమే నిండుగా ప్రతిపాదించగలదన్న సూత్రాన్ని అను సరించి వాక్యపఠనం నేర్పడం మంచిది. ఒక ఏనుగును గుర్తించాల్సి వచ్చినప్పుడు దాని వివిధ అవయ ంవాలను పరిశీలించి పోల్చుకోవడం లేదు. మొత్తం ఏనుగు ఆకారాన్ని ఒకటిగా చూసి గుర్తిస్తున్నాం. అట్లే వాక్యాన్ని కూడా మొత్తంగా గ్రహిస్తాం. అంతేగాని ప్రతి అక్షరాన్ని గుణించుకొని వాక్యాన్ని గ్రహిం చం. సాధారణంగా శిశువులు తమభావాలను విడివిడి శబ్దాలతో, పదాలతో సూచించిననూ వారు వాక్యపరంగానే భావాన్ని గ్రహిస్తారు.

ఈ పద్ధతి ప్రకారం పదాలకు బదులుగా, వాక్యాలను నేర్పడం ద్వారా పిల్లలకు పఠనం నేర్పడం జరుగుతుంది. ప్రాథమిక స్థాయిలో మూడు, నాలుగు వాక్యాలలో పఠనం మొదలుపెట్టాలి. వాక్యా లను, చిత్రపట సహాయంతో చదివేటట్లు చేయాలి.

ఉదా   కమల పలకతో బడికి వెళ్లుతున్నది.

చిత్రపటాల సహాయంతో పిల్లల స్థాయికి తగినట్లు ఏదేని ఒక చిన్న కథను చెప్పించవచ్చు.

ఉదా   కాకి – కడవ కథ.

ఈ చిత్రపట సహాయంతో ఉపాధ్యాయుడు వాక్యంలోని భావానికి చిత్ర పటానికి సంబంధం ఏర్పరచ వలసి ఉంటుంది. తరువాత చిత్రపటాన్ని తొలగించి, వాక్యంలోని పదాలను పలుమార్లు చెప్పేటట్లు చేయాలి. ఇందువల్ల పిల్లలకు పదపరిచయం, అక్షర పరిచయం కలుగుతుంది. ఇవి మొత్తంగా

బోధించడం అవుతుంది. ఆధునిక విద్యావేత్తల అభిప్రాయం ప్రకారం పిల్లలకు పఠనం నేర్పడానికి అక్షర పద్ధతి, పదపద్ధతుల కంటే వాక్యపద్ధతి సరియైనది. అర్థవంతమైనది. సమగ్రమైనది.

చూసి చెప్పే పద్ధతి :

ఈ పద్ధతి అనుసరించి, చిత్రాన్ని చూసి వాక్యాన్ని మూడు, నాలుగుసార్లు చెప్పించాలి. అటు తరువాత చిత్ర సహాయం లేకుండా వాక్యాలనే చూసి చదివేటట్లు చేయాలి. వాక్యాలను చదవడం ద్వారా పదాలను, అక్షరాలను పిల్లలు గుర్తిస్తారు.

కథా చిత్రాలు రెండింటిని సేకరించండి. బొమ్మలను చూపిస్తూ క్రింద వ్రాసిన కథను చదివించండి. అలా చేయడానికి రెండింటిని సేకరించుకొనిరావడం. ఉదా నక్క – ద్రాక్ష.

కథా పద్ధతి :

ఒక కథకు సంబంధించిన చిత్రాలను తయారు చేసుకొని ఒక్కొక్క చిత్రంక్రింద ఒక వాక్యాన్ని వ్రాయాలి. ఆరు,ఏడు సరళమైన వాక్యాలలో కథ పూర్తి అయ్యేటట్లు చూడాలి. పిల్లలు చిత్రాలను చూసి, వాక్యాలను చెప్పి కథను ముగిస్తారు. ఈ పద్ధతిలో రకరకాలైన వాక్యాల మధ్య సమన్వయం ఉండడం వల్ల పిల్లలు అత్యంత ఆసక్తితో పఠనాన్ని కొనసాగిస్తారు.

ఉదా వాక్య పద్ధతి, కథా పద్ధతి, ప్రాథమిక దశలో చాలా ఉపయుక్తమైన పద్ధతులని W.M. Ryburn వంటి బోధనశాస్త్ర పండితులు అభిప్రాయపడుతున్నారు.

పదాల కన్నా వాక్యాలు, వాక్యాల కన్నా చిత్రపట వాక్యాలు, పిల్లలకు అధికమైన ఆసక్తిని పెంపొందిస్తాయి. కాని తెలుగు భాషలో గుణింతాలు, ద్విత్వాలు, సంయుక్తాలు లేని పొడి అక్షరాలతో వాక్యాలు తయారు చేయడం వీలుకాదు. పదపద్ధతిలో రెండేసి అక్షరాల మాటలు, మూడేసి అక్షరాల మాటలతో పఠనాభ్యసనం మొదలైనప్పుడు ఆ అక్షరాలు తక్కువ సంఖ్యలో ఉంటాయి. కనుక వాటిని పిల్లలు గుర్తించి పఠించడం సులభం. అంతే కాకుండా తెలుగులో మొదట గుణింతాల అవసరం లేని పదాలను కల్పించవచ్చు. రానురాను గుణింతాలు, ద్విత్వాలు, సంయుక్తాలు ఉన్న పదాలను పరిచయం చేయవచ్చు. ఈ వాక్యపద్ధతి భారతీయభాషల కంటే 26 అక్షరాల వర్ణమాల కలిగి, గుణింతాలు, ద్విత్వాలు, సంయుక్తాలు లేని ఆంగ్లం మొదలైన భాషలకు మిక్కిలి అనువుగా ఉంటుంది.

పఠనం నాలుగు రకాలు. వీటినే పఠన భేదాలు అని కూడా చెప్పవచ్చు.

1. ప్రకాశ పఠనం 2. మౌన పఠనం 3. క్షుణ్ణ పఠనం. 4.విస్తార పఠనం

ఇందులో మొదటి రెండు భేదాలు చదివే విధానానికి సంబంధించినవి. చివరి రెండు భేదాలు విషయగ్రహణకు సంబంధించినవి.

ప్రకాశ పఠనం :

దీనినే బాహ్యపఠనం, బాహిర పఠనం అని కూడా అంటారు. లిఖిత రూపంలో ఉన్న అంశాన్ని వాగింద్రియాల సహాయంతో తగు వేగంతో, తగినంత స్వరంతో, స్పష్టంగా, భావయుక్తంగా శ్రోతలకు అర్థమయ్యేటట్లు చదవడాన్ని ప్రకాశపఠనం అంటారు.ఈ పఠనం విద్యార్థుల తొలి దశలో ఎక్కువగా ఉపయోగపడుతుంది. ఉచ్చారణ దోషాలను గుర్తించడానికి, సవరించడానికి వీలు కలుగుతుంది. ఉన్నత తరగతులలో, సమావేశాలలో ఉపన్యసించేటప్పుడు పద్యాలు, గేయాలు, కథలు, ప్రసంగాలు చక్కగా చదివేందుకు ప్రకాశ పఠనం. విద్యార్థులకు మిక్కిలి ప్రయోజనాకారిగా ఉంటుంది. పాఠకుడు చదివే విషయంపై మనస్సునిలపడంవల్ల విషయగ్రహణం సులభమవుతుంది.సభలో తమ భావాలను శ్రోతలకు తెలియజేయడానికి ఉపయోగపడుతుంది. వాగింద్రియాలకు చక్కని శిక్షణ

కలుగుతుంది. పద్యాలు, గేయాలు లయబద్ధంగా చదివి కావ్య సౌందర్యాన్ని ఆస్వాదించి, ఆనందానుభూతిని పొందవచ్చు.

ఇతరులకు వాటిని కలిగించవచ్చు.

ఉత్తమ ప్రకాశపఠన లక్షణాలు :

1. స్పష్టంగా చదవడం.
2. నిర్దుష్టంగా చదవడం.
3. విషయ దోషాలు లేకుండా చదవడం.
4. సముచిత వేగంతో, భావాన్ని గ్రహిస్తూ, ఊనిక, స్వరభేధాలను పాటిస్తూ చదవడం.
5. పద్యం, గేయం, పాట, గద్యం, సంభాషణ మొదలైన వాటిని తగినట్లు చదవడం.
6. చదివేటప్పుడు మృదు స్వరంతో, శబ్ద గాంభీర్యం, అర్థగాంభీర్యం లోపించకుండా చదవడం.
7. విరామ చిహ్నాలు పాటిస్తూ చక్కగా ఉచ్చరిస్తూ చదవడం.

ప్రకాశ పఠనాన్ని సులభంగా చేయడానికి విద్యార్థుల చూపు మేర, పలుకు మేరకి సంబంధం కల్గించాలి. ఒక్క చూపులో విద్యార్థి ఎంత వరకు చూడగల్గుతాడో అది అతని చూపుమేర (నయన మితి) అవుతుంది. ఒక్క గుక్కలో పలక గలిగే పదసముదాయాన్ని పలుకుమేర(వాఙ్మితి) అంటారు. ప్రాథమిక దశలో విద్యార్థి చూపు మేర ఒక అక్షరానికి మాత్రమే పరిమితమై ఉంటుంది. క్రమంగా నేర్చుకోవడం వల్ల అది పదాలు, వాక్యాలకు విస్తరిస్తుంది. చూపు మేరను పలుకు మేరతో పాటు వృద్ధిపరచుకొన్న విద్యార్థి సులభంగా చదువగల్గుతాడు.

పఠన దోషాలు :

1. పఠనలో పునరుక్తకం ఒక దోషం.
2. నాన్చి నాన్చి చదవడం.
3. పద విభాగం తెలియకుండా చదవడం.
4. వేగంగా చదవడం.
5. చాలా మెల్లగా చదవడం.
6. వినిపించకుండా చదవడం.
7. మోతాదుకు మించిన శబ్దంతో చదవడం.

ఇలాంటి దోషాల వల్ల పఠనాన్ని వినే శ్రోతలు ఆసక్తిని కోల్పోతారు. కాబట్టి వివిధ దశల్లో పఠనాన్ని దోషరహితం చేయడానికి తగినసందర్భంలో అవసరమైన చర్యలు చేపట్టడం భాషోపాధ్యాయుల బాధ్యత అనేవిషయం మరువరాదు.

ప్రకాశపఠనానికి చేపట్టే చర్యలు :

ప్రాథమిక దశ :

1. విద్యార్థుల ఉచ్చారణ దోషాలను ఉపాధ్యాయుడు ప్రాథమిక దశలోనే నివారించాలి. లేకుంటే అవి లేఖన దోషాలుగా పరిణమిస్తాయి.
2. పఠన వేగంలో పోటీలను పెట్టాలి.
3. సుమతి, వేమన, భాస్కర, మొదలైన శతకాల్లోన్ని నీతి పద్యాలను పఠించడంలో శిక్షణ (అభ్యాసా లను) ఇవ్వాలి.
4. విద్యార్థుల స్థాయికి తగినట్లు వ్యాసాలను, ఉపన్యాసాలను వ్రాయించి వారిచే చదివించాలి.
5. తెలుగు వాచకాల ఆధారంగా విద్యార్థులు సరళంగా, ధారాళంగా, పఠించేటట్లు శిక్షణ ఇవ్వాలి.

మాధ్యమిక మరియు ఉన్నత దశల్లో ప్రకాశపఠనాభివృద్ధికి ఈ క్రింది విధంగా చేయాలి :

1. ప్రతి రోజు ఉదయం ప్రార్థనసమావేశంలో వార్తాపత్రికల్లోని వార్తలను, విశేషాల్ని విద్యార్థుల చేత చదివించాలి.

2.పురాణ, ఇతిహాసాలు, శతక నీతిపద్యాలు, దేశభక్తి గీతాల నుండి, విద్యార్థుల స్థాయికి తగిన వాటి ని ఎంపిక చేసుకొని, రస, భావాలకు అనుగుణమైన వాచికాభినయంతో చదివే నైపుణ్యాన్ని కలిగించడా నికి తగిన అభ్యాసాలను (శిక్షణ) ఇవ్వాలి.

3.పద్యాలను, గేయాలను లయబద్ధంగాను, సందర్భానికి తగినట్లు పదవిభజన చేస్తూ, భావానుగు ణంగా పఠించడానికి శిక్షణఇవ్వాలి.

4.విద్యార్థులకు కవి సమ్మేళనాలు నిర్వహించి, కవితలు, కథలు, వ్యాసాలు వ్రాసే విద్యార్థులకు సభా వేదికపై చదివే అవకాశాన్ని కల్పించాలి.

5.చాలా మంది సమక్షంలో సభావేదికపై చదవవలసిన సందర్భాలలో విద్యార్థులు స్పష్టంగా, నిర్దుష్టం గా పలు పఠనరీతులను పాటిస్తూ చదవడానికి ప్రయత్నిస్తారు.

6.సభావేదికల్లో విద్యార్థుల కార్యక్రమాలను రికార్డు చేసి, వాటిని తీరిక సమయాల్లో విద్యార్థులకు వినిపించినప్పుడు వారి తప్పిదాలను వారు తెలుసుకొంటారు.

ప్రకాశ పఠనం - పరిమితులు

1. ఈ పఠనం ద్వారా ఎక్కువ సేపు పఠనం చేయడం వల్ల వాగింద్రియాలకు శ్రమ కల్గుతుంది.
2. ఈ పఠనం వల్ల సమయం కలిసిరాదు.
3. పరిసరాల్లోని వారికి ఆటకం కల్గుతుంది.
4. నత్తి, దొ్రి ఉన్న వాళ్ళకు ఈ పఠనం అనుకూలం కాదు.

మౌన పఠనం :

ఇది బాహ్య పఠనం కంటే భిన్నమైనది. వాగింద్రియాలతో పని లేకుండా కంటితో చూసి, మనసు లోనే పఠించి విషయాన్ని అర్థం చేసుకొనే పఠనాన్ని మౌనపఠనం అంటారు. ప్రాథమిక దశలో దీనికి ప్రాధాన్యం తక్కువ. మాధ్యమిక, ఉన్నత దశలలో మౌన పఠనానికి ప్రాధాన్యం ఎక్కువ. ఎంత ఎక్కువ చూపు మేర ఉంటే అంత వేగంగా అంశాన్ని చదవగలం. బాహ్య పఠన పరిమితులను అధిగమించి సమగ్ర పఠన నైపుణ్య ప్రయోజనాన్ని అందించగలిగేది మౌనపఠనమే.

మౌనపఠనం ప్రయోజనాలు :

1. తక్కువ కాలంలో ఎక్కువ విషయాలను చదివి అర్థం చేసుకోవచ్చు.
2. ఈ పద్ధతిలో వాగింద్రియాలతో సంబంధం ఉండదు.
3. ఎక్కువ సమయం పఠనాన్ని కొనసాగించవచ్చు.
4. ఈ పఠనం వల్ల ప్రక్కవారికి ఇబ్బంది కలుగదు.
5. విస్తార పఠనాన్ని పెంపొందించుకోవడానికి తోడ్పడుతుంది.
6. అర్థగ్రహణ శక్తి పెంపొందుతుంది.

మౌన పఠనాన్ని పెంపొందించే మార్గాలు :

ప్రాథమిక దశ :

ప్రాథమిక దశలో దీని ప్రాధాన్యం తక్కువగా ఉంటుంది. అయినా మాధ్యమిక ఉన్నత దశల్లో మౌనపఠనం పెంపొందించడానికి ప్రత్యేక కృషి (శిక్షణ) అవసరం.

1.ప్రాథమిక దశలో విద్యార్థులకు పఠనాభ్యాసం తరువాత వారికి పరిచయమైన మాటలను ఉపాధ్యా యుడు నల్లబల్ల మీద వ్రాసి విద్యార్థులను తమ పలకల మీద వ్రాసేటట్లు చేయాలి. ఈ పనిని విద్యార్థులు నిశ్శబ్దంగా చేస్తారు. తద్వారా వారు క్రమంగా మౌనపఠనానికి అలవడుతారు. ఈ అలవా టు మాధ్యమిక, ఉన్నత దశలలో మౌన పఠనానికి పరోక్షంగా ఉపకరిస్తుంది.

2. 3,4,5 తరగతులలో క్రమశిక్షణ నెలకొల్పడానికి వీలుగా పాఠం ప్రారంభించేటప్పుడు నిలబడండి, కూర్చోండి మొదలైన ఆదేశాలు వ్రాసి ఉన్న అట్టముకలను చూపించడం వలన విద్యార్థులకు మౌనపఠనం అలవడుతుంది.

3. 4,5 తరగతులలో విద్యార్థులకు ఆసక్తి కలిగించే కథలు, పత్రికలనుండి కొన్ని అంశాలను తీసుకొని పఠనం చేసి సందర్భాలు కల్పించడం. తద్వారా మౌనపఠన సామర్థ్యం పెంపొందించవచ్చు.

మాధ్యమిక – ఉన్నత దశలు

మౌన పఠనాభివృద్ధికోసం ఈ క్రింది వాటిని ఉపయోగించవచ్చు.

1. గ్రంథాలయాలు: విద్యార్థులకు ఉపకరించే కథల పుస్తకాలు, హాస్యరచనలు, దేశభక్తుల చరిత్రలు, పౌరాణిక నాటకాలు, పత్రికలు, విస్తారంగా చదివే సౌకర్యం కల్పించాలి.

2. విద్యార్థులకు ఆసక్తికరంగా ఉండే బాలసాహిత్య పుస్తకాలు ఇచ్చి కనీసం వారానికి రెండు పీరియడ్లు కేటాయించి చదివించడం.

3. విద్యార్థుల తీరిక సమయాలను మౌన పఠనానికి కేటాయించి ఉపవాచకాలను మౌనంగా చదివి విషయాలను గ్రహించి ఇచ్చిన నియోజనాలకు సమాధానాలు వ్రాసే విధంగా ఉపాధ్యాయులు పథకాన్ని రూపొందించుకోవాలి.

ప్రయోజనాలు :

1. వేగంగా చదవడం.
2. చదివిన విషయాలను గ్రహించగలగడం.
3. మౌన పఠనం ద్వారా ఉత్తమ గ్రంథ పఠనాసక్తి పెరుగుతుంది.
   తద్వారా జ్ఞాన సంపాదన, సామర్థ్యం పొందవచ్చు.
4. విసుగు కలగదు.
5. విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని ఒకేసారి పరీక్షించవచ్చు.
6. ఇతరుల అవధానానికి భంగం కలగదు.

**బాగా స్పష్టంగా చదివే విద్యార్థి పఠనాన్ని, రేడియో, టి.వి. వార్తలను రికార్డు చేసి వినిపించడం.**

మౌనపఠనానికి ఉన్న పరిమితులు :

1. వినేవారికి (శ్రోతలకు) వినిపించడానికి అవకాశం ఉండదు.
2. ఉచ్చారణ దోషాలను, శబ్దదోషాలను సరిచేసుకోలేరు.
3. సంకల్పిత అవధానం లోపించడానికి అవకాశం ఉంది.
4. అసంకల్పిత అవధానం వల్ల (మనస్సును నిలపనందువల్ల) చదివిన విషయం గుర్తించుకోవడానికి అవకాశం తక్కువ
5. లయబద్ధంగా చదివి ఆనందానుభూతిని పొందలేరు.

విషయగ్రహణానికి సంబంధించి పఠనం రెండు రకాలు :

1. క్షుణ్ణ పఠనం 2. విస్తార పఠనం

క్షుణ్ణ పఠనం : క్షుణ్ణ పఠనమంటే గద్య, పద్యాలను ప్రతిపదార్థ తాత్పర్యాలతో పరిపూర్ణంగా తెలుసుకొంటూ చదవడం అని అర్థం. ప్రతిశబ్దంమీద అర్థంమీద దృష్టిని ఉంచి ఆమూలాగ్రం పఠించడమే క్షుణ్ణపఠనం. సారస్వతాన్ని (సమగ్రంగా) పఠించడమే క్షుణ్ణపఠన ఉద్దేశ్యం.

Nash చెప్పినట్లు గాసట బీసటగా వివిధ విషయాలు చదవడం కంటే విషయమొక్కటి అయినా

క్షుణ్ణంగా నేర్వడం మేలు.

క్షుణ్ణ పఠనం - ప్రయోజనాలు :

1. ఈ పఠనం వల్ల సాహిత్యాభిరుచి, వివిధ సాహిత్య ప్రక్రియల్లోనిశైలి, రీతి, వృత్తులు, పాకాలు, రస . బేధాలు, ఛందస్సు, అలంకారాల్లోని భేదాలు మొదలైనవి తెలుస్తాయి.
2. ఈ పఠనం ద్వారా కావ్య సౌందర్యాన్ని పెంపొందించే రచనా శిల్పాన్ని విద్యార్థులు గ్రహించేటట్లు చేస్తుంది.
3. విద్యార్థులకు శబ్దం అర్థం, దాని వినియోగ యోగ్యత (సామర్థ్యం) అలవడుతుంది.
4. భాషా స్వరూపం తెలుస్తుంది.
5. భాషలో లోతైనజ్ఞానం ఏర్పడుతుంది.
6. కవి భావాన్ని, కవితాత్మను పరిపూర్ణంగా తెలుసుకొంటారు.
7. మాతృభాష ప్రయోజనాలన్నింటినీ వీలైనంత వరకు సాధించవచ్చు.
8. మాతృభాషాభ్యసనం పరభాషాభ్యసనానికి ఉపకరిస్తుంది.

విస్తార పఠనం :

చాలా తక్కువ సమయంలో ఎక్కువ పుస్తకాల్లోని విషయాలను చదివి అవగాహన చేసుకోవడం విస్తారపఠనం అంటారు. ఇందులో భాష కంటే విషయం, భావం ప్రాధాన్యం వహిస్తాయి. గ్రంథాలయాల్లోని పలు అంశాలకు చెందిన పుస్తకాలు,ఉపవాచకాలు ఈ పఠనానికి ఉపకరిస్తాయి. కేవలం వాచక పుస్తకాలతోనే విద్యార్థుల భాషాభివృద్ధి, జ్ఞానార్జన, భాషా నైపుణ్యాలు సమగ్రంగా సిద్ధించవు. కాబట్టి భాషపై ఆధిపత్యం కలగడానికి ఎక్కువ పదజాలాన్ని కూర్చుకోవడానికి విద్యార్థుల కు విస్తార పఠనం ఎంతో అవసరం.

విస్తారపఠనం - ప్రయోజనాలు :

1. విశ్రాంతి కాలాన్ని గ్రంథ పఠనానికి ఉపయోగించడం వల్ల విజ్ఞానాభివృద్ధి కలుగుతుంది.
2. గ్రంథ పఠనం వల్ల ప్రాపంచిక జ్ఞానం కలుగుతుంది.
3. విద్యార్థి శారీరక, మానసిక అలసటను తగ్గించి బుద్ధి వికాసాన్ని పెంపొందిస్తుంది.
4. సాహిత్యాభిరుచిని పెంపొందించి, రచనా నైపుణ్యం సిద్ధింపజేస్తుంది.
5. విద్యార్థికి స్వయంకృషిపై నమ్మకం పెరుగుతుంది.
6. సంపూర్ణ మూర్తిమత్వానికి దోహదం చేస్తుంది.

విస్తార పఠన నైపుణ్యం పెంపొందించే మార్గాలు :

| | |
|---|---|
| 1. గ్రంథాలయాలు | 2. వివిధ పత్రికలు |
| 3. పాఠశాల పత్రిక | 4. సారస్వత సంఘాలు |
| 5. పుస్తక ప్రదర్శనలు | 6. ఉపవాచక వినియోగం |

1. గ్రంథాలయాలు :

గ్రంథాలయాల్లోని గ్రంథాలను చదవడానికి ఉపాధ్యాయుడు విద్యార్థులను ప్రోత్సహించాలి. దీని కోసం వారానికి ఒక గంట వినియోగించాలి. మాధ్యమిక స్థాయి నుంచే విస్తార పఠనంలో నైపుణ్యాన్ని పెంపొందిచండం వల్ల ఉన్నత స్థాయికి ఈ శక్తి ఎంతగానో ఉపకరిస్తుంది. మంచి పుస్తకాలకుమించిన మిత్రులు లేరు అన్నది ఆర్యోక్తి.

2. వివిధ పత్రికలు :

విషయ సేకరణ కోసం వివిధ దినపత్రికలు, వార పత్రికలు చదివేటట్లు సహకరించాలి. ప్రస్తుతం

పత్రికలు విద్యార్థుల జ్ఞానాన్ని పెంపొందించడానికి అవసరమైన రచనలు అందిస్తున్నాయి. ఉపాధ్యాయుడు విద్యార్థులకు అవగాహన కలిగే విధంగా ప్రోత్సాహించి సహకరించాలి.

3. పాఠశాల పత్రిక :

పాఠశాల పత్రిక నిర్వహించడం వల్ల ఈ పత్రికలో తమ రచనలు ఉండాలనీ విద్యార్థులు కోరుకొంటారు. అందుకుగాను విద్యార్థులకు ఇష్టమైన వివిధ ప్రక్రియలలో రచనలు చేయడానికి ప్రోత్సాహించాలి.

4. సారస్వత సంఘాలు : పాఠశాలలో సారస్వతసంఘాలు విద్యార్థుల్లో పరిపూర్ణమూర్తిమత్వాన్ని పెంపొందించడానికి ఉపకరిస్తాయి. చర్చలు, ప్రసంగాలు, వాద వివాదాలు, వ్యాసరచన పోటీలు మొదలైన కార్యక్రమాల్ని ఉపాధ్యాయుడు చేపట్టాలి. ఇందుకుగాను కొంతసమయం కేటాయించాలి. విద్యార్థులు అందులో పాల్గొనడానికి కావలసిన సమాచారం కోసం గ్రంథాలయాలకు వెళ్లి సంబంధిత గ్రంథాలను చదువుతారు.

5. పుస్తక ప్రదర్శనలు : పాఠశాలలో రెండు నెలలకొకసారి విద్యార్థులు తాము సేకరించిన పుస్తకాలను ప్రదర్శించే అవకాశాన్ని ఉపాధ్యాయులు కల్గించాలి. తద్వారా విద్యార్థులకు పుస్తక ప్రదర్శనపై ఆసక్తి కలిగి, మంచి పుస్తకాలను సేకరించే అలవాటు కలుగుతుంది. ఈ విధంగా తెలియని ఎన్నో పుస్తకాల సమాచారాలను తెలుసుకొంటారు. తద్వారా పఠనాభిలాషను పెంపొందించుకొంటారు.

6. ఉపవాచక వినియోగం :

స్వయంకృషితో ఉపవాచకంలోని విషయం గ్రహించేలా ఉపాధ్యాయుడు విద్యార్థులను ప్రోత్సహించాలి. ఉపవాచకాన్ని సొంతంగా చదివి ఉపాధ్యాయుడు ఇచ్చిన నియోజనాలకు సమాధానాలు విద్యార్థి వ్రాయడం వల్ల ఆత్మవిశ్వాసం పెంపొంది అనేక పుస్తకాలు చదవాలనే ఆసక్తి కలుగుతుంది. పై విధంగా విస్తార పఠన నైపుణ్యాలను పెంపొందించవచ్చు.

## 3.5 లేఖనం

పరిచయం :

లిపి రూపమైన భావప్రకటన సాధనమే లేఖనం. లిపిరూపాలను గుర్తుపెట్టుకొని వ్రాయడాన్ని లేఖనం అంటారు. భాషణ, లేఖనాలు, భావ వ్యక్తీకరణ సాధనాలు. శ్రవణ భాషణలు ధ్వనితో కూడుకొన్నవి కాగా పఠన, లేఖనాలు లిపితో కూడుకొన్నవి. పఠనం కంటే లేఖనం కష్టతరం. మనోవిజ్ఞానం ప్రకారం మొదట భాషణ నైపుణ్యాన్ని పెంపొందించిన తరువాతనే లేఖన నైపుణ్యం పరిచయం చేయాలి.

లేఖన సంసిద్ధత ( ఆధునిక పద్ధతి )

అభ్యసనానికి సంసిద్ధత చాలా ముఖ్యం. లేఖనం కష్టతరమైన నైపుణ్యం. చిన్న పిల్లల చేతి వ్రేళ్ళు చాలా లేతగా, సున్నితంగా ఉంటాయి. ప్రాథమిక దశలో బలపమో, పెన్సిలో పట్టి వ్రాయడానికి చేతి వ్రేళ్ల సమన్వయం అవసరం, వ్రాసేటప్పుడు కంటికి – చేతివ్రేళ్ళకు సమన్వయం కుదిరితే లేఖనాన్ని సాధించడం సులభమవుతుంది. బడిలో పిల్లలు చేరిన వెంటనే వారికి అక్షరాలు, గుణింతాలు నేర్పకూడదు. మొదట బలపం పట్టుకొనే పద్ధతి నేర్పించాలి. పిల్లలకు ఆనందాన్ని కలిగించే రకరకాల గీతలు, సున్నలు చుట్టించాలి. వాళ్ళకు ఇష్టమైన బొమ్మలు గీయించాలి. అలా చేయడానికి వారికి స్వేచ్ఛను ఇవ్వాలి. అప్పుడు వాళ్ళు లేఖనాన్ని ఒక క్రీడలా భావిస్తారు.

మనం నేర్పే విషయాలకు తగినట్లు ఆటలు అన్వయించాలి. అలా చేయగలిగినపుడు అభ్యసనం సహజంగా ఉంటుంది. తద్వారా వాళ్ళ చేతివ్రేళ్లు, కండరాలు క్రమక్రమంగా సమన్వయాన్ని పొంది వ్రాతకు (లేఖనానికి) సహకరిస్తాయి. ఆ తర్వాత మనం వారిని అక్షరాల వైపు మళ్లించవచ్చును. దీనినే లేఖన సంసిద్ధత అంటారు.

ఉత్తమ లేఖనానికి చెందిన లక్షణాలు :

1) ప్రాథమిక దశ :

అ) స్పష్టంగా వ్రాయడం.

ఆ) దోషాలు లేకుండా వ్రాయడం.

1) ధ్వని దోషాలు లేకుండా వ్రాయడం.

2) భాషా దోషాలు లేకుండా వ్రాయడం.

3) విషయ దోషాలు లేకుండా వ్రాయడం.

ఇ) ఆత్మవిశ్వాసంతో వ్రాయడం.

ఈ) సముచిత వేగంతో ధారళంగా వ్రాయడం.

> అచ్చుల ఆకారాలను సేకరించి వాటిని ఎలా ప్రారంభించి, కొనసాగించి ముగించాలో క్రమంగా వాటి ఆకారంతో పాటు బాణంగుర్తు వేసి చూపించండి

మాధ్యమిక దశ :

అ) సమతతో వ్రాయడం (వర్ణాలన్నీ నియమిత పరిమాణంలో ఉండేలా అక్షరానికి అక్షరానికి మధ్య పదాలకు మధ్య, వాక్యాలకు వాక్యాలకు మధ్య నియమిత దూరం ఉండడం)

ఆ) భావనను క్రమంలో వ్రాయడం.

ఇ) విరామ చిహ్నాలు పాటిస్తూ వ్రాయడం.

ఉన్నత దశ :

1) ఆలంకారికంగా వ్రాయడం.

2) భావానికి తగిన భాషతో వ్రాయడం.

3) జాతీయాలను, సామెతలను వినియోగిస్తూ వ్రాయడం.

4) ప్రక్రియానుగుణంగా వ్రాయడం

5) సందర్భానికి తగిన భావాలను ప్రకటించడం.

6) సొంత శైలిలో వ్రాయడం, తద్వారా ఎవరి శైలి వారికి అలవడుతుంది.

## లేఖన ఆవశ్యకత

భాషణం ద్వారా మన భావాలను ఎదుటి వారికి తెలపడానికి వీలవుతుంది. అయితే దూరంగా ఉన్నవారికి మన భావాలను తెలపడానికి, వారి భావాలను మనం గ్రహించడానికి, మాటల రూపంలో ఉండే భాష మనకు ఉపకరించదు. అలాంటప్పుడు లిపి రూపంలో ఉండే భాష మాత్రమే అనగా లేఖనం మాత్రమే ఉపకరిస్తుంది. తరతరాల జ్ఞానాన్ని, భావితరాల వారికి అందించడానికి, వ్యక్తి జ్ఞానానికి ఒక స్థిర రూపం కలిగించడానికి, వాగ్రూపమైన భాషకు స్థిరత్వాన్ని చేకూర్చడానికి లేఖనం ఎంతో అవసరం. వార్తా విశేషాలను, పాఠకులకు తెలిసే విధంగా పత్రికల్లో ప్రచారం చేయడానికి లేఖనం ఉపయోగపడుతుంది. కవులు, రచయితలు తమ భావాలను వెలువరించడానికి లేఖనమే ఉపకరిస్తుంది. (లిఖిత పరీక్షల మూలంగా) విద్యార్థులు తమ సామర్థ్యాలను, నైపుణ్యాలను, నిరూపించుకోగలుగుతారు. బహుముఖ ప్రయోజనాలున్న లేఖనాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మకంగా నేర్పించాలి.

ప్రాచీన  పద్ధతి :

ఈ పద్ధతి ప్రకారం పూర్వం పాఠశాలలో ప్రవేశించిన పిల్లలకు మొదట లేఖనం నేర్పించేవారు అర్థం లేని అక్షరాలను దిద్దడం వల్ల పిల్లలకు విసుగు కలిగి, చదువుపై అనాసక్తి కలిగేది. ఈ విధంగా ప్రారంభంలోనే పిల్లల్లో విద్యపై అనాసక్తి కలిగించరాదు. ఈ పద్ధతి మనోవిజ్ఞానశాస్త్రం ప్రకారం సరియైన పద్ధతి కాదు. కాబట్టి భాషణాన్ని, పఠనాన్ని నేర్పిన తరువాతనే వ్రాతను నేర్పించాలి.

పఠనానికి వ్రాతకు గల సంబంధం : ( వ్రాత నేర్పేపద్ధతి)

పిల్లలకు వ్రాతను నేర్పించడానికి మొదట పఠనం చేయించాలి. పిల్లలకు పరిచయమైన బొమ్మలను చూపించి, వాటి క్రింద వ్రాసిన పేర్లను వారిచే పలుమార్లు చదివించవచ్చు. ఈ విధంగా చదివించడం వల్ల విద్యార్థులు చిత్ర స్వరూపాన్ని మనస్సునందుంచుకొన్నట్లే దానికి సంబంధించిన లిపిని కూడా మనస్సునందు ఉంచుకోగలరు. ప్రారంభంలో పదాన్ని గుర్తింపజేసి వాటిని వ్రాయించవచ్చును. ఒక అక్షరాన్ని వ్రాసేటపుడు ఆ అక్షరాన్ని మొదట ఎలా ప్రారంభించాలో, ఎలా కొనసాగించి ముగించాలో నల్లబల్లపై వ్రాసి చూపించాలి.

ఉదా   అమ్మ

అమ్మ

పఠనానికి లేఖనానికి గల సంబంధాన్ని ఉపాధ్యాయుడు విస్మరించరాదు. మొదట పఠనం, ఆ తర్వాత లేఖనాన్ని నేర్పించాలి. పఠన లేఖనాలకు క్రీడా పద్ధతిని అనుసరిస్తే విద్యార్థులకు అభ్యసనంపై ఆసక్తి కలుగుతుంది.

లేఖనం – ఉద్దేశ్యాలు :

1. స్పష్టంగా నిర్దుష్టంగా వ్రాసే అలవాటును విద్యార్థులకు కలిగించడం.

2. అక్షరరూపాన్ని సారూప్యాన్ని తెలుసుకొని వ్రాసేటట్లు చేయడం.

3. అంశాన్నిభావానుక్రమంలో పరిచ్ఛేదాలుగా (పేరాలు) విభజించి వ్రాసే అలవాటును విద్యార్థుల్లో కలిగించడం.

4. భాషాదోషాలు, భావదోషాలు, విషయ దోషాలు లేకుండా వ్రాసేటట్లు చేయడం. విరామ చిహ్నాలను పాటిస్తూ వ్రాసే అలవాటును పెంపొందించడం.

5. విషయ విపులీకరణ, విషయ సంక్షిప్తీకరణ విధానాలను విద్యార్థులకు తెలియబరచడం.

6. సముచిత వేగంతో ధారాళంగా, అందంగా వ్రాసే అలవాట్లను కలిగించడం.

7. సమత పాటిస్తూ, నియమిత పరిమాణంలో అక్షరాలు ఉండేలా పదాలను, వాక్యాలను వ్రాసే విధానాన్ని అభివృద్ధి చేయడం.

8. భావానుగుణమైన భాషను ఉపయోగిస్తూ ఆలంకారికంగా వ్రాసే నైపుణ్యాన్ని పెంపొందించడం.

9. సృజనాత్మక రచన ( నూతన పద్ధతుల్లో) రీతుల్ని ప్రక్రియ విధానాలను అవసరానుగుణంగా ఉపయోగిస్తూ రచనలను చేసే నేర్పును కలిగించడం.

10. జాతీయాలను, లోకోక్తులను, సామెతల్ని, నానుడుల్ని అవసరానుగుణంగా ఉపయోగిస్తూ రచనలను చేసే నేర్పును కలిగించడం.

11. విద్యార్థుల ప్రతిభ, ఉత్పత్తి, అభ్యాసాల ఉత్పత్తికనువైన వివిధ అభ్యాసాలు నిచ్చి రచనా నైపుణ్యాలను పెంపొందించడం.

12. విద్యార్థి తనదైన శైలిలో ఆమోదయోగ్యమైన రచనలను వెలువరించే అవకాశాలను కలిగించి, రచనా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం.

13. విద్యార్థుల్లో భావుకతను సృజనాత్మక శక్తిని వికసింపజేసి ఉదాత్తమైన రచనా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఉత్తమ రచయితలుగా మలచడం.

14.విద్యార్థుల్లో లేఖనకౌశలాలను, రచనా నైపుణ్యాలను, సామర్థ్యాలను అభివృద్ధి చేసి వారిని సంపూర్ణ మూర్తి మత్వంగల వారినిగా తీర్చిదిద్దడం.

15.అనువాద రచనా సామర్థ్యాన్ని పెంపొందించడం.

లేఖనం – ప్రయోజనాలు :

విద్యార్థులకు లేఖనం వల్ల క్రింది ప్రయోజనాలు కలుగుతాయి.

1. శబ్ద స్వరూపం చక్కగా గ్రహించడానికి వీలవుతుంది.
2. అక్షర జ్ఞానం ఏర్పడుతుంది.
3. పఠనంపై ఆసక్తి కలుగుతుంది.
4. లేఖనం ద్వారా భావ ప్రకటన సామర్థ్యం పెంపొందుతుంది.

ఉత్తమ లేఖనానికి ఉండవలసిన లక్షణాలు :

1.స్పష్టత : అక్షరాలన్ని స్పష్టంగా కనబడాలి. అక్షరానికి, అక్షరానికి మధ్య కొంత స్థలం, (కలియ కుండా ఉండునట్లు) ఉండాలి. అదే విధంగా పదానికి, పదానికి మధ్య కొంత స్థలం వదిలి వ్రాయాలి. ఈ విధంగా ఉంటే పాఠకులకు (చదివేవారికి) అర్థమవుతుంది. కాబట్టి వ్రాతలో స్పష్టత ఉండాలి.

2.పరిమాణం : విద్యార్థులు వ్రాసేటపుడు అక్షరాలన్ని ఒకే పరిమాణం కలిగి ఉండే విధంగా వ్రాయాలి. కొన్ని అక్షరాలు పెద్దవిగాను, కొన్ని చిన్నవిగాను ఉంటే వ్రాత సుందరంగా ఉండదు. కాబట్టి ఉపాధ్యాయుడు ఒకే పరిమాణంగల అక్షరాలను వ్రాయడానికి తగిన శిక్షణ ఇవ్వాలి.

3. వేగం :– వ్రాసేటప్పుడు కొంత వేగం పాటించాలి. ఎక్కువ వేగంగా, ఎక్కువ నెమ్మదిగా వ్రాయకూడదు. కావున ఉపాధ్యాయుడు తగిన వేగంతో వ్రాయడానికి విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇవ్వాలి. నిమిషానికి 20–30 పదాలు వ్రాసే వేగాన్ని నేర్పించాలి.

4. నిర్దుష్టత :– లిఖిత సంబంధమైన దోషాలు లేకుండా వ్రాయాలి. వ్రాతలో తప్పులు ఉండే భావప్రకటనం, భావ గ్రహణం కుంటుబడుతుంది. కాబట్టి విద్యార్థులు వ్రాతలో తప్పులు లేకుండా వ్రాయడానికి, ఉపాధ్యాయుడు తగిన శ్రద్ధ చూపాలి. ప్రాథమిక దశలో ఇవి సవరించబడాలి.

5. సౌందర్యం :

తెలుగు అక్షరాలన్ని అందంగా, గుండ్రంగా వ్రాసేటట్లు చూడాలి. గొలుసుకట్టుగా కలిపి వ్రాయడం కూడదు. కోలగా వ్రాయకూడదు. అక్షరాలను అందంగాను, స్పష్టంగాను ఉండేటట్లు ఉపాధ్యాయుడు విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వాలి.

1. గీతలపై చక్కగా పొందికగా ఉండేటట్లు వ్రాయాలి.
2. పదాలను వ్రాసేటపుడు వంకర పోకుండా పంక్తులు సమాంతరంగా ఉండేటట్లు వ్రాయాలి.
3. వ్రాత ముత్యాల సరాల్లా ఉండి పాఠకులకు ఆహ్లాదాన్ని కల్గించాలి.
4. విరామ చిహ్నాలను పాటిస్తూ వ్రాయాలి.

విద్యార్థులు వ్రాత ప్రాధాన్యతను గుర్తించేటట్లు ఉపాధ్యాయుడు శ్రద్ధ వహించాలి.

వ్రాతకు శిక్షణ యిచ్చే సమయంలో ఉపాధ్యాయుడు కొన్ని జాగ్రత్తలను పాటించమని విద్యార్థులకు సూచించాలి. వ్రాసేటపుడు తగినంత వెలుతురు ఉండాలి. విద్యార్థి కూర్చొనే విధానం అతని వ్రాతను ప్రభావితం చేస్తుంది. వ్రాసేటపుడు నడుం వంచుకొని వ్రాయడాన్ని నివారించాలి. వెన్నెముకను

వంచకుండా చక్కగా కూర్చొని బల్లపై చేతులుంచి కుడిచేయి భుజం వ్రాసే వరుసకు లంబంగా ఉండేటట్లు చూడాలి. పలకను, బలపాన్ని, పెన్సిల్‌ను, కలాన్ని, పుస్తకాన్ని పట్టుకోవడంలోను, కూర్చోవడంలోను, ఉపాధ్యాయుడు తగిన విధంగా శిక్షణ ఇవ్వాలి. ఉపాధ్యాయుడు లేఖన సమయంలో విద్యార్థులు చేసే దోషాలను సవరిస్తూ ఉండాలి. కాగితంపై వ్రాసేటప్పుడు క్రింద సహాయంగా గట్టి అట్ట పెట్టుకొంటే అనుకూలంగా ఉంటుంది.

మంచి దస్తూరి ( వ్రాత) చక్కని విద్యకు ఒక నిదర్శనం అని గాంధీజీ సెలవిచ్చారు .

లేఖన దోషాలు - నివారణోపాయాలు :

విద్యార్థులు సాధారణంగా చేసే ఉచ్చారణ దోషాలే క్రమంగా లేఖన దోషాలుగా పరిణమిస్తాయి. స్పష్టమైన, నిర్దుష్టమైన భాషణం దోషరహితమైన లేఖనానికి ఉపకరిస్తుంది. ఉపాధ్యాయుడు నిర్లక్ష్యం చేస్తే అవే లిఖిత దోషాలుగా స్థిరపడుతాయి. ఉపాధ్యాయుడు బాధ్యతలో విద్యార్థుల ఉచ్చారణ దోషాలను గమనిస్తూ తగిన సందర్భంలో సవరిస్తే దోషరహిత లేఖనాన్ని పెంపొందించవచ్చు.

లిఖిత దోషానికి - కారణాలు :

1. విద్యార్థుల ఉచ్చారణలో దోషాలు, అవి వారి వ్రాతలో దోషాలకు కారణాలవుతాయి.
2. సరియైన శబ్దజ్ఞానం విద్యార్థిలో లేకుంటే వ్రాత దోషాలు కలుగుతాయి.
3. గుణింతం చక్కగా తెలియకపోవడం వల్ల లిఖిత దోషాలు ఏర్పడుతాయి.
4. పఠించేటప్పుడు, రాసేటప్పుడు పదాలను చక్కగా గమనింపక పోవడం వల్ల లిఖిత దోషాలు సంభవిస్తాయి.
5. అక్షర రూపాలను సరిగా గుర్తుపట్టలేకుంటే దోషాలు కలుగుతాయి.
6. విషయం సరిగా తెలియకపోవడం వల్ల తప్పులను వ్రాస్తారు.
7. సరియైన వ్యాకరణ జ్ఞానం లేనందు వల్ల దోషాలు కలుగుతాయి.
8. విద్యార్థులకివ్వబడిన వ్రాత పనిలోను దోషాలను ఉపాధ్యాయుడు ఎప్పటికప్పుడు చూడకపోవుట వలన ఈ దోషాలు కలుగుతాయి. విద్యార్థుల లిఖిత దోషాలను 5 విధాలుగా విభజించవచ్చు.

1. అక్షర దోషాలు 2. పదదోషాలు 3. వ్యాకరణ దోషాలు 4.విషయదోషాలు 5. విరామచిహ్నాల దోషాలు

1. అక్షరదోషాలు :

విద్యార్థుల వ్రాతలో అక్షరాలను తప్పుగా వ్రాయడం. వీటినే వర్ణదోషాలని కూడా అంటారు.

ఉదా

1. వేంకటేశ్వరుడు - వెంకటేశ్వరుడు
2. దుర్యోధనుడు - ధుర్యోదనుడు
3. శిశువు - సిసువు

2. పదదోషాలు :

విద్యార్థులు ఒక పదానికి బదులుగా మరొక్క పదాన్ని వ్రాయడం - ఓడ ( ఒప్పు) - ఒడ (తప్పు)

3. వ్యాకరణ దోషాలు :

విద్యార్థులు తమ రచనలో సంధి, సమాస, లింగ, కాల, వచన, విభక్తి మొదలైన వ్యాకరణాంశాలను తప్పుగా వ్రాయడాన్ని వ్యాకరణదోషాలు అంటారు.

ఉదా సంధి :

రాముడు + ఉన్నాడు = రాముడున్నాడు ( ఒప్పు)

రాముడుయున్నాడు (తప్పు)

సమాసం :

యావత్ + జనులు = యావజ్జనులు (ఒప్పు)

యావన్మంది (తప్పు)

లింగం : సీత అన్నం తిన్నది (ఒప్పు)

సీత అన్నం తిన్నాడు (తప్పు)

కాలం : రేపు నేను వస్తాను (ఒప్పు)

రేపు నేను వచ్చాను (తప్పు)

4. విషయదోషాలు :

వ్రాయవలసిన విషయాన్ని తప్పుగా వ్రాయడం.

ఉదా చతుర్ముఖుడు = బ్రహ్మ (ఒప్పు)

షణ్ముఖుడు = బ్రహ్మ (తప్పు)

5. విరామ చిహ్నాల దోషాలు :

రచనలో విరామ చిహ్నాలను సరిగా పాటించడం లేఖకుని అవగాహనకు అద్దం పడుతుంది.

ఉదా: 1. "ఆహా ! తాజ్ మహల్ ఎంత అందంగా ఉంది ! " అన్నాడొక విదేశీయుడు.

ఏదైనా ఒక శీర్షికను తీసుకొని వ్యాసరచన చేయండి.
రచనదోషాలు లేని ఆదర వంతమైన ఆ వ్యాసాన్ని తరగతి గదిలో
చార్టుపై పదరి ంచండి

లేఖనదోషాల నివారణ:

1. భాషాదోషాలు, భావదోషాలు, వ్యాకరణ దోషాలు, విరామ చిహ్నాలను ఉపయోగించడంలో దోషాలను సులభంగానివారించవచ్చు.వాటినిసరియైనరూపాలను విద్యార్థులకు తెల్పడంద్వారావీటినితొలగించవచ్చు.

2. విద్యార్థుల చేసే దోషాలను వ్యక్తిగతంగా సవరించి చూపాలి.

3. తరగతి గది నల్లబల్లపై వ్రాసి చూపిన తప్పులను సరిదిద్దుకొనేటట్లు చేయాలి.

4. విద్యార్థులకు చూచివ్రాత వంటి పనులను ప్రతి రోజు అవసరమైనంత ఇవ్వాలి.

5. ఉపాధ్యాయుడు ప్రతి పదాన్ని స్పష్టంగా పలుకుతూ వ్రాస్తూ, విద్యార్థులకు ఆదర్శంగా వుండాలి.

6. సక్రమమైన వ్యాకరణ జ్ఞానం కల్గించాలి.

7. ఇంటి పనిని ప్రతి రోజూ ఇవ్వాలి.

దృష్టలేఖనం, ఉక్తలేఖనం, లిఖితచర్య అనే లేఖనాభ్యాసాల ద్వారా విద్యార్థుల్లో లేఖన నైపుణ్యాన్ని పెంపొందించవచ్చు.

దృష్ట లేఖనం : (చూచి వ్రాయడం) (Copywriting)

ఉపాధ్యాయుడు నల్లబల్లపై వ్రాసిన లేదా పుస్తకంలో అచ్చు వేసిన అంశాన్ని విద్యార్థులు చూసి తనలో తాను చదువుకొంటూ, పలకపైగాని, కాగితంపైగాని వ్రాయడమే దృష్ట లేఖనం. తద్వారా విద్యార్థులు అక్షరాలను క్రమమైన పంక్తుల్లో , అందంగా వ్రాయడానికి నేర్చుకొంటారు. వ్రాసేటప్పుడు పదానికి,పదానికి, తగినంత స్థలం మధ్యలో వదలి గమనిస్తూ వ్రాయడం వల్ల పద, ప్రత్యయ విభాగాలను తెలుసుకొంటారు. విరామచిహ్నాల వాడుకను, వాటి సక్రమ ప్రయోగాన్ని తెలుసుకోవడానికి దృష్టలేఖనం ఉపకరిస్తుంది. వర్ణక్రమ దోషాల సవరణకు క్రమమైన వాక్య నిర్మాణ రీతులకు తోడ్పడుతుంది. రచనా చమత్కృతిని గ్రహించడానికి ఉపకరిస్తుంది. నమూనా (మాదిరి) వ్రాతను చూచి వ్రాసే శిక్షణ వల్ల విద్యార్థుల లేఖనం సక్రమ పద్ధతిలో వృద్ధి చెందుతుంది. ప్రాథమిక దశలో

విద్యార్థులకు మొదట రెండు గీతల మధ్య,తర్వాత ఒక గీతపై వ్రాయడానికి అభ్యాసం చేయించడం మంచిది.పిల్లలచే వ్రాయించే పదాలుగాని, వాక్యాలుగాని వారికి పరిచయమున్న వాటిని,సంయుక్తాక్షరాలు లేనివాటిని మొదట ప్రవేశపెట్టి, తర్వాత ద్విత్వాక్షరాలను, సంయుక్తాక్షరాలను ప్రవేశపెట్టాలి.

చూచి వ్రాత ప్రయోజనాలు :

1. విద్యార్థులు అక్షరాలను అందంగా వ్రాస్తారు.

2. అక్షరానికి అక్షరానికి మధ్య, పదానికి పదానికి మధ్య, వాక్యానికి – వాక్యానికి మధ్య తగిన వ్యవధి ఇచ్చి వ్రాస్తారు.

3. అక్షరాలు సమాన పరిణామంలో ఉండేటట్లు వ్రాస్తారు.

4. అక్షరాన్ని వ్రాసేటపుడు ఎలా ప్రారంభించి, ఎలా ముగించాలో విద్యార్థులు తెలుసుకొంటారు.

5. ఏయే విరామచిహ్నాలు ఎక్కడెక్కడ పాటించాలో విద్యార్థులు తెలుసుకొని వ్రాస్తారు.

6. చదివిన సూక్తులు, వాక్యాలు లిఖిత రూపంలో అనుభవంలోకి రావడంతో పూర్వజ్ఞానానికి పునర్బలం జరుగుతుంది.

7. నిర్దుష్టంగా వ్రాయడానికి అక్షరస్వరూపం తోడ్పడుతుంది.

ఉక్తలేఖనం : **(Dictation)**

ఉక్తలేఖనం అనగా ఒకరు చెప్పగా విని వ్రాయడం. ఉపాధ్యాయుడు పలికే పదాల్ని వాక్యాల్ని విద్యార్థులు విని, జ్ఞప్తిలో ఉంచుకొని వ్రాయడాన్ని ఉక్తలేఖనం అంటారు. ఉచ్చారణకు, వర్ణక్రమానికి సరియైన సమన్వయాన్ని కుదిర్చి,విద్యార్థులరచనల్లో వర్ణక్రమదోషాలు లేకుండా చేయడం, లేఖనం వేగంగా సాగేటట్లు చేయడం, ఉక్తలేఖనం ప్రధాన ఉద్దేశ్యాలు. దీనిని ప్రాథమిక దశలో ఎక్కువగా అనుసరించాలి. పిల్లల స్థాయిని దృష్టిలో ఉంచుకొని వారు ఏయే వర్ణాలను, పదాలను దోషయుక్తంగా వ్రాస్తారో అలాంటి పదాలను, వర్ణాలను, వాక్యాలను దృష్టిలో ఉంచుకొని ఉక్త లేఖనం చేయించాలి. ఉపాధ్యాయుడు విద్యార్థుల ఎదుట స్పష్టంగా ఉచ్చరించి చూపాలి. తద్వారా విద్యార్థులు విని, వర్ణక్రమాన్ని గ్రహించి అదే క్రమంలో వ్రాస్తారు. ఉక్తలేఖనాభ్యసనాన్ని ఇచ్చినప్పుడు ఈ క్రింది విషయాల్ని దృష్టిలో ఉంచుకోవాలి.

1. ఉపాధ్యాయుడు దృష్టలేఖనం చేయించే వాక్యాలను పాఠ్యగ్రంథం నుంచి ఎన్నుకోవాలి.

2. ఉక్తలేఖనం చేయించేటపుడు విద్యార్థుల స్థాయిని దృష్టిలో ఉంచుకోవాలి. వారికి పరిచయమైన ద్విత్వ, సంయుక్తాక్షరాలు గల పదాలను, కొత్త పదాలతో కూడిన వాక్యాలను ఉక్తలేఖనం ఇవ్వాలి.

3. ఉక్తలేఖనం మొదట పదాల్ని క్రమంగా వాక్యాలను చెబుతూ చేయించాలి. పదాలు, వాక్యాలు రెండు, మూడు మార్ల కంటే ఎక్కువసార్లు పునరావృతం కాకుండా చూడాలి.

4. ఉక్తలేఖనం పూర్తయిన తర్వాత ఉక్తలేఖనానికిచ్చిన అంశాల్ని మరొక్క మారు పూర్తిగా, స్పష్టంగా తరగతి గదికంతటికి వినబడేటట్లు చదవాలి.

5. విద్యార్థులు వ్రాసిన అంశాన్ని పరస్పరం దిద్దుకోవడానికి అవకాశం ఇవ్వాలి. లేదా ఉపాధ్యాయుడే స్వయంగా విద్యార్థుల ఎదుట సవరించడంచేయాలి.

పై విధంగా ఉక్తలేఖనాన్ని ఒకటి, రెండు, మూడు తరగతుల వారికి ప్రతి రోజు 4,5 తరగతుల వారికి వారానికి మూడు, నాలుగు మార్లు ఇవ్వాలి. మాధ్యమిక దశలో వారానికి మూడుసార్లు, ఉన్నత విద్యార్థులకు వారానికి కనీసం రెండుమార్లు ఇవ్వాలి. తద్వారా విద్యార్థుల లేఖన వేగం అభివృద్ధి చెందుతుంది. దోషం లేని రచనా (లేఖన) సామర్థ్యం పెంపొందుతుంది.

తోటి ఛాత్రోపాధ్యాయులు చేసే లేఖనదోషాలను
కొన్నింటిని తెల్పి వాటి నివారణకు చేపట్టే చర్యలను వ్రాయండి

ఉక్తలేఖన ప్రయోజనాలు :

1. విద్యార్థుల శ్రవణ శక్తిని గమనించవచ్చు.
2. విద్యార్థుల జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుంది.
3. విద్యార్థుల పఠనానికి, శ్రవణానికి, లేఖనానికి సమన్వయం ఏర్పడుతుంది.
4. లేఖన దోషాలను సులభంగా గుర్తించవచ్చు.
5. వేగంగా వ్రాసే శక్తికి తోడ్పడుతుంది.
6. విరామచిహ్నాలను వాడే అవగాహన పెరుగుతుంది.
7. వ్రాతలోని అందాన్ని పరీక్షించుకోవచ్చు. పెంపొందించుకోవచ్చు.

లిఖిత చర్య :

ఆలోచనతో కూడిన వ్రాతపనిని లిఖిత చర్య అనవచ్చు. విద్యార్థులు ముందుముందు ఎవరిపై ఆధారపడక సొంతంగా తమ భావాలను దోషరహితంగా వ్రాయడానికి ఉపాధ్యాయుడు నేర్పడాన్ని లిఖిత చర్య అని అంటారు. పాఠ్యబోధన సమయంలో విద్యార్థులకు కొత్త పదాలతో పరిచయమేర్పడుతుంది. ఈ విధమైన పదాలను సొంత వాక్యప్రయోగం చేసి వ్రాసినట్లయితే అది లిఖిత చర్య అవుతుంది. ఉదా ఇంటి పని ఇచ్చి వ్రాయించడం.

కథలు, సంభాషణలు, లేఖలు, విమర్శలు, నివేదికలు మొదలగునవి వ్రాయించడం – అభ్యాసాలు చేయించడం.

లిఖిత చర్యను అభివృద్ధి చేసే మార్గాలు :

ప్రాథమిక స్థాయి :

1. దినచర్యలు :

విద్యార్థులచే రోజు వారి కార్యక్రమాలు ఇంటిలోను, బడిలోను చేసిన వాటిని వ్రాయించవచ్చు. తేది, వారం, పేరు తప్పనిసరిగా గుర్తించునట్లు చూడాలి. దినచర్య వ్రాయించడానికి వారికి తగిన నోటు పుస్తకాలను ఏర్పాటు చేయాలి.

2. కథలను వ్రాయించడం :

పిల్లలకు కథలంటే చాలాయిష్టం. కనుక ఉపాధ్యాయుడు చిన్న చిన్న కథలను చెప్పి వారిచే వ్రాయించవచ్చు. విద్యార్థులచే కథలను వ్రాయించేటప్పుడు కథ ప్రారంభం, కథ వివరణ, కథ ముగింపు ఎలా వ్రాయాలో తెలియచేయాలి.

3. లేఖలు వ్రాయించడం : **(Letter Writing)**

ప్రాథమికదశలో విద్యార్థులకు, లిఖిత చర్యలు అభివృద్ధి చేయడానికి లేఖలను వ్రాయించడం ఉత్తమం. తల్లిదండ్రులకు, బంధువులకు కొన్ని లేఖలను వ్రాయించవచ్చును. తర్వాత సెలవుచీటి వ్రాసే విధాన్ని నేర్పించాలి. లేఖలను వ్రాసేటపుడు సంబోధించే విధానం, విషయాన్ని వివరించడం, ముగింపు, చిరునామ వ్రాసే విధానం గూర్చి ఉపాధ్యాయుడు విద్యార్థులకు తెలపాలి.

4. చిత్రపట రచన : **(Picture composition)**

చర్యల **(Actions)** తో కూడిన వర్ణచిత్ర పటాలను చూపించి అందలి కథను వ్రాయించడం.

5. వర్ణనాత్మక విషయాలు :

ఇల్లు, బడి, జంతువులు, పక్షులు మొదలైన వాటిని గురించి వ్రాయించడం. ఇలా చేయడం వల్ల విద్యార్థులకు పరిశీలనజ్ఞానం, ఊహాజ్ఞానం, మంచి రచనాశక్తి కలుగుతుంది.

మాధ్యమిక/ ఉన్నతస్థాయి :

ఈ దశలో విద్యార్థులు కొంతవరకు మాతృభాషలో అనుభవం, రచనలో కొంత నైపుణ్యం కలిగి ఉంటారు. కాబట్టి ఈ దశలో లిఖితచర్య అభివృద్ధిచేయడానికి వ్యాసాలను, సంక్షిప్తరచనలను, కథలను, గేయాలను, సంభాషణలను, అనువాదాలను, నాటికలు మొదలగువాటిని వ్రాయించాలి.

1. కథలు : భారత, భాగవత, రామాయణాది గ్రంథాల నుండి ప్రసిద్ధ కథలను విద్యార్థులచే వ్రాయించవచ్చు.

2. గేయాలు : విద్యార్థులు నేర్చుకొన్న గేయాలను, జాతీయనాయకులను గూర్చి పండుగలను గూర్చి గేయాలను వ్రాయించవచ్చు.

3. సంభాషణలు : పాఠ్య పుస్తకంలోని పాఠాలనుగాని ఇతర విషయాలనుగాని సంభాషణాత్మకంగా వ్రాయించవచ్చు.

1. కోతి – మొసలి సంభాషణలు. 2. పిల్లి – ముసలిగ్రద్ద సంభాషణలు.

4. వ్యాసాలు : పాఠ్య పుస్తకం, ఉపవాచకం నుంచి లేదా జాతీయ పండుగలు జాతీయ నాయకులను గూర్చిగాని వ్యాసాలను విద్యార్థులచే వ్రాయించవచ్చు.

ఉదా **1. గాంధీజీ, నేతాజీ, నెహ్రూ మొదలగు వారి గురించి వ్రాయించడం.**

**2. స్వాతంత్ర్యదినోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవం మొదలగు శీర్షికలిచ్చి వ్రాయించడం.**

5. నాటికలు : పాఠ్యపుస్తకంలోని కొన్ని పాఠాలను చిన్న చిన్న నాటికలుగా విద్యార్థులచే వ్రాయించవచ్చు. మానవ స్వభావా లను తెలియజేసే చిన్నచిన్న నాటికలను విద్యార్థులచే వ్రాయించవచ్చు. ఈ నాటికలు సాంఘికంగా లేదా పౌరాణికంగా కాని ఉండవచ్చు.

6. సంక్షిప్త రచనలు : ఒక విషయాన్నిచ్చి దాన్ని విద్యార్థులు చదివి అవగాహన చేసుకొన్న తర్వాత దానిని 1/3 వంతునకు తగ్గించి, భావం చెడకుండా వ్రాయించడాన్ని " సంక్షిప్త రచన" అని అంటారు.

7. విన్నపాలు :

అధికారులకు తమ అత్యవసరాలను విన్నపం చేస్తూ వ్రాసే విధాన్ని విద్యార్థులకు తెలియజేయాలి. విద్యార్థులతో కొన్ని విన్నపాలను వ్రాయించి ఉపాధ్యాయుడు సరిచేయాలి.

8. అనువాదాలు :

ఒక భాషలో ఉన్న విషయాన్ని తమ మాతృభాషలోనికి, తమ మాతృభాషలో ఉన్న విషయాన్ని ఇతర భాషలోనికి అనువదింపజేయడాన్ని అనువాదం అంటారు. ఇది 8వ తరగతి నుంచి ప్రారంభించడం మంచిది. ఇలా చేయడం. వలన రెండు భాషల్లో విద్యార్థులు మంచి ప్రావీణ్యం సంపాదిస్తారు.

| వ.సంఖ్య | లేఖనం దోషం కలిగినపదాలు | దోషం | సరైన పదాలు |
|---|---|---|---|
| 1. | భాద | అక్షరదోషం | బాధ |
| 2. | తీసుకెళ్ళి | సంధిదోషం | తీసుకవెళ్ళి |
| 3. | చూస్తిని / ఇస్తిని | గ్రామ్యభాష | చూశాను/ ఇచ్చాను (ప్రామాణిక వ్యావహారికరూపాలు |
| 4. | ప్రతిరోజు (సంస్కృతం+ హిందీ) | సమాసదోషం | ప్రతిదినం (సం+సం) |

అధ్యాయం - 4

# భాషా బోధనపద్ధతులు

## పద్యబోధన - 1

4.1.1 పరిచయం

4.1.2 పద్యబోధన లక్ష్యాలు

4.1.3 పద్యబోధన ఉద్దేశ్యాలు

4.1.4 పద్యబోధన పద్ధతులు

4.1.5 వివిధ దశల్లో బోధించే పద్యాంశాలు

4.1.6 పద్యబోధన సోపానాలు

4.1.7 పద్యబోధన ప్రయోజనాలు

4.1.8 ప్రాథమిక, మాధ్యమిక తరగతులలో బోధించు పద్యబోధన భావనలు.

4.1.1 పరిచయం :

సహితస్యహితం సాహిత్యంఅంటే హితంతో కూడుకొన్నది. హితాన్నిబోధించేది సాహిత్యం. శ్రేయస్సు, మేలు, పురోభివృద్ధి మొదలైన వాటిలో కూడినదని అర్థం. సాహిత్యానికి భావం జీవం. కావ్యాలు, నాటకాలు, నాటికలు, ఏకాంకికలు, నవలలు, కథానికలు, విమర్శలు, వ్యాసాలు మొదలైనవి సాహిత్యంలో అంతర్భాగాలు. ఇటువంటి సాహిత్య గ్రంథాలు, సంఘానికి మేలు చేస్తాయి.

మాతృభాషాబోధనలో ముఖ్యమైనది పద్యబోధన. పద్యాలను వ్రాసేవారిని కవులుగాను, వ్యాసం, కథానిక, విమర్శ మొదలగునవి వ్రాసే వారిని రచయితలుగాను వ్యవహరిస్తారు.

కావ్యసృష్టికి మూలకర్త కవి. ఈ ప్రపంచానికి సృష్టికర్త బ్రహ్మదేవుడు కాగా కావ్య ప్రపంచానికి సృష్టికర్త కవి. (అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః) కవి తనకావ్యంలోని పాత్రలకు ప్రాణం పోసి కథను నడుపుతాడు. కవి సృష్టించిన పాత్రల్లో వైవిధ్యం, విషయ వైవిధ్యం ఉంటుంది. ఆ పాత్రల ద్వారా తాను చెప్పదలచుకొన్న విషయాన్ని చెబుతాడు. కవి యొక్క ఆధ్యాత్మిక చింతన ధార్మిక జీవనం, నైతిక విలువలు మొదలైనవి తెలుసుకోవాలంటే వారి కావ్యమే మనకు ఆధారం. సమాజంలో తాను ఆశించిన మార్పులు తన కావ్యం ద్వారానే తీసుకొని వచ్చేందుకు ప్రయత్నిస్తాడు.

కవిత్వానికి భావనాశక్తి ప్రధానం. భావనాశక్తికి ఛందస్సు తోడయి కావ్యకన్యకది అలంకార ప్రాయమై మరింత శోభాయమానంగా విరాజిల్లుతుంది. భావా విష్టుడైన కవి నోటి నుంచి వెలువడే లయాన్వితమైన భాషనే మనం 'కవిత్వం' అంటున్నాం. ఉదాత్తమైన భావాలను అత్యంత సముచితమైన పదాలతో కూర్చడమే కవిత్వం అనడంలో పై భావమే కనిపిస్తుంది. ఈ లక్షణాలు కలిగిన చిన్నయసూరి గద్యం కూడా కవిత్వంగానే చెప్పదగింది. గద్యంలో కంటే పద్యంలో అక్షర రమ్యతకు అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఏ భాషాసాహిత్యంలోనైనా ఇతర ప్రక్రియల కంటే పద్యరచన ఒక విశిష్ట స్థానం పొంది ఉంది. అయితే ఛందస్సు కావ్యానికి అలంకార ప్రాయమే కాని ప్రాణం మాత్రం కాదు-కారాదు. కవి భావనా బలమే కావ్యానికి ఆధారంగా ఉంటుంది. పూర్వ సంస్కృతిని, నాగరికతను పూర్తిగా తెలియజేయడానికి కావ్య సంపద సాహిత్యం మనకు తోడ్పడుతుంది.

ఏ భాష అయిన సాహితీ గౌరవస్థాయిని పొందిన తొలిదశలో పద్యరూప సారస్వతంగా

వెలువడటం విదితం. సంస్కృత వాల్మీకి రామాయణంలో శోకం శ్లోకంగా ఆవిర్భవించింది. ఇతర భారతీయ భాషల్లోను, తెలుగు సాహిత్యంలోను పద్యరూప సాహిత్యమే వెలువడినట్లు గమనించవచ్చు. సాధారణంగా పద్యం క్లిష్టమయినది. అయినప్పటికి ప్రాచీన సాహిత్యం ఎక్కువగా పద్య రూపాత్మ కంగా ఉండడం వల్ల కవిత్వం రచించినవాడే మన్నన, ఆదరణ పొందడానికి అరుడు, యోగ్యుడు కాగలడని ఆలోచించడం వల్ల పద్యరచనకే పట్టంకట్టినట్లు భావించవచ్చు.

కావ్యానికి ప్రముఖ భారతీయు, పాశ్చాత్య కవులు, రచయితలు ఇచ్చిన నిర్వచనాలు.

☆ లోకత్తర వర్ణనా నిపుణుడయిన కవి కర్మకావ్యం అని మమ్మటుని అభిప్రాయం.

☆ 'కవనీయం కావ్యం' (వర్ణింప తగినది కావ్యం) అని అభినవగుప్తుడు పలికినాడు.

☆ 'వర్ణించువాడు కవి, అతని కర్మకావ్యం' – విద్యాధరుడు.

☆ ' శబ్దార్థ యుగళమ్ కావ్య శరీరం' అలంకారం దీనికి సౌందర్యం కలిగిస్తుందని ఒక అభిప్రాయం

ప్రాశ్చాత్యుల అభిప్రాయం :

– 'Poetry is metrical composition. It is the art of uniting pleasure with truth by calling for the imagination or with the help of a reason' అని Samuel Johnson చెప్పాడు.

(కవిత్వమంటే ఛందో బద్ధమైన రచన, అని బుద్ధియు, భావన, సాధనాలుగా ఆనంద సత్యముల ఐక్యతగా సంఘటించు కళ అని నిర్వచించాడు)

'For all, the good poetry is the spontaneously overflow of powerful feelings' అని వర్డ్స్‌వర్తు నిర్వచించాడు.

– 'Poetry in general sense may be defined as the expression of the imagination' అని కవి 'Shelly' నిర్వచించాడు. (భావనా వ్యక్తీకరణము కవిత్వమని భావము)

– 'Poetry we will call musical thought' అని Carlyle వర్ణించాడు.
(మధురమైన భావమే కవిత్వము) అని అర్థం.

– 'Best words in their best order is poetry' (Coleridge)
ఉత్తమమైన శబ్దాలు ఉత్తమమైన రీతిలో అమరివుంటుడయే కవిత్వం అని కవితాస్వరూపాన్ని వివరించాడు.

– "Poetry is the criticism of life (జీవిత విమర్శనమే కవిత్వము) అని Mathew Arnold వర్ణించాడు.

పైన పేర్కొన్న నిర్వచనాలను బట్టి కావ్యంఎంత రసవంతమైనది, శక్తివంతమైనది, లయాత్మకమైనది, రమణీయార్థకరమైనది, ఛందోబద్ధమైనది మనసును రంజింపచేసి మధరమైన ఆనందాన్ని కలిగించేదని విశదమవుతుంది. సాహిత్యంలో ఇంతటి ప్రాచుర్యాన్ని పొందిన పద్యాన్ని గురించి ఛాత్రోపాధ్యాయులు తెలుసుకోవలసిన అవసరం ఉంది. మన పాఠ్య పుస్తకాలలో పద్య, గద్యాలు చోటు చేసుకొని ఉన్నాయి. పద్యబోధన గురించి, పద్య బోధన పద్ధతులు గురించి భాషోపాధ్యాయులు తెలసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## 4.1.2 లక్ష్యాలు :

ఆయా పాఠ్యాంశాల ద్వారా విద్యార్థుల్లో ఆవిర్భవిస్తున్న ప్రవర్తనాపరమైన మార్పుల్ని తెలిపేవి లక్ష్యాలు. లక్ష్యాలు స్వల్పకాలంలో అంటే ఒక పాఠ్యాంశ బోధన ద్వారా సాధించవచ్చు.

ఏ పనినైన విజయవంతంగా నెరవేర్చాలంటే కొన్ని లక్ష్యాలు కలిగి ఉండాలి. లేకుంటే అది సముద్రంలో చుక్కాని లేని ఓడ ప్రయాణం లాంటిదవుతుంది.

కాబట్టి పద్యబోధనకు పూనుకొనే ముందు ఉపాధ్యాయుడు కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకోవాలి.

- రసానుభూతిని కలిగించడం.
- ఆనందానుభూతిని కలిగించడం.
- భాషా జ్ఞానాన్ని, విద్యార్థుల యందు ఆసక్తి కలిగించడం.
- కవి ఆత్మీయతాభావాన్ని తెలియజేయడం.
- కవి చమత్కారాన్ని విశదపరచడం, పద్య సౌందర్యాన్ని అవగాహన చేయడం.
- పద్యంలోని భావాన్ని చర్చింపచేసి తమ జీవితాలకు అన్వయించుకోవడం, వాటి ద్వారా మంచి నైతిక విలువలను పొంది సామాజికీకరణానికి తోడ్పడచేయడం.

## 4.1.3 ఉద్దేశాలు :

పాఠ్యాంశాల ద్వారా సాధించవలసిన స్థూలమైన ప్రవర్తనా పరమైన మార్పుల్ని తెలిపేవి ఉద్దేశాలు. ఒక ప్రత్యేక పాఠ్యప్రణాళిక చివర విద్యార్థుల్లో సాధించే ప్రవర్తనా మార్పుల మొత్తాలు ఉద్దేశాలు, ఉద్దేశాలు దీర్ఘకాలంలో సాధించదగినవి.

- విద్యార్థులలో భావనాశక్తిని పెంపొందింపజేయడం.
- పద్య పాఠ్య విషయాలలో సంపూర్ణమైన అవగాహన కల్పించడం.
- సాహిత్య పఠనంలో ఆసక్తి కలిగించడం.
- విద్యార్థులకు అలౌకికమైన ఆనందాన్ని కలిగించడం.
- పద్య పఠనాశక్తి, భాషా నైపుణ్యాలు పెంపొందించడం.
- విమర్శనాశక్తి, సృజనాత్మక శక్తి పెంపొందించడం.
- ధారణశక్తిని పెంపొందించడం.
- ఉచ్చారణ వేగం, క్రమబద్ధం చేయడం.
- విద్యార్థులు భావావేశపరులై భవిష్యత్తులో మంచి కవులుగా, రచయితలుగా కావడానికి దోహదపడడం.
- ఛందస్సు సంబంధించిన జ్ఞానాన్ని పెంపొందించడం.
- అలంకారం – రసం – ధ్వని, రీతిని గూర్చి తెలియచేయడం.
- సాహిత్య విలువ గల రచనలోని శైలి, రీతి, పాకం మొదలైన వాటిని విద్యార్థులు గ్రహింపచేయడం
- విద్యార్థుల ప్రశంసాశక్తిని పెంపొందించడం.
- రాగయుక్తంగా, భావయుక్తంగా పద్యాలు, గేయాలను బోధించే నైపుణ్యాన్ని పెంపొందించడం.
- విద్యార్థుల హృదయాలను తేలిక చేయడం.
- సద్విమర్శనాశక్తిని, ఉత్తమ భావాలను పెంపొందించడం.
- విరామ కాలాన్ని ఉత్తమ సాహిత్య పఠనాన్ని సద్వినియోగం. చేసుకోవడం.
- వివిధ సాహిత్య శాఖలను చదివింపచేయడం.
- సముచిత వైఖరులను పెంపొందించడం.
- కవిత్వం ఒక విలక్షణమైన కళ. అట్టి కళారాధన సౌందర్య పిపాసలను కలిగించి అట్టి విలువలను పెంపొందింప చేయడం.
- కవితా స్వరూపాలయిన పురాణేతిహాసాలు, కావ్యప్రబంధాలు, గేయం, నాటకం, ఖండిక, శతకం మొదలయిన వాటి సామ్యభేదాలను తెలుసుకోవడం.
- దేశ కాలానుగుణంగా రాజకీయ, మత, సాంఘిక, ఆర్థిక పరిస్థితులు సమకాలీన

కవిత్వోద్యమాలు ఆవిర్భావానికి కారణమయిన పరిస్థితులను తెలుసుకోవడం.

– సంపూర్ణ మూర్తిమత్వ వికాసానికి దోహదపడడం.

– ఆలోచనాశక్తి, భావనాపటిమ, తార్కిక హేతువాద దృష్టి పెంపొందించుకొనడానికి మార్గదర్శకంగా నిలవడం.

## 4.1.4 పద్యబోధన పద్ధతులు :

"ఒక పద్యంలో ఉద్దిష్టాలయిన ఆవేశాలు మనలో తిరిగి మొలకెత్తితేగాని, ఆ భావానుభూతిని పొందితే గాని దాన్ని మనం అవగతం చేసుకొన్నామనడానికి వీలు లేదు". అని ప్రొఫెసర్ ముర్రె చెప్పారు. అందుచేత ఉపాధ్యాయుడికి ఉండవలసిన ముఖ్య లక్షణం రసాస్వాదన శక్తి. అతడు పద్యాన్ని చదివి, రసానందాన్ని అనుభవిస్తేనే రసవంతంగా బోధించగలడు. విద్యార్థులు ఆనందా నుభూతిని పొందడానికి తోడ్పడగలడు. ఇందుకు గాను, ప్రాచీన, ఆధునిక పద్యబోధన పద్ధతులు, విధానాలు ఎన్నో ఉన్నాయి. పద్యబోధన పద్ధతిలో ప్రధానంగా క్రింది విధంగా విభజింపబడ్డాయి.

1. పూర్ణ పద్ధతి
2. ఖండ పద్ధతి
3. పఠన పద్ధతి
4. ప్రతి పదార్థ పద్ధతి
5. తాత్పర్య/ సారాంశ పద్ధతి
6. ప్రతి పదార్థ తాత్పర్య పద్ధతి
7. ప్రశంసన పద్ధతి
8. ప్రశ్నోత్తర పద్ధతి
9. చర్చా పద్ధతి

ఇందులో మొదటి రెండు పద్ధతులు చాలా ముఖ్యమైనవిగా చెప్పవచ్చు. మిగిలిన పద్ధతులు ఈ పద్ధతులకు ఉపబలకంగా ఉంటాయి.

పూర్ణ పద్ధతి : ఈ పద్ధతిలో ఏపాఠ్యాంశాన్ని బోధించబోతున్నారో దానిని ఏకాంశం (Single Unit) గా తీసుకొనిదానిలోని స్థూలమైన భావాన్ని (Outlines) విద్యార్థులకు చెప్పాలి.

'Proceed from whole to parts' అనే సూత్రాన్ని ఆధారం చేసుకొని బోధించే పద్ధతి పూర్ణ పద్ధతి.

పద్యపాఠంలోని అన్నిపద్యాలను చదివి ఆ పాఠం యొక్క సారాంశాన్ని విద్యార్థుల దృష్టికి తెచ్చి తరువాత ఒక్కొక్క పద్యంలోని అంశాలను వివరించడమే ఈ పూర్ణ పద్ధతి. కావ్య వస్తువు బట్టి, విద్యార్థుల మానసిక వికాసాన్ని బట్టి బోధించడం పూర్ణ పద్ధతి అవుతుంది.

పద్యాల్ని బోధించేటప్పుడు ఆ పద్యాల్ని ఎవరు చెపుతున్నారు. ఎవరితో ఎప్పుడు, ఏ సందర్భంలో దానిని చెప్పుతున్నారు అనే ముఖ్య భావనాంశాలను ఒక్కసారిగా బోధించడమే పూర్ణపద్ధతి.

కొన్ని సందర్భాలలో రెండు మూడు పద్యాలలో ఉండే స్థూలభావాన్ని కూడ ఏకాంశంగా తెలిపిన తర్వాత ఆ భావాల్ని ఉపభాగాలుగా విభజించి ఒక్కొక్క పద్యంలోని విశేషాంశాలను వివరిస్తూ విద్యార్థులకు గ్రహింపచేయవచ్చు. ఈ విధంగా చేయడం కూడా ఈ పూర్ణ పద్ధతిలో భాగమే.

ఇది ఆధునిక మనస్తత్వశాస్త్రానికి అనుగుణమయిన బోధన. విద్యార్థులలో రసానుభూతి, ఆనందానుభూతి కలిగించడానికి ఇది ఉత్తమ పద్ధతి.

పూర్ణపద్ధతిలో ప్రతిపదానికి అర్థం చెప్పడం కాకుండా పద్యభావానికి సౌందర్యానికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగు తుంది. అయితే కఠినపదాలకు అర్థాల్ని ప్రత్యక్షంగా చెప్పకుండా వాక్యప్రయోగాల సాయంతోను, సన్నివేశాలు కల్పించడం వల్ల విద్యార్థుల నుంచే రాబట్టాలి. పద్యంలోని శబ్ద చమత్కా రాన్ని, అర్థ చమత్కారాన్ని సాధ్యమైనంత వరకు విద్యార్థులనే గ్రహించి చెప్పేందుకు తగిన సన్నివేశాన్ని కల్పించాలి. విద్యార్థులకు పూర్తిగా తెలియని పూర్వగాథలు, విశేషాంశాలు ఉపాధ్యాయుడే చెప్ప వలసి ఉంది. పూర్ణ పద్ధతి ఆధునిక పద్ధతి. ఇది ఉన్నత తరగతులకు ఉత్తమ పద్ధతి.

**మీ వాచకంలోని ప్రాచీన సాహిత్యానికి చెందిన ఒక పద్యానికి పూర్ణ పద్ధతిలో బోధించడానికి పాఠప్రణాళికను తయారు చేయండి.**

2. ఖండపద్ధతి :

ఈ పద్ధతి పూర్ణపద్ధతికి భిన్నమైంది. పదవిభజనకు ప్రతి పదార్థానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి పద్యాన్ని బోధించే పద్ధతి ఖండపద్ధతి.

పద్యంలోని ప్రధానాంశాన్ని తెలియజేయకుండా పద్యంలోని ఒక్కొక్క భాగాన్ని పద్యాన్ని విడదీస్తూ ప్రతి పదానికి అర్థాన్ని చెప్తుతూ చివరకు పద్యంయొక్క భావాన్ని చెప్పడమే ఖండపద్ధతి.

పద్యాన్ని ఖండాలుగా చేసి చెప్పడం వల్ల రసస్వాదనకు అనుకూలంకాదు. ప్రాచీన కాలంలో ఈ పద్ధతిని ఉపయోగించి పద్యంలోని అన్వయక్రమాన్ని, పదజాలవిశ్లేషణ, పదనిర్మాణం, వ్యాకరణం మొదలైన వివరాలన్ని బోధించేవారు. పద్యంలోని ప్రధాన విషయం ఏమిటో ముందు బోధించకుండానే పద్య భావాన్ని ఉపభాగాలు విభజించి బోధించడం మనస్తత్వ శాస్త్ర విరుద్ధం. కాబట్టి ఈ పద్ధతి నేటి కాలంలో అంతగా అనుసరణీయం కాదని భావిస్తున్నారు. అందుచేత పద్యాన్ని ఖండపద్ధతిలో కాక పూర్ణపద్ధతిలో బోధించాలని విద్యావేత్తలు భావించారు. ఇలా పూర్ణపద్ధతిలో పద్యబోధన గావించదలిస్తే ఆయా సందర్భాలకు తగిన విధానాలను ఏ మేరకు ఉపాధ్యాయుడు సమయస్ఫూర్తితో ఉపయోగించుకోవాలో నిర్ణయించుకోవాలి.

చిత్రాన్ని చూపించి విద్యార్థుల నుండి అర్థాన్ని రాబట్టవచ్చు. అదే క్రియా పదమైతే ఆ క్రియను ఆచరించడం ద్వారా అర్థవివరణ చేయాల్సి ఉంటుంది. అలా కుదరని సందర్భంలో సన్నివేశాలు, దృష్టాంతాలు లేదా దృశ్యచిత్రాలు చూపించి అర్థాలను వివరింపవచ్చు.

నూతన పదాలు, దానికి వ్యతిరేక పదాలు తెలిసినదైతే కొత్తపదాలకు అర్థాలు ఆ తెలిసిన పదం సహాయంతో కొత్తపదానికి అర్థం తెలియచేయవచ్చు. అస్పష్ట పదాలకైతే తప్పనిసరిగా చిత్రపటాలను ఉపయోగించాలి. ఉదా అడవి దృశ్యం.

వ్యుత్పత్త్యర్థాలకు మొదట వాక్య ప్రయోగం సహాయంతో అర్థం రాబట్టి తరువాత సమసించిన పదాలు విడదీసి వేరు వేరుగా అర్థాలను బోధించాలి. ప్రకృతులన్నీ తత్సమాలు, వికృతులన్నీ తద్భవాలు. నూతన పదాలకు ఉపాధ్యాయుడే ప్రకృతి, వికృతులు చెప్పాలి.

ఒకే పదానికి వేరువేరు సందర్భాలలో ఆ పదాన్ని ఉపయోగించి ఆ పదానికి గల నానార్థాలు రాబట్టాలి. సందర్భాన్నిబట్టి ఆ పద్యంలో ఆ పదానికి ఏ అర్థం వస్తుందో విద్యార్థుల చేత ఊహింపచేసి అర్థాలను రాబెట్టాలి. ఉదా రాజు ఈ పదానికి ప్రభువు , చంద్రుడు అని అర్థాలు వస్తాయి.

సంప్రదాయమైన ఈ ఖండపద్ధతిలో విద్యార్థులు కేవలం శ్రోతల్లా ఉంటారు. ఖండపద్ధతి సంప్రదాయ పద్ధతి. అయితే పద్యతాత్పర్యం, విశేషాంశాలు చెప్పేటపుడు పద్య సౌందర్యం కూడా విద్యార్థులకు అవగతం అయ్యేట్టు బోధించడం జరుగుతుంది. ఇది ప్రాథమిక తరగతులకు ఉత్తమ పద్ధతి.

**ఒక ఆధునిక గేయాన్ని తీసుకొని ఖండ పద్ధతిలో పాఠ ప్రణాళికను తయారుచేయండి.**

3. పఠన పద్ధతి : ఈ పద్ధతిలో పద్యాన్ని ఉపాధ్యాయుడు రెండు మూడుసార్లు ఆదర్శపఠనం చేసి విద్యార్థులకు వినిపించాలి. ఒకటికి రెండుసార్లు పద్యాలను సంపూర్ణంగాను, పదాలను విడదీసి రాగయుక్తంగా, భావయుక్తంగా, ఛందోబద్ధంగా చదివే, ఉపాధ్యాయుని ఆదర్శ పఠనం చేత విద్యార్థులు ప్రభావితులవుతారు. తరువాత విద్యార్థుల చేత ప్రకాశ పఠనం చేయించాలి.

ఈ విధంగా పద్యాలను రాగం, తాళం, లయాత్మకంగా వినిపించాలి. శ్రావ్యంగా, రసభావస్ఫోరక ంగా వెలువరించినపుడు విద్యార్థులలో అనుకరణ జరుగుతుంది. అని Carlyle భిప్రాయం Poetry we will call musical thought ( కవిత్వం లయాత్మకమైన భావన) అని చెప్పాడు.

కొందరు ఈ పఠనాన్ని ఒక ప్రత్యేక పద్యబోధన పద్ధతిగా కూడా ఎంచుకొన్న విద్యావేత్తలు ఉన్నారు. అంటే ఉపాధ్యాయులు చదివే విధానం, ఆ సందర్భాలలో వారు ప్రదర్శించే హావభావాలు, విద్యార్థు లు గమనించడం వల్ల విద్యార్థులకు పద్యభావాన్ని అవగతం చేయించగలరు.

పద్యాన్ని రాగయుక్తంగా సంగీత నియమాలకు లోబడి చెప్పాలని లేదు. ఆవిధంగా లేకపోయినా భావయుక్తంగా అర్థమయేనట్లు చదవడం అవసరం. కొన్ని సందర్భాలలో దీర్ఘమైన రాగాలాపనలు చేయడం కద్దు. అందువల్ల పద్యంలోని భావనల మరుగుపడిపోయి అర్థంకాని, స్థితి కలుగుతుంది.

పద్యపఠనవల్ల విద్యార్థులలో పద్యబోధన ప్రధాన లక్ష్యమైన రసానుభూతిని సాధించగలం. విషయ సంబంధమయిన అన్వయకాఠిన్యత, భాషా సంబంధమైన సంధికార్యం , నూతన పదజాల ప్రయోగం, ప్రకృతి వికృతులు, ఛందోలంకారం మొదలైన వాటిని సందర్భానుగుణంగా సాధించగ లం. కాబట్టి ఈ పద్ధతిని పఠన పద్ధతి అనడం కన్నా పఠనవిధానం అనడం ఉచితం.

ఈ పద్ధతి తరగతిలోని అన్ని స్థాయిల విద్యార్థులకు తగిన పద్ధతికాదు. తరగతిలో మంచి గ్రహణ శక్తి గల విద్యార్థులకు కొంత మేరకు ఉపయోగపడినా సగటు స్థాయి విద్యార్థులకు ఇది అనుకూల మైన పద్ధతికాదు.

4. ప్రతి పదార్థ పద్ధతి :

ప్రతి పద్యాన్ని చదివి దానికి పదవిభాగము చెప్పించి అన్వయక్రమాన్ని ఏర్పరచి ప్రతి పదం అర్థా న్ని మొదట వివరించి చెప్పాలి. అలా చెప్పడంలో సమాస విగ్రహాలను సంధిగత విశేషాంశాలను వివరించి, ఆ తరువాత పద్య తాత్పర్యాన్ని చెప్పడం ఈ పద్ధతిలోని విశేషం. దీర్ఘ క్లిష్ట సమాస భూయిష్టా లయితే ప్రతి పదార్థ వివరణకు ఆటంకాలు ఏర్పడుతాయి. అటువంటి పద్యాలను ఈ పద్ధతిలో బో . దించడం సాధ్యపడదు.

ఈ విధానం పూర్ణపద్ధతికి ప్రోద్బలకం కాదు. ఇందులో విద్యార్థుల ఆలోచన, ఊహ మొదలైన వాటికి తావు లేదు. ఇక్కడ ఉపాధ్యాయుడు చురుకుగాను (Active)విద్యార్థులు కేవలం శ్రోతలుగా, స్తబ్దులుగాను (Passive) ఉంటారు. ఉపాధ్యాయుడే ప్రతి పదానికి అర్థం చెప్పడం వల్ల విద్యార్థుల పాత్ర తక్కువగా ఉంటుంది.

పద్యబోధన పరమలక్ష్యం రసానుభూతి, ఆనందానుభూతి, హృదయద్రవీకరణం. ప్రతి పదానికి అర్థాన్ని బోధించడం ద్వారా వారు తాత్పర్యాన్ని గ్రహించటం పరమావధి కాదు. కాబట్టి ఈ పద్ధతి పాఠశాల దశలో ప్రోత్సహింపదగినది కాదు.

5. తాత్పర్య / సారాంశపద్ధతి :

ఈ పద్ధతిలో పద్యాలను ఉపాధ్యాయుడు చదివి విద్యార్థులకు వాటిలోని తాత్పర్యాన్ని చెప్పి వివరి ంచి మరలా వారిచే చెప్పించడం ఈ పద్ధతి ప్రత్యేకత. ఇక్కడ కూడా విద్యార్థులు స్వయంగా పద్యభా వాన్ని గ్రహించ లేక ఉపాధ్యాయుని సహకారంతో గ్రహిస్తారు. కొంత శబ్ద కాఠిన్యం తగ్గిన పద్యాలు ఈ పద్ధతికి తగినవి కావు. సంస్కృతం మొదలైన భాషలను ఈ పద్ధతి ద్వారా బోధించడం జరుగుతుంది.

ఈ పద్ధతిలో ఉపాధ్యాయుడే తాత్పర్యాంశాలను చెప్పడం వల్ల విద్యార్థుల పాత్ర ప్రేక్షక పాత్ర మాత్రమే. విద్యార్థి ప్రమేయం శూన్యం. ఛందోబద్ధం, అలంకార రసభూయిష్టం, వ్యంగార్థం, అన్వయ కాఠిన్యత మొదలైనవి పద్యబోధన సందర్భంలో చివరిలో విద్యార్థుల చేత పద్య సారాంశాన్ని వారి

సొంత మాటాల్లో రాబట్టి సంస్కరించి వ్రాయించడం జరుగుతుంది.

ఈ విధానం పూర్ణపద్ధతిలో పద్య బోధన చేయడంలో ఒకభాగం మాత్రమే. కాని దీన్ని ప్రత్యేక బో . దన పద్ధతిగా బోధించడం అనుసరణీయం కాదు.

6. ప్రతి పదార్థ – తాత్పర్య పద్ధతి :

ఇది పైన వివరించిన ప్రతిపదార్థ తాత్పర్య పద్ధతుల కలయిక ఉపాధ్యాయుడు పద్యంలోని ప్రతి పదానికి అర్థాలను ఇచ్చి, అన్వయ క్రమంలో తాత్పర్యం, భావం, వచ్చేవిధంగా వివరించి తాత్పర్యాన్ని చివరగా తెలియజేసే పద్ధతి ఈ పద్ధతి.

ఈ పద్ధతిలో కూడా ఉపాధ్యాయుని ద్వారానే బోధన జరుగుతుంది. విద్యార్థుల పాత్ర తక్కువ. కాని ఈ పద్ధతిలో పద్యంలోని అర్థాలను, నూతన పదాలకు అర్థాలు, నానార్థాలు తెలుసుకొనడానికి వీలు పడుతుంది.

7. ప్రశంసన పద్ధతి :

పద్యబోధన చేసేటప్పుడు అన్ని విషయాలను విద్యార్థుల చేత రప్పించడం కష్టం. కొన్ని ముఖ్యమైన వ్యంగార్థాలు (ధ్వని), విశేషాంశాలు, కవి రచనా చమత్కృతి, ప్రతిభ, రసపోషణ, అలంకార వైశిష్ట్యం, సమయోచిత పదప్రయోగ ఔచిత్యం మొదలైన అంశాలను కవితా వస్తువు, కవి చమత్కృతులను ఉపాధ్యాయుడు విద్యార్థులకు తెలియపరచి వారు ప్రశంసించేట్లు చేసి వారిని పాఠ్యాంశంలో నిమగ్న లుగా చేయడమే ప్రశంసన పద్ధతి.

ఈ పద్ధతి వలన పద్యం గేయంలోని పదాల అమరిక, శైలి, లయ, అలంకార మొదలైనవి విద్యార్థులు గమనించగలరు. విద్యార్థులకు సాహిత్యం పట్ల అభిరుచి, మహాకవులపై గౌరవాదులను పెంపొందింపవచ్చును. ఇది కూడా పూర్ణపద్ధతిని ఫలప్రదం చేయడంలో ఒక ఉత్తమమైన పద్ధతి అవుతుంది.

ఉపాధ్యాయుడు పద్య భావాలను అర్థం చేసుకొనడానికి అడ్డుగా వున్న సంధి విశేషాలను, సమాస విగ్రహాలను, నూతన పదాలకు అర్థాలను తెలియజేసి గ్రహింపజేసి వారికి కవి హృదయం అర్థమయ్యేటట్లు చేసి విద్యార్థులచే కవితాప్రశంసను చేయిస్తాడు.

ఈనాడు ప్రతిపదార్థ, తాత్పర్య పద్ధతి, సారాంశ పద్ధతులు చిన్నతరగతుల నుండి పెద్దతరగతులకు బోధించడం వల్ల ప్రశంసనా పద్ధతికి ముఖ్యత్వం లేక పోయింది. అందుకే విద్యావేత్తలు ఇలా వర్ణించారు.

'The explanation of difficult words and phrases is not the main aim of teaching poetry. Writing paraphrases of poetry is probably one of the worst thing we can make our children do it we want to teach them to appreciate poetry and to develop the poetic sense and poetic feeling.

The poetry lesson should not attempt in any direct manner to increase the vocabulary or enlarge the reader`s stock of general knowledge or his power of expression'

కఠిన పదాలకూ, వాక్యాంశాలకూ సంబందించిన అర్థాలవివరణే పద్యబోధన ముఖ్యోద్దేశం కాదు. విద్యార్థులకు మనం పద్యప్రశంసను తెలిపి వారిలో కవితాదృష్టిన్ని, కవితానురక్తిని కలిగించాలనే అభిలాష ఉన్నట్లయితే వారి చేత మనం చేయించదలచిన తాత్పర్య వివరణ ప్రక్రియ చాలా చెడ్డదనవచ్చును. పద్యపాఠం ద్వారా నేరుగా విద్యార్థుల శబ్దరాశిని, వృద్ధి చేయడానికి వారి లోకజ్ఞానాన్ని పెంచడానికి, ప్రకటనా శక్తిని పెంచడానికి ప్రయత్నం చేయరాదు. కాబట్టి అతి ముఖ్యమైన పద్ధతుల్లో ప్రశంసన పద్ధతి ఒకటి. ఈ విధానాన్ని ప్రోత్సాహించడం ఉపాధ్యాయుడి కర్తవ్యం.

| |
|---|
| ప్రశంసనా పద్ధతిలో బోధించడానికి ఏదైనా ఒక పద్య భాగానికి పాఠ ప్రణాళిక తయారుచేయండి. |

8. ప్రశ్నోత్తర పద్ధతి :

పాఠ్యాంశాన్ని బోధించేటప్పుడు ఉపాధ్యాయుడు ప్రశ్నలడుగుతూ, విద్యార్థుల నుండి

సమాధానాల్ని రాబట్టుట ప్రశ్నోత్తర పద్ధతి. ఈ పద్ధతి వలన విద్యార్థుల అవధానం, ఆలోచనాశక్తి, అవగాహన శక్తి, భాషణశక్తి పెరగడానికి ఉపయోగపడుతుంది.

బోధన చేసేటప్పుడు ఉపాధ్యాయుని పాత్ర మాత్రం ముఖ్యంగా ఉండడం, చురుకుగా పాల్గొనడం, ఉపన్యాస పద్ధతిలో బోధిస్తూ విద్యార్థులను ప్రేక్షకులుగా ఉంచినట్లయితే అభ్యసనంలో ఫలితం ఆశించినంతగా ఉండదు.

కాబట్టి ఉపాధ్యాయుడు బోధిస్తూ విద్యార్థులను ప్రశ్నిస్తూ, వారిని పాఠ్యబోధన ప్రక్రియల్లో పాల్గొనేటట్లు చేసి, విద్యార్థుల ఆలోచనా శక్తి, అవగాహన శక్తి పెంచి చురుకుగా, ఉత్సాహంగా విద్యార్థులు అలసట లేకుండా అభ్యసన పొందడానికి ఉత్తమమైన పద్ధతి ఈ ప్రశ్నోత్తర పద్ధతి.

కాబట్టి విద్యార్థులు ఆసక్తితో అభ్యసన పొందడానికి ఈ పద్ధతి తోడ్పడుతుంది.

9. చర్చా పద్ధతి :

విద్యార్థులు ఒకరితో ఒకరుగాని, సమూహాలుగా లేదా విద్యార్థులు ఉపాధ్యాయులతోగాని, పాఠ్యాంశాన్ని గురించి చర్చించడం చర్చాపద్ధతి. సూక్ష్మంగా, సమగ్రంగా వారివారి అభిప్రాయాలను వ్యక్తపరచడం ఈ పద్ధతిలోని ప్రధానాంశం. దీనినే చర్చా విధానం అని కూడా అంటారు.

మొదట ఉపాధ్యాయుడు పాఠ్యాంశాన్ని గురించి ప్రారంభించి విద్యార్థులను పాల్గొనేటట్లు చేయాలి. విద్యార్థులు తమ భావాలను స్వేచ్ఛగా సహజంగా వ్యక్తీకరించడానికి అవకాశం దొరుకుతుంది.ఈ పద్ధతిలో విద్యార్థులు చాలా ఉత్సాహంగా తరగతిలో అభ్యసనలో పాల్గొంటారు.వారి స్వీయ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెలువరించడానికి ఈ పద్ధతి ఎంతో ఉపయోగపడుతుంది.కొన్ని సందర్భాలలో ప్రశ్నోత్తర పద్ధతిలో కూడా చర్చజరపవచ్చు.

ఈ విధానాన్ని వారు సహృదయంతో స్వీకరిస్తారు. ఇది మాధ్యమిక, ఉన్నత దశలలో ఉపయోగకరమైన పద్ధతి.పద్యపాఠ్యాంశ బోధనలో ఈ విధానం బోధనలక్ష్యాలను సాధించడానికి ఉపాధ్యాయునికి తోడ్పడుతుంది. విషయాలను చర్చించడం ద్వారా ఉపాధ్యాయుడు ప్రశ్నలను అడగడంలో, సహృదయతతో, వివరణ సామర్థ్యం బోధన నైపుణ్యాల ప్రదర్శనకు దారితీస్తుంది. ఉపాధ్యాయుడు ఈ పద్ధతిని క్రమపరచి బోధన కొనసాగిస్తే అభ్యసన చక్కగా జరగడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇది మాధ్యమిక, ఉన్నతదశలలో ఉపయుక్తమయిన పద్ధతి. పద్య పాఠ్యాంశ బోధనలోతదితరాల బోధనలో ఈ చర్చ విధానం అత్యంత ప్రధానమయిన ఘట్టంగా ఉండి అన్ని బోధనాలక్ష్యాలను నెరవేర్చడంలో ముఖ్య పాత్ర వహిస్తుంది.ఈ విధానం ఉపాధ్యాయుని సమయస్ఫూర్తి, బోధనోపకరణాల వినియోగ నైపుణ్యం, ప్రశ్నలను అడగడంలో కుశలత, వివరణ సామర్థ్యం వంటి బోధనా నైపుణ్యాల ప్రదర్శనకు దర్పణంగా నిలుస్తుంది.

4.1.5 వివిధదశల్లో బోధించు పద్యాంశాలు :

ఇంత వరకు మనం పద్యం, పద్యబోధనా ఉద్దేశాలు, వివిధ రకాలైన పద్యబోధన పద్ధతులను, పద్యబోధన క్రమాన్ని గురించి తెలుసుకొన్నాం. ఇప్పుడు పాఠశాలల్లో, స్థాయి వారిగా అంటే దశానుకూలంగా ఎలాంటి పద్యాంశాలను బోధించవచ్చునో తెలుసుకొందాం.

ప్రాథమిక దశ :

ప్రాథమిక దశలో విద్యార్థుల స్థాయి కనుగుణంగా కొన్ని గేయాలు, గీతాలు గల పద్యభాగాలు ఉంటే వారికి ఆసక్తి కలుగుతుంది. ఈదశలో విద్యార్థులు ఆటపాటలపై మక్కువ చూపిస్తారు. కాబట్టి క్రీడాపద్ధతి ద్వారా బోధించడానికి అనుగుణమైన పద్యాలను ఎన్నుకొని బోధించడం మంచిది.

ఉదా అభినయగీతాలు, బాలగేయాలు, చిన్న చిన్న ద్విపదలు, కథాత్మక గేయాలు, నీతిపద్యాలు, శతక పద్యాలు, భక్తి గేయాలు, జానపదగేయాలు మొదలగునవి.

ఇవన్ని సరళమైన భాషలో ఉండాలి. విద్యార్థులు సరళంగా ఉచ్చరించడానికి అవగాహన పొందే విధంగా ఉండాలి. విద్యార్థులు సులభంగా ధారణ చేసేటట్లు ఉండాలి. విద్యార్థులు పద్య గేయాలలో అనురక్తిని కలిగి, ఉత్సాహంతో రసానుభూతిని, ఆనందానుభూతిని పొందగలరు.

2. మాధ్యమిక దశ :

ఈ దశ విద్యార్థులకు కొంత అవగాహన శక్తి అధికంగా ఉంటుంది. కాబట్టి కొంత వరకు శ్రుతి పేయంగా కొంత క్లిష్టమైన పద్యాలను వీరికి బోధించవచ్చు. రసానుభూతిని కలిగించే పద్యాలు, పద్య కథలు, భక్తి వాత్సల్య కరుణరసాలతో కూడిన పద్యాలను ఈ దశ వారికి బోధించవచ్చు.

రౌద్ర, భీభత్స, కరుణరసాలు విరివిగా ఉండరాదు. రసవంతాలయిన పాటలు, ద్విపదలు, రగడలు, గీతాలు, సీసాలు, వర్ణణాత్మక పద్యాలు ఈ దశ వారికి పాఠ్యాంశాలుగా ఎంపిక చేయవచ్చు.

3. ఉన్నత దశ :

ఈ దశలోని విద్యార్థుల అవగాహన, సృజనాత్మక శక్తి, విమర్శనాశక్తి కొంత వరకు ప్రాథమిక, మా . ధ్యమిక దశ విద్యార్థుల కంటే ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వీరికి వివిధ సాహిత్యరీతులను తెలియజేసే పద్య పాఠ్యాంశాలను, శైలిభేదాలు గల కవుల రచనలు, ఆయా యుగ ప్రతినిధి కవుల రచనలు, పద్యాలను బోధించవచ్చు.

పూర్వకవుల రచనలతో బాటు ఆధునిక సంప్రదాయ సామాజిక చైతన్యాన్ని, ఆలోచన శక్తిని పెంపొందించే పద్య గేయాలు, వచన కవితలు, మినీ కవితలు కూడా బోధింపవచ్చు. వివిధ రసాలతో కూడిన పద్య నాటకాలను ఈ దశవారికి బోధించవచ్చు.

పురాణాలు, ఇతర గ్రంథాల నుండి శిష్టజన సమ్మతమైనవి బోధించడం ఉత్తమం. భాషలలోని ఉత్తమ సాహిత్యాన్ని కూడా అనువాదం చేసి ఈ దశ వారికి బోధించవచ్చు.

4.1.6 పద్యబోధన సోపానాలు :

తరగతి గదిలో పద్యబోధన చేయడానికి కొన్ని సోపానాలను క్రింద వివరించడం జరిగింది. ఈ సోపానాలను ఉన్నవి ఉన్నట్లుగా అనుసరించాలని లేదు. సందర్భాన్నిబట్టి ఆయా సోపానాలను ఉపయోగించడం లేదా మార్పులు కూడా చేసుకోవడం ఉపాధ్యాయునిపై ఆధారపడి ఉంటుంది.

పద్యబోధన సామాన్య ఉద్దేశాలను, ప్రత్యేక ఉద్దేశాలను దృష్టిలో పెట్టుకొని పద్యం బోధించబోయే ముందు ఉపాధ్యాయుడు అందులోని లక్ష్యాలను, స్పష్టీకరణలను విద్యార్థుల స్థాయికి తగినట్లుగా ముందుగా నిర్ణయించుకోవాలి. పాఠ్యప్రణాళికలో పద్యబోధన సామాన్య ఉద్దేశాలు, ప్రత్యేక ఉద్దేశాలు వ్రాసాక అధ్యాపకుడు లక్ష్యాలు, స్పష్టీకరణాలు వ్రాసుకోవాలి.

పద్యబోధనలో లక్ష్యాలు : 1.జ్ఞానం ( విషయ, భాష,సాహిత్యజ్ఞానం) 2.అవగాహన 3.ఆనందానుభూతి 4.నైపుణ్యాలు ( పఠన, వినియోగ, సృజనాత్మక నైపుణ్యాలు) 5.ఆసక్తులు 6.వైఖరులు

వీటిని సాధించడానికి అవసరమైన ఉపకరణాలు సిద్ధం చేసుకోవాలి. అవసరమైన పరిశీలన గ్రంథాలన్ని చూసి ఉండాలి. బోధించబోయే పద్ధతి గురించి, ఆ పద్ధతిలో ఉపయోగించుకోబోయే సంవిధానాల్ని గురించి జాగ్రత్త వహించాలి. తరువాతనే ఉపాధ్యాయుడు తరగతి గదిలోనికి వచ్చి వివిధ సోపానాక్రమంలో పద్య బోధనకు పూనుకోవాలి.

1. ప్రేరణ : ( ఉన్ముఖీకరణం) **(Motivation) :**

మానసికంగా ఎక్కడో వున్నవిద్యార్థులను తన బోధన వైపు మరల్చుకోవాడానికి ఉపాధ్యాయుడు చేసే ప్రయత్నమే ఉన్ముఖీకరణం. ఈ ప్రేరణ ఉపాధ్యాయుల సామర్థ్యం, నైపుణ్యాలపై ఆధారపడి

ఉంటుంది. ఉపాధ్యాయుడు బోధించ బోవు పాఠ్యాంశానికి సంబంధించిన కొన్ని కథా విశేషాలు చెప్పడం ద్వారా ప్రశ్నలు, పూర్వజ్ఞానాన్ని పరిశీలించి ప్రశ్నలు అడగడం ద్వారా ప్రేరేపింపవచ్చు.

- కొన్ని బోధన ఉపకరణాలను కూడా చూపించి ప్రేరణ చేయవచ్చు.
- కొన్ని సందర్భాలలో ఉపాధ్యాయుడు పాఠ్యాంశానికి సంబంధించిన విషయాలపై అభినయం చేసి ప్రేరణ చేయవచ్చు.
- కొన్ని చిత్ర పటాలు, బొమ్మలు చూపించి ప్రేరణ చేయవచ్చు.

ప్రశ్నలడగటం మాత్రమే ప్రధానంగా పాటించకూడదు. సందర్భాన్ని బట్టి చర్చ, కృత్యాల ద్వారా, పఠనం, ప్రత్యక్షానుభవాలు కల్పించడం ద్వారా ప్రేరణను చేసుకోవచ్చు.

2. శీర్షిక ప్రకటన :(విషయ ప్రకటన)

ఉపాధ్యాయుడు ఉన్ముఖీకరణం చేస్తూ తాను చెప్పబోయే అంశాన్ని విద్యార్థుల నుంచి రాబట్టిన పూర్వ జ్ఞానాలతో ప్రస్తుత బోధనాంశాన్ని కలిపి విషయాన్ని ప్రకటించే సోపానమే విషయ ప్రకటన లేదా శీర్షికప్రకటనం అంటారు. విద్యార్థులు ఆ పీరియడ్‌లో బోధించబోయే పాఠ్యాంశంపేరును సరిగ్గా చెప్పాలి అనే నియమం లేదు. దానికి సంబంధించిన సమాధానాలు ఇస్తేనే సరిపోతుంది. ఆ పాఠ్యాంశం పేరును ఉపాధ్యాయుడు వ్రాయవచ్చు. ఇట్లు విద్యార్థులకు బోధించబోయే పాఠ్యాంశాన్ని రాబట్టి ప్రవేశపెట్టడం ఉపాధ్యాయుని ప్రతిభ, సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది. బోధన చేయడానికి ఇది తొలిమెట్టు. ఈ విధంగా విద్యార్థులు నేర్చుకోబోయే పాఠ్యాంశాన్ని ప్రకటించి విద్యార్థులను ఉత్సాహపరచడం జరుగుతుంది.

3. ప్రదర్శన : (Presentation)

శీరీక ప్రకటన తరువాత విద్యార్థులు గ్రహించబోయే విషయాలను తెలుపడం ఈ ప్రదర్శన ప్రధాన సోపానం. ఇక్కడ కవి కాలాదులు, సందర్భం, కవి జీవిత విశేషాలు, కవి పరిచయం పట్టికలు పఠనం, పాఠనం, మౌనపఠనం బోధనాంశ విశదీకరణ అనేవి ఉపభాగాలు.

శీరీక ప్రకటన తరువాత విద్యార్థులు పుస్తకములోని పాఠ్యాంశాలను చూడగలరు. బోధించబోయే పద్యాన్ని ఉపాధ్యాయుడు లయబద్ధంగా, రాగయుక్తంగా రెండుసార్లు సంధితో అన్వయ క్రమంలో ఆదర్శంగా పఠించాలి.పద్యానికి సంబంధించిన స్థూల విషయాన్ని పూర్ణ పద్ధతిలో ఏకాంశంగా స్వీకరించి ముందుగా చెప్పాలి. ఆ తరువాత విషయాన్ని ఉపభాగాలుగా విభజింపచేసి ముఖ్యాంశాలను బోధించాలి.

కవి కాలాదులు : ఉపాధ్యాయుడు పద్యపాఠాన్ని బోధించబోయే ముందు ఆ పద్య పాఠాన్ని రచించిన కవి పేరు, ఏ గ్రంథం నుండి స్వీకరింపబడినది, కవి జీవితకాలం, సమకాలికలు, కవి రచించిన ఇతర గ్రంథాలు, ఆయన ఏ ప్రాంతానికి చెందినవాడు, ఆయన బిరుదులు మొదలగువాటిని గురించి విద్యార్థులకు బోధించాలి. విద్యార్థులు కవులను తమజీవితంలో ఆదర్శ మూర్తులుగా తీసుకోగలరు.

సందర్భం : పద్యంలోని స్థూలభావాన్ని తెలియజేయడానికి సందర్భం, పఠనం, పాఠనం, మౌనపఠనం అనే ఉప సోపానాలు ఉపకరిస్తాయి.విద్యార్థులు చెప్పగలరను కొన్నప్పుడు వారి నుండి ప్రశ్నోత్తర సంవిధానంలో సందర్భం రాబట్టవచ్చు. వీలు కాదనుకుంటే ఉపాధ్యాయుడే చెపుతూ మధ్య మధ్య ప్రశ్నలడుగుతు కూడా బోధించవచ్చు.

పద్యంచెప్పేటపుడు ఆ పద్యం ఎవరు ఎవరితో, ఎప్పుడు, ఏ సందర్భంలో ఎట్లు చెబుతున్నాడు అనే విషయాలు ఈ సందర్భం అనే సోపానంలో తెలియజేయవచ్చు. కొన్ని పద్యాలకు సందర్భం చెప్పడానికి సాధ్యపడలేదంటే చెప్పనవసరం లేదు. ఇటువంటి విషయాలు పాఠ్యాంశాన్ని ప్రారంభించి నరోజు చెప్పిన తరువాత ప్రతి పీరియడ్‌లో బోధన మధ్యలో సందర్భ విషయాలను బోధించాలనే నియమం లేదు. సందర్భాన్ని బట్టి వారికి విషయాలను తెలియజేయవచ్చు.

2. పఠనం – పాఠనం – మౌనపఠనం

పద్యబోధన చేసేటప్పుడు విద్యార్థులు పుస్తకాన్ని చూస్తు గమనించడం మంచిది. అప్పుడే ఉపాధ్యాయుడు పఠించే పద్యాలు,పదాలు, పదాల ఉచ్చరణపై విద్యార్థులకు మంచి అవగాహన ఏర్పడుతుంది. పద్యాన్ని చదవడంలోని (రకాలు) పాటించవలసిన కొన్ని నియమాలు :

1. లయబద్ధంగా చదవడం (రాగయుక్తంగా)
2. అన్వయక్రమంలో భావానుగుణంగా విడదీసి చదవడం.
3. మౌనంగా చదవడం

ఉపాధ్యాయుడు పద్యాన్ని లయబద్ధంగా, రాగయుక్తంగా చదవాలి. తరువాత విద్యార్థులచే పద్యాలను చదివించాలి. లయబద్ధంగా అంటే సంగీత పరిజ్ఞానంతోనే చదవాలనే నియమం లేదు. పద్యంలోని ఛందస్సును, అనుసరించి పదాలను తప్పులు లేకుండా అర్థమయ్యేటట్లు,స్పష్టంగా, ఉచ్చారణా లోపం లేకుండా చదివితే అది లయానుగుణంగా ఉంటుందని చెప్పవచ్చు.

పద్యంలోని భావ విశ్రాంతిని దృష్టిలో పెట్టుకొని మూడు, నాలుగుసార్లు ఉపాధ్యాయుడు విడదీసి చదవడం మంచిది. పద్యాన్ని చదివేటప్పుడు సంగీత శబ్దానికి ప్రాధాన్యత ఎక్కువైతే విద్యార్థులు పద్య భావాన్ని గ్రహించడానికి అవకాశం తగ్గిపోతుంది.

అన్వయక్రమంలో భావానుగుణంగా విడదీసిచదవడం :

ఉపాధ్యాయుడు లయబద్ధంగా చదివిన తరువాత భావానుగుణాలను దృష్టిలో పెట్టుకొని పద్యాలను రెండుసార్లు విద్యార్థులకు అర్థం అయ్యేటట్లు విడదీసి అన్వయ క్రమంలో చదవాలి. ఆ తరువాత విద్యార్థులను కూడా భావానుగుణంగా విడదీసి చదువడానికి ప్రయత్నించాలి. విద్యార్థులచే చదివించాలి. పద్యాన్ని చదివేటప్పుడు (కర్త, కర్మ, క్రియ క్రమంలో) అన్వయపరచి చదవడం ఉత్తమమైనది.

3. మౌన పఠనం :- ఉపాధ్యాయుడు చదవడాన్ని పఠనం అంటారు. విద్యార్థుల చేత చదివించడాన్ని పాఠనం అంటారు.ఉపాధ్యాయుడు పఠనం చేసిన తరువాత పాఠ్యాంశాన్ని విద్యార్థులచే చదివించడం మౌనపఠనం అంటారు. ఇది పాఠ్యాంశాలను ఉపాధ్యాయుడు బోధించిన చివరగా చేస్తే ఉత్తమం. భాషాస్థాయి కఠినంగా లేక పోయిన కొందరు పాఠ్యాంశాల్ని బోధించడానికి ముందు చదివిచదివించి బోధించిన తరువాత కూడా మళ్ళీ చదివి చదివిస్తారు. ఇలా చదివేటప్పుడు భావస్ఫూర్తి బాగా పొంది ఉన్న విద్యార్థులు ఇంకా ఎక్కువ ఆనందానుభూతి పొందే అవకాశం ఉంది.

4. బోధించే విషయాల విశదీకరణ :

పద్యాన్ని మౌనపఠనం చేయించిన తరువాత పద్యంలోని స్థూలభావాన్ని ప్రశ్నల రూపంలో సమాధానాలను రాబట్టాలి. విద్యార్థులు మౌనపఠన సమయంలో పద్యంలోని అర్థాన్ని, స్థూలభావాన్ని గ్రహించి ఉంటారు. ఆ స్థూలభావాన్ని ఉపాధ్యాయుడు ముందుగా తెలియజేసాక ఆ భావాన్ని ఉపభాగాలుగా విభజించి ఒక్కొక్క అంశాన్ని విశ్లేషించి దానిలోని సౌందర్యాన్ని, ముఖ్యాంశాలను తెలియపరచాలి.

ప్రాచీన బోధన పద్ధతిలో బోధనలో చెప్పడం ముఖ్యంగా ఉన్నది. అంటే ఉపాధ్యాయుడే బోధనలో ముఖ్యత్వం వహించి విద్యార్థులు అంతగా పాత్ర వహించరు.(Teacher- Centered) అది ఉపాధ్యాయ కేంద్రీకృత పద్ధతి.

కాని ఆధునిక బోధన పద్ధతిలో చెప్పించడం ప్రధానమైనది. ఇక్కడ ఉపాధ్యాయుల పాత్ర కన్న విద్యార్థుల పాత్ర ఎక్కువ (Student-Centered) విద్యార్థి కేంద్రీయ పద్ధతి.
బోధనాభ్యసన కృత్యాలలో విద్యార్థులను ఎక్కువగా పాల్గొనేటట్లు చేయడం జరుగుతుంది.

విద్యార్థులు స్వయంగా తెలుసుకోవడానికి వారిని ప్రశ్నించి వారితోనే సమాధానాలను రాబట్టాలి. ప్రశ్నలు సహజ, వ్యావహారిక భాషలో ఉండాలి. ఈ బోధనాంశ విశదీకరణ ప్రదర్శన సోపానంలో ఉప సోపానం. పద్య బోధనలక్ష్యాన్ని ఈ సోపానమందే ఎక్కువగా సాధించాలి.

ఉపాధ్యాయుడు పద్య ముఖ్యాంశాలను బోధించడానికి ముందుగానే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. ఒక వరుస క్రమానుసారంగా విద్యార్థులను ప్రశ్నించాలి. సమాధానాలను రాబట్టి విషయాలను బోధించాలి. అర్థం కాని పెద్ద పెద్ద సమాసాలున్న పద్యాలు, ఛందస్సు, అలంకారాలున్న వాటిని పరిశీలించి జాగ్రత్తగా వర్గీకరించుకొని విడదీసి బోధించాలి.

ఉపాధ్యాయుడు పద్యబోధన చేసేటప్పుడు అన్ని పదాలకు ఒక్కసారిగా అర్థాలు చెప్పనవసరం లేదు. ఆయా సందర్భాలలో కఠినపదాలకు అర్థాలు చెప్పాలి. చాలా కఠినమైన వాటిని బోధించేటప్పుడు బోధన ఉపకరణాలైన చిత్ర పటాలను, నమూనాలను చూపించాలి లేదా విద్యార్థులలో ఆలోచనాజ్ఞానంతో సమాధానాలను రప్పించి నల్లబల్లపై వ్రాయించాలి.
భావాన్ని తెలుసుకొనడానికి విడదీస్తూ బోధిస్తే చాలు.

- సంధి పేర్లు, సూత్రాలు, విషయాలు చెప్పనవసరం లేదు.
- భావ సౌందర్యాన్ని బోధించేటప్పుడు మాత్రం సాభిప్రాయాలు వ్యుత్పత్తి అర్థాలను శ్లేషలో ఉన్న

నానార్థాలను ఆయా సందర్భానుసారంగా బోధించాలి. భావ గ్రహణ ప్రయోజనం లేనప్పుడు బోధించకూడదు.

– వ్యాకరణాంశాలైన సంధి కార్యాలు, సమాసకార్యాలు, ప్రకృతి, వికృతులను బోధన మధ్యలో చేయకూడదు.

ఇక్కడ భాషాజ్ఞానం కన్నా ఆనందానుభూతిని పెంపొందించడం చాలా ముఖ్యం. అంటే అమృతంలాంటి భావసౌందర్యాన్ని గ్రహింపచేసేటప్పుడు వ్యాకరణాంశాలు పానకంలో పుడకలా అడ్డుపడకూడదు. కాని పద్యబోధన అయిన తరువాత వ్యాకరణాంశాలను గురించి బోధించవచ్చు.

4. మూల్యాంకనం :

పద్య బోధన పూర్తి అయిన తరువాత విద్యార్థులను వారు అవగాహన పొందిన పాఠ్యాంశాలను, సారాంశాలను, భావాలను ఎంత వరకు వారు గ్రహించారో అని తెలుసుకోవడానికి ఈ మూల్యాంకనం చాలా ఉపయోగకరమైనది.

కేవలం బోధన మాత్రం జరిపితే చాలదు. అది ఎంత వరకు విజయవంతమైనది, దానిలోని ఏవైనా పొరబాటు లున్నయా, ఏ ఏమార్పులు చేసుకోవాలి, ఉపాధ్యాయుడు ఏఏ కొత్తబోధనా వ్యూహాలను పాటించాలి అని తెలుసుకోవడానికి ఈ మూల్యాంకన సోపానం చాలా ముఖ్యమైనది.

ఇక్కడ ఉపాధ్యాయుడు ప్రశ్నలు అడుగుతూ, కృత్యాలు చేయించడంతో పాటు, పద్యాన్ని కంఠస్థం చేయించటం వంటి విధానాలను మూల్యాంకనంలో పాటించి ఇంటి పనిగా కూడా ఉపయోగించుకోవచ్చు.

## గద్యబోధన - 2

4.2.1 పరిచయం

4.2.1 గద్యబోధన లక్ష్యాలు

4.2.3 గద్యబోధన ఉద్దేశాలు

4.2.4 గద్యబోధనలలో ఉపయోగించే బోధన
ఉపకరణాలు

4.2.5 గద్యబోధన పద్ధతులు

4.2.6 పద్య, గద్యబోధనకు భేదాలు

4.2.1. పరిచయం :

భాషింపబడేది భాష. ఇది భాష్ అనే ధాతువు నుండి పుట్టింది.పరస్పర భావవ్యక్తీకరణకు భాష చాలా అవసరం. మానవులకు భాష రెండువిధాలుగా ఉపయోగపడుతుంది.

1. వైయక్తికం  2. సామాజికం.

వ్యక్తి యొక్క ఉన్నతికిగానీ, పతనానికిగానీ భాష కారణమవుతుంది. సమాజంలో గుర్తింపు పొందడానికి ఈ భాష ఉపయోగపడుతుంది. భాషలోని సాహిత్యాలన్ని చదవడం ద్వారా ఆనందాన్ని పొందుతాడు. కవులైనా, రచయితలైన, పండితులైన తమభావాలు పద్య, గద్య, వ్యాస రూపాలలో వ్యక్తీకరిస్తారు.

సాహిత్య చరిత్రలో గద్యానికి ఒక ప్రత్యేక స్థానముంది. ప్రాజ్ఞన్నయకాలంలో పద్యగద్యాలతో కూడిన శాసన లభించినట్లు ఆధారాలున్నాయి.పద్యరచన ఛందోబద్ధనియమాలకు లోబడింది. గద్యం స్వేచ్ఛగా సాగేరచన. పండితులు, పామరులు ఎవరైన కూడా తమ భావప్రకటనను గద్యరూపంలో కొనసాగిస్తుంటారు.

గద్యరచన, పద్యరచనకంటే సులభతరం. కాని శ్రోతలకు పఠితలకు ఆనందాన్ని, అనుభూతాన్ని, సంతృప్తిని కలిగించే విధంగా గద్యరచన చేయడం కష్టతరం. అందరిని ఆకట్టుకునే విధంగా గద్యరచన చేయగలడం, రచయిత రచనాశక్తిని శోధించడమే అవుతుంది. ' గద్యం కవీనాం నికషం వదని' అంటారు. కవి ప్రతిభకు గద్యమే గీటురాయి. గద్యం ఛందోరహితంగా ఉంటుంది.

కాబట్టి పద్యంలాగా వినడానికి, మధురంగా ఉండదు. పద్యరచనలో శ్రోతలను ఆకరించినంతగా గద్యరచన ఆకరించజాలదు. కాబట్టి పద్యరచనపై చూపే ఆసక్తి గద్యరచనపై కవులు చూపలేదు.

బాణభట్టు కాదంబరి, దండిదశకుమారచరిత్ర, చిన్నయసూరి నీతిచంద్రిక వంటి గద్యరూప గ్రంథాలుచాలా ప్రసిద్ధి పొందాయి. ఛందోరహితమైన గద్యంలో కూడా ఛందస్సువల్ల సాధించే ప్రయోజనాలను సాధించవచ్చు అనేదానికి ఈ గ్రంథాలు మచ్చుతునకలు.

పద్యం సాహిత్యానికి మాత్రమే అయితే గద్యం సాహిత్యంతోపాటు సాహిత్యేతరాంశాలన్నింటికి ఉపయోగ పడుతుంది. గద్యరచనను సామాన్యులు సులభంగా అర్థంచేసుకొనగలరు.

ఆధునిక సాహిత్యం చాలవరకు గద్యరూపంలోనే ఉంది. సరళమైన శిష్ట వ్యవహారిక భాషలో గద్య రచనలు వెలువడుతున్నాయి. కొన్ని ప్రయోజనాలను ఆశించి కొన్ని లక్ష్యాలలో విద్యార్థులకు గద్యాన్ని బోధించవలసి ఉంది.

### 4.2.2 గద్యబోధన లక్ష్యాలు

1. గ్రాంథిక, వ్యవహారిక, ప్రామాణిక, మాండలికభాషా స్వరూప స్వభావాలను అవగాహనపరచడం.
2. గద్యం అంటే ఏమిటో (పద్యంతో పోల్చి) విద్యార్థులకు తెలియజేయడం.
3. భాషకు, భావానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని గుర్తింపచేసి భాషాజ్ఞానంతో పాటు విషయజ్ఞానం అభివృద్ధి పరచడం.
4. భారతీయ సంస్కృతి, నాగరికతను గురించి తెలియజేయడం.
5. భాషలోనున్న సామెతలు, నుడికారాలు, లోకోక్తులను, జాతీయాలను, విద్యార్థులకు తెలియజేయడం.
6. సర్. ఆర్కాట్ లక్ష్మణస్వామి మొదలియార్‌గారి అభిప్రాయ ప్రకారం నాగరికత అభివృద్ధి, మూర్తిమత్వ వికాసం, నాయకత్వలక్షణాలు పెంపొందించి ఉత్తమపౌరులుగా తయారుచేయడం.
7. సర్వేపల్లి రాధాకృష్ణగారు అభిప్రాయపడినట్లు కల్పనాశక్తి, ఆలోచనాశక్తి, కళాభిరుచి కలిగించడం
8. సముచిత వైఖరులను పెంపొందించడం.
9. జ్ఞాన, భావ సంకల్పాల ద్వారా ప్రపంచ విషయాలను తెలియజేసి, వ్రాయడం, చదవడం, పదజాలాన్ని అభివృద్ధి పరచుకోవడంలో విద్యార్థులకు తోడ్పడం.
10. విద్యార్థుల మూర్తిమత్వవికాసాన్ని మంచి ప్రవర్తనకు దోహదపడడం మొదలైన లక్ష్యాలుగా గద్యబోధన సాగించడం.
11. ధార్మిక, నైతిక విలువలను తెలియజేసి ఉత్తమ పౌరులుగా తయారుచేయడం.

### 4.2.3 ఉద్దేశాలు :

1. ఉపాధ్యాయుడు విద్యార్థులకు పాఠ్యాంశాలను తెలియజేయడం.
2. భావగ్రహణపదజాలం(Active Vocabulary), భావవ్యక్తీకరణ పదజాలం (Passive Vocabulary) పెంపొందింప చేయడం.
3. చక్కని ఆలోచనాశక్తి, విమర్శనాత్మక దృష్టిని అభివృద్ధిపరచడం.
4. భాషానైపుణ్యాలను పెంపొందించడం.
5. భాషాజ్ఞానం అభివృద్ధి చేయడం.

6. వర్ణక్రమాన్ని నిర్దుష్టంగా తెలియపరచడం. 7. భాషపై అధికారాన్ని పెంపొందింపచేయడం.

8. శ్రవణ పఠన సామర్థ్యాలను అభివృద్ధిపరచడం.

9. జ్ఞానపరిధిని విస్తరింపచేయడం.

10. గద్యలక్షణాన్ని సంప్రదాయాన్ని క్షుణ్ణంగా తెలియజేయడం.

11. రచన చేయడానికి ప్రేరేపించడం.

12. సంభాషణాశక్తిని అభివృద్ధిపరచి, చర్చలపై ఆసక్తిని కలిగించడం.

13. భాషలోని నుడికారాన్ని తెలియపరచడం. 14.స్పష్టమైన ఉచ్చారణాశక్తిని కలిగించడం.

15. గద్యపాఠాలలోని వ్యాకరణాంశాలను గ్రహించి చక్కని వ్యాకరణజ్ఞానాన్ని అభివృద్ధిపరచుకోవడం.

16. సృజనాత్మకశక్తిని పెంపొందింపచేయడం.

17. గద్యంలోని కఠిన పదాలకు అర్థాలను తెలియచేయడం, వాక్యప్రయోగ జ్ఞానాన్ని కలిగించడం.

18. విరామ సమయాలలో ఉత్తమ గద్యరచనలను విస్తారంగా చదివేటట్లు ప్రోత్సాహించడం.

19. విద్యార్థులలో ప్రకాశ, మౌన పఠనాశక్తులను పెంపొందింపచేయడం.

20. శబ్దాధికారాన్ని, శబ్దజాలాన్ని అభివృద్ధిచేయడం.

21.సాహిత్యాభిరుచిని కలిగించి, సాహిత్యరచనలు కవులు, పండితులు,రచయితలపై గౌరవాభిమానాలు కలిగేటట్లు చేయడం.

గద్యపాఠ్యాలలో క్రింద పేర్కొన్న అంశాలు చోటుచేసుకొంటాయి.

1. కథ 2.జీవిత కథ 3.స్వీయచరిత్ర 4.యాత్రకథ 5.లేఖ 6.వ్యాసం 7.ఉపన్యాసం

8. చరిత్ర 9.లలితకళలు 10. ఏకపాత్రాత్మకం 11.రేడియోప్రసంగం 12. నవల

13.నాటకం – నాటిక 14.ఏకాంకిక 15.విమర్శ 16. చర్చ

4.2.4 గద్యబోధనలో ఉపయోగించే బోధనఉపకరణాలు :

ఉపాధ్యాయుడు గద్యపాఠ్యాంశాన్ని బోధించేటప్పుడు విద్యార్థులను పాఠ్యోన్ముఖులుగా చేయాలి. పాఠ్యాంశాన్ని సమగ్రంగా విద్యార్థులు అర్థం చేసుకోవడానికి అవగాహన పొందడానికి కొన్ని బోధనోపకరణాలను ఉపయోగించాలి.

1. నల్లబల్ల 2.సుద్దముక్క 3.తుడుపుగుడ్డ

4. సూచి (Pointer) 5.సాహిత్యపాఠానికి సంబంధించిన చిత్రపటాలు

6. కవులచిత్రపటాలు 7.పరామర్శగ్రంథాలు

8. దేశపటాలు 9.జాతీయ సంస్కృతిని తెలియజేసే పటాలు

10 భాషావికాసాన్ని నిరూపించే శాసనాలు 11.ఆధునిక కవులచిత్రాలు

12.ప్రాచీన కవుల భావచిత్రాలు 13.చారిత్రాత్మక స్థలాలు చిత్రాలు

14. ప్రకృతి దృశ్యకళాఖండాలు మొదలైన వాటిని బోధన సందర్భంలో ఉపాధ్యాయుడు సమయోచితంగా ఉపయోగించుకోవాలి.

4.2.5 గద్యబోధన పద్ధతులు :

ఉపాధ్యాయులందరూ బోధనా సమర్థులే. మాతృభాషను బోధించడం అనేది విశిష్టమైన కళ. ఈ కళలను ఉపాధ్యాయులందరూ అలవరచుకోవాలి.

గద్యంలో వివరణ ప్రధాన లక్షణం. విషయాలను వివరించడానికి గద్యాన్ని ఉపయోగిస్తారు. పద్యబోధనలో ఉపయోగించే పద్ధతులను గద్యబోధనలో కూడా ఉపయోగించవచ్చు.

సందర్భానికి తగినట్లు ఉపాధ్యాయుడు బోధనావిధానాలను పద్ధతులను ఎంపిక చేసుకోవాలి.

ఇది ఉపాధ్యాయుని సామర్థ్యం, ప్రతిభపై ఆధారపడి ఉంటుంది. గద్యాన్ని పూర్ణపద్ధతిలో బోధింపవచ్చు. గద్యంలో ఒక్కొక్క పరిచ్ఛేదము (పేరాను) ను తీసుకొని దానిలో ఉండే ముఖ్యాంశాన్ని విద్యార్థులకు బోధించాలి. గద్యంలోని ముఖ్యాంశాలను వివరిస్తూ విషయజ్ఞానం, భాషా జ్ఞానాలపై విద్యార్థులకు అవగాహన కలిగించాలి.

గద్యబోధనలో సాధారణంగా ఉపయోగించే పద్ధతులను ఛాత్రోపాధ్యాయుల కోసం క్రింద వివరించడం జరిగింది.

| | | |
|---|---|---|
| 1. కథాకథనపద్ధతి. | 2. కృత్యాధారపద్ధతి | 3. సంభాషణపద్ధతి |
| 4. పఠనపద్ధతి | 5. ఉదాహరణపద్ధతి | 6. ప్రశ్నోత్తరపద్ధతి |
| 7. చర్చాపద్ధతి | 8. వివరణపద్ధతి. | |

1. కథాకథనపద్ధతి : విద్యార్థులకు కథలంటే చెవికోసుకొంటారు. ప్రాథమికస్థాయి విద్యార్థులకు గద్యపాఠాన్ని బోధించేటప్పుడు ఎక్కువగా ఈపద్ధతిని ఉపయోగించవచ్చు.

ఈ పద్ధతిలో బోధించవలసిన పాఠ్యాంశాన్ని కథలుగా విద్యార్థులకు చెప్పి మరల వారిచేత ఆకథను చెప్పించడాన్ని కథాకథన పద్ధతి అంటారు. ప్రాథమికతరగతులలో అంటే ముఖ్యంగా 1 నుండి 3 వతరగతి విద్యార్థులకు ఈపద్ధతి చాలా ఉపయోగకరం. ఈ దశవిద్యార్థులకు కథలంటే చాలాఆసక్తితో వింటారు. ఉపాధ్యాయుడు దీన్ని ప్రేరణగా కూడా వాడుకోవచ్చు. ఉపాధ్యాయుడు గద్యాన్ని బోధించేటప్పుడు విషయాలను ఆసక్తిదాయకంతో, కథను చెప్పేటప్పుడు హావభావాలతో, వాచికాభినయం చేస్తూ చెప్పాలి. అలాగే విద్యార్థులచేత కూడ చెప్పించాలి.

ఈ పద్ధతిలో పూర్ణపద్ధతిలోలాగా పాఠ్యాంశ స్థూలభావాన్ని ఏకాంశంగా గ్రహించి విద్యార్థులకు బోధించాలి. గద్యాంశాన్ని కథలుగా చెప్పేటప్పుడు దానిలోని కథాపాత్రలకు తగిన విధంగా వాచికాభినయంచేస్తూ, విద్యార్థుల మనసు ఆకట్టుకొనే విధంగా చెప్పి విద్యార్థులచేత కూడ చెప్పించాలి.

కాబట్టి ఈపద్ధతిలో విద్యార్థులు పాఠ్యాంశాన్ని ఏకాగ్రతతో ఆసక్తితో నేర్చుకోవడానికి ఉపయోగపడుతుంది.

2. కృత్యాధారపద్ధతి :-

కృత్యాల ఆధారంగా బోధించడమే కృత్యాధారపద్ధతి. కృత్యాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులు అభ్యసనలో చురుకుగా పాల్గొంటారు. గద్యబోధనకు ఈపద్ధతిని ఉపయోగించి చేసేటప్పుడు ఉపాధ్యాయుడు పాఠ్యాంశానికి తగినట్లు కొన్ని కృత్యాలను చేసి బోధించవచ్చు.

కృత్యాలను వైయుక్తికంగాను, చిన్నజట్లతోను, సమూహంలోను నిర్వహించవచ్చు. గద్యాన్ని బోధించడానికి పాఠ్యాంశానికి సంబంధించిన భాషాక్రీడలు కూడా ఉపయోగించవచ్చు. ఈ పద్ధతిలో విద్యార్థులలో స్వయం అభ్యసనాశక్తి, పరస్పరసహకారం పెంపొందించడానికి అవకాశముంటుంది.

3. సంభాషణపద్ధతి :

ఈపద్ధతిలో విద్యార్థులను ఎక్కువగా మాట్లాడిస్తూ పాఠ్యాంశాలను బోధించవచ్చు. సంభాషణా రూపంలోని గద్యపాఠాలకు ఈపద్ధతి ఉపయోగపడుతుంది. సంభాషణారూపంలో లేని పాఠాలకు సంభాషణలుగా మలచుకొని బోధన చేయవచ్చు.

ఈపద్ధతి వలన విద్యార్థుల భాషాజ్ఞానం, ఆలోచనాశక్తి, పరస్పరఅవగాహన, మంచివాక్చాతుర్యం పెంపొందించవచ్చు ఈపద్ధతి ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత తరగతులకు ఉపయోగపడుతుంది.

4. పఠనపద్ధతి :

గద్యపాఠంలోని విషయాలను చదువుతూ, విద్యార్థులచేత చదివించి బోధించడం ఈపద్ధతి ప్రత్యేకత. ఈపద్ధతివలన విద్యార్థుల పఠననైపుణ్యాన్ని పెంపొందించవచ్చు. పాఠ్యాంశాన్ని చదివించ

డంద్వారా విద్యార్థులలోఉచ్చారణలోపాలను కనిపెట్టి సవరణకు తగిన సూచనలిచ్చి, నిర్దుష్ట ఉచ్చారణను అభివృద్ధిపరచవచ్చు. ప్రాథమికతరగతి వారికి ఈ పద్ధతి చక్కగా ఉపయోగపడుతుంది.

5. ఉదాహరణపద్ధతి :

నూతనపదాలను పరిచయం చేసేటప్పుడు వాటిని తెలిసిన అంశాలతో సమన్వయపరచి ఉదాహరణలతో వివరించి సులభంగా అర్థమయ్యేటట్లు బోధించడానికి ఈపద్ధతి ఉపయోగపడుతుంది. నూతనపదాలు, శబ్దాలు, విద్యార్థులకు సులభంగా అర్థంకావడానికి అవకాశం ఎక్కువ.

వ్యాకరణాంశాలు (సంధులు, సమాసాలు, కఠినపదాలు) పరిచయం చేసేటప్పుడు ఈ పద్ధతిని ఉపయోగించవచ్చు.సారూప్యతగల ఒకపదాన్ని విడదీసి మొదట, మరోపదాన్ని విడదీయించి బోధించవచ్చు.

> ప్రాథమిక తరగతులలో గద్యభాగంలోని కొత్తపదాలను ఎలా పరిచయం చేస్తారో ఉదాహరణలతో వివరించండి.

6. ప్రశ్నోత్తర పద్ధతి :

గద్యపాఠ్యాంశానికి సంబంధించిన కొన్ని ప్రశ్నలు తయారుచేసుకొని వాటిని ఉపయోగించి విద్యార్థులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టి బోధించడమే ప్రశ్నోత్తరపద్ధతి. ఈ పద్ధతిలో ఉపాధ్యాయుడు గద్యపాఠాన్ని కేంద్రంగా తీసుకొని విద్యార్థుల్ని ప్రశ్నిస్తూ, విద్యార్థుల నుండి సమాధానాలను రాబట్టి బోధించడం జరుగుతుంది.

అటుతర్వాత విద్యార్థులు ఇచ్చే సమాధానాలను విస్తృతపరచి మరికొన్ని విషయాలు వివరించాలి. గద్యాన్ని వివరించేటప్పుడు నిత్యజీవితంలోని అనుభవాలపై కూడ ప్రశ్నించవచ్చు.

ఆధునికకాలంలోని విద్యార్థులు వారికే సందేహం కలిగిన వెంటనే ఉపాధ్యాయులను ప్రశ్నించి తెలుసుకోవడం పరిపాటి. కాబట్టి బోధనలో ప్రశ్నోత్తరపద్ధతి ఎంతోప్రయోజనకరంగా ఉంటుంది. ఈపద్ధతిలో విద్యార్థులు చురుకుగా పాల్గొంటారు. ఈపద్ధతివలన విద్యార్థులలో భాషణనైపుణ్యాభివృద్ధి కలుగుతుంది. ప్రశ్నలు అడగడంలో క్రింది విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి.

> ఒక గద్యభాగాన్ని తీసుకొని కథాకథనపద్ధతిలో బోధించండి. అదే పాఠాన్ని చర్చాపద్ధతిలో బోధించండి. పై రెండింటిలో గల భేదాన్ని గమనించి మీ అభిప్రాయాలను తెలుపండి.

- ☆ ప్రశ్నలు ఆలోచనాత్మకంగా ఉండాలి.
- ☆ పాఠ్యాంశానికి సంబంధించిన ప్రశ్నలుగా ఉండాలి.
- ☆ విద్యార్థులను ఇబ్బంది పెట్టేవిధంగా ప్రశ్నలుండకూడదు.
- ☆ విద్యార్థులు సమాధానాలను ఇచ్చే విధంగా ప్రశ్నలు వుండాలి.
- ☆ ఒక వేళ ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నకు విద్యార్థులు సమాధానం చెప్పలేకపోతే ఆ ప్రశ్నకు సంబంధించిన మరికొన్ని సహాయక ప్రశ్నలను అడిగిసమాధానం రాబట్టాలి. ఈపద్ధతి ప్రాథమిక, మాధ్యమిక ఉన్నత తరగతులకు ప్రయోజనకారి.

7. చర్చాపద్ధతి :

బోధనాభ్యాసనా ప్రక్రియలో విద్యార్థులను పాల్గొనేటట్లు చేయడానికి, ఈపద్ధతి చక్కని అవకాశం ఇస్తుంది. ఇందులో విద్యార్థులకు ప్రశ్నించి సమాధానాలు రాబట్టే పద్ధతికాకుండా విద్యార్థుల్ని సామూహికంగా, జట్లుగా పాఠ్యాంశంపై సమగ్రంగా చర్చింపజేయాలి. పాఠ్యాంశంలోని విషయా

లను ప్రస్తావిస్తూ వారి అభిప్రాయాలను స్వేచ్ఛగా సహజంగా వ్యక్తీకరిస్తూ, పాఠ్యాంశ ముఖ్యాంశాలపై సమగ్ర అవగాహన పొందడానికి ఈపద్ధతి ఉపయోగపడుతుంది. చర్చించేటప్పుడు విద్యార్థుల మధ్య సరైన వాతావరణం ఉండేటట్లు ఉపాధ్యాయుడు అనుసంధానకర్తగా వ్యవహరించాలి. ఈ పద్ధతి వలన విద్యార్థులలో భాషణనైపుణ్యాలను పెంపొందించవచ్చు. మాధ్యమిక, దశవిద్యార్థులకంటే ఉన్నత తరగతులవారికి ఈపద్ధతి చాలా ఉపయోగపడుతుంది.

8. వివరణపద్ధతి :

ఈపద్ధతిలో పాఠ్యాంశంలోని విషయాలన్నింటిని ఉపాధ్యాయుడు ఉపన్యాసధోరణిలో వివరించి చెప్తాడు. పాఠ్యాంశంలోని విశేషాంశాలు, రచయిత, వివరాలు, పూర్వగాథలు, సందర్భం, వ్యాకరణాంశాలు, పాఠ్యనేపథ్యం మొదలైన విషయాలన్నింటిని ఉపాధ్యాయుడు విశదపరచి చెప్పాలి. వివరణలు విమర్శనాత్మకంగా సాగాలి. కవి లేక రచయిత అభిప్రాయాలను ఆత్మీయతాభావాన్ని వివరించాలి. సామెతలు, నుడికారాలు, సూక్తులు మొదలైనభాషావిశేషాలకు గ్రహించి నిత్యజీవితంలో ఉపయోగపరచేటట్లు విద్యార్థులకు వివరించాలి.

తెలియని విషయాలు విశదంగా తెలుసుకోవడానికి ఈపద్ధతి ఎంతో ఉపయోగపడుతంది. మాధ్యమిక, ఉన్నత తరగతులకు ఎక్కువగా ఈ పద్ధతి ఉపయోగపడుతుంది.

తెలుగులో ప్రసిద్ధమైన గ్రంథాలపేర్లను సేకరించి పట్టికను తయారుచేయండి.

4.2.6 పద్యబోధనకు, గద్యబోధనకు భేదాలు :

| పద్యబోధన | గద్యబోధన |
|---|---|
| 1. ఆనందానుభూతి, సాహిత్యాభిరుచి పెంపొందించటం ప్రధాన ఉద్దేశాలు | భాషాధికారం, విషయపరిజ్ఞానం పెంపొందించటం ప్రధాన ఉద్దేశాలు. |
| 2. లయబద్ధంగాను, అన్వయక్రమంలో భావానుగుణంగా విడదీసి చదవాలి | భావానుగుణంగా విడదీసి చదివితే చాలు. |
| 3. వ్యాకరణ విశేషాలు, పద్యబోధన మధ్యలో చేయ పనిలేదు. బోధన ముగిసిన తర్వాత చేయవచ్చు. | గద్యాన్ని బోధిస్తున్న సమయంలోనే వ్యాకరణ విశేషాంశాలు తెలుపవచ్చు. |
| 4. కవి, ఆత్మీయత, చమత్కారం, ధ్వని మొదలైన సాహిత్య అంశాలు తెలుపబడుతాయి. | రచయిత, ఆత్మీయత, చమత్కారం, ధ్వనిమొదలగు సొగసులకన్న భాషాంశాలు ఎక్కువగా ఉంటాయి. |
| 5. పద్యాన్ని కంఠస్థం చేయించవచ్చు | కంఠస్థం చేయించే పనిలేదు. |
| 6. సారాంశం చెప్పించి రాయించాలి | సారంశాన్ని చెప్పిస్తే చాలు. ప్రశ్నలకు సమాధానాలు |
| 7. విద్యార్థుల్ని ఉత్తమ కవులుగా తీర్చిదిద్దవచ్చు. | గాని, సంక్షిప్త సారాంశంగాని రాయించవచ్చు. |
| 8. మౌనపఠనం అత్యంత ఆవశ్యకం కాదు. | ఉత్తమ రచయితలుగా తీర్చిదిద్దవచ్చు. |
| 9. పద్యంలో వాక్యనిర్మాణం ముందు వెనుకలుగా ఉంటుంది. కాబట్టి బోధనలో ప్రశ్నల క్రమాన్ని జాగ్రత్తగా ఎంచుకోవాలి. | మౌనపఠనం చేయించటం అవసరం. గద్యంలోవాక్యనిర్మాణం ఒక క్రమపద్ధతిలో ఉంటుంది. కాబట్టి బోధనలో ప్రశ్నల క్రమం ఎంచుకోవటం తేలిక. |
| 10. భాషకొంత కఠినంగా ఉంటుంది. కనుక ఎక్కువ కఠినపదాలకు అర్థాలు చెప్పాలి. | భాషసరళంగాఉంటుంది. కనుక ఎక్కువ కఠినపదాలకు అర్థాలు చెప్పే అవసరం ఉండదు. |
| 11. ఉపాధ్యాయుని బోధనకు ప్రాధాన్యత కలిగి ఉంటుంది . | విద్యార్థుల స్వీయఅభ్యసనానికి అవకాశం ఉంది |

# ఉపవాచక బోధన - 3

4.3.1 పరిచయం

4.3.1 బోధన లక్ష్యాలు

4.3.3 బోధన ఉద్దేశాలు

4.3.4 ఉపవాచక లక్షణాలు

4.3.5 ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత దశలలో
ఉపవాచక బోధన

4.3.6 ఉపవాచక బోధన పద్ధతులు

4.3.7 ఉపవాచక బోధనక్రమం

4.3.8 వాచక - ఉపచాక భేదాలు

4.3.1. పరిచయం :

విద్యాప్రణాళికా లక్ష్యాలను నెరవేర్చడానికి బోధనఅభ్యసనాలకు ఉపయుక్తం అయ్యేవి వాచకాలు.విద్యార్థుల క్షుణ్ణపఠనానికి తద్వారా సాహిత్యాభిరుచిని మరియు భాషాజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి పాఠ్యపుస్తకాలు అవసరం. పఠించడానికి ఉపయోగింపబడేవి కనుక వాటిని పాఠ్యపుస్తకాలంటారు. వచించడానికి ఉద్దేశించబడ్డవి కనుక వాచకాలు అని కూడా అంటారు.

పాఠశాలలో బోధన అభ్యాసాలకు ముఖ్యసాధనం పాఠ్యపుస్తకం. దీనిలోని అంశాలన్నింటిని విద్యార్థులు తప్పనిసరిగా నేర్చుకోవాలి. కాబట్టి దీనిని క్షుణ్ణపఠన గ్రంథం అని కూడా అంటారు.

ఈ పాఠ్యగ్రంథంద్వారా విద్యార్థులు భాషానైపుణ్యాల అభివృద్ధి, పదజాలాభివృద్ధి, భావాగ్రహణ శక్తి, వ్యాకరణజ్ఞానం, సాహిత్యాభిరుచి, ఆనందానుభూతి మొదలైనవి పొందగలరు.

ఈ వాచకాలు అధికమైన విషయ జ్ఞానాన్ని పొందడానికి చాలవు. పాఠ్యగ్రంథాలలో నేర్చుకొన్న వివిధ భాషాసాహిత్య విషయాల ఆధారంగా జ్ఞానాన్ని అభివృద్ధి పరుచుకోవడానికి,విస్తారపఠనం చాలాఅవసరం.ఈ విధమైన విస్తారపఠనం ద్వారా విద్యార్థులు విషయజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. తదనుగుణంగా రూపొందించబడినవే ఉపవాచకాలు. ఇవి పాఠ్యగ్రంథ బోధన లక్ష్యాల సాధనకు పూరకాలుగా ఉంటాయి. అందుకు అనుగుణంగా రూపొందింపబడినవే ఉపవాచకాలు విద్యార్థులు విషయజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలను సందర్శించి అందలి గ్రంథాలను చదివి నేర్చుకోవాలి. విరామసమయంలో స్వయంగా చదివి ఎక్కువ విషయాలను తెలుసుకోవడానికి, ప్రపంచజ్ఞానాన్ని అవగతంచేసుకోవడానికి ఉపయోగపడేది ఉపవాచకం.

విషయజ్ఞానంతోబాటు మనసంస్కృతి,నాగరికత, ఆచారవ్యవహారాలను ఆధ్యాత్మికచింతన మొదలైన వాటిని తెలుసుకోవడానికి కూడా ఇవి ఉపయోగపడతాయి. కాబట్టి పాఠశాలలో ఉపవాచకాల బోధన చేయడం ఎంతో అవసరం. ఉపవాచకబోధన లక్ష్యాలు, ఉద్దేశ్యాలు, పద్ధతులు ఉపాధ్యాయులు తెలుసుకోవాలి.

4.3.2. ఉపవాచక బోధనలక్ష్యాలు :

1. విస్తృత పఠన్యాభ్యాసం అలవాటు చేయడానికి.
2. విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించడానికి కలిగించడానికి
3. బుద్ధి వికాసాన్ని కలిగించడానికి,
4. సారస్వతఅభిరుచి పెంచడానికి
5. స్వయంకృషిలో జ్ఞానసముపార్జనకు అవకాశం కలిగించడానికి

6. విరామకాల సద్వినియోగానికి

7. మౌనపఠన సామర్థ్యాన్ని పెంచడానికి

8. గ్రంథాలయ పఠనాన్ని ప్రోత్సహించడానికి

9. విద్యార్థులలో విమర్శనాశక్తి పెంపొందించడానికి

10. సంక్షిప్త రచనాభ్యాసం అలవాటు చేయడానికి

11. కథనశక్తిని అభివృద్ధి చేయడానికి

12. నీతిని గ్రహించేటట్లు చేయడానికి

13. జాతి సంస్కృతి ఔన్నత్యాన్ని గుర్తించడానికి, అనుసరించడానికి

14. మానవతా విలువలను గ్రహింపడానికి

15. ఉత్తమ పౌరుడుగా రూపొందడానికి

4.3.3 ఉపవాచకబోధన ఉద్దేశాలు :

1. విద్యార్థులలో విస్తారపఠనను అభివృద్ధి చేయడం.

2. విద్యార్థులలో విషయజ్ఞానాన్ని పెంపొందించడం

3. విద్యార్థులలో భాషానైపుణ్యాలను పెంపొందించడం.

4. విద్యార్థులకు భాషా సాహిత్యంలో ఆసక్తి అభిరుచి కలిగించడం.

5. భాషాసంస్కృతి, సంప్రదాయాలను అవగాహనచేయడం.

6. సృజనాత్మకశక్తి, రచనాశక్తిని అభివృద్ధి చేయడం

7. గ్రంథాలయాలను సందర్శించి ఉత్తమగ్రంథాలను పరామర్శ చేసే అలవాటు అభివృద్ధిపరచడం.

8. నిత్యపఠనాన్ని ప్రోత్సాహించి, పఠనవేగాన్ని పెంచడం.

9. పదజాలం అభివృద్ధిపరచుకోవడం.

10.మన సంస్కృతి, నాగరికత, ఆచారవ్యవహారాలను తెలుసుకోవడం.

11.విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దడం.పై ఉద్దేశాలలో ఉపవాచకబోధనను కొనసాగించవచ్చు.

4.3.4 ఉపవాచక లక్షణాలు :

ఉపవాచక లక్షణాలు వాచక లక్షణాలకు భిన్నమైనది. విస్తారపఠనానికి ఉద్దేశించినవి. కాబట్టి ఇవి క్రింది లక్షణాలు కలిగి ఉంటాయి.

1. విద్యార్థులకు ఉత్తమ అభిరుచులను కలిగించేవిగా ఉండాలి.

2. విస్తారపఠనానురక్తిని పెంపొందించాలి.

3. స్వయంగా చదువుకొని విషయాలను గ్రహించేటట్లు ఉండాలి.

4. ఉద్దేశించిన తరగతిస్థాయి కన్న క్రింది తరగతిలోని భాషాస్థాయికి, శైలికి దగ్గరగా ఉండాలి.

5. సరళమైనరచనలో ఉండాలి.

6. అన్ని సాహితీప్రక్రియలను, సాహిత్య సంప్రదాయాలతో పరిచయం ఏర్పరచాలి.

7. భిన్న సంస్కృతి సంప్రదాయాలను పరిచయం చేసేదిగా ఉండాలి.

8. రచనలో శబ్దకాఠిన్యతో, జటిలమైన దీర్ఘ సమాసాలు లేకుండా సులభంగా, అర్థవంతంగా, ఆసక్తికరంగా ఉండాలి.

9. భాషాసాహిత్యాలకు మాత్రం పరిమితం కాక, శాస్త్రసాంకేతికాభివృద్ధితో పాటు సామాజిక అంశాలకు కూడ ముఖ్యత్వమిచ్చి జ్ఞానాభివృద్ధి పరచేదిగా ఉండాలి.

10. స్వీయపఠనాసక్తిని కల్గించేదిగా ఉండాలి.

11. తగిన అభ్యాసవేదికలు ఉండాలి

12. నాణ్యతమైన కాగితం, చక్కని ముద్రణ, ఆకరణీయమైన వర్ణచిత్రాలు, పుస్తకం వెల తక్కువగా ఉండాలి.

13. మనదేశనాయకులు, కవులు, ఇతర దేశనాయకుల జీవిత చరిత్రల రచనలు ఉండాలి.

14. సామెతలు, లోకోక్తులు, సూక్తులు, జానపదగేయాలు, సులభతరాలైన పద్యాలను సందర్భానుసారంగా పేర్కొనాలి.

15. రచనలు చేయడానికి పాఠకుడిని ప్రేరేపించేవిధంగా ఉండాలి.

4.3.5. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత దశలలో ఉపవాచక బోధన :-

1. ప్రాథమిక దశ : ఈ దశలోని విద్యార్థులకు ఉపవాచకాలు ప్రవేశపెట్టకపోయినా, కొన్ని ఆకరణీయమైన చిత్రాలతో వర్ణించిన కథలు, ఉపవాచకాలుగా ఉపయోగించవచ్చు.

ఉదా పంచతంత్రకథలు, ఈసఫ్ నీతికథలు, పురాణాలలోని నీతికథలు ( రామాయణం, మహాభారతం, భాగవతం నుండి) పొడుపుకథలు, చందమామ, బాలమిత్ర మొదలైనవి ఈ దశలో చదివించవచ్చు. ఇది విస్తారపఠనాశక్తిని పెంపొందించేవిగా వర్ణచిత్రాలతో ఆకరణీయంగా ఉండాలి.

2. మాధ్యమిక దశ : ఈ దశ విద్యార్థులకు ఉపవాచకాలు కథలుగా మాత్రమేగాక కొన్ని సంభాషణాత్మకంగా కూడ ఉండవచ్చు. ఉదా చారిత్రక కథలు, తెనాలి రామకృష్ణుని కథలు, మర్యాదరామన్నకథలు, జాతీయ పండుగలు మొదలైనవి ఉండవచ్చు.

3. ఉన్నతదశ :

ప్రాథమికదశలో ఉపవాచకాలు విస్తారపఠనానికి వినోదానికి, ఉద్దేశించబడి ఉంటాయి.

మాధ్యమిక దశలో మౌనపఠనం, అభివృద్ధిపరచేవిగా ఉండాలి.

ఉన్నతదశలో పై రెండు ప్రయోజనాలేకాకుండా జ్ఞానవికాసానికి, ఆలోచనాశక్తికి ఉపయోగపడేటట్లు ఉండాలి.

ఉదా గేయాలు, నవలా సాహిత్యం, కథాసాహిత్యం, నాటికలు, నాటకాలు, వివిధ జీవిత కథలు, ఆత్మకథలు సంస్కృతికి సంబంధించిన కథలు, ఏకాంకికలు, మొదలైనవి కూడా ఈ దశ విద్యార్థులకు పరిచయం చేయవచ్చు. వివిధ మాసపత్రికలు, సాక్షి వ్యాసావళి మొదలైన వాటిని కూడ పఠనకు తీసుకోవచ్చు. ఇది వ్యావహారిక గ్రాంథికలేక శిష్టవ్యావహారిక భాషలో ఉండవచ్చు. మాండలిక భాషలో వెలువడిన రచనలను కూడా ప్రవేశపెట్టడం ద్వారా సమైకృతాసాధనకు అవకాశం కలుగుతంది.

4.3.6. ఉపవాచక బోధనపద్ధతులు :

ఉపవాచకబోధన పద్య, గద్యాల వలె బోధించకూడదు. కాబట్టి ఉపవాచక ఉద్దేశ్యాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయుడు కొన్ని పద్ధతులను పాటించాలి.

1. కథాకథనపద్ధతి　　2. చర్చాపద్ధతి　　3.పఠనపద్ధతి

4. ఉపన్యాస- వివరణపద్ధతి　　5. పరిశోధన పద్ధతి

1. కథాకథనపద్ధతి : విద్యార్థుల కథలంటే చాల కుతూహలంగా వింటారు. వారి అభిరుచిని ఆధారంగా చేసుకొని ఉపవాచకాలను ఈ పద్ధతిలో బోధించవచ్చు. కథలమూలంగా విషయాలను వివరించి అవగాహనగావించవచ్చు. విషయాలను వివరించి నల్లబల్లపై వ్రాసి బోధించ వచ్చు.

2. చర్చాపద్ధతి : ఈపద్ధతిలో ఉపవాచకంలోని పాఠ్యాంశాన్ని ముందుగానే విద్యార్థులను ఇంటివద్ద చదువుకొని రమ్మని ఉపాధ్యాయుడు చెప్పాలి. తరగతిలో ఆ పాఠ్యాంశాలను ప్రశ్నోత్తర పద్ధతిలో చర్చించాలి. చర్చించిన కొన్ని అంశాలను నల్లబల్లపై వ్రాయాలి. విద్యార్థులు వారి విరామసమయంలో తరగతి చర్చను ఆధారంగా చేసుకొని మరల ఉపవాచకాన్ని చదివి అవగాహన చేసుకొంటారు.

3. పఠనపద్ధతి : ఈ పద్ధతిలో ఉపాధ్యాయుడు చెప్పబోయే ఉపవాచక అంశాన్ని చదివి విద్యార్థుల కు వినిపించాలి. తరువాత విద్యార్థులచే చదివించాలి. ముఖ్యాంశాలను విద్యార్థులకు వివరించాలి, నల్లబల్లపై వ్రాయాలి. వీటి వల్ల విద్యార్థుల పఠనాసామర్థ్యాన్ని పెంపొందించవచ్చు.

4. ఉపన్యాస – వివరణ పద్ధతి : ఈపద్ధతిలో ఉపాధ్యాయులు ముఖ్యమైన పాత్ర వహించాలి. ఉపాధ్యాయులు విషయాలను వివరించాలి. విద్యార్థులు ఇక్కడ కేవలం శ్రోతలు మాత్రమే. పాఠశాల స్థాయిలో ఇవి అంతగా పాటింపదగిన పద్ధతికాదు.

5. పరిశోధన పద్ధతి :

ఈపద్ధతిలో విద్యార్థులు విషయాలను గ్రంథాలయాలు, నిఘంటువు సహాయంతో కఠినపదాలకు అర్థాలను వెదికి విషయాలను పరిశోధన ద్వారా గ్రహిస్తారు. ఈ పద్ధతిలో ఉపాధ్యాయుడు విద్యార్థుల కు మార్గదర్శకత్వం వహిస్తాడు.

6. నియోజనపద్ధతి : సాధారణంగా విద్యార్థులు ఉపవాచకాన్ని స్వయంకృషితో నేర్చుకొంటారు. కాబట్టి ఈపద్ధతిలో ఉపవాచకంలోని పాఠ్యాంశాలపై అనేక ప్రశ్నలు ఇచ్చి విద్యార్థులను సమాధానాలు వ్రాయమని చెప్పాలి. దీనినే నియోజనపద్ధతి అంటారు.

**4.3.7. ఉపవాచకబోధనక్రమం :**

1. ప్రేరణ 2. ప్రదర్శనం 3. పునర్విమర్శ 4. ఇంటిపని

1. ప్రేరణ : ఉపవాచకం బోధించడానికి ముందుగా ఉపాధ్యాయుడు వాటికి సంబంధించిన విషయాలను విద్యార్థులకు జ్ఞప్తికి తెప్పించాలి. ప్రశ్నలు మూలంగా కాని, లేదా పాఠ్యాంశానికి సంబం దించిన విషయాలను ఉపాధ్యాయుడే చెప్పి విద్యార్థులను ఉన్ముఖీకరణం చేయవచ్చు.

గద్యబోధనలో వలె స్వల్పకాలంలో ప్రేరణ ఉపవాచక బోధనలో జరుగదు. కాబట్టి ప్రేరణకు సమయం ఎక్కువగా కేటాయించవలసి ఉంటుంది.

2. ప్రదర్శన :

ఈ సోపానంలో ఉపాధ్యాయుడు పాఠ్యాంశాన్ని కొన్ని విభాగాలుగా విభజించి విషయాలను వివ రించి చెప్పాలి విద్యార్థులచే మౌనపఠనం చేయించాలి. తరువాత కొన్ని ప్రశ్నలు అడుగుతు ముఖ్యాం శాలను తెలియజేయాలి.

3. పునర్విమర్శ :

విద్యార్థులు చదివిన తరువాత కొన్ని కఠినపదాలుకాని నూతన పదాలు ఉంటే ప్రశ్నించి విద్యార్థు ల నుండి సమాధానాలు రాబట్టాలి. అది సాధ్యపడనపుడు ఉపాధ్యాయుడే అర్థాలను చెప్పాలి. విద్యా ర్థులను నిఘంటవును చూసి అర్థాలను గ్రహించమనాలి.

ఇంటిపని :

పునర్విమర్శ అయిన తరువాత పాఠ్యాంశాలలో ఉండే విషయాలను చదివి సంక్షిప్తంగా వ్రాయ మని చెప్పి కొన్ని ప్రశ్నలు ఇవ్వవచ్చు. పాఠ్యాంశాలపై కొన్ని కథలను వ్రాయమని ఇంటిపనిగా ఇవ్వవ చ్చు. వీటి వలన విద్యార్థుల లిఖితరచనా నైపుణ్యాన్ని పెంపొందించవచ్చు.

ఉపవాచకంలోని ఒక కథను తీసుకొని పాఠప్రణాళికను తయారుచేయండి.

4.3.8 వాచక - ఉపవాచకాలకు గల బేధాలు :

| వాచకాలు | ఉపవాచకాలు |
|---|---|
| 1. ఇవి క్షుణ్ణపఠనానికి ఉద్దేశించినవి. | ఇవి విస్తారపఠనానికి ఉద్దేశించినవి. |
| 2. ఇవి ప్రకాశపఠనానికి ఉద్దేశించబడినవి | ఇవి మౌన పఠనానికి ఉద్దేశింపబడినవి. |
| 3. భాషకు ప్రాముఖ్యం ఉంటుంది. | విషయానికి ముఖ్యత్వం ఉంటుంది. |
| 4. పద్యగద్యాత్మకంగా ఉంటుంది. | గద్యాత్మకంగా ఉంటుంది. |
| 5. బోధనఉపాధ్యాయుని సహాయంతోజరుగుతుంది | అభ్యసనం,విద్యార్థి స్వయంకృషితో జరుగుతుంది. |
| 6. వీటిబోధనలో ఉపాధ్యాయునికి శ్రమఎక్కువ | ఉపాధ్యాయునికి శ్రమతక్కువ |
| 7. బోధన ఉపకరణాలు అవసరం | బోధన ఉపకరణాల ఆవశ్యకత తక్కువ |
| 8. అభ్యాసాలు, కృత్యాలు ఎక్కువ | అభ్యాసాలు,కృత్యాలుపరిమితంగా ఉంటాయి. |
| 9. వ్యాకరణ విషయాల వివరణకు ప్రాధాన్యం ఎక్కువ | వ్యాకరణ విషయాలకు ప్రాధాన్యం తక్కువ. |
| 10.నూతన విషయాలను గ్రహిస్తారు | తెలిసిన విషయాలు ఆధారంగా అవగాహన చేసుకొంటారు |
| 11. నూతనపదాలు, వాటి పట్టికలు ఉంటాయి. | పరిచితపదజాలమే ఉంటుంది కనుక ఇందు పదపట్టికలు ఉండవు |
| 12.1వతరగతి నుండి పరిచయం చేయబడుతుంది. | మాధ్యమిక, ఉన్నతదశలలో పరిచయం చేయబడుతుంది. |
| 13. పుటలు ఎక్కువగా కలిగి ఉంటాయి | పుటలు తక్కువగా ఉంటాయి. |

**అధ్యాయం - 4**

# వ్యాకరణ బోధన

4.4.1 పరిచయం
4.4.2 వ్యాకరణబోధన లక్ష్యాలు
4.4.3 వ్యాకరణ బోధన ఉద్దేశాలు
4.4.4 వ్యాకరణం - విభజనలు
4.4.5 వివిధదశలలో బోధింపదగిన వ్యాకరణాంశాలు
4.4.6 వ్యాకరణబోధనపద్ధతులు

## 4.4.1 పరిచయం

మానవుడు సాంఘికీకరణ చెందడానికి ప్రధానంగా అవసరమైన సాధనం భాష. ప్రతివ్యక్తి మాట్లాడే భాషలో వ్యాకరణం ఉంది. భాషలో చేసే ప్రయోగాల ఆధారంగా పుట్టినదే వ్యాకరణం. ప్రయోగశరణం వ్యాకరణం. అయితే వ్యాకరణశాస్త్రం భాషఅభివృద్ధికి అడ్డుకాదు. భాష ప్రవాహంలాంటిది. అంటే పరిణామశీలం కలది.

పూర్వకాలంలో వర్ణనాత్మక వ్యాకరణాలు మాత్రమే ఉండేవి. భాషాశాస్త్రం అభివృద్ధిచెందిన తరువాత తులనాత్మక,వ్యాకరణం, చారిత్రాత్మక వ్యాకరణం అని రెండు రకాలుగా ఏర్పడ్డాయి.వ్యాకరణం భాషలో ఏ ప్రయోగం సాధువో, ఏది అసాధువో (సరియైనది, సరికానిది) అని తెలుపుతుంది. సంస్కృత వైయాకరుణులు వారి కాలంలో ఉన్న వైదిక భాషకి, లౌకికభాషకి (వ్యవహారంలో ఉన్న సంస్కృతభాషకు) కలిపి శాస్త్రీయమైన వ్యాకరణం వ్రాయగలిగారు.

సంస్కృత వ్యాకరణశాస్త్రవేత్త పాణిని రచించిన అష్టాధ్యాయీ శాస్త్రీయం సమగ్రమైందని భాషాశాస్త్రజ్ఞులచే ప్రశంసించబడింది. ఆ కాలంలోనే సంస్కృత వైయాకరణులు ధ్వనుల ఉత్పత్తి, క్రమం, విభాగం మొదలైన విషయాలలో శాస్త్రీయజ్ఞానం సంపాదించి ధ్వనిశాస్త్రమును ప్రారంభించి దానికి పరిపూర్ణత చేకూర్చారు. శబ్దసాధు అసాధురూపాలను తెలియజేసి వ్యవహారదక్షతను పెంపొందించడానికి వ్యాకరణశాస్త్ర బోధన అభ్యసనం ఎంతో అవసరం.

గ్రీకుభాషలో వ్యాకరణం అనే అర్థం ఇచ్చేపదం Grammata ఇది లాటిన్‌భాషలో Grammaticus గా మారింది. ఈ లాటిన్ పదం నుండి ఇంగ్లీషు Grammar గా ఏర్పడింది. అతి ప్రాచీనభాషగా శాస్త్రజ్ఞులచే చెప్పబడే తమిళభాషకు తొల్‌కాప్పియం తొలివ్యాకరణ గ్రంథం. అట్లే తెలుగుభాషకు నన్నయ రాసిన ఆంధ్రశబ్దచింతామణి, సంస్కృతంలో రాసిన మొదటివ్యాకరణం. సంస్కృతంలో వ్యాకృతిని కలిగించేది వ్యాకరణం. (వ్యాకృతి (వి+ ఆకృతి)) అంటే విశిష్టమైన ఆకారం అని అర్థం. భాషకు ఆకారాన్ని ఇచ్చేవారు (నిర్ణయించేవారు) జనసామన్యులే అయిప్పటికి సాధికారులు, వైయాకరణులు, కవులు, రచయితలు మొదలైనవారు. వీరు భాషను క్రమబద్ధంగా ఉంచడానికి కొన్ని నియమాలు ఏర్పరిచారు. తద్వారా భాషా రూపాలను నియంత్రించారు.

ఆదికవి నన్నయననుసరించిన భాషానియమాలను తర్వాతి కవులు కూడా తమరచనలలో అనుసరించారు. అందువల్ల వెయ్యేండ్ల నుండి క్రమానుగతంగా గ్రంథస్థమయిన భాష వివిధ ప్రాంతాలకు చెందిన నేటి సామాన్య ప్రజానీకానికి కూడా అర్థంకావడానికి, తెలుగుభాషకేర్పరచన నిబద్ధతే కారణం అవుతుంది.

ప్రపంచంలో ప్రాచీనకాలంలో ఏ భాషఅయినప్పటికి మొదటప్రజలు వ్యవహారంలోకి వస్తుంది. కొన్ని శతాబ్దాలు అభివృద్ధిచెంది దానిలో సారస్వతం పుడుతుంది. ఇతరభాషలలోని (సంస్కృత ప్రాకృత) పదాలను కూడా కొన్నింటిని తన సంప్రదాయాలకు అనుగుణంగా మార్చుకొని తనలో కలుపుకొంటుంది.

భాష ఈవిధంగా అభివృద్ధిచెందుతూ భాషించే వారి ముఖయంత్రాలలో ఉండే తేడాల వల్ల, పరస్పర ఉచ్చారణా భేదిస్తుంది. ఈ విభేదాలు కొంతకాలానికి ఈ భాషకు వికలత్వం ఏర్పడి ఒకరిభాష ఇంకొకరికి అర్థం కాని పరిస్థితి ఏర్పడుతుంది. భాషకు అటువంటి పరిస్థితి ఏర్పడకుండా ఉండటం కోసం ఆభాషకు స్థిరత్వం ఏర్పడి దానిలో సారస్వతం పుట్టడం, తరువాత అది విశృంఖలంగా పెరగకుండా కొన్ని నియమాలకు లోబడి అభివృద్ధి చెందే విధంగా మేధావులు కొందరు జాగ్రత్తలు తీసుకొని ఆభాషకు కొన్ని నియమాలు, విధులు, సూత్రాలు పాటించి వ్యాకరణాన్ని రూపొందించారు.

వ్యవహార భ్రష్టమైన సంస్కృతం, లాటిన్‌భాషల్ని నేర్చుకోవడానికి వాటికి తరువాతికాలంలో వ్రాయబడ్డ వ్యాకరణ గ్రంథాలే ఆధారాలయినాయి. అవి ఆయాభాషలోని తప్పొప్పులను నిర్ణయిస్తాయని ప్రజలలో అభిప్రాయం ఏర్పడింది. ప్రాచీనభాషల విషయంలో ఉన్న ఈ అపోహలే క్రమంగా దేశభాలయిన తెలుగు మొదలైన వ్యవహారభాషల విషయంలో కూడా ఏర్పడ్డాయి. అప్పకవి, నన్నయ్య ప్రయోగాలే తప్పకొత్తవి ఏవీ కూడ వాడకూడదనడం దీనికి ఒక చక్కని ఉదాహరణ. ప్రాచీనకాలపు భాషే ప్రామాణికం అయిందని వ్యవహారికభాషకు వ్యాకరణం వుండదని ప్రజలలో ఇప్పటికీ ఉన్న అపోహను తొలగించడానికి భాషాశాస్త్రజ్ఞానం ఎంతగానో సహకరిస్తుంది.

4.4.2. వ్యాకరణ బోధనలక్ష్యాలు :

1. విద్యార్థులలో భాషాజ్ఞానం కలగడానికి తోడ్పడడం.
2. నిర్దుష్టమైన శబ్ద స్వరూపాలను తెలుసుకొనడం.

3. వాక్యాంగాలైన పదాల మధ్య సంబంధాలను గుర్తించడం. సమాస, స్వరూపాలు, వాక్యనిర్మాణం, సంధి తెలుసుకోవడం.

4. విద్యార్థులలో తార్కిక జ్ఞానం, హేతువాత దృకృథం పెంపొందించడం.

5. ధ్వని, ఉచ్చారణ భేదాలు గ్రహించడం.

6. పదవాక్య సమ్మేళన సంప్రదాయాలలోని ప్రత్యేకతలను విశ్లేషించే నేర్పు వివరించడం.

7. విరామ చిహ్నాల వినియోగాలను తెలుసుకోవడం..

8. దోషరహిత భావప్రకటన సామర్థ్యాన్ని పెంపొందించుకొనడం.

వ్యాకరణానికి సంబంధించిన కొన్ని అభిప్రాయాలను పరిశీలిద్దాం.

'Grammar is the practical analysis of a language about its anatomy' అని Dr. Sweet అనే వ్యాకరణవేత్త నిర్వచించాడు. వ్యాకరణం భాషయొక్క ప్రయోగాత్మక విశ్లేషణ భాషా శరీర ధర్మశాస్త్రం అని వీరి అభిప్రాయం. (New English grammar)' Grammar deals merely with difference in the grouping of words in the sentence ' అని Prof Sonnen Schein అనే భాషావేత్త చెప్పారు. కేవలం వాక్యంలోని పదసమూహాల మధ్యగల ఆంతరిక సంబంధమేమిటో వ్యాకరణ తెల్పుతుంది. అని వీరి భావం (The soul of grammar ) 'Description of a peculiar structure of a language is grammar' అని Hazlitt అను భాషావేత్త అన్నారు. భాష యొక్క ప్రత్యేక ఆకృతుల వివరణే వ్యాకరణం అని వీరిభావం.

Modern English అనే గ్రంథంలో "Grammar especially for school purposes is a description of the main laws of the structure of current language coached in terms which are sufficiently precise.' అని వివరింపబడింది. అంటే వ్యవహారంలోని భాషా రూపాలకు గల సంబంధాలను చెప్పే ఒక సూక్ష్మరూప నియమావళి మాత్రమే వ్యాకరణమని భావం.

ఈ భావనల ఆధారంగా వ్యాకరణ బోధనోద్దేశాలను తెల్సుకొందాం.

### 4.4.3 వ్యాకరణ ఉద్దేశాలు :

1. ప్రాచీన, ఆధునిక భాషావిశేషాలను తెలుసుకోవడం.
2. పదస్వరూప, స్వభావాలను గ్రహించడం.
3. విద్యార్థుల భాషాజ్ఞానాన్ని పెంపొందింపజేయడం.
4. వాక్యంలోని పదాలమధ్యగల సంబంధాలను, సందర్భాలను తెలుసుకొనేటట్లు చేయడం.
5. సోదరభాషల మధ్య గల భేదాలును తెలుసుకోవడం..
6. తార్కికశక్తిని, హేతువాద దృక్పథాన్ని అభివృద్ధిపరచడం.
7. వ్యాకరణ గ్రంథాల పట్ల అభిరుచి, ఆసక్తి పెంపొందించడం.
8. ఇతర భాషలపదాలు, వాటి అర్థాలు తెలియజేయడం.
9. వైయాకరణులపై గౌరవమర్యాదలను కల్పించడం.
10. విద్యార్థులను మంచి వ్యాకరణకర్తలుగా రూపొందించడం.
11. శాస్త్రీయభాషాదృక్పథాన్ని పెంపొందించడం.
12. సంధులు, సమాసాలు, విభక్తులు మొదలగువాటి స్వరూపాన్ని తెలుసుకోవడం.
13. భాషలో వ్యాకరణ ప్రాధాన్యాన్ని తెలుసుకోవడం.

### 4.4.4. వ్యాకరణం - విభజనలు :

వ్యాకరణాన్ని క్రింది విధంగా విభజించవచ్చు.

1. వర్ణనాత్మక వ్యాకరణం. 2. చారిత్రాత్మక వ్యాకరణం. 3. తులనాత్మక వ్యాకరణం.

1. వర్ణనాత్మక వ్యాకరణం : **(Descriptive Grammar)**

ఒక భాష స్వరూప స్వభావాలను ఒక నిర్దిష్టకాలానికి సంబంధించి పూర్వాపరాలతో సంబంధం లేకుండా వర్ణించేది వర్ణనాత్మక వ్యాకరణం.

ఉదా నన్నయ్య నుండి చిన్నయసూరి దాకా ఉన్న గ్రాంథికభాషను పూర్వపరాలతో సంబంధం లేకుండా వర్ణిస్తే అది వర్ణనాత్మక వ్యాకరణం అనబడుతుంది. బాల వ్యాకరణం మొదలైన లక్షణ గ్రం : దాలు ఇటువంటివే.

2. చారిత్రాత్మక వ్యాకరణ :

కాలక్రమంలో ఒక కాలం నుండి ఇంకొక కాలం వరకు భాషలో పొందిన మార్పులను పరిశీలించి గుర్తించి తెలియజేసే వ్యాకరణాన్ని చారిత్రాత్మక వ్యాకరణం అంటారు.

ఉదా హృదయము – ఎడంద– ఎడద – ఎద

అంటే భాషలు జరిగే ధ్వనిపరిణామాలు, అర్థం విపరిణామాలు, పదజాలాలు జరిగే మార్పులు, మాండలికభేదాల గురించి చర్చించేది ఈ చారిత్రాత్మక వ్యాకరణం.

తైలం అంటే తిలల (నువ్వుల) నుండి తీయబడిన ద్ర వవిశేషం విస్తరించింది. ఇది అర్థవ్యాకోచం (Expansion of Meaning) గా గ్రహించాలి. బారతంలో దమయంతిని చూసి ఆటవికులు అవ్వా అని సంబోధించారు. అంటే ఆనాడాశబ్దం స్త్రీ అనే అర్థంలో ప్రయోగించబడింది. నేడది వృద్ధ స్త్రీ అర్థంలో ప్రయోగిస్తున్నారు.

తులనాత్మక వ్యాకరణం :

ఒక భాషాకుటుంబంలో ఉన్న వివిధ భాషలను పోల్చి, పరిశీలించి, వివిధ భాషల మధ్యగల సంబంధాలను వివరించేది తులనాత్మక వ్యాకరణం.

ఉదా సోదరభాషలైన తెలుగు, కన్నడం, తమిళం, మలయాళం మొదలైన వాటికి మూలభాష ద్రావిడభాష అని మొట్టమొదట కాల్డ్‌వెల్ తన (comparative grammar of Dravidian Languages) గ్రంథంలో ఆవిష్కరించారు.

ఉదా పాలు (తె) పాల్ (త) పాల్ (మ) హాలు (క)

ఉన్నత తరగతులకు ప్రథమభాషగా తెలుగు పాఠ్యప్రణాళికలో వర్ణనాత్మక వ్యాకరణాన్ని మాధ్యమిక తరగతులకు చారిత్రక వ్యాకరణాన్నిపరిచయం చేయవచ్చు చారిత్రాత్మక, తులనాత్మక, వ్యాకరణాలను కళాశాల దశలో పరిచయం చేయవచ్చు.

4.4.5. వివిధ దశలలో బోధింపదగిన వ్యాకరణాంశాలు :

1. ప్రాయోగిక వ్యాకరణం 2. నైమిత్తిక వ్యాకరణం 3. రూపాత్మక వ్యాకరణం

1. ప్రాయోగిక వ్యాకరణం :

వ్యాకరణ నియమాలను చెప్పకుండా నిర్దుష్టప్రయోగాలను అభ్యసింపజేసి వాటిద్వారా వ్యాకరణ బోధనను సాధించే విధానాన్ని ప్రాయోగిక వ్యాకరణ బోధన అంటారు.

పాఠశాల పూర్వదశలోనే గృహపరిసరాలు ప్రభావంతోవ్యవహరించే విద్యార్థికి మాతృభాషలోవ్యాకరణ నియమాలు చాలావరకు అప్రయత్నంగానే అలవడతాయి. అయితే సరైన వాక్యనిర్మాణాన్ని భాషణ లేఖనాలు (వ్యక్తీకరణలు) అలవడేట్లు చూడాల్సిన బాధ్యత తరగతిలో బోధన చేసే ఉపాధ్యాయుడిది. అభ్యాసాలనిచ్చి దోషసవరణ చేస్తూ వ్యాకరణాన్ని అభ్యసింపచేయవచ్చు.

భాషలో భావవ్యక్తీకరణకు ప్రాతిపదిక వాక్యం. 4,5 తరగతుల్లో వాక్యాన్ని ఆధారంగా చేసుకొని లింగ, వచన విభక్తులను, కాలం, భాషాభాగాలు మొదలైనవాటి ప్రయోగాలకు సంబంధించిన

అభ్యాసాలను ఇవ్వడం ప్రధానం. అంటే విద్యార్థులు చేసే వాచికచర్య లిఖిత చర్యల ఆధారంగా సరియైన ప్రయోగాలు చేసేటట్లు శిక్షణ ఇవ్వడంలో పరోక్షంగా వ్యాకరణం బోధింపవచ్చు.

ఉదా అక్కడ రెండు పుస్తకాలు ఉన్నది. అనిచెప్పితే విద్యార్థులు ఆ వాక్యాన్ని సవరించి అక్కడ రెండు పుస్తకాలు ఉన్నాయి. అని చెప్పి సరిదిద్దితే చాలు. అంతేగాని క్రియరూపంలో ఏర్పడిన మార్పులను వివరించాల్సిన అవసరం లేదు.

2. నైమిత్తిక వ్యాకరణ బోధన **(Teaching of Applied Grammar)**

ఆధునిక మనోవిజ్ఞానశాస్త్ర సూత్రాల ప్రకారం సూత్ర పద్ధతి లేదా నిగమోపపత్తి పద్ధతిలో వ్యాకరణం బోధించడం సరియైనది కాదు.

ఈ పద్ధతి ప్రకారం విద్యార్థుల పాఠ్యపుస్తకాలలో ఉండే ప్రయోగాలను ఉదాహరణగా తీసుకోవాలి. తెలిసిన విషయం నుండి తెలియని విషయాలకు **(known to un- known)** సులభంగా నేర్పించాచాలనే సూత్రాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఉదాహరణలలోని స్వరూప స్వభావాలను, పోలికలు తేడాలను జరుగుతున్న మార్పులను విద్యార్థుల చేత పరిశీలింపజేసి వారి సొంత వాక్యాలతో ఆయా అక్షరాలను (సూత్రాలని) చెప్పించడం సూత్రపద్ధతి

దీనినే కొందరు ఉదాహరణ పద్ధతి అంటారు. శాస్త్రీయపరిభాషలో అనుమానోపపత్తి పద్ధతి అంటారు. ఈ అభ్యసన పద్ధతిలో విద్యార్థుల పాత్ర ప్రధానంగా ఉంటుంది. ఉపాధ్యాయుడు బోధించడానికి పాఠ్యాంశాల నుండి ఉదాహరణలను తీసుకొని, విద్యార్థుల అనుభవాల నుండి అనుమానోపపత్తి పద్ధతిలో బోధించే వ్యాకరణా విధానాన్ని వైయక్తిక వ్యాకరణ బోధన **(Teaching of applied grammar)** అంటారు.

మాధ్యమిక దశలో ఉండే విద్యార్థులకు ఈపద్ధతిలో వ్యాకరణం బోధించవచ్చు. ఈ బోధనాపద్ధతి విశిష్టమైనదిగా భావింపబడుతున్నది.

3. రూపాత్మక వ్యాకరణ బోధన **(Teaching of Formal grammar) :**

పాఠ్యాంశాల నుండి ఉదాహరణలను తీసుకొని బోధించాలనే నియమం లేకుండా సూత్రపద్ధతి లేదా నిగమోపపత్తి పద్ధతిలో కళాశాల దశలలో శాస్త్రదృష్టితో బోధించడాన్ని రూపాత్మకబోధన అంటారు. భాషాస్వరూపాన్ని స్వభావాన్ని సమగ్రంగా ఈ దశలో బోధించవచ్చు. సంధులు, ఛందస్సు, అలంకారాలు, కావ్యలక్షణాలు, పరిచయం చేయాలి.

వ్యాకరణాభిరుచిని విద్యార్థులలో పెంపొందించడానికి క్రింద పేర్కొన్న కొన్ని విచిత్ర వ్యాకరణ స్వరూపాలను హైదరాబాదు రాష్ట్ర ఉపాధ్యాయసంఘంవారు సూచించి ఉన్నారు.

1. చిత్ర వ్యాకరణం (Pictorial grammar)
2. క్రీడా వ్యాకరణం (Grammar in play)
3. ప్రశ్నోత్తర వ్యాకరణం (Question Answer in grammar)
4. లేఖావ్యాకరణం (Grammar in letter)
5. సంభాషణ వ్యాకరణం (Conversational grammar)
6. ఔపన్యాసిక వ్యాకరణం (Grammar in lectures)
7. కథత్మాక వ్యాకరణం (Story in grammar)
8. నాటకీయ వ్యాకరణం (Dramatic grammar)

4.4.6 వ్యాకరణబోధన పద్ధతులు :

వ్యాకరణాన్ని ప్రత్యేకించి బోధించరాదన్నది ఒక అభిప్రాయం. వ్యాకరణాన్ని విద్యార్థులు చదివే వాచక పాఠాలతో అనుసంధించి బోధించాలన్నిది పలువురి అభిప్రాయం. వ్యాకరణానికి పాఠాలతో అవినాభవ సంబంధముందని విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రహించాలి.

1. నిగమోపపత్తిపద్ధతి :

ఈ పద్ధతిని ప్రాచీనకాలంలో అనుసరించే వారు. దీనినే శాస్త్రపద్ధతి, సూత్ర, సంప్రదాయ లేదా ప్రాచీన పద్ధతి అని కూడా అంటారు.

ఈ పద్ధతిలో ఉపాధ్యాయుడు సూత్రాన్ని ముందుగా చెప్పి అందలి పారిభాషిక పదాల్ని వివరించడం జరుగుతుంది. ఆ లక్షణానికి సరిపడిన లక్ష్యాన్ని వాచకంలో నుంచి తీసుకొని ఆ రెండింటిని సవన్వయం చేస్తాడు.

నిగమం అంటే వేదం, వేదవాక్కు అనుసరించడం. వేదాన్ని కంఠస్థం చేయాలి. ఆ తరువాత భావాన్ని, అర్థాన్ని వివరించేటట్లు , వ్యాకరణలో కూడా మొదటసూత్రాన్ని కంఠస్థం చేయించాలి. తరువాత దానిని వివరించడం జరుగుతుంది.

ఈ పద్ధతిలో విద్యార్థుల కేవలం శ్రోతులుగా ఉండే ప్రమాదం ఉంది. వారి పరిశీలనకు ఈపద్ధతి పదును పెట్టదు. శాస్త్రం అభ్యసనం చేసేవారికి ఈ పద్ధతి చాలా సహాయకారి. వ్యాకరణశాస్త్ర గ్రంథాలు కూడా ఈ పద్ధతులచే లభిస్తాయి. అయితే ఈ పద్ధతి మనోవిజ్ఞానిక శాస్త్రలకు విరుద్ధమైనది అని భావిస్తారు.

2. అనుమానోపపత్తిపద్ధతి :

దీనినే ఉదాహరణ పద్ధతి లేక నవీన పద్ధతి అని అంటారు. మనోవైజ్ఞానిక పరిభాషలో అనుమితి అంటే కొన్ని ఆధారాల నుండి ఒక విషయాన్ని ఊహించడం అని అర్థం. ఇట్లు ఊహాలను ఆధారంగా చేసుకొని ఒక అంశంపై ఒక నిర్ణయాన్ని తీసుకోవడం జరుగుతుంది.

మొదట విద్యార్థులకు, సూత్రాలను చెప్పక ఉదాహరణలను తీసుకొని వాటిని స్వరూప స్వభావాలను పరిశీలింప చేయించాలి. విద్యార్థులు దీనిలోని సామాన్య ధర్మాల్ని తెలుసుకొని వాటిని ఆధారంగా చేసుకొని కొన్ని లక్షణాలను లేదా సూత్రాలను సొంతభాషలో చెప్పడానికి ప్రయత్నిస్తాడు. ఈ పద్ధతిలో విద్యార్థులు వ్యాకరణ అభ్యసనలో చాలచురుకుగా పాల్గొని సులభంగా అభ్యసిస్తారు.

విద్యార్థులలో ఆలోచనాశక్తిని, వ్యాకరణాభిరుచిని, భాషాధికారాన్ని, ఆసక్తిలో వ్యాకరణాభ్యసన గావించడానికి ఈపద్ధతి చాలా ఉపయోగపడుతుంది.

విషయాలను గుర్తించుకొనడంతో పాటు వాటిని ఉపయోగించి వ్యక్తీకరించే నైపుణ్యాలను విద్యార్థులలో పెంపొందించవచ్చు.

ఉదా తెలుగులో ఉకారసంధి తరచుగా వస్తుంది. ఈ సంధికి

| | |
|---|---|
| ఉదా మీరెక్కడి వారు? | ఇట ఎందుకున్నారు? |
| మీ కన్నీ తెలుసా ? | మీకు+ అన్నీ = మీకన్నీ |
| మీరు+ ఎక్కడ= మీరెక్కడ | ఎందుకు+ ఉన్నారు= ఎందుకున్నారు. |

పై ఉదాహరణలో మొదటి పదం చివర ఉన్న అచ్చును 'ఉ' గుర్తింపచేయాలి. ఇలాగా మరి కొన్ని ఉదా ఇచ్చి తరువాత పూర్వపదంలోని చివరి అచ్చుపోయి తరువాతి పదంలోని మొదటి అచ్చునిలుస్తుందని విద్యార్థుల చేత గుర్తింపచేయాలి. చివరిగా పూర్వపరస్వరాలకు పరరం ఏకాదేశం కావడం సంధి అని సూత్రీకరణ చేయవచ్చు. పారిభాషికపదాలను మొదటనే ప్రవేశపెట్టకూడదు.

అట్లే జటిలమైన సంధిరూపాలను ఉన్నత తరగతులలో ఉపయోగించవచ్చు.

3. అనుసంధాన పద్ధతి

ఇది ఉన్నతస్థాయికి ఉపయోగకరమైనది. ఈపద్ధతిలో విద్యార్థులు వివిధ గ్రంథాలను సంప్రదించుట ద్వారా వ్యాకరణజ్ఞానాన్ని పొందుతారు.

సంపాదించిన సాంప్రదాయక వ్యాకరణజ్ఞానాన్ని వివిధ పాఠ్యాంశాల రూపాలతో, ప్రయోగాలతో అనుసంధానం చేయడంద్వారా ఆయా వ్యాకరణ నియమాలను నేర్చుకొనడాన్ని అనుసంధాన పద్ధతి అంటారు.

4. ప్రయోగపద్ధతి/ ప్రాయోగిక పద్ధతి

వ్యాకరణాంశాలను ప్రత్యేకంగా గాక పాఠ్యబోధనాంశాలతోచేర్చి బోధించాలనేది ఈ పద్ధతిలోని విశేషం. విద్యార్థులు ఈపద్ధతిలో ఆసక్తిని కనబరచి అభ్యసనగావిస్తారు. వ్యాకరణం ప్రయోగశరణం అనే భావన దీనికి ప్రాతిపదిక.

**తరచుగా వచ్చే ఉకారసంధిని అనుమానోపపత్తి పద్ధతి ద్వారా బోధించడానికి పాఠ్యప్రణాళికను తయారుచేయండి.**

## అధ్యాయం - 5

# బోధనా సామర్థ్యాలను పెంపొందించడం.

5.1 ఛాత్రోపాధ్యాయులకు పరిశీలనావశ్యకత
5.2 పరిశీలనావిధానాలు పాఠశాల పరిశీలన
5.3 పరిశీలన పత్రం
5.4 లోపాలను సరిదిద్దుకోవడం
5.5 బృందబోధన
5.6 స్వీయఅభ్యసన
5.7 సమాచార సేకరణ సామర్థ్యం
5.8 గ్రంథాలయాలు
5.9 పఠనాలయాలు
5.10 మూలగ్రంథాలు
5.11 పరామర్శక గ్రంథాలు
5.12 బొమ్మల్ని వర్ణించడం
5.13 క్విజ్

5.1. ఛాత్రోపాధ్యాయులు - పరిశీలనావశ్యకత

కృత్యాల ద్వారా బోధన, అభ్యసన అనే రెండు అంశాలతో కూడుకొన్నది నేటి విద్య. బోధన చేసే అన్ని సందర్భాలలోనూ అభ్యసన జరుగుతుంది అని చెప్పడానికి వీలుకాదు. సంపూర్ణ అభ్యసన

జరగాలంటే సమర్థవంతమైన బోధన జరగాలి. కాబట్టి ఛాత్రోపాధ్యాయులు శిక్షణాకాలంలో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలంటే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనను పరిశీలిం చాలి. ఆవిధంగా పరిశీలించే సందర్భంలో చక్కని అభ్యసనా ఫలితాలను ఇవ్వగలిగే వ్యూహాలను తాము అనుసరించవచ్చు.

కాబట్టి ఈ అధ్యాయంలో కృత్యాధార అభ్యసనను పరిశీలించడం సంప్రదాయబోధన (Conventional Method) విధానం ద్వారా అభ్యసనను పరిశీలించడం. సృజనాత్మకత ద్వారా అభ్యసన విధానాన్ని పరిశీలించడం మొదలైన వాటిని గురించి, వాటికి సంబంధించిన పత్రాలు (Forms) పూర్తి చేయడం. సమాచారాలను సేకరించడం, గురించి తెలుసుకొందాం.

పరిశీలనా ఆవశ్యకత :

ఛాత్రోపాధ్యాయులు పాఠశాలలకు వెళ్ళి అనుభజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన విధానాన్ని ప్రత్యక్షంగా చూసి పొందే అనుభవమే పరిశీలన అనబడుతుంది. ఛాత్రోపాధ్యాయులు శిక్షణా కాలంలో పరిశీలన కోసం ప్రతి విద్యాసంవత్సరంలో పదేసిరోజులు నిర్దేశించిన పాఠశాలలకు వెళుతుంటారు. ఇది వారి శిక్షణలో ఒక అంతర్భాగం. ఈ పరిశీలనానుభవం బోధనకు ఛాత్రో పాధ్యాయుని ఆయత్తపరుస్తుంది. ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి సమర్థవంతులైన ఉపాధ్యా యులుగా రూపొందడానికిపలురకాలైన కృత్యాలలో ఛాత్రోపాధ్యాయులు పాల్గొనేటట్లు చేస్తున్నారు. తరగతిగదిలో తాము చదివిన బోధనశాస్త్రం క్షేత్రస్థాయిలో ఎలా అమలులో ఉందో తెలుసుకో వచ్చు. పరిశీలన చేసే ఉపాధ్యాయుని బోధనా సామర్థ్యాలను అనుసరించడానికి, ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిచేసుకోవడానికి ఈ ప్రత్యక్ష పరిశీలన అవసరమవుతుంది.ఉత్తరోత్తర ఉత్తమ ఉపాధ్యాయు డుగా బోధనసామర్థ్యాల పెంపుదల మొదలుకొని మూల్యాంకనం వరకు గల వివిధ సోపానాల నిర్వహణ ఈ పరిశీలన ద్వారా అవగతం అవుతుంది.

5.2 పరిశీలనావిధానాలు :

మొదటితరగతి నుండి నాల్గవ తరగతి వరకు కృత్యాధార అభ్యసన విధానాలు, ఐదవతరగతిలో మునుపటి బోధన విధానంలో బోధన , ఆరు నుండి ఎనిమిది తరగతులకు సృజనాత్మకత విధా నంలో అభ్యసన విధానాలను అనుసరించి పాఠశాలలను పరిశీలన చేసి బోధన సామర్థ్యాలు పెంపొం దించ బడుతున్నాయి.

కృత్యాధార అభ్యసనలో పరిశీలన :

కృత్యాధార అభ్యసన సోపానాలు(Achievement ladders), గుర్తులు (Logos) ఆరుజట్టులు, వాతావరణ సూచికలు, ఆరోగ్యచక్రాలు (సంక్షేమచక్రం),అభ్యసనకు యుక్తమైన అట్టలు,కృత్యాలు, వీటిని పరిశీలించడానికి పత్రాలు ఇవ్వబడి ఉన్నాయి. ఆ పత్రాన్ని సక్రమంగా పూర్తి చేయాలి.తర్వాత వాటినిగురించి అభిప్రాయాలు ‘ అభిప్రాయాల నమోదు’ అనే శీరిక క్రింద నమోదు చేయాలి. కృత్యాధార అభ్యసనను పరిశీలించి పత్రాలను పూర్తి చేయండి. ఆచరణాత్మక శిక్షణ (Practicum)లో ఇవ్వబడ్డాయి. దానిని భాషాబోధన పరిశీలనలో ఉపయోగించుకోండి.

సాధారణ ఉపాధ్యాయుడు మాట్లాడుతాడు
సరాసరి ఉపాధ్యాయుడు వివరిస్తాడు
మంచి ఉపాధ్యాయుడు బోధిస్తాడు
ఉత్తమ ఉపాధ్యాయుడు మానసిక కాంతిని ప్రసాదిస్తాడు ...... ప్రొ॥ ఆర్నాల్డు

## సంప్రదాయ బోధనపద్ధతిని పరిశీలించడం (Conventional Method)

ఉపాధ్యాయుని ప్రేరణ, బోధనావిధానాలు, ఉపకరణాల ఉపయోగం, నల్లబల్ల ఉపయోగం, తరగతి గది నిర్వహణ, ప్రశ్నవిధానం, ఉపాధ్యాయుని దృక్పథం, ఉపాధ్యాయ – విద్యార్థుల సత్సంబంధాలు మొదలైన వాటిని పరిశీలించి విషయాలను నోటుపుస్తకాలలో గుర్తించుకొని పరిశీలనాపత్రాలను పూర్తి చేయాలి. ఉపాధ్యాయుని బోధనలో ఉన్న సామర్థ్యాలను ఛాత్రోపాధ్యాయులు గ్రహించాలి.

జట్టులుగా విభజించి జట్టుకార్యకలాపాలు, బోధనోపకరణాలను ఉపయోగించే తీరు, బోధనకు ముందు – బోధనకు తరువాత కృత్యాలు, మూల్యాంకనం, పాఠ్యబోధనాపథకం మొదలైన వాటిని సునిశితంగా పరిశీలించాలి. అదేవిధంగా పాఠశాలకున్న ప్రాథమిక వసతులను పరిశీలించి నమోదు చేయాలి. విద్యార్థుల ఉపాధ్యాయుల సంఖ్యా వివరాలు రికార్డులు, సాధనలు, ప్రణాళికేతర కార్యక్రమ వివరాలను సేకరించి పట్టిక చేయాలి.

ఈవిధంగా పరిశీలించేటపుడు సేకరించిన వివరాలతో నిర్దేశించబడిన పరిశీలనా పత్రాలను పూర్తి చేయాలి. పూర్తి చేసేటప్పుడు బాగుంది, చాలాబాగుంది అని ప్రశంసించే పదాలను వ్రాయక, తరగతి గదిలో జరిగినవాటిని వివరంగా వ్రాయాలి.

సంప్రదాయ బోధనాపద్ధతికి కృత్యాధార
బోధనాపద్ధతికి ఉన్న భేదాలను
పట్టిక పరచండి.

## 5.3 పరిశీలనాపత్రం

I
1. ఛాత్రోపాధ్యాయుని పేరు.
2. మార్గదర్శక ఉపాధ్యాయుని పేరు.
3. పాఠశాల పేరు
4. తరగతి
5. తేది
6. సమయం
7. పాఠం
8. శీరిక

II
1. అనుసరించు బోధనపద్ధతి
2. ప్రేరణ
3. బోధనాభ్యసన ఉపకరణాలు
4. బోధనాభ్యసన ఉపకరణాలను ఉపయోగించడం
5. పాఠ్య వివరణ, నల్లబల్ల వినియోగం
6. బోధన అభ్యసన కృత్యాలు
7. ప్రశ్నలు అడగడం
8. విద్యార్థులు పాల్గొనడం
9. పునర్విమర్శ
10. మూల్యాంకనం
11. ఇంటిపని

ఛాత్రోపాధ్యాయుని సంతకం

మార్గదర్శక ఉపాధ్యాయుని సంతకం

ఉపన్యాసకుల సంతకం

5.4 లోపాలను సరిదిద్దుకొనడం

ఛాత్రోపాధ్యాయులు పరిశీలనానంతరం సమగ్రంగా పత్రాలను పూరించాలి. అటు తర్వాత తరగతిలో సహవిద్యార్థులతో పరిశీలనాంశాలను చర్చించాలి. అందలి గుణదోషాలను పట్టిక చేయాలి. లోపాలున్న పక్షంలో వాటిని ప్రత్యేకంగా గుర్తుంచుకొని లోపనివారణకు చర్చద్వారా మార్గాలను అన్వేషించాలి.నివేదికను తయారుచేసి శిక్షణా సంస్థలోని ఉపన్యాసకులకు సమర్పించి తగుసూచనలు పొందాలి. బోధనాసామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో తగిన నియమాలను సూచనలను పాటించడం గుణదోషాల వివేచన చేయడం తదనుగుణమైన నిర్ణయాలు చేయడం శిక్షణకాలంలో ప్రతి శిక్షణార్థి చేయవలసి ఉంది. తద్వారా బోధనాశక్తిని పెంపొందించుకోవచ్చు.

5.5 బృందబోధన

విద్యాబోధన సమర్థవంతంగా ఉండటానికి తద్వారా విద్యార్థులలో విషయగ్రహణ సామర్థ్యాన్ని పెంచడానికి సెమినార్. గ్రూప్‌వర్క్, శిక్షణాశిబిరం (వర్క్‌షాపు) వంటివి బోధన విధానంలో చోటు చేసుకోవాలని అనేక కమీషన్‌లు సిఫారసుచేశాయి. అట్టి పద్ధతులలో భాగంగానే బృందబోధన రూపొందించడం జరిగింది.

1955లో అమెరికా సంయుక్తరాష్ట్రాల్లో బృందబోధన భావన హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఆ తరువాత Lexingtone లో 1957 ప్రాంతంలో అమలుపరచబడింది. Francis chase, J.Leyd Trumpనే విద్యావేత్తలు ఈ భావనను వ్యాప్తిచేశారు. 1970 నాటికి అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని అనేక పాఠశాలల్లో బృందబోధన నిర్వహించి వారు సత్ఫలితాలు సాధించారు.

లక్ష్యాలు :

1. ఈవిధానం చదవడం ద్వారా ఛాత్రోపాధ్యాయులు బృందబోధన భావనను గ్రహిస్తారు.
2. బృందబోధన నిర్వహణావిధానాన్ని అవగాహన చేసుకొంటారు.
3. బృందబోధన ప్రయోజనాలను తెలుసుకొంటారు.

బృందబోధన - నిర్వచనాలు :

1. 'వైవిధ్యమైన బోధననైపుణ్యాలతో ఒకరికంటె ఎక్కువ మంది ఉపాధ్యాయులు కలిసి ఆలోచించి, బోధన నిర్వహించి సత్ఫలితాలు సాధించగల వ్యూహం' - Carlo Obson.
2. ' ఇద్దరికంటె ఎక్కువమంది ఉపాధ్యాయులు ఒక ప్రణాళిక ప్రకారంగా, పరస్పర సహకారంతో బోధనను మూల్యాంకనాన్ని నిర్వహించే విధానమే బృందబోధన' -M.B. Nayak.

3. ‘ ఒక పాఠశాలలో ఉపాధ్యాయులు ఒక బృందంగా ఏర్పడి తమకున్న ప్రత్యేక నైపుణ్యాలను వనరులను విద్యార్థుల అవసరాలను, వారికున్న ప్రత్యేక నైపుణ్యాలను దృష్టిలో పెట్టుకొని పాఠ్యప్రణాళికను చర్చించి, అందులో వివిధ భాగాలను వేరువేరు ఉపాధ్యాయులు బోధించే పద్ధతిని బృందబోధన అంటారు’ – David Warwick

ఈ విధానం ప్రకారం ఒక పాఠాన్ని ఒక ఉపాధ్యాయుని కంటే ఎక్కువ మంది బోధించి నట్లయితే విద్యార్థికి ఆ పాఠం సమగ్రంగా అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. విద్యార్థి సహజంగా వైవిధ్య బోధనావిధానాన్ని కోరుకొంటాడు. ఒకే పాఠ్యాంశాన్ని ఉపాధ్యాయులంతా చర్చించి బోధించడం విద్యార్థులకు ప్రయోజకారిగా ఉంటుంది. వారివారి ప్రత్యేక నైపుణ్యాలను ఈ బృందబోధనలో ప్రదర్శించడం వల్ల విద్యార్థి సులభంగా ఎక్కువ జ్ఞానాన్ని పొందగలడు.

బృందబోధన ప్రయోజనాలు :


1. పాఠశాలల్లో పరిమితంగా ఉన్న మానవ, భౌతికవనరులను సమీకరించి, గరిష్ట స్థాయిలో విద్యార్థుల అభ్యసనాసామర్థ్యాన్ని అభివృద్ధి చేయవచ్చు.
2. ఉపాధ్యాయుల మధ్య సంయుక్త బాధ్యత, సహకారభావన పెంపొందుతుంది.
3. సమర్థవంతులైన ఉపాధ్యాయుల్ని బృందనాయకులుగా నియమించడం జరగాలి. సమర్థులైన బోధకులకు ఈ పద్ధతి మంచి ప్రేరణగా పేర్కొనవచ్చు. పలువురు ఉపాధ్యాయులు ఒక పాఠాన్ని చెప్పడం వల్ల బోధనలో వైవిధ్యముంటుంది. ఇది విద్యార్థులలో ఆసక్తిని ప్రేరణను కలుగజేస్తుంది.
4. వివిధ పాఠ్యాంశాలను ప్రత్యేకంగా బోధించడం వల్ల విద్యార్థులకు పాఠం సమగ్రంగా అవగాహన అవుతుంది.

5.6 స్వీయ అభ్యసన **(Self-learning):**

అభ్యసన మూడు స్థాయిలలో సాగుతుంది. ఉపాధ్యాయుని బోధన ద్వారా అభ్యసనం చేయడం మొదటిది. ఇది ప్రాచీనమైనది. గురుకేంద్రంగా సాగేది. దీని ద్వారా అభ్యసనం నిర్బంధంతో సాగుతుంది. విద్యార్థి ఆసక్తులకు అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇందులో అధికంగా లేదు. ఈ పద్ధతిలో ఆహ్లాదకరంగా అభ్యసనం జరగడం లేదని కొందరి అభిప్రాయం. సహాధ్యాయుల (సమవయస్కులు) ద్వారా అభ్యసనం రెండవ విధానం. ఇది ఆహ్లాదకరమైన విధానం. ప్రాథమిక దశలోని విద్యార్థి కూడా సహవిద్యార్థి కథ చెపితే తానూ చెప్పగలగననే ఆత్మవిశ్వాసంతో ప్రయత్నం చేయడం జరుగుతుంది. అలాగే అభ్యసనంలో కూడా ఆహ్లాదం, ఆసక్తి కలుగుతుంది. కాబట్టే బడిలో తోటివిద్యార్థులతో కలసి జట్టుకృత్యాలద్వారా అభ్యసనవిధానం అమలులో ఉంది. మొదటి విధానంకంటే ఇది

శక్తివంతమయినదిగా భావించబడుతోంది. ఇకపోతే మూడవది స్వీయఅభ్యసన, ఇది పూర్తిగా రూసో సిద్ధాంతం పైన ఆధారపడిన శిశుకేంద్ర విద్యగా భావించవచ్చు.

స్వయంకృషి ద్వారా తెలుసుకొన్న జ్ఞానం స్థిరంగా ఉంటుంది. అర్థవంతంగా ఆసక్తికరంగా ఉంటుంది. ఇది ఉత్కృష్టమైనదిగా ఉద్దేశించబడుతోంది.పైన పేర్కొన్న విధానాల అభ్యసన పరిమాణాన్ని (Learning Quantity) ఈ చిత్రం ద్వారా వ్యక్తీకరించడంజరిగింది.




ఛాత్రోపాధ్యాయుడు స్వీయాభ్యసనకున్న ప్రాధాన్యతను గుర్తించాలి. అంతేగాని తరగతిలో ఉపాధ్యాయుని బోధన సర్వస్వంగా భావించరాదు. పాఠ్య గ్రంథాలే అభ్యసనానికి పరమావధిగా భావించరాదు. అనేక అంశాలను సహపాఠకులతో చర్చించాలి. జట్టుకృత్యాలలో పాల్గొనాలి. చర్చావేదికలు సమీక్షలు చేయాలి. బృందబోధన వంటి వానిని నిర్వహించాలి. వీటి అన్నింటికంటే ఉపబలకంగా స్వీయఅభ్యసనను కొనసాగించాలి. తద్వారా ఉత్తమ ఉపాధ్యాయుడు కావడానికి అరత సాధించవచ్చు.

స్వీయాభ్యసనానికి వార్తాపత్రికలు, మూలగ్రంథాలు, పరామర్శక గ్రంథాలు చదవాలి. గ్రంథాలను, ఇంటర్‌నెట్ సేవల్ని సక్రమంగా ఉపయోగించుకోవాలి. అనంతమైన విజ్ఞానాన్ని సొంతం చేసుకోవడానికి నిరంతర తపస్సు చేసే మనిషే మనీషి అవుతాడు, విజ్ఞానకాంతుల్ని వెదజల్లుతాడు.

5.7 సమాచార సేకరణ సామర్థ్యం :

పాఠ్యపుస్తకం ఉపాధ్యాయునికి మార్గదర్శకంగా ఉంటుంది. కాని అది మాత్రమే అభ్యసనలో సత్ఫలితాలను, సంపూర్ణంగా సాధించడానికి సహాయపడదు. పాఠ్యపుస్తకంలో చోటు చేసుకొన్న విషయాలను, సమాచారాలకు వివరణలు అందులో చోటుచేసుకోవు. ఉపాధ్యాయుడు పాఠాన్ని బోధించేటప్పుడు పాఠ్యపుస్తకంలోని విషయాలను విద్యార్థుల మనసులలో పదిలపరిచే విధంగా వివరణలు ఉదాహరణలు ॥ వాటికి సంబంధించిన విషయాలను వివరించడం వల్ల బోధన సజీవంగా ఉంటుంది. బోధన సజీవంగా సాగాలంటే ఉపాధ్యాయుడు పలు పరామర్శక గ్రంథాలు, మూల గ్రంథాలు, విజ్ఞాన సర్వస్వాలు, పదకోశాలు, నిఘంటువులు మొదలైన వాటిని పరిశీలించాలి.

వాటిలో తన బోధనకు అవసరమైన వాటిని ఉపయోగించుకోవాలి. జ్ఞానవిస్తారణ (Knowledge expansion) జరుగుతున్న ఈరోజులలో ఉపాధ్యాయుడు అన్నింటినీ స్మరణకు తీసుకురావడం సాధ్యం కాదు. కాని ఏ ఏ విషయాలు ఏ ఏ గ్రంథాలలో దొరుకుతుందో ఉపాధ్యాయుడికి తెలిసి ఉండాలి. దీనినే సమాచార సేకరణ సామర్థ్యం అంటారు.

| సమచార సేకరణకు ఉపయుక్తమయ్యే వివిధ ఆధారాలను పట్టిక పరచి వివరించండి. |
| --- |

5.8 గ్రంథాలయాలు :

భాషాబోధన- అభ్యసనాలకు తోడ్పడే వాటిల్లో గ్రంథాలయాలు కూడా ప్రాధాన్యత కల్గి ఉన్నాయి. పాఠశాలలోని విద్యార్థులు చదువుకోవడానికి వివిధ రకాలైన పుస్తకాలను ఒక చోట ఉంచే ప్రదేశాన్ని 'గ్రంథాలయం' అంటారు. పాఠశాలకు అంతటికీ కలిపి ఒకే గ్రంథాలయం ఉంటే దాన్ని 'పాఠశాల గ్రంథాలయం' అంటారు. పాఠశాల గ్రంథాలయం అందరి అవసరాలకు సరిపో నప్పుడు తరగతి గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తారు. ఇవి ఆయా తరగతుల విద్యార్థులకు దగ్గరగా ఉండి, వారి స్థాయికి అవసరాలకు తగిన పుస్తకాలను సరఫరా చేస్తాయి. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో సబ్జెక్టు వారీ గ్రంథాలయాలు కూడా ఏర్పాటు చేయడం కద్దు.

ఈ పాఠశాల గ్రంథాలయాల్లో ఉపాధ్యాయులకు ఉపయుక్తమయ్యే మూలగ్రంథాలు, పరామర్శ గ్రంథాలు ఉంటాయి. వాటిని సంప్రదించి ఉపాధ్యాయులు తమబోధనను మెరుగుపరచు. కొంటారు.

తరగతి వాచకాలు తరచుగా మారవు. కానీ ప్రపంచ విజ్ఞానం రోజురోజుకు వేగంగా పెరుగుతోంది. గనుక ఉపాధ్యాయులు వాచకాలలోని అంశాలకు అనుబంధంగా కొత్త కొత్త అంశాలను అన్వేషించి, విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలి. అందుకే ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అంటారు. ఉపాధ్యాయుడు నిత్యం మారే విజ్ఞానాన్ని తాము పొంది దాన్ని విద్యార్థులకు అందించడానికి ఈ గ్రంథాలయాలు బాగా ఉపకరిస్తాయి.

విద్యార్థులకు పఠనాభ్యాసం కలగడానికి, వ్రాయడానికి పఠననైపుణ్యం పెరగడానికి, వారి అవ సరాలు, ఆసక్తులు వారిలోని సృజనాత్మకశక్తులు ఉద్దీపించడానికి వారికి మంచి విజ్ఞానం అందించ డానికి ఇవి ఉపయోగపడుతాయి. విద్యార్థులను మంచి పౌరులుగా చేయడానికి పాఠశాల గ్రంథాల యాలు తోడ్పడతాయి. విద్యార్థులందరు తమకు కావలసిన అన్ని పుస్తకాలు కొనే ఆర్థిక వసతి కలిగి వుండరు. కాబట్టి ప్రతి విద్యార్థి ఈ గ్రంథాలయం ద్వారా తానుకోరుకున్న పుస్తకాలను పొంది, తన ప· రనాభిలాషను తీర్చుకోగలడు. ఈ గ్రంథాలయాల్లోని వాచకాలు ప్రత్యేకించి పేద విద్యార్థులకు ఉప యోగపడుతాయి. విద్యార్థులు కూడా ఆధునికజ్ఞానాన్ని అందుకోవడానికి, వాచకాలకు తోడుగా ఇతర

విషయాలను నేర్చుకోవడానికి ఈగ్రంథాలయాలు పనికి వస్తాయి. పుస్తకాలు ప్రపంచంలోని విజ్ఞానాన్ని దర్శించే గవాక్షాలుగదా! మంచి పుస్తకాలు మంచి మిత్రులే కదా! మంచి పుస్తకాలు చదివి విద్యార్థులు విజ్ఞానం, వినోదం కాలం సద్వినియోగంతో పాటు ఉత్తమ మానవలక్షణాలు అలవరచుకొంటారు.

పాఠశాల గ్రంథాలయాలు ప్రయోజనాలు సాధించాలంటే పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు సమిష్టిగా కృషి చేయాలి. ముఖ్యంగా ప్రతి సంవత్సరం కొత్త కొత్త పుస్తకాలను కొని తెప్పించాలి. వాటిని క్రమపరచి అందరికీ అందుబాటులో ఉంచాలి. గ్రంథాలయ నిర్వాహకుడు తప్పనిసరిగా ఉండాలి. ప్రతి తరగతికి వారానికి ఒక్క పీరియడ్ అయినా గ్రంథాలయం కోసం కేటాయించాలి. గ్రంథాలయంలో లభించే గ్రంథాలు, వాటిల్లో ఉండే అంశాల వివరాలు ఉపాధ్యాయులకు తెలిసి వుండాలి. అప్పుడే వాళ్ళు విద్యార్థుల్ని సరిగా ప్రేరేపించి మార్గదర్శకత్వం ఇవ్వగలరు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శంగా ఉండి తరచుగా గ్రంథాలయంలో గడపాలి.

విద్యార్థులు తప్పనిసరిగా గ్రంథాలయానికి వెళ్ళడం, పుస్తకాలు తీసుకోవడం, చదివిన వాటిలోని అంశాలను నోట్సు రాసుకోవడం, అవసరమైనప్పుడు చర్చించడం, ఇతరులకు చదివి వినిపించడం, పోటీల్లో పాల్గొనడం అవసరం. ప్రతి విద్యార్థి గ్రంథాలయం వినియోగించుకొనేట్లు చూసే బాధ్యత తరగతి ఉపాధ్యాయుడిదే.

విద్యార్థుల్ని ప్రోత్సహించడానికి తరచుగా వాళ్ళు చదివిన పుస్తకాలపై చర్చలు, గోష్ఠులు ఏర్పాటు చేయవచ్చు. గ్రంథాల్లోని అంశాలు, పాత్రలు, సన్నివేశాలు మొదలయిన అంశాలపై సమీక్షించవచ్చు. క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, పాత్రాభినయం, సంభాషణలు వ్రాయడం మొదలయిన సృజనాత్మకత కృత్యాల ద్వారా విద్యార్థులు గ్రంథాలయం వినియోగించేటట్లు ప్రోత్సహించవచ్చు.

గ్రంథాలయ నిర్వహణ :

గ్రంథాలయాలకు పుస్తకాల ఎంపికలో జాగరూకత అవసరం. విద్యార్థుల స్థాయి, అవసరాలు, ఆసక్తులు, ఆధునికత, మంచి భావాల వ్యాప్తి, మంచిభాష , ఆకర్షణీయమైన చిత్రాలు మొదలయిన అంశాలను దృష్టిలో ఉంచుకొని తగిన పుస్తకాలనే ఎంచుకోవాలి. ముఖ్యంగా మనకు బాలసాహిత్యం చాలా తక్కువ కాబట్టి బాలలకు మక్కువ కలిగించే పాటలు, గేయాలు, కథలు, విజ్ఞాన శాస్త్ర విషయాలు మొదలయిన వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. మూలగ్రంథాలు, పరామర్శగ్రంథాలు ఎంపికలో వాటి ఆవశ్యకత దృష్టిలో ఉంచుకోవాలి. విద్యార్థుల్ని పోటీ పరీక్షలకు ప్రోత్సహించే పుస్తకాలను కూడా ఎన్నుకోవడం అవసరం. ముఖ్యంగా మన సాహిత్యం, భాష, సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు అందించగల సరళమైన పుస్తకాలను గ్రంథాలయంలో ఉంచడం చాలా అవసరం.

పుస్తకాల ఎంపిక ఎంత అవసరమో, వాటి అమరిక, అందుబాటు కూడా అంతే ప్రధానం. పుస్తకాలు వెతుకుకొనకుండా విద్యార్థులే స్వయంగా అందుకొనేట్లు వాటిని అమర్చాలి. అందుబాటులో ఉంచాలి. వర్గీకరించి పుస్తకాల పట్టికను తయారు చేసి అందరికి అందుబాటులో ఉంచాలి.

పాఠశాలకు గ్రంథాలయం గుండె వంటిది. ఈ గ్రంథాలయాన్ని నెలకొల్పడం. నిర్వహించడం మంచి ఫలితాలు సాధించడం అనేది విద్యార్థుల ఉపాధ్యాయులు, యాజమాన్యాల సమిష్టి సహకారం పై ఆధారపడి యుంటుంది. విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం, సహాయం తీసుకొని వీటిని అభివృద్ధి పరచవచ్చు. గ్రామస్తులు పుస్తకాలను గ్రంథాలయాలకు వితరణ చేయవచ్చు. సేవా సంస్థలు సైతం చందాలు పోగుచేసి గ్రంథాలను సమకూర్చవచ్చు. గ్రంథాలయం శుభ్రంగా అందంగా నిశ్శబ్దంగా ఉండాలి. గోడలపై ప్రభావితం చేసే మంచి నీతి వాక్యాలు, ఆకరించే కవులపటాలుండటం అవసరం. తరచుగా గ్రంథాలయ వారికోత్సవాలు నిర్వహిస్తూ, పెద్దలను ఆహ్వానించి గ్రంథాలయాల వినియోగంపై ఉపన్యాసాలు, గోష్టులు, సాహిత్య ప్రసంగాలు, పద్యపఠనం, సమీక్షలు నిర్వహించడం కూడా చాలా ముఖ్యం.

మూలగ్రంథాలు, పరమార్శగ్రంథాలతో బాటు విద్యార్థులకు పనికివచ్చే ప్రశ్నలనిధులు, విజ్ఞాన విషయాల పుస్తకాలు, క్విజ్‌కు పనికివచ్చే పుస్తకాలు కూడా లభించేటట్లు చేయాలి. బాగా ఉపయోగించుకొనే విద్యార్థులను గుర్తించి, అభినందించి బహుమతులిచ్చి ప్రోత్సహించాలి.

గ్రంథాలయాల వినయోగానికి ఉపాధ్యాయులు తమ వంతు సహాయం అందించాలి. విద్యార్థులకు ఆదర్శంగా ఉండి మార్గదర్శకత్వం వహించాలి. మంచి పుస్తకాలను చదవడానికి ప్రోత్సహించాలి. తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకోవాలి. వారిని ఉత్తమరచనలు చేయడానికి ప్రోత్సహించాలి.

5.9. పఠనాలయాలు :

పఠనాలయాలు గ్రంథాలయాలకు అనుబంధంగా ఉంటాయి. విద్యార్థులు తీరిక సమయాలలో అక్కడే కూర్చొని చదవడానికి వీలైన పత్రికలు, చిన్నపుస్తకాలు పఠనాలయంలో ఉంటాయి. తమకు నచ్చిన పత్రికలను చదువుకొంటారు. ఇక్కడ ముఖ్యంగా దిన, వార, మాసపత్రికలు ఉంటాయి. బడి గ్రంథాలయం వల్ల సమకూరే ప్రయోజనలన్నీ పఠనాలయంద్వారా కూడా పొందగలం.

పత్రికల్లో అనేక విశేషాలుంటాయి. విద్యార్థులకు ఇష్టమైన విజ్ఞానశాస్త్రాంశాలు, కథలు, కవితలు, గేయాలు, వ్యంగ్యచిత్రాలు( కార్టూన్లు), ఛలోక్తులు( జోక్సు), వివిధ ఆసక్తులు కలిగించే ప్రత్యేక శీరికలు ఉంటాయి. విద్యార్థులకు ముఖ్యంగా రోజు వారీ వచ్చే నూతన అంశాల జ్ఞానం వీటిల్లో లభిస్తుంది. అందువల్ల పఠనాలయాల్లో పత్రికలను చదవడానికి విద్యార్థులు బాగా ఇష్టపడతారు.

ఒక్కొసారి వారి ఆలోచనలకు,మెదడుకు పదును పట్టే అంశాలు పత్రికలల్లో ఉంటాయి. అందు వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు తమ ప్రతిభను మరింత పెంచుకోవడానికి వీలుంటుంది. ముఖ్యంగా గడి-నుడి, పొడుపుకథలు, చెప్పండి చూద్దాం. కనుక్కోండి? వింతలు- విశేషాలు, మీ ప్రశ్న -మాజవాబు వంటి శీరికలు విద్యార్థుల్ని ఆకరిస్తాయి. ఇలాంటి సవాళ్ళను ఎదుర్కొని సమస్యల్ని అవగాహన చేసుకొని, పరిష్కరించే సామర్థ్యం ఆలోచనా సరళి, సహనం, హేతుబద్ధత, కార్యకారణ సంబంధాలు గ్రహించడం,మూఢాచారాలను తిరస్కరించడం, సంస్కారభావాలను విశాలదృక్పథాలను ఆహ్వానించడం వంటి మంచిగుణాలు ఏర్పడతాయి.

ఇలా అనేక ప్రయోజనాలు సాధించడానికి వీలున్న ఈ పఠనమందిరాలను కూడా చక్కగా నిర్వహించాలి. మంచి పత్రికలను అందుబాటులో ఉంచాలి. ఆయాపత్రికాంశాలపై చర్చలు, గోష్టులు, సమీక్షలు ఏర్పాటు చేయాలి. విద్యార్థులు ఆయా పత్రికల నుండి విషయాలను సేకరించి, క్రమపరచి, తగువిధంగా స్పందించగల్గాలి. అందుకు కావలసిన మార్గదర్శకత్వం ఉపాధ్యాయులు ఇవ్వాలి. విద్యార్థులు చదివిన పుస్తకం పత్రిక వివరాలు తేదితో సహా నమోదు చేసుకొనే అలవాటును చేయాలి. పఠనాలయంలోని పత్రికల్ని, పుస్తకాల్ని క్రమపద్ధతిలో అందుబాటులో ఉంచడం. పాత వాటిని సైతం సరైనచోట పరామర్శకు, పరిశీలన కోసం ఉంచడం అవసరం. విద్యార్థులే పఠన మందిరాన్ని నిర్వహించేట్లు వారికి శిక్షణ ఇవ్వాలి.

విద్యార్థుల సహజమైన ఆసక్తులు, అనురక్తులు తీరడానికి, వారి సృజనాత్మక శక్తులు వికసించడానికి అనువైన అంశాలను, కార్యక్రమాలను ఈ పఠనమందిరం ద్వారా రూపొందించాలి. చిత్రీకరించడం, రంగులువేయడం, అలంకరించడం, ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, గేయాలు, కథలు రచించడం, పద్యపఠనం మొదలైనవి చేయించాలి.

పఠనాలయ ఆశయాలు ఫలించడానికి మెండుగా పుస్తకాలు, పత్రికలు ఉంటేనే చాలదు. పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, దాతలు, సమాజసేవకులు అంతా కలిసికట్టుగా, ప్రణాళికాబద్ధంగా కార్యకలాపాలను సాగించిననాడే ఆశించిన ఫలితాలను పొందగలం. ఇది అందరి బాధ్యత అని తెలుసుకోవడం అత్యవసరం.

మీ ఊరి గ్రంథాలయానికి వెళ్ళి పరామర్శక గ్రంథాలను/ మూలగ్రంథాల వివరాలను సేకరించండి.

గ్రంథాలయాలు బోధనా సామర్థ్యమును పెంపొందించడానికి ఏవిధంగా ఉపకరిస్తుంది అనే అంశంపై తరగతిలో వ్యాసరచన చేసి ఉత్తమ వ్యాసాలను ఎన్నిక చేసి తరగతిలోని విద్యార్థులకు చదివి వినిపించడం. దాన్ని తరగతి గదిలో చదవడానికి అనువుగా వ్రేలాడదీయండి.

## 5.10 మూలగ్రంథాలు (Source Books):

తెలుగుభాషాబోధనకు ప్రధానంగా ఉపయుక్తమయ్యే వాచకాల (పాఠ్యగ్రంథాల)తో బాటు మూల గ్రంథాల ఆవశ్యకత పేర్కొన తగ్గది. మూలగ్రంథాలకు, పరామర్శకగ్రంథాలకు పెద్దగా భేదం లేదు. వాచకంలోని సుమతి పద్యాలను బోధించేటప్పుడు సుమతి శతకాన్ని చదివి అందలి మంచి పద్యాలను వివరించడం వల్ల ఆ శతకపఠనంపై విద్యార్థులకు మరింత ఆసక్తి కలుగుతుంది. పోతన పద్యాలు, శ్రీశ్రీగేయాలకు కూడా కావలసిన మూలగ్రంథాలను సేకరించి పాఠశాల గ్రంథాలయంలో భద్రపరచాలి. మూలగ్రంథాలను ఆకరగ్రంథాలని కూడా అంటారు. ఇవి ఇటు బోధకులకు, అటువిద్యార్థులకు ఉపయోగపడుతాయి. భాషాపరంగా ఉపయుక్త గ్రంథాలను రెండువర్గాలుగా విభజించవచ్చు. ఒకటి భాషాపరమైనది. రెండవది సాహిత్యపరమైనది. మూల గ్రంథాన్ని చూడడం వల్ల ఉపాధ్యాయునికి జ్ఞాన సమృద్ధి కలుగుతుంది. ఆలోచనా పరిధి విస్తరిస్తుంది. పాఠ్యాంశానికి ముందు వెనుక నున్న (సందర్భోచితం) తెలుస్తుంది. మూలగ్రంథాలకు పరామర్శక గ్రంథాలు పూరకాలుగా ఉంటాయి. బాషాపరమైన గ్రంథాలకోవలో భాషాచరిత్రను భాషా స్వరూపాన్ని, స్వభావాన్ని తెలిపే వ్యాకరణం ఛందస్సు, అలంకారాలు మొదలైన శాస్త్ర గ్రంథాలు ఉంటాయి.

కాల్డ్వెల్‌గారి ద్రావిడభాషల తులనాత్మక వ్యాకరణం (Comparative grammar of Dravidian Languages) పి.ఎస్.సుబ్రమణ్యంగారి, ఆధునిభాషాసిద్ధాంతాలు, కోరాడరామ కోరాడరామ కృష్ణవారి సంధి, చేకూరి రామారావు తెలుగువాక్యం మొదలైన భాషా స్వరూపాన్ని వివరించే కొన్ని ముఖ్యగ్రంథాలు, బాలవ్యాకరణం, ప్రౌఢవ్యాకరణం, సులక్షణసారం, అప్పకవీయం, ప్రతాపరుద్ర యశోభూషణం మొదలైన లాక్షణిక గ్రంథాలు పేర్కొనదగినవి. ప్రసిద్ధ సాహిత్య గ్రంథాలను ప్రక్రియ భేదాన్ననుసరించి ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు, గేయాలు మొదలైనవాటిలో ప్రసిద్ధమైన వాటిని సేకరించాలి. సరళవచన రూపంలో వచ్చిన పురాణకథాగ్రంథాల్ని సేకరించాలి. అవి విద్యార్థులకు మరింత ఉపయోగకరంగా ఉంటాయి. ప్రసిద్ధమైన శతకాలన్నింటిని సేకరించాలి. గద్యగ్రంథాల్లో చిన్నయసూరి నీతిచంద్రిక పిల్లల కథలు, కథానికలు, నాటికలు, నాటకాలు సాహితీవిమర్శక గ్రంథాలు, వ్యాసాలు, చరిత్రలు మొదలైన వాటిని సేకరించాలి. సేకరించిన వాటిని భద్రపరచడం సరిగా ఉపయోగించుకోవడం కూడా ముఖ్యమే. ఇదంతా ప్రణాళికాబద్ధంగా జరగాల్సివుంది. ఉపాధ్యాయుడు నిరంతరపఠనాశీలిగా ఉన్నపుడే జ్ఞానాన్ని పెంపొందించుకోవడం సాధ్యం. అటువంటి ఆదర్శబోధకుడే విద్యార్థుల్ని ప్రభావితం చేసి గ్రంథపఠనకు పురికొల్పగలడు. పుస్తకపఠనం రానురాను సన్నగిల్లుతున్న ఈ కాల పరిస్థితుల్లో అధ్యాపకుడు తగిన ప్రోత్సాహాన్ని, సూచనలిచ్చి విద్యార్థులచేత ఆకరగ్రంథాలను పఠింపచేయాలి. లేకుంటే ప్రాచీనుల ఆధునికుల భావసంపదను సొంతం చేసుకోలేమన్నది సత్యం. మూలగ్రంథపఠనం స్వీయఅభ్యసనకు ప్రథమ సోపానం.

పది ఆకరగ్రంథాలను సేకరించి, పేర్కొనండి. పట్టిక ఇవ్వండి.

5.11 పరామర్శక గ్రంథాలు **(Reference Books)** :

పాఠశాలగ్రంథాలయంలో విద్యార్థుల కోసం, ఉపాధ్యాయుల కోసం ఎన్నో పుస్తకాలను ఎన్ను కొంటారు. వాటిలో ఉపాధ్యాయులు పలు అంశాలను బోధిస్తున్నపుడు కావలసిన అదనపు సమాచారం సేకరణ చేసుకోవడానికి, సందేహాలను నివృత్తి చేసుకోవడానికి, విషయాన్ని స్పష్టంగా అవగాహన చేసుకోవడానికి, వివిధ దృష్టాంతాలను చెప్పడానికి ఉపయోగపడేవాటిని పరామర్శక గ్రంథాలన వచ్చు. వీటి సహాయంతో విషయబోధన మరింత స్పష్టంగా శక్తివంతంగా అధ్యాపకుడు చేయవచ్చు.

పటిష్టమైన పాఠ్యప్రణాళిక తయారుచేసుకోవడంలో వీటి ప్రాముఖ్యత చాలా వుంది. ప్రతి పాఠశాల గ్రంథాలయంలో పరామర్శక గ్రంథాలు విధిగా ఉండితీరాలి. పాఠశాల గుర్తింపు విధానం లో పాఠశాల గ్రంథాలయ నిర్వహణం ఒక అంశం అన్నది విస్మరించకూడదు. ఇవి ప్రాచీన సాహిత్య బోధన చేసేటప్పుడు భాషాచార్యునికి సహాయకారులుగా ఉంటాయి. మాధ్యమిక, ఉన్నత తరగతుల విద్యార్థులకు కూడా వీటి ఉపయోగాన్ని వివరించాలి. వీటి వినిమయానికి ప్రోత్సహించాలి. ఈ గ్రంథాలను ఎలా ఉపయోగించాలో కూడా విద్యార్థులకు సూచనలు ఇవ్వాలి. పద్యగద్య బోధన అభ్యసనంలో కొత్తపదాలకు అర్థాలను తెలుసుకోవడానికి ఉపయుక్తమయ్యే నిఘంటువులను ఉపయోగించే విధానం విద్యార్థులకు తెలియచేయాలి. పదకోశాలు నిఘంటువులు, సామెతలు, పలుకుబడులు తెలిపే గ్రంథాలు, వ్యాఖ్యానాలు, గాథాసంకలనాలు, విమర్శలు మొదలైనవి ఈ కోవలోనికి వస్తాయి.

పదకోశం, సూర్యరాయాంధ్రనిఘంటువు, శబ్దార్థనిఘంటువు, విద్యార్థికల్పతరువు, పదబంధ పారిజాతం, పూర్వగాథాలహరి, బాలవ్యాకరణం – రమణీయం, సాహిత్యశిల్పసమీక్ష మొదలైనవి ఈ కోవకు చెందిన కొన్ని ముఖ్య గ్రంథాలు. భాషాబోధన అభ్యసనక్రియలో ఈ గ్రంథాలకు సముచితస్థానం కల్పించాలి.

పది పరామర్శక గ్రంథాలను సేకరించి పట్టిక పరచండి.

5.12 బొమ్మల్ని వర్ణించడం.

విద్యార్థులకు బోధనోపకరణాల ద్వారా బోధన చేయడంలో ఉన్న ఉద్దేశ్యాలను ఛాత్రోపాధ్యాయులు గుర్తించాలి. చిత్రాలు మంచి ఉపకరణాలుగా ఉపయోగపడుతాయి. విద్యార్థులను అందమైన వర్ణచిత్రాలు బాగా ఆకట్టుకొంటాయి. రకరకాలైన చిత్రాలను సేకరించి ప్రదర్శించవచ్చు. మహనీయుల, కవుల చిత్రాలు, చారిత్రక, ఊహాచిత్రాలు (వ్యంగ్యచిత్రాలు– కార్టూనులు) మొదలైనవాటిని మరియు కథాచిత్రాలు, సంఘటన ప్రాధాన్యత కలిగిన చిత్రాలు (భగత్‌సింగ్‌ను ఉరితీయడం) మొదలైన వాటిని సేకరించి ప్రదర్శించాలి.

విద్యార్థులస్థాయిననుసరించి తగిన చిత్రాలను ప్రదర్శించి విద్యార్థులను వాటి గురించి చర్చించమనాలి. ఊహించడానికి తగిన ప్రశ్నలను సంధించాలి. ఈబొమ్మలను వర్ణించడం ద్వారా విద్యార్థులు కొత్తకొత్త అంశాలను కూడా స్వయంగా తెలుసుకోగలరు. వారి ఊహాశక్తిని ఇవి ఇనుమడింప చేస్తాయి. సృజనాత్మకతను పెంపొందిస్తాయి. ఇవి వైయక్తిక భేదాలను, మూర్తిమత్వాన్ని తెలియజేస్తాయి. ఈ వర్ణనప్రక్రియ విద్యార్థుల బాషణ నైపుణ్యాన్ని, లేఖననైపుణ్యాన్ని పెంపొందిస్తుంది.

5.13 క్విజ్ (రసప్రశ్నావళి) :

బోధనాభ్యసనల ప్రక్రియలో క్విజ్‌కు ఒక ప్రత్యేకస్థానం వుంది. ఇందులో విద్యార్థుల భాగ స్వామ్యం ప్రధానమైనది. దీని నిర్వహణ కూడా విద్యార్థులే చేయగలరు. క్విజ్ అనే ఆంగ్లపదాన్ని తెలుగులో 'రసప్రశ్నావళి' అంటారు. విద్యార్థుల అభ్యసనను మూల్యాంకనం చేయడానికి ఇది ఒక వ్యూహాత్మక కృత్యంగా భావించవచ్చు.విద్యార్థుల ఆర్జితస్థాయిని తెలుసుకోవడానికి పాఠశాలలో వీటిని తరచు నిర్వహించాలి.విజేతలనేకాకుండా పాల్గొన్నవారందరిని అభినందించాలి.బహుకరించాలి.

# అధ్యాయం - 6

## పాఠపథకం

6.1 పరిచయం

6.2 పాఠపథకం తయారుచేసే విధానాలు

6.3 వృత్తిపూర్వ (Pre -Service), వృత్త్యంతర (In -Service) పాఠపథక నిర్మాణంలో ఉన్న భేదాలు

6.4 పద్యభాగానికి పాఠపథకం

6.5 గద్యభాగానికి పాఠపథకం

6.6 వ్యాకరణాంశానికి పాఠపథకం

6.7 ఉపవాచకానికి పాఠపథకం

## పాఠపథకం

6.1 పరిచయం :

భాషాపాఠాలలో ప్రతిపాఠం ఒక యూనిట్‌గా పరిగణించబడుతుంది. మిగతా విషయాలలో (Subjects) ఒక అంశానికి సంబంధించిన అన్ని పాఠాలను ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. భాషలోని పాఠాలసంఖ్య యూనిట్ల సంఖ్య సమానంగా ఉంటాయి. వ్యాకరణాంశాలలో సంధులను ఒకయూ నిట్‌గాను, అలంకారాలను ఒకయూనిట్ గాను, ఛందస్సును ఒకయూనిట్‌గాను పరిగణించవచ్చు.

6.2 పాఠపథకం తయారుచేసే విధానాలు :

బోధనాభ్యసనానికి ఉపాధ్యాయశిక్షణ సంస్థలలో అనుసరించే పథకమే పాఠపథకం. ఒక పీరియడ్‌లో బోధనాభ్యసన కృత్యాల నిర్వాహణకు తయారుచేసుకొనే పథకమే పాఠపథకం. ఉపాధ్యాయశిక్షణ సంస్థలలో అభ్యసించే ఛాత్రోపాధ్యాయులు (Student-Teachers) అభ్యాసానికి రూపొందించే పథకం పాఠపథకం.

ఉత్తమ ఉపాధ్యాయులుగా రాణించాలంటే బోధన కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించవలసి ఉంటుంది. విద్యార్థుల ముందు జంకు, భయం లేకుండా నిలబడే స్తోమత ఉండాలంటే

బోధించే సామర్థ్యం చేకూర్చవలసి ఉంటుంది. దీని సహకారానికి తోడ్పడేదే పాఠపథకం. పాఠపథకం నిర్మాణ సామర్థ్యం అలవడితే బోధన సామర్థ్యం అలవడుతుంది.

ఉపాధ్యాయశిక్షణ సంస్థలలో పాఠపథక నిర్మాణం గురించి బోధించిన తర్వాత ఉపన్యాసకులు ఛాత్రోపాధ్యాయుల కోసం ప్రదర్శన పాఠాన్ని ఇస్తారు. ఆతర్వాత పాఠశాల ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో ఛాత్రోపాధ్యాయులు పాఠశాలలకు వెళ్ళి బోధనను అభ్యాసం చేయవలసి ఉంటుంది. బోధన ప్రారంభానికి ముందు పాఠపథకం (Lesson Plan) తయారుచేసుకొని దానిననుసరించి తరగతిగదిలో బోధించవలసి ఉంటుంది. కాబట్టి పాఠపథక నిర్మాణాన్ని సక్రమంగా అవగాహన చేసుకొన్న ఛాత్రోపాధ్యాయులు తరగతిగదిలో విద్యార్థుల ముందు నిలబడి బోధించగలుగుతారు. బోధన అంటే ఏమిటో తెలియని ఛాత్రోపాధ్యాయులకు పాఠపథకం ద్వారా వృత్తినైపుణ్యం అలవడుతుంది. భవిష్యత్తులో మంచి ఉపాధ్యాయుడుగా రాణించడానికి, అవసరమైన బోధనోపకరణాలను తయారుచేయడానికి, వాటిని ఉపయోగించడానికి, పాఠపథకం ఉపయోగపడుతుంది. బోధనాభ్యాసనకృత్యాలు పాటించడం మూల్యాంకనం చేయడం, ప్రశ్నలను తయారుచేయడం,వేగంగా ప్రశ్నలడిగే సామర్థ్యాన్ని సాధించడం మొదలైన వాటిని పాఠపథకాన్ని అనుసరించి బోధించడం ద్వారా సాధించవచ్చు. ఒక పనిలో సామర్థ్యం అలవడాలంటే దాన్ని అభ్యాసం చేయాలి. బోధనను అభ్యాసం చేయడానికి పాఠపథకం తోడ్పడుతుంది. అభ్యాసం వల్ల బోధన చేసే విధానం అవగాహనకావడమే కాకుండా అలవాటు అవుతుంది. బోధనాభ్యాసం వల్ల ఛాత్రోపాధ్యాయులు తమ భావిజీవితంలో సమర్థవంతులైన ఉపాధ్యాయులుగా రాణిస్తారు.

6.3 వృత్తిపూర్వ (Pre-service) వృత్త్యంతర (In-service) పాఠ్యపథక నిర్మాణంలో ఉన్న భేదాలు :

ఉపాధ్యాయశిక్షణా సంస్థలలో అభ్యసించే ఛాత్రోపాధ్యాయులు తమశిక్షణా కాలంలో (Pre - service) బోధనను అభ్యాసం చేసుకోవడానికి మార్గదర్శకంగా ఉండే సాధనం పాఠపథకం. ఇది వివరంగా ఉండి అడుగుగునా ఛాత్రోపాధ్యాయులకు తోడ్పడేది. కాబట్టి దీన్ని వివరంగా వ్రాయవలసిన అవసరం ఉంది. బోధించినప్పుడు పర్యవేక్షించే ఉపన్యాసకులు కూడా ఈదృష్టితోనే లోపాలను సవరించడానికి ప్రయత్నిస్తాడు.

ప్రతిరోజు ఐదు లేదా ఆరుపీరియడ్లు బోధించే ఉపాధ్యాయుడు పాఠపథకాన్ని సమగ్రంగా వ్రాయడానికి ఇది సాధ్యంకాదు. ఉపాధ్యాయుడు తాను బోధించవలసిన అంశాలను సూచనప్రాయంగా వ్రాసుకుంటే సరిపోతుంది. తరగతిలో బోధించవలసిన ఉపాధ్యాయునికి (In-service) ఇది మార్గదర్శకత్వం వహిస్తుంది. తాను అంశాలను (Points)మరచిపోకుండా బోధించడానికి అవసరమైనచోట బోధనోపకరణాలను ఉపయోగించడానికి ఇది తోడ్పడుతుంది. అంశాన్ని విడిచిపెట్టి వేరే అంశంలోనికి మరలకుండా ఉండడానికి ఉపాధ్యాయుడికి సహాయపడుతుంది. ఒక అంశాన్ని బోధించడానికి ముందు దాని గురించి ఆలోచించడం బోధనకు సంసిద్ధంకావడం అవసరం. ఒకే అంశాన్ని 20 సంవత్సరాలు బోధించినప్పటికి మంచి ఉపాధ్యాయుడు కూడా తరగతికి పోవడానికి వయుందు సంసిద్ధుడై అన్ని హంగులను సమకూర్చుకొంటాడు. అది ప్రతి ఉపాధ్యాయుని విధి, వృత్తిధర్మం. ఉపాధ్యాయు శిక్షణాసంస్థలో అభ్యసించే ఛాత్రోపాధ్యాయుల కోసం సమగ్రమైన పాఠపథకం రూపొందించబడింది. దీనిని తెలుసుకోవడానికి ముందు ప్రణాళిక అంటే ఏమిటి? ప్రణాళిక రచన ఎందుకు ? పాఠపథక ఆవశ్యకం ఏమిటి? దాని ప్రయోజనాలు, పాఠపథకాన్ని రూపొందించేటప్పుడు దృష్టి యందుంచుకోవలసిన అంశాలను గురించి తెలుసుకుందాం.

పాఠ్యపథకం – ఆవశ్యకత :

ప్రతికార్యానికి ప్రణాళిక అవసరం. ప్రణాళిక లేని ఏకార్యం కూడా సఫలీకృతం కాదు. ప్రణాళిక, పథకం అనేపదాలను సమానార్థక పదాలుగా వాడుతుంటారు. ఉపాధ్యాయులందరు సమర్థవంతులు, ప్రతిభావంతులు, తాము రూపొందించుకొన్న కార్యక్రమానికి వారు కూడా ప్రణాళిక రచన చేసుకొంటారు. నిర్ణీత సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం పూర్తికావడానికి ప్రణాళిక రచన ఉపయోగపడుతుంది.

ఉపాధ్యాయుడు విద్యార్థులకనుగుణంగా ఏ ఏ బోధనాంశాలను, ఎంత మోతాదులో,ఎంత కాలంలో,ఏవిధంగా బోధించాలి అని బోధన కార్యక్రమాల్ని రూపొందించుకోవాలి. ఇదే పాఠ ప్రణాళిక, పాఠపథకం ఏదైనా కూడా. తమకు ఏయే బోధనసామగ్రులు ఎంత వరకు అవసరం అని ముందుగానే అంచనావేసుకోవాలి. అంతేకాక ఏవిధంగా బోధిస్తే అభ్యసన ఫలితాలను సాధించవచ్చు. తాను ఎదుర్కొనే సమస్యలు, పరిష్కారమార్గాలను అంచనా వేసుకొని శాస్త్రీయమైన పద్ధతుల్లో ప్రణాళికను రచించుకోవాలి. ఇదే పాఠపథకానికి ఆధారం. ఉపాధ్యాయుని బోధన విజయవంతం కావాలంటే పాఠపథకం అవసరం.

పాఠపథకం – ప్రయోజనాలు :

పాఠపథకం లేకుండా బోధించడం కళ్లకు గంతులు కట్టుకొని నడవడం లాంటిది. ఉపాధ్యాయుడు తమవృత్తికి న్యాయం చేకూర్చాలన్నా, విద్యార్థుల మనస్సుల్లో సముచితస్థానాన్ని పొందాలన్నా పాఠపథకం అవసరం. పాఠపథక ఆవశ్యకం దాని ప్రయోజనాలు క్రింది విధంగా ఉన్నాయి.

* ఒక పద్ధతి ప్రకారంగా నిర్ణీతకాలంలో, నిర్ణయించుకొన్న విధంగా బోధించడానికి పాఠపథకం అవసరం.

* విద్యార్థులకు తెలియజేయవలసిన మెళకువలన్నీ తెలియజేసివారిని విద్యాపరంగా మెరుగుపరచడానికి పాఠపథకం అవసరం.

* కృత్యాధారపద్ధతిలో ఆసక్తికరంగా బోధించడానికి కృత్యాలను ముందుగా ఎన్నుకోవచ్చు. కృత్య నిర్వహణలో విద్యార్థులను భాగస్వాములుగా చేయడానికి పాఠపథకం ఉపయోగపడుతుంది.

* లక్ష్యాత్మక విద్యను అందించడానికి, విద్యార్థుల ఉత్తీర్ణతాశాతాన్ని పెంచడానికి పాఠ్యపథకం దోహదపడుతుంది.

* బోధనలో ఎదురయ్యే సమస్యలు వాటి పరిష్కారాలకు పాఠపథకం అవసరం.

* బోధనకుముందే తనకు తెలియని అంశాల తోటి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకొని బోధించవచ్చు.

* విద్యార్థులచే ఒక నిర్ణీతకాలంలో ఎంతమేరకు అభ్యసన చేయించవచ్చు. అనేది పాఠ్యపథకం ద్వారా తెలుసుకోవచ్చు.

* విషయప్రణాళిక (Syllabus) ను నిర్ణీత సమయంలో పూర్తిచేయడానికి తోడ్పడుతుంది.

* విద్యార్థుల స్థాయికి, అభిరుచులకు అనుకూలంగా బోధించవచ్చు.

* వనరులను పొదుపుగా, జాగ్రత్తగా, సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చు.

* ఉపాధ్యాయుడికి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

* ఉపాధ్యాయ విద్యార్థుల మధ్య సంభాషణలు చోటుచేసుకుంటాయి.

* బోధనకు అనుకూలమైన వాతావరణాన్ని ఉపాధ్యాయుడు ఏర్పరచుకుంటాడు.

* విద్యార్థులలో ఆశించిన ప్రవర్తనామార్పులను తీసుకొనిరావడానికి దోహదపడుతుంది.

* జ్ఞానాత్మకరంగంతోపాటు, మానసికచలనాత్మకరంగం, భావావేశరంగాలకు ప్రాధాన్యం కల్పించవచ్చు.

* ఉపాధ్యాయవిద్యార్థుల మధ్య సద్భావనలు నెలకొంటాయి.

* ఉపాధ్యాయుడు తనబోధన నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు.

పాఠపథక నిర్మాణంలో దృష్టి యందుంచుకోవలసిన అంశాలు :

* కవికాలాదులను బోధించేటపుడు, ఆ కవి లేదా రచయితపైన విద్యార్థులకు అభిమానం కలిగే విధంగా ఆ కవిలేదా రచయిత ఇతరగ్రంథాలను చదవాలన్న ఆసక్తికలిగే విధంగా పాఠ్యపథకాన్ని తయారుచేసుకోవాలి.

* బాషాంశాలను వ్రాసేటప్పుడు కఠినపదాలు మాత్రం కాక అర్థాలు కూడా వ్రాసుకోవాలి. ఆ అర్థాలు కూడా విద్యార్థుల మనసులో పదిలమయ్యేవిధంగా కొన్ని ఉదాహరణలను సిద్ధం చేసుకోవాలి.

* సంధులు, సమాసాలను వివరించేటప్పుడు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే ఉదాహరణలు ఇవ్వాలి. వ్యాకరణాన్ని నేర్చుకోవాలన్న అభిలాష విద్యార్థులలో కలిగేటట్లు పాఠపథకం ఉండాలి.

* ప్రకృతి – వికృతులను గురించి చెప్పేటపుడు ప్రకృతి అంటే ఎలాంటి పదాలు వికృతి అంటే పదాలు అనే వివరణలు ఉండాలి.

* పరిశీలన గ్రంథాలను పేర్కొనేటపుడు, గ్రంథంపేరు, రచయితపేరు ప్రచురించిన సంవత్సరం, ప్రచురించిన సంస్థ పేరు, తెలియజేయాలి. ఆవిధంగా చేసినప్పుడే విద్యార్థులకు వాటిని చదవాలనే ఆసక్తి కలుగుతుంది.

* కఠినపదాలకు వాక్యప్రయోగాలు చేసేటపుడు, ఉపాధ్యాయుడు కొన్ని మంచి ఉదాహరణలను ఇవ్వాలి. విద్యార్థులచే కూడా ఉదాహరణలు చెప్పించే విధంగా ఉండాలి. వాక్యనిర్మాణాలు విద్యార్థులకు తెలిసే అవకాశం ఉంటుంది.

* విద్యార్థులు కూడా తరగతి గదిలో పాల్గొనే సన్నివేశాలను కల్పించాలి. విద్యార్థులకు జంకు తొలగుతుంది.

* బోధనోపకరణాలను ఏ అంశానికి ఏవిధంగా ఉపయోగించాలో ఉపాధ్యాయుడు పాఠ్యపథకంలో సూచించాలి

* విద్యార్థులలో ఆలోచనాశక్తిని రేకెత్తించే ప్రశ్నలు అడగాలి.

* పాఠ్యాంశంలోని విషయాలన్నింటిపైనా ప్రశ్నలు వచ్చే విధంగా మూల్యాంకనాన్ని రూపొందించుకోవాలి.

* విద్యార్థుల విద్యా గ్రహణకు భాషపునాది – అనే విషయం ఆధారంగా పాఠ్యపథక నిర్మాణం జరగాలి.

* సమగ్రలక్ష్యసాధనకు పాఠ్యపథకం దోహదపడాలి.

* భాషపైన, సాహిత్యంపైన విద్యార్థులకు ఆసక్తి కలిగే విధంగా పాఠ్యపథకం ఉండాలి.

* ఇంటి పని కేటాయించేటపుడు తరగతిలో విద్యార్థులందరికి ఒకేవిధమైన ఇంటిపని ఇవ్వకూడదు. జట్టులుగా చేసి ఇంటిపని ఇవ్వాలి. భాషాశిక్ష (Imposition) విధించే విధంగా ఉండకూడదు. విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించే విధంగా ఉండాలి.

పాఠ్యపథకానికి ఉపాధ్యాయుడే నిర్మాణకర్త. విద్యార్థుల సమగ్రమూర్తిమత్వ వికాసానికి దోహదపడే విధంగా పాఠ్యపథకాన్ని అమర్చుకోవాలి.

బోధన అభ్యసన లక్ష్యాలను అనుగుణంగా కృత్యాలను రూపొందించి పద్య, గద్య, వ్యాకరణ, ఉపవాచకాలకు నమూనా పాఠ్యపథకాలను రూపొందించడం జరిగింది. ఇవ్వబడిన మాదిరి పాఠపథకాలను పరిశీలించి, అందలి అంశాలను మార్గదర్శకంగా తీసుకొని, ఉపాధ్యాయ విద్యార్థులు తగిన పాఠపథకాలను రూపొందించాలి.

## 6.4. పద్యభాగానికి పాఠపథకం

ఉపాధ్యాయుని/ ఉపాధ్యాయిని పేరు :

| | | | |
|---|---|---|---|
| విషయం | : తెలుగు | పాఠశాల | : |
| తరగతి | : 5 | తేది | : |
| శీరిక | :సుభాషిత రత్నాలు | పీరియడ్ | : |
| | | సమయం | : |

చదువది యెంత గల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు, గుణ సంయుతులెవ్వరు యెచ్చరెచ్చటం
బదునుగ మంచి కూర నలపాకము చేసిననైన నందు ఇం
పొదవెడు ఉప్పులేక, రుచి పుట్టగ నేర్చునటయ్య భాస్కరా !

సామాన్య ఉద్దేశాలు **(General aims)**

* విద్యార్థులలో ఆనందానుభూతిని పెంపొందించడం, విద్యార్థులు విద్యగొప్పదనాన్ని గ్రహించడం.
* విద్యార్థులలో సాహిత్యాభిరుచి పెంపొందించడం.
* విద్యార్థులలో సద్భావనను పెంపొందించడం.
* విద్యార్థులలో సహృదయతను పెంపొందించడం.
* విద్యార్థులలో ఆలోచనాశక్తిని రేకెత్తించడం. విద్యార్థులలో భాషాపరమైన పఠనాన్ని పెంపొందించడం.

ప్రత్యేక ఉద్దేశం **(Specific aim)**

నలచక్రవర్తి వంట చేసినా ఉప్పులేని వంటకం రుచించదు. చదువులోనిసారాన్ని గ్రహించకపోతే ఆ చదువు నిరర్థకం అనే భావాన్ని విద్యార్థులుగ్రహించేలా చేయడం.

**I** లక్ష్యాలు – స్పష్టీకరణలు **(Objectives - specifications)**

* జ్ఞానం – స్పష్టీకరణలు **(Knowledge - Specifications)**
  - జ్ఞప్తికి తెచ్చుకొనడం **(Recollection)**
  - గుర్తించటం **(Identification)**

(అ) విషయ జ్ఞానం : **(Knowledge of the subject)**

* చదువు ఎంత చదివినా రసజ్ఞత లేకుంటే ఆ చదువు నిరర్థకం.
* గుణవంతులెవ్వరు రసజ్ఞత లేని చదువును మెచ్చుకోరు.

* నలచక్రవర్తి వంట చేసినా ఉప్పు లేకుంటే ఆ వంట రుచించదు.

(ఆ) సాహిత్యజ్ఞానం : **(Knowledge of the literature)**

కవి : మారదవెంకయ్య : కావ్యం : భాస్కరశతకం

కాలం : 15వ శతాబ్దం : ఇతరరచనలు : అలభ్యం

(ఇ) భాషాజ్ఞానం : **(Knowledge of the language)**

ఈ జ్ఞానం గద్యపాఠాలలో అధికంగా సాధించవలసి ఉంటుంది. కనుక ఇక్కడ వీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వరాదు. ఆ విధంగా ఇస్తే ప్రధాన లక్ష్యమైన రసానందం కుంటుపడుతుంది.

* కఠినపదాలు – అర్థాలు

  రసజ్ఞత = సారం గ్రహించుట, గుణసంయుతులు = మంచి గుణం

  నిరర్థకంబు = అర్థము లేని, పదునుగన్ = పక్వంగా

* సంధులు : మెచ్చరు + ఎచ్చట = మెచ్చరెచ్చట

II అవగాహన – స్పష్టీకరణలు **(understanding - specifications)**

విద్యార్థులు పోలికలు గ్రహించడం, భేదాలు గ్రహించడం, వివేచించడం, క్రొత్త ఉదాహరణలు ఇవ్వడం, ఔచిత్యం గ్రహించడం, ప్రాధాన్యక్రమం గ్రహించడం, ఊహించడం మొదలైనవి.

విషయ స్పష్టీకరణలు **(Subject specifications)**

* చదువు యొక్క గొప్పదనాన్ని తెలియజేయడం.
* చదువులోని సారాన్ని గ్రహించకపోతే అది నిష్ప్రయోజనమవుతుందని తెలియజేయడం.
* గుణవంతులెవ్వరు నిస్సారమైన చదువును మెచ్చుకోరని తెలియజేయడం.
* పాకశాస్త్రపారంగతుడైన నలమహచక్రవర్తి వంట చేసినా అందులో ఉప్పులేకుంటే అది రుచించదని తెలియజేయడం.
* చదువులోని సారాన్ని (మర్మాన్ని) గ్రహించడానికి చదవాలిగాని, పైపై అర్థాన్ని గ్రహించడానికి చేసే పఠనం వలన ప్రయోజనంలేదని తెలియజేయడం.
* చదువు లేకపోవడం వలన కలిగేనష్టాలను తెలియజేయడం.
* చదువు వలన కలిగే లాభాలను తెలియజేయడం.
* పద్యంలోని నీతిని తెలియజేయడం– (చదువులోని సారాన్ని గ్రహించక చదివితే అది నిష్ప్రయోజనమవుతుంది)

III ఆనందానుభూతి స్పష్టీకరణలు : **(pleasure specification)**

* పద్యం వింటూ అందులోని లయకు విద్యార్థులు ఆనందానుభూతి పొందడం.
* పద్యం చదువుతూ అందులోని లయకు విద్యార్థులు ఆనందానుభూతి పొందడం.
* పద్యంలోని శబ్ద మాధుర్యానికి విద్యార్థులు ఆనందానుభూతి పొందడం.
* పద్యంలోని గంభీరభావాలను ఆలోచించడం వలన విద్యార్థులు ఆనందానుభూతి పొందడం.

IV నైపుణ్యాలు **(skills)**

(అ) పఠన నైపుణ్యం : **(Reading Skill)** స్పష్టీకరణలు : **(Specifications)**

* విద్యార్థులుపద్యాన్ని లయబద్ధంగా చదవడం.
* విద్యార్థులు పద్యాన్ని భావానుక్రమంలో విడదీసి చదవడం.

(ఆ) వినియోగ నైపుణ్యం **(Application Skill)**: స్పష్టీకరణలు **(Specifications)**

* కొత్తపదబంధాలను, విద్యార్థులు సొంతమాటలలో ప్రయోగించటం.
* నేర్చిన పద్యభాగాన్ని సందర్భానుసారంగా వ్యవహారంలో ఉపయోగించడం. ఉదా :
  ఊరకరారు మహాత్ములు .....(పోతన)
  బావా ! ఎప్పుడు వచ్చితవు (తిరుపతి వెంకట కవులు)
  ఒట్టిమాటలు కట్టిపెట్టోయ్ ( గురజాడ)

(ఇ) వ్యక్తీకరణ నైపుణ్యం **(Expression skill)** **:** స్పష్టీకరణాలు **(Specifications)**

* పద్యభావాన్ని విద్యార్థులు సొంతమాటల్లో చెప్పడం.
* పద్యభావాన్ని విద్యార్థులు సొంత మాటల్లో వ్రాయడం.

(ఈ) సృజనాత్మక నైపుణ్యం **(Creative Skill)**

* నేర్చుకొన్న పద్యభాగానికి క్రొత్తపేరు సూచించడం.
* నేర్చుకొన్న విషయానికి స్పందించి కొత్తరచన చేయడం.

**V** ఆసక్తులు **(Interest) -** స్పష్టీకరణలు **(Specifications)**

* విద్యార్థులు నేర్చిన పద్యం ఉన్న మూలగ్రంథాన్ని( భాస్కరశతకాన్ని) చదవాలని ఆసక్తి కలగడం.
* నలచక్రవర్తి కథ తెలుసుకోవాలని ఆసక్తి కలగడం. వారి చిత్రపటాలు సేకరించడానికి ఆసక్తి కలగడం.
* కవులు, రచయితలను చూడాలనే అభిరుచి కలగడం.
* మాతృభాషపై అభిమానం పెంపొందించడం.
* మంచిపద్యాలను ధారణ చేయాలనే ఆసక్తి కలగడం.
* సారస్వత సమావేశాలు నిర్వహించడానికి, పాల్గొనడానికి ఆసక్తి చూపడం.
* నిర్మాణాత్మక విమర్శ చేయాలనే ఆసక్తి కలగడం.

**VI** వైఖరులు **(Attitude) :** స్పష్టీకరణలు **(Specifications)**

* విద్యార్థులలో ఆర్ద్రతా గుణాలను పెంపొందించడం.
* కవులను, రచయితలను, కళాకారులను గౌరవించడం.
* విమర్శలను సహృదయతతో స్వీకరించడం.
* మానవతా వైఖరితో నడుచుకొనడం.
* నైతిక విలువలను పాటించడం.

బోధనోపకరణాలు **(Teaching Learning Materials)**

* అందమైన ముఖచిత్రాన్ని చార్టులో గీయడం. ఈచిత్రంలో కళ్లు గుర్తించకపోవడం. ఈచిత్రాన్ని ఉపకరణంగా ఉపయోగించవచ్చు.
* వివేకానందుడు, రవీంద్రనాథ్‌ఠాగూర్, అరవింద్‌ఘోష్, సర్వేపల్లిరాధాకృష్ణన్, గాంధీజీ మొదలైన విద్యాతత్వవేత్తల చిత్రాలు.

## బోధనపద్ధతి (Teaching Method)

పూర్ణపద్ధతి : ఖండపద్ధతి

పద్యభావాన్ని పూర్తిగా తెలియజెప్పి ఆతర్వాత అందులోని ఒక్కొక్క ఉప అంశాన్ని బోధించాలి.

బోధన విధానాలు **(Types of Teaching)**

* ప్రశ్నోత్తర విధానం
* వాక్యప్రయోగవిధానం
* పఠన విధానం
* వివరణ విధానం

పరిశీలించవలసిన గ్రంథాలు : **(Books to be referred)**

* సూర్యారాయాంధ్ర నిఘంటువు
* భాస్కర శతకం

బోధనాభ్యసన కృత్యాలు **(Teaching Learning activities)**

1. ప్రేరణ **(Motivation)**

* ప్రశ్నోత్తర విధానం
* మనశరీరంలో ముఖ్యమైన భాగం ఏది? - హృదయం
* వాహనాలను నడిపించే ముఖ్యభాగం - ఇంజిను (యంత్రం)
* ఆహారానికి రుచిని కలిగించేది ఏది? - ఉప్పు
* అర్థం లేని చదువును ఏమంటారు? - వ్యర్థం

2. శీరికా ప్రకటన **(Announcement of the little)**

ఈ రోజు మనం రసజ్ఞత లేని చదువు నిరర్థకం అనే అంశం గురించి ఓ పద్యంలో తెలుసుకుందాం.

3. కృత్యాలు

కృత్యం : 1

కవి కాలాదుల గురించి తెలియచెప్పడం.

కృత్యం : 2

పద్యాన్ని లయబద్ధంగా చదవడం.

కృత్యం : 3

పద్యాన్ని అన్వయక్రమంలో విడదీసి చదివించడం

కృత్యం : 4

పద్యాన్ని విద్యార్థులచే లయబద్ధంగా చదివించడం.

కృత్యం : 5

పద్యాన్ని విద్యార్థులచే అన్వయక్రమంలో విడదీసి చదివించడం.

కృత్యం : 6

పద్యాన్ని విద్యార్థులచే మౌనంగా చదివించడం.

కృత్యం : 7

రసజ్ఞత, నిరర్థకంబు, గుణసంయుతులు పదునుగా మొదలైన పదాలకు అర్థాలు గ్రహింపచేయడం.

కృత్యం : 8

భాస్కరా (సంబోధన)

= ఓ సూర్యదేవా అని అర్థం

భాస్కరా - పద్య మకుటమని తెలియచెప్పడం.

వేమన, సుమతి లాంటి మకుటాలను ఉదాహరణగా చెప్పడం ప్రాస అంటే వివరించడం.

శతకాలు అంటే ఏమిటో వివరించడం.

కృత్యం : 9

చదువది యెంతగల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నాచదువు నిరర్థకంబు...

* చదువది యెంతగల్గిన అంటే ఏమిటి ?

జ. ఎంత చదువు చదువుకున్నా....

* రసజ్ఞత అంటే ఏమిటి

జ. సారం గ్రహించడం అని అర్థం

* ఇంచుక చాలకున్న అంటే ఏమిటి?

జ. కొంచెం లేకపోయినా

* నిరర్థకంబు అంటే ఏమిటి?

 జ. అర్థం లేనిది అని అర్థం

* నిరర్థకము : వాక్యప్రయోగం

ప్రకృతిలోని ఏ చెట్టు కూడా నిరర్థకం కాదు.

కృత్యం : 10

గుణ సంయుతులెవ్వరు మెచ్చరెచ్చట....

* గుణసంయుతులు అంటే ఎవరు ?

జ. మంచి గుణము గలవారు.

* మెచ్చరెచ్చుట అంటే ఏమిటి?

జ. మెచ్చుకోరు అని అర్థం.

* సంయుతు లెవ్వరు - విడదీయండి

సంయుతులు + ఎవ్వరు

* మెచ్చరెచ్చట - విడదీయండి

మెచ్చరు + ఎచ్చట

కృత్యం : 11

పదునుగ మంచి కూర నలపాకము చేసిననైన నందు ఇం

పొదవెడు ఉప్పు లేక రుచి పుట్టగ నేర్చునటయ్య భాస్కరా !

* పదునుగ అంటే ఏమిటి ?

జ. పక్వంగా

* నలచక్రవర్తి ప్రత్యేకత ఏమిటి?

 జ. రుచికరమైన వంటలు చేసేవాడు

* పక్వమైన వంటలో ఉప్పు లేకపోతే ఏమవుతంది?

జ. వంటకం రుచించదు.

* ఈ పద్యంలోని నీతి ఏమిటి?

 జ. చదువులోని సారాన్నిగ్రహించి చదవాలి.

కృత్యం : 12

* పక్వంగా చేసిన వంటలో ఉప్పు లేకపోతే రుచి ఉండదు. కవి దీన్ని దేనితో పోల్చాడు ?

జ. సారం గ్రహించని చదువుతో పోల్చాడు.

శతకకర్తలు చాలా వరకు చెప్పవలసిన విషయాలను పోలికలతో, ఉదాహరణలతో చెపుతుంటారు.

మూల్యాంకనం **(Evaluation) :**

ప్రశ్నలు అడిగి మూల్యాంకన పరచడం

- ఈ పద్యం ఏ శతకంలోనిది ?
- ఈశతకంలోని మకుటం ఏమిటి?
- రసజ్ఞత లేని చదువు ఎలాంటిది ?
- ఈపద్యంలోని నీతి ఏమిటి ?

ఇంటిపని **(Follow - up - work)**

- నేర్చుకొన్న పద్యసారాంశాన్ని సొంత మాటలలో వ్రాసుకొని రండి. శతక పద్యాలను కొన్నింటిని సేకరించుకొని రండి.

ఇలాంటి పాఠ్యపథకాన్ని మాధ్యమిక, ఉన్నత తరగతులకు కూడా ఉపయోగించవచ్చు.

## 6.5. గద్య భాగానికి పాఠ్యపథకం

ఉపాధ్యాయుని పేరు/ :

| | | | |
|---|---|---|---|
| ఉపాధ్యాయుని పేరు | : | పాఠశాల | : |
| విషయం | : | తేది | : |
| తరగతి | : 4 | పీరియడ్ | : |
| శీరిక | : తెనాలి రామకృష్ణుడు | | |

సామాన్య ఉద్దేశ్యాలు **(General aims)**

- విద్యార్థులలో భాషాపరిజ్ఞానం పెంపొందించడం.
- విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించడం.
- కొత్త పదజాలంపై అధికారం కల్గించడం.
- భాషానైపుణ్యాలను పెంపొందించడం. కొత్తపదజాలం పై అధికారం కల్గించడం. క్షుణ్ణపఠనకు పురికొల్పడం.
- సంస్కృతి, సంప్రదాయాలు పెంపొందించడం.
- సృజనాత్మకశక్తిని పెంపొందించడం.
- ఆనందానుభూతి పెంపొందించడం.
- ఆలోచనాశక్తిని రేకెత్తించడం.
- విద్యార్థులలో మానవీయతభావాలను పెంపొందించడం.

ప్రత్యేక ఉద్దేశ్యం **(Specific aims)**

- రాజాజ్ఞమూలంగా సామాన్య ప్రజలు ఎదుర్కొనే కష్టనష్టాలను శ్రీకృష్ణదేవరాయలకు, తెనాలిరామకృష్ణుడు తెలియజేయడం.
- నాటి సాంఘిక, రాజకీయ, చారిత్రక విషయాలను తెలియజేయడం.

లక్ష్యాలు – స్పష్టీకరణాలు **(Objectives Specifications)**

- జ్ఞానం – స్పష్టీకరణాలు **(Knowledge -Specifications)**

జ్ఞప్తికి తెచ్చుకొనటం, గుర్తించటం **(Recollection, Identification)**

(అ) విషయజ్ఞానం **(Knowledge of the subject)**

○ శ్రీకృష్ణదేవరాయలు దేశక్షేమం కోరి బలమైన అశ్వదళమును ఏర్పాటు చేయదలచాడు.

○ అరబ్బు దేశం నుండి వేయి గుఱ్ఱపు పిల్లలను తెప్పించాడు.

○ విజయనగర ప్రజలకు ఇంటికొక గుఱ్ఱపు పిల్లను ఇచ్చి పోషించడానికి కొంత డబ్బును కూడా ఇచ్చాడు.

○ రాజాజ్ఞకు భయపడి ప్రజలు తమ సొంతధనాన్ని వెచ్చించి గుఱ్ఱాలను బలంగా పెంచారు.

○ ఆఖరుకు ప్రజలు తమకోసం పడిన కష్టాలను తెలుసుకొని పశ్చాత్తాపపడ్డాడు.

(ఆ) భాషాజ్ఞానం **(Knowledge of the Subject)**

○ కఠిన పదాలు :

ఆజ్ఞాపించుట = ఉత్తరువు జారీ చేయడం.

పశ్చాత్తాపము = చేసిన తప్పుకు బాధపడడం

○ పదాలను విడదీయడం.

* ఇంటికొక = ఇంటికి + ఒక

* రాజాస్థానము= రాజ+ ఆస్థానము

* గుఱ్ఱములన్ని = గుఱ్ఱములు + అన్ని

(సంధులు, సూత్రాలు, సమాసాలు మొదలైన వాటిని మాధ్యమిక, ఉన్నత తరగతులకు పరిచయం చేయవచ్చు)

**II** అవగాహన- స్పష్టీకరణలు : **(Understanding Specifications)**

○ విద్యార్థులు పోలికలు గ్రహించడం.

○ భేదాలు గ్రహించడం.

○ తెలియజేయడం.

○ కొత్త ఉదాహరణల ఇవ్వడం.

○ ప్రాధాన్యక్రమం గ్రహించడం.

○ ఔచిత్యం గ్రహించడం.

○ ఊహించడం.

– తెనాలిరామకృష్ణుడు ఎవరో తెలియజేయడం.

– మనదేశాన్ని పరిపాలించిన గొప్ప రాజుల పేర్లను ఉదాహరించడం (అక్బరు, అశోకుడు మొదలైన వారు)

**III** నైపుణ్యాలు **-** స్పష్టీకరణలు: **(Skills - Specifications)**

○ పఠననైపుణ్యం : **(Reading Skill)** విద్యార్థులు ఈ పాఠ్యభాగాన్ని భావానుగుణంగా చదవడం.

○ వినియోగనైపుణ్యం :**(Application Skill)** విద్యార్థులు కొత్త సంబంధాలను సొంత వాక్యాలలో ఉపయోగించడం.

○ వ్యక్తీకరణ నైపుణ్యం : **(Expression Skill)**

పాఠ్యభాగాన్ని సొంతమాటలలో చెప్పడం. పాఠ్యభాగాన్ని సొంతమాటలలో వ్రాయండి.

○ సృజనాత్మక నైపుణ్యం **(Creative skill)**

**IV ఆసక్తులు : స్పష్టీకరణలు (Desire/pleasure Specifications)**

- తెనాలిరామకృష్ణుని కథలను చదవాలనే ఆసక్తి పెంపొందడం.
- రచనలు చేయాలనే అభిలాషకలగడం.
- మాతృభాషపై అభిమానం పెంపొందడం.
- సారస్వత సమావేశాలలో పాల్గొనడానికి ఆసక్తి చూపడం.
- తమ సొంత అభిప్రాయాలను ప్రకటించడం.

**V వైఖరులు - స్పష్టీకరణలు: (Attitudes Specifications)**

- విద్యార్థులలో ఆర్ద్రతా గుణం పెంపొందడం.
- కవులను, రచయితలను గౌరవించడం.
- మాతృభాషలో అన్ని వ్యవహారాలు నిర్వహించడం.
- సారస్వత సమావేశాలలో పాల్గొనడం.
- విమర్శను సహృదయతతో స్వీకరించడం.
- నైతిక విలువలు పాటించడం.

బోధనోపకరణాలు **(Teaching Learning Materials)**

- తెనాలి రామకృష్ణుడు, గుఱం, అశ్వదళాధిపతి, శ్రీకృష్ణదేవరాయల చిత్రాలున్న దృశ్యంపటం.
- కఠినపదాలకు అర్థాలు – పట్టిక

  వ్యతిరేకపదాలు – పట్టిక

బోధన పద్ధతి – పూర్ణపద్ధతి **(Teaching method)**

ముక్కలు ముక్కలుగా కాకుండా పాఠ్యాంశాన్ని మొత్తంగా స్వీకరించుట.

బోధన విధానాలు : **(Teaching Techniques)**

- కథన విధానం **(Narration)**
- ప్రశ్నోత్తర విధానం
- వాక్యప్రయోగ విధానం
- పఠన విధానం
- వివరణ విధానం

పరిశీలించిన గ్రంథాలు **(Books to be referred)**

- సూర్యారాయాంధ్ర నిఘంటువు
- తెనాలి రామకృష్ణుని కథలు

బోధన – అభ్యసన కృత్యాలు : **(Teaching learning activities)**

ప్రేరణం **(Motivation)**

1. దేశాన్ని పరిపాలించే రాజుల బాధ్యతలు ఏవి?

జ. ప్రజల క్షేమం కోసం పరిపాలించడం ప్రజల మంచి చెడులను తెలుసుకోవడం.

2. రాజాజ్ఞ మీరితే ఏమవుతుంది ?

జ. శిక్షిస్తాడు

శీరికా ప్రకటన : **(Announcement of the Title)**

రాజాజ్ఞను శిరసావహించి కష్టనష్టాలను ఓర్చుకొన్న ప్రజలు సమస్యను పరిష్కరించిన తెనాలిరామ కృష్ణుడు కథ ద్వారా తెలుసుకొందాం.

కృత్యం : 1 **(Activity)**

విజయనగర రాజైన శ్రీకృష్ణదేవరాయలను గురించి వివరించాలి.

కృత్యం : 2

తెనాలి రామకృష్ణుని కథలను కొన్నింటిని చెప్పాలి. ఇలాంటి కథలాంటిదే ఈ పాఠ్యభాగమని వివరించాలి.

కృత్యం : 3

పాఠ్యభాగాన్ని భావానుగుణంగా విడదీసి చదవాలి.(పాఠ్యభాగాన్ని పూర్తిగా ఒకేసారి కాకుండా ఒక్కొక్క అంశానికి ప్రాధాన్యమిస్తూ చదవాలి)

కృత్యం : 4

పాఠ్యభాగాన్ని చదివినపుడు అందులో ఉండే కఠినపదాలను నల్లబల్లపై వ్రాయాలి. వాటికి అర్థాలను వివరించాలి.

కృత్యం : 5

పాఠ్యభాగంలోని వ్యతిరేకపదాలను నల్లబల్లపై వ్రాసి వివరించాలి.

కృత్యం : 6

పాఠంలోని కొన్నిపదాలను వాక్యప్రయోగం చేయించాలి.

ఉదాహరణకు:

ం ఆజ్ఞాపించుట : ఉద్యోగులు తమవిధులను సక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆజ్ఞాపించింది

ం కండబలం : మానవులకు కండబలం ఉంటే మాత్రం సరిపోదు. గుండెబలం కూడా ఉండాలి.

కృత్యం : 7

విద్యార్థులచే మౌనంగా పాఠ్యభాగాన్ని చదివించాలి.

కృత్యం : 8

స్థూలభావం మీద కొన్ని ప్రశ్నలు అడగాలి.

ం శ్రీకృష్ణదేవరాయలు వేయి గుఱపు పిల్లలను ఎక్కడ నుండి తెప్పించారు?

జ. అరబ్బు దేశము

ం శ్రీకృష్ణదేవరాయలు గుఱపు పిల్లలను ఇంటికొకటి ఇచ్చి ఏమని ఆజ్ఞాపించాడు.

జ. గుఱపు పిల్లలను తగినరీతిగా శ్రద్ధగా పెంచాలని ఆజ్ఞాపించాడు.

ం తెనాలిరామకృష్ణుడు శ్రీకృష్ణదేవరాయలకు ఏమని సమాధానమిచ్చాడు.

జ. రాజాజ్ఞకు భయపడి ప్రజలు సొంతధనాన్ని వెచ్చించి గుఱాలను పుష్టిగా పెంచారు. గుఱాలను ఖర్చుపెట్టడం వల్ల ఉపవాసాలుండి ప్రజలు బక్కచిక్కి పోయారు. దీన్నే రాజుగమనించాలని చెప్పాడు.

కృత్యం : 9

సంధి పదాలను కొన్నింటిని విడదీసి చూపించాలి.

రాజ+ ఆస్థానము = రాజాస్థానము

ఇంటికి + ఒక = ఇంటికొక

గుఱములు + అన్ని = గుఱములన్ని

పునర్వ్యవుర్శ : **(Reinforcement)**

విద్యార్థులలో ఒకరు శ్రీకృష్ణదేవరాయలుగా, ఒకరు తెనాలిరామకృష్ణుడుగా, ఒకరు అశ్వదళా . దిపతిగా, కొందరిని ప్రజలుగా, కొందరిని గుఱాలుగా ఎన్నుకొని పాఠ్యభాగాన్ని నాటకరూపంలో ప్రదర్శించమని చెప్పాలి.

ఈ విధంగా చేయడం వల్ల పాఠాన్ని ఒకసారి పునరావృతం చేసినట్లవుతుంది.

మూల్యాంకనం : **(Evaluation)**

- ౦ శ్రీకృష్ణదేవరాయలు ప్రజలకు ఏమని ఆజ్ఞాపించాడు ?
- ౦ తెనాలిరామకృష్ణుడు గుఱపు పిల్లను ఏమి చేసాడు ?
- ౦ తెనాలిరామకృష్ణుడు శ్రీకృష్ణదేవరాయలకు ఏమని తెలియజేసాడు?
- ౦ ఈ పాఠ్యభాగాన్ని సొంతమాటలలో చెప్పండి.
- ౦ ఈ పాఠ్యభాగానికి ఇంకొక శీరికను సూచించండి.
- ౦ ఈ పాఠ్యభాగంలో నీతి ఏమిటి?

ఇంటిపని : **(Follow - up- work)**

- ౦ శ్రీకృష్ణదేవరాయల పరిపాలనా విధానాన్ని గురించి తెలుసుకొని రండి.
- ౦ తెనాలిరామకృష్ణుని కథలను కొన్నింటిని సేకరించుకొనిరండి. రెండు కథలను వ్రాసుకొని రండి.

## 6.6. వ్యాకరణాంశానికి పాఠపథకం

| | | | |
|---|---|---|---|
| ఉపాధ్యాయుని పేరు/ | : | | |
| ఉపాధ్యాయుని పేరు | : | పాఠశాల | : |
| విషయం | : తెలుగు | తేది | : |
| తరగతి | : | పీరియడ్ | : |
| శీరిక | : విరామచిహ్నాలు | | |

సామాన్య ఉద్దేశ్యాలు **(General aims)**

వ్యాకరణ ప్రధాన బోధనోద్దేశ్యం భాషాస్వరూపం తెలియచేయడం. అదే దాని బోధనసామాన్యోద్దేశ్యం

- ౦ విద్యార్థులకు భాషా స్వరూప స్వభావాలు తెలియజేయడం.
- ౦ విద్యార్థులలో విరామచిహ్నాలను పాటించేవిధంగా పఠన నైపుణ్యాన్ని పెంపొందించడం.
- ౦ విరామచిహ్నాలనుపయోగించి అర్థవంతమైన లేఖన నైపుణ్యాన్ని విద్యార్థులలో పెంపొందించడం.
- ౦ విద్యార్థులు విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకొనే సామర్థ్యాన్ని పెంపొందించడం.

ప్రత్యేక ఉద్దేశాలు : **(Specific aims)**

విద్యార్థులు విరామచిహ్నాలను గురించి తెలుసుకునేటట్లు చేయడం.

లక్ష్యాలు – స్పష్టీకరణాలు : **(Objectives Specifications)**

- ౦ జ్ఞానం :

  1. జ్ఞప్తికి తెచ్చుకోవడం 2. గుర్తించడం.

- ౦ విషయజ్ఞానం :

  1. విద్యార్థులలో విరామచిహ్నాలను జ్ఞప్తిలో ఉంచుకొనేటట్లు చేయడం, గుర్తింపచేయడం.
  2. విద్యార్థులలో విరామచిహ్నాలు ఏవేవో గ్రహింపచేయడం.

అవగాహన - స్పష్టీకరణలు : **(Understanding Specifications)**

విద్యార్థులు పోలికలు గ్రహించడం, భేదాలు గ్రహించడం, వివరించడం, కొత్త ఉదాహరణలతో వివరించడం, ఔచిత్యం గ్రహించడం.

విషయ స్పష్టీకరణలు **(Subject Specifications)**

- ౦ విద్యార్థులు విరామచిహ్నాలు గురించి తెలుసుకుంటారు.
- ౦ విద్యార్థులు పాఠాలలో విరామచిహ్నాలను గుర్తిస్తారు.

○ విద్యార్థులు విరామచిహ్నాలను అనుసరించి పఠించడం తెలుసుకొంటారు.

○ విద్యార్థులు విరామచిహ్నాలను ఉపయోగించి వ్రాయడంలో నైపుణ్యాన్ని పొందుతారు.

**III** నైపుణ్యాలు : స్పష్టీకరణాలు **(Skills- Specifications)**

విద్యార్థులు విరామచిహ్నాలను ఉదాహరించి ఉపయోగించుకొనేలా చేయడం.

బోధనోపకరణాలు **(Teaching learning Materials)**

1. విరామచిహ్నాలను పరిచయం చేయడానికి ఉపయోగపడే చిత్రపటం.
2. విరామచిహ్నాలను వాటి పేర్లను జతపరచే విధంగా తయారుచేసుకొన్న అట్టలు.

పరిశీలించిన గ్రంథాలు **(Books to be Referred)**

పెద్దబాలశిక్ష – గాజుల సత్యనారాయణ, పాఠశాల వ్యాకరణం.

బోధన అభ్యసన కృత్యాలు : **(Teaching learning Activities)**

ప్రేరణ : ప్రశ్నోత్తర విధానం **(Motivation)**

○ విరామం అంటే ఏమిటి ?

జ. ఆపడం లేదా ఆగడం.

○ చిహ్నం అంటే ఏమిటి ?

జ. గుర్తు

○ చదువుతున్నప్పుడు విరామం ఎందుకు అవసరం ?

జ. విరామం ఉండి చదివితే అర్థవంతంగా ఉంటుంది.

వాక్యాలలో చిహ్నాలు ఎందుకు ?

శీరికా ప్రకటన : **(Announcement of the title)**

వాక్యాలను విరామచిహ్నాలు ఎందుకు ? వాటి ప్రాధాన్యాన్ని గురించి ఈ రోజు తెలుసుకుందాం.

కృత్యం : 1

విరామచిహ్నాలు వ్రాసిన చిత్రపటాన్ని విద్యార్థులకు చూపించి వాటిని పరిచయం చేయడం.

కృత్యం : 2

బిందువు లేక ముగింపు చుక్క ఫుల్‌స్టాప్ (.) భిన్నవాక్యాల మధ్య చివర ఈ గుర్తు వస్తుంది.
వాక్యం పూర్తి అయినపుడు దాన్ని సూచించడానికి బిందువు పెడతారు.

ఉదా జాతర సమీపిస్తోంది. బట్టలుకొనాలి.

కృత్యం : 3

వాక్యాంశ బిందువు **(Comma)** కామా (,)

వాక్యం పూర్తికానప్పుడు మరొక వాక్యం వ్రాయవలసినపుడు అసమాపక క్రియలను వాడి వాక్యం వ్రాస్తున్నపుడు కామా ఉపయోగిస్తారు.

ఉదా స్వాతంత్ర్యదినోత్సవం, గణతంత్రదినోత్సవం, ఉపాధ్యాయదినోత్సవం, బాలలదినోత్సవం మొదలైనవి సంఘపరమైన పండుగలు.

కృత్యం : 4

అర్థబిందువు (Semi-colon) సెమికోలన్ (;)

ఒక పెద్ద వాక్యంలో భాగంగా ఉండే చిన్నవాక్యాల చివర అర్థబిందువు వస్తుంది.

ఉదా చదివినంత చిత్త సంస్కారమబ్బదు; చదువు చదివి కూడా జడులుకారె ?

కృత్యం : 5

అనుకరణ చిహ్నములు (Inverted commas)

( “ ” )

ఒకరు చెప్పిన మాటలను ఇంకొకరు చెపుతున్నప్పుడు ఏదైనా ఒక గ్రంథం నుండి గ్రహించిన వాక్యాలను చెప్పవలసినపుడు అనుకరణ చిహ్నాలను వాడుతారు.

ఉదా “తథాస్తు ” అన్నాడు పరమశివుడు.

కృత్యం : 6

ప్రశ్నార్థకం (Question mark ) (?)

ఎదుటివారిని ప్రశ్నించేటట్లు, అడిగేటపుడు ఆ వాక్యం చివర (?) ఈ ప్రశ్న గుర్తును ఉపయోగిస్తారు.

ఎవరు మీరు? ఎక్కడ నుండి వచ్చారు ?

కృత్యం : 7

ఆశ్చర్యార్థకం (Exclamatory mark)

ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని, భయాన్ని, వింతను, మెచ్చుకోలును తెలిపే పదాల చివర ఈ గుర్తు (!) ను ఉపయోగిస్తారు.

ఉదా ఆహా ! మీరు ఎంత తెలివి గలవారు !

కృత్యం : 8

కుండలీకరణం (Brackets)

భాషాపదాల వివరణ ఇవ్వడానికి, మరొక పేరును తెలియజేయడానికి, ఒక విషయాన్ని విపులంగా తెలియజేయడానికి కుండలీకరణాలను ఉపయోగిస్తాం.

ఉదా దాశరథికి (రామునకు) నమస్కారం. నిష్కారణంగా నీచుడు (పాపభీతిలేనివాడు గనుక) సత్పురుషులకు కీడు చేస్తాడు.

కృత్యం : 9

విరామచిహ్నాలను ఉపయోగించి విద్యార్థులతో వాక్యాలు వ్రాయించాలి.

పునర్విమర్శ : (Reinforcement)

విరామచిహ్నాలను ఒక్కొక్క చిహ్నాన్ని ఒక్కొక్క చిన్న అట్టముక్కలో వ్రాసుకోవాలి. విద్యార్థులకు ఇవ్వాలి. చిన్నకర్ర పుల్లకి ఆ చిహ్నాన్ని తగిలించాలి. విద్యార్థులను కొందరిని పిలిచి వాక్యాలు చెప్పమనాలి. ఏ చిహ్నం ఎక్కడ అవసరమో, ఆ చిహ్నం గల అట్టముక్కలు గల విద్యార్థులను ఆస్థానంలో నిలబడమని చెప్పాలి.

ఈ విధంగా విరామచిహ్నాలను పునరావృతం చేయించవచ్చు.

మూల్యాంకనం : (Evaluation)

o విరామచిహ్నాల ప్రయోజనం ఏమిటి?

o ఊరి చివరలో ఒక కొలను ఉంది ఆ కొలనులో తామరలు, కలువలు, చేపలు, కప్పలు ఉన్నాయి గట్టున పక్షులు ఉన్నాయి. ఆహా ఎంత అందంగా ఉన్నాయి.

పై వాక్యాలలో విరామచిహ్నాలను గుర్తించండి.

ఇంటిపని (Follow up work)

విరామచిహ్నాలు అన్నింటిని ఉపయోగించి వాక్యాలు కొన్నింటిని వ్రాసుకొని రండి.

## 6.7. ఉపవాచకానికి పాఠపథకం

ఉపవాచకబోధనలో ఉపాధ్యాయుడు మార్గదర్శిగా, సహాయకారిగా మాత్రమే ఉంటాడు. విద్యార్థులు స్వయంగా అభ్యసిస్తారు. మిగతా వాటికివలె ఉపవాచక బోధనకు విపులమైన పాఠపథకం అవసరం లేదు. సంక్షిప్తంగా పాఠపథకం వ్రాసుకొంటే సరిపోతుంది.

సామాన్య ఉద్దేశ్యం

- విషయజ్ఞానం
- అవగాహన అంశాలు
- వ్యక్తీకరణనైపుణ్యాలు.
- విద్యార్థిని విస్తారపఠనకు అలవాటు చేయడం
- స్వీయాభ్యసనకు ప్రోత్సహించడం.
- వివిధ గ్రంథాలను పఠించాలనే అభిరుచిని కల్గించడం.
- కొత్తపదాలు గుర్తించి వాటి అర్థాన్ని నిఘంటవుల ద్వారా తెలుసుకొనే ప్రయత్నం
- మౌనపఠనకు ప్రోత్సహించడం.

ప్రత్యేక ఉద్దేశం (శీరిక) బోధనలలో గల ప్రయోజనాలు

**I** విషయవిశ్లేషణ : ఉపవాచక పాఠ్యాంశంలోని బోధనాంశాలు వ్రాయాలి.

**II** లక్ష్యాలు స్పష్టీకరణలు : 1. విషయజ్ఞానం 2. అవగాహనఅంశాలు 3.వ్యక్తీకరణనైపుణ్యాలు

**III** బోధనపద్ధతులు : 1. నియోజనపద్ధతి 2.చర్చాపద్ధతి

**IV** బోధనోపకరణాలు : కథలు చిత్రించినచార్టులు

**V** పరిశీలన గ్రంథాలు :

**1.** ప్రేరణ : విద్యార్థుల పూర్వజ్ఞానాన్ని పరిశీలించే విధంగా ప్రశ్నలు అడగడం.

**2.** నియోజనాలు : ఉపవాచకంలోని పాఠ్యాంశానికి సంబంధించి కొన్ని ప్రశ్నలను ఉపాధ్యాయులు ఇవ్వాలి. ఈ ప్రశ్నలకు సమాధానాలను విద్యార్థులను సొంతంగా వ్రాయమని చెప్పాలి.

**3.** చర్చ : విద్యార్థుల నియోజనాలపై తరగతిగదిలో చర్చ నిర్వహించాలి.

ఉపాధ్యాయుడు తన అభిప్రాయాలను తెలియజేయాలి.

ఉపవాచకబోధన ద్వారా ఉపాధ్యాయుడు మౌనపఠన నైపుణ్యాన్ని విద్యార్థులలో పెంపొందించాలి. నైతికవిలువలను విద్యార్థులు అనుసరించే విధంగా ఉపాధ్యాయుడు హితబోధన చేయాలి.

| |
|---|
| పద్య, గద్య, ఉపవాచక పాఠాలకు, వ్యాకరణాంశాలకు పాఠ్యపథకాన్ని తయారుచేసి సమర్పించండి. |

కృత్యం :

| వ.సంఖ్య | భాషా నైపుణ్యాలు ( భాష - అంశాలు) | వీటి అభివృద్ధికి నీవు సూచించే 2 కార్యక్రమాలు / కృత్యాలు |
|---|---|---|
| 1. | శ్రవణం | రేడియో వార్తలు వినిపించుట |
| 2. | బాషణం | నాటకీకరణం |
| 3. | పఠనం | ప్రార్థనా సమావేశంలో వార్తలు చదవడం |
| 4. | లేఖనం | మిత్రునికి జాబు వ్రాయడం |

కృత్యం : శిశుగేయాలను (2) రెండింటిని రికార్డు చేసి మొదట ఉపాధ్యాయుడు తానుపాడి, వినిపించి విద్యార్థులు అందరి చేత కలిసి పాడించడం.

ఉదా

అరటి పండు తీపి
ఆవు పాలు బలము
ఇటుక మిద్దె షోకు
ఈగ తెచ్చు రోగం
ఉడుత సేవ మేలు
ఊయలెంతో సుఖము
ఋణము ఎంతో ముప్పు
ఎలుక తోలు నలుపు
ఏనుగు దంతం తెలుపు
ఐసు గడ్డ చలువ
ఒంటె ఇసుక ఓడ
ఓడ క్రింద నీరు
ఔటులన్ని ప్రేలె
అందమైన పూలు
అః ఎంతో బాగు

కృత్యం :

పరిచయం ఉన్న అంశాలను ఇచ్చి పిల్లల చేత వర్ణింపజేయడం.
ఉదా బడితోట, మా ఊరు, పరిశుభ్రత - పచ్చదనం.

=======

**ప్రశ్నపత్రం - సమగ్ర పథకం**

| సమయం : 3.00 గంటలు | | | | | | | | | | | | గరిష్ట మార్కులు - 100 | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| అధ్యాయం/ బోధనా ఉద్దేశం | జ్ఞానం (36) | | | అవగాహన(30) | | | అన్వయం(20) | | | నైపుణ్యం(14) | | | మొత్తం (100) | | |
| | స.స. | ల | వ్యా | స.స. | ల | వ్యా | స.స. | ల | వ్యా | స.స. | ల | వ్యా | స.స. | ల | వ్యా |
| భాషాసామర్థ్యాలు(28) | 5 | 0 | 0 | 1 | 1 | 0 | 2 | 1 | 0 | 0 | 1 | 0 | 8 | 3 | 0 |
| భాషా స్వరూప స్వభావాలు(14) | 2 | 0 | 0 | 0 | 0 | 1 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 2 | 0 | 1 |
| భాషాబోధన (8) | 2 | 0 | 0 | 0 | 0 | 0 | 2 | 0 | 0 | 0 | 0 | 0 | 4 | 0 | 0 |
| భాషా నైపుణ్యాలు(18) | 1 | 0 | 0 | 3 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 1 | 4 | 0 | 1 |
| భాషాబోధనపద్ధతులు(16) | 2 | 1 | 0 | 0 | 1 | 0 | 2 | 0 | 0 | 0 | 0 | 0 | 4 | 2 | 0 |
| బోధనా సామర్థ్యాలను పెంపొందించడం (4) | 2 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 2 | 0 | 0 |
| పరిశీలన(4) | 1 | 0 | 0 | 1 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 2 | 0 | 0 |
| పాఠ్యపథకం(8) | 1 | 0 | 0 | 1 | 0 | 0 | 0 | 1 | 0 | 0 | 0 | 0 | 2 | 1 | 0 |
| మొత్తము(100) | 16 | 1 | 0 | 6 | 2 | 1 | 6 | 2 | 0 | 0 | 1 | 1 | 28 | 6 | 2 |

**గమనిక :** స.స. - సంక్షిప్త సమాధాన ప్రశ్నలు (100 పదాలకు మించకుండా)

ల - లఘు, సమాధాన ప్రశ్నలు ( 200 పదాలకు మించకుండా)

వ్యా - వ్యాసరూప ప్రశ్నలు ( 500 పదాలకు మించకుండా)

- గడిలో ఉన్న సంఖ్యలను ప్రశ్నల సంఖ్యలను సూచిస్తుంది

## తెలుగుభాషా బోధన

## మొదటి సంవత్సరం

సమయం : 3 గంటలు **మాదిరి ప్రశ్న పత్రం** గరిష్ఠ గుణములు– 100

విభాగం – అ

**I** క్రింది ప్రశ్నలన్నింటికి నూరుపదాలకు మించక జవాబులు వ్రాయండి (10x2)=20

1. కాలాలు ఎన్ని అవి ఏవి? ఉదాహరణాలతో వివరించండి.
2. పరుషములు, సరళములు, స్థిరములు, అంతస్థములు ఏవి ? వ్రాయండి.
3. సంధి అంటే ఏమిటి ? ఉదాహరణతో వివరించండి.
4. ఉకారానికి సంధి నిత్యం నిగమనపద్ధతిలో వివరించండి.
5. వచనాలు ఎన్ని? అవి ఏవి ?
6. ఉత్తమ గుణములు నీచున
   కెత్తెఱగున గలుగనేర్చు నెయ్యెడలన్ దా
   నెత్తిచ్చి కఱగి పోసిన
   నిత్తడిబంగారమగునె యిలలో సుమతీ !
   ఈ పద్యంలో ఎవరని దేనితో పోల్చారు.
7. వాక్యం అంటే ఏమిటి? వాక్యాంగాలు ఏమి? ఉదాహరణలతో వివరించండి.
8. ఈ వాక్యంలో విరామ చిహ్నాలనుగుర్తించండి.
   మిత్రమా నిన్ను నేనెవరినీ కాటువేయవద్దన్నాను గాని బుసకొట్టి భయపెట్టవద్దన్నానా నువ్వు ఏ ప్రాణిని కాటు
   వేయకుండా బుసకొట్టి ఎవరినీ నీ సమీపానికి రాకుండా చెయ్యవచ్చు గదా
9. ఉచ్చారణదోషాన్ని తొలగించడానికి ఏదైనా రెండు ఉదాహరణలు ఇవ్వండి.
10. ఏదేశమేగినా ఎందుగాలిడిన
    ఏ పీఠమెక్కినాఎవ్వరెదురయిన
    పొగడరా నీతల్లి భూమిభారతిని
    నిలుపరా నీజాతి నిండుగౌరవము
    లేదురా యిటువంటి భూదేవియెందు
    లేదురా మనవంటి ధీరులింకెందు !
    ఈ గేయాన్ని వివరించడానికి ఏవైనా రెండు ఉదాహరణలు ఇవ్వండి.

**II** క్రింది ప్రశ్నలలోఏవైనా 5 ప్రశ్నలకు రెండువందల పదాలకు మించక జవాబులు వ్రాయండి

**(5x4) =20**

11. ఎక్కడనో జనించి, పరమేశ్వరుడిచ్చినగాలి పీల్చి, వే
    రొక్కరి జోలికేగక, యెదో భుజయించి, సరోవరాలలో
    గ్రుక్కెడు నీళ్ళు గ్రోలి, వినువ్రోవల నేగెడు రాజహంసపై
    రక్కసి బుద్ధి సెల్లునె ? మరాళ మరాళ శరాగ్నులోర్చునే?
    ఈ పద్యానికి భావం రాయండి. ఈసన్నివేశాన్ని వివరించండి.
12. తెలుగుభాషలోని పదములు – విభాగాలను వ్రాయండి.
13. తేజిత బాణహస్తు దృఢదీర్ఘ మలీయస కృష్ణదేహు గృ
    ష్ణాజిన వస్త్రు నస్త్ర విషయాస్త విషాదు నిషాదు జూచి,యా
    రాజకుమారులందఱు బరస్పర వక్త్ర విలోకన క్రియా

వ్యాజమునం దదీక్షణ నివారితులై రతిమత్సరంబునన్
ఈ పద్యపాదానికి గణవిభజన చేసి లక్షణాలు వ్రాయండి.

14. సీతారామయ్య : నానీ ! రా ! ఇక్కడ కూర్చో ! నీకు ఈ రోజు ఆటలు ఆరోగ్యమును గూర్చి చెబుతా విను

నాని : బోర్ కొట్టకుండా ఉంటే చెప్పుతాతయ్యా ! వింటాను.

సీతారామయ్య : నీకు ఆసక్తి కలిగేటట్లు చెపుతా !

నాని :

సరే ! చెప్పుతాతయ్యా ! సీతారామయ్య తన ధోరణిలో చెప్పుట ప్రారంభించాడు

సీతారామయ్య : ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు. అంటే ఏ జబ్బూ లేకుండా జీవించడమే గొప్ప సంపద. ఈ ఆటల వల్ల ఆరోగ్యం చేకూరుతుంది. మనిషి ఆరోగ్యానికి పోషకాహారమెంత ముఖ్యమో ఆటలు వ్యాయామము అంత ముఖ్యం. ఈ ఆటలను మూడు విధాలుగా విభజించారు. నానీ !

నానీ : తాతయ్యా ! ఆటలంటే రకాలేముంటాయి. చెప్పండి, వింటాను.

సీతారామయ్య : నానీ ! ఆటలు మూడురకాలు. పాఠశాలలో ఆడు ఆటలు, బహిరంగంగా

ఆడు ఆటలు, జాతీయమైన ఆటలు, మా కాలంలో గోలీలు, కోతికొమ్మచ్చి, కోలాటం, తొక్కుడు బిళ్ళ, అచ్చనగాయలు, చెమ్మచెక్క మొదలగు ఆటలు ఆడేవాళ్ళం.

పై సంభాషణను వాక్యరూపంలో రాయండి.

15. యడాగమసంధిని ఆగమన పద్ధతిలో ఏవిధంగా వివరిస్తారో వ్రాయండి.

16. కెల్లర్ గ్రుడ్డివారి శ్రేయస్సుకోసం పాటుపడమని ఉద్భోధించాలనే సదుద్దేశంతో ప్రజల్లోకి వెళ్ళి అనేక సభల్లో సమావేశాల్లో ప్రసంగాలు ఇవ్వసాగింది. ఆమె ఉపన్యాసాలు ప్రజలకు బాగా నచ్చాయి. దానివల్ల ఆమెకు ప్రజల్లో ఆకరణ బాగా పెరిగింది. చివరకు అమెరికా అధ్యక్షుడు కూడా ఆమెను వైట్ హౌస్‌కి ఆహ్వానించి అంధుల సహాయార్థం విరాళం ఇచ్చారు. అమెరికా అధ్యక్షులుగా పనిచేసిన ప్రతివ్యక్తి ఆహ్వానించి విరాళాలు ఇచ్చిన ఘనత హెలెన్‌కెల్లర్‌కే దక్కింది. పైన పేర్కొన్న వాక్యాలలో కేంద్రీకృతమైన భావం ఏది ? కఠినపదాలకు అర్థాలను రాయండి. శీరికను సూచించండి.

17. స్త్రీవిద్యను గురించి వ్యాసం వ్రాయడానికి ఉండవలసిన సోపానక్రమం వ్రాయండి. ఈ వ్యాసంలోమీరు ఉపయోగించిన సామెతలు ఏవైనా నాల్గింటిని వ్రాయండి.

18. అనువుగాని చోట నధికులమనరాదు.
కొంచెముండటెల్ల కొదువగాదు
కొండ అద్దమందు కొంచెమైయుండదా?
విశ్వదాభిరామ వినురవేమ.

1. అనువుగానిచోట అధికులు మనరాదు. ఎందుకు ?
2. కొంచెముండుటెల కొదువరాదు. ఎందువల్ల?

విభాగం – ఆ

**III** క్రింది ప్రశ్నలన్నింటికి నూరుపదాలకు మించకుండా జవాబులు వ్రాయండి (10x2) =20

19. మాండలికభాషా పదాలను గురించి జ్ఞానం ఉపాధ్యాయునికి అవసరం ఎందుకు ?

20. గ్రామ్యాలు, దేశ్యాలులకు ఏవైనా నాలుగు ఉదాహరణలు వ్రాయండి.

21. ఉచ్చారణభేదం, ఉచ్చారణ దోషం – అర్థం భేదం గల పదాలను ఏవైనా నాల్గింటిని వ్రాయండి.

22. పద్య, గద్యబోధన ఉద్దేశాలలో గల భేదాలను ఏవైనా రెండింటిని రాయండి.

23. పాఠ్యపథకానికి (Lesson plan), సూక్ష్మాంశబోధన (Teaching Notes)కి ఉన్న భేదాలు ఏవైనా రెండింటిని తెలపండి.

24. నాలుగవతరగతి విద్యార్థులకు సంభాషణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి నాలుగు మార్గాలు చెప్పండి.

25. కృత్యాధారఅభ్యసన (ABL) లో ప్రతిభావంతులైన విద్యార్థులను ఏవిధంగా గుర్తిస్తారు.

26. దేశమంటే మట్టికాదోయ్ ఈ గేయాన్ని బోధించడానికి ఎలాంటి ప్రేరణలు చేస్తారు ?

27. చర్చలు జరిగేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు ఏవి ?

28. ల, ళ, ణ, న, క, ఖ ఈ అక్షరాలను ఉపయోగించి పదాలను వ్రాసేటపుడు ఏవైనా అక్షరాలను మార్చి వ్రాస్తేఅర్థం పూర్తిగా మారుతుంది. దీనికి ఏవైనా నాలుగు ఉదాహరణలు వ్రాయండి.

**IV** క్రింది ప్రశ్నలన్నింటికి నూరుపదాలకు మించకుండా జవాబులు వ్రాయండి (10x2) =20

29. విజ్ఞాన సర్వస్వంలో ఏ ఏ విషయాలుంటాయి. అవి విద్యార్థులకు ఏవిధంగా ఉపయోగపడుతాయి.

30. పఠనసామర్థ్యాన్ని పెంపొందించడంలో గల సమస్యలను వివరించండి.

31. వర్ణోత్పత్తి స్థానాలను గురించి వ్రాయండి.

32. మిమ్మల్ని ఆకరించిన ఏదైనా ఒక పద్యాన్ని వ్రాయండి. అది మిమ్మల్ని ఎందుకు ఆకరించిందో కారణాలను వ్రాయండి.

33. పాఠ్యపథకాన్ని అమలు చేసేటప్పుడు పదజాలలను పెంపొందించడానికి సహాయపడే కృత్యాలు ఏవేవి?

34. గద్యపాఠ్యభాగాలద్వారా పదజాలాలను పెంపొందించడానికి సహాయపడే కృత్యాలు ఏవేవి?

35. విద్యార్థులు పాఠ్యాంశంలో విషయాన్ని అవగాహన చేసుకొనే సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఎలాంటి పుస్తకాలు ఉపయోగపడుతాయి మీరు వివరించండి.

36. సంప్రదాయబద్ధంగా అమలులో ఉన్న విద్యావిధానానికి, కృత్యాధారఅభ్యసన(ABL) విధానానికి ఉన్న భేదాలు ఏవి ?

**V** ఐదువందల పదాలకు మించకుండా జవాబులు వ్రాయండి (2x10) =20

37. వైయక్తికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చెందడానికి భాష ఏవిధంగా తోడ్పడుతుంది.

38. పద్యబోధనాలక్ష్యాలను (లేదా) ఉదాహరణ పూర్వకంగా వివరించండి.

39. మంచిదస్తూరి లక్షణాలు ఏమిటి? ఏ ఏ పద్ధతుల ఉపయోగించి లేఖనా నైపుణ్యాన్ని పెంపొందించగలరు.?

40. పరికల్పనాపద్ధతిని వివరించండి. ప్రాథమిక తరగతులకు పరికల్పనాపద్ధతిలో ఏవిధంగా ఉపయోగించగలరో ఉదాహరణ పూర్వకంగా వివరించండి. కు

=======

| అంతరమూల్యాంకనం | | |
|---|---|---|
| వ. సంఖ్య | వివరాలు | మార్కులు |
| 1.<br>2.<br>3.<br>4.<br>5. | పరిశీలన పత్రాలను పూర్తిచేయడం<br>పాఠ్యపథకాలను తయారుచేయడం<br>ఉచ్చారణ దోషాలు -వాటి సవరణ రూపాల పట్టికను తయారుచేయండి<br>కృత్యాధార అభ్యసన అట్టలను తయారుచేయండి<br>మీ శిక్షణా సంస్థకు ఒక వార్షిక పత్రికను తయారుచేయండి. | 5 |
| 1.<br>2.<br>3.<br>4.<br>5. | బోధనోపకరణాలను తయారుచేయండి<br>శిశుగేయాలను రూపొందించండి<br>గ్రంథాలయాలను సందర్శించండి. నివేదికను సమర్పించండి.<br>ఉచ్చారణ భేదం - అర్థం భేదం గల పదాలను రూపొందించండి.<br>సమగ్ర పథకం (Blue print) ను తయారుచేయండి. | 5 |
| 1. | సారస్వత సమావేశాన్ని నిర్వహించండి | 5 |
| 2. | పరీక్షలు | 5 |
| 3. | ప్రశ్నల నిధి (Question Bank) ను రూపొందించండి. | 5 |
| | మొత్తం | 25 |

# సహకరించిన గ్రంథాలు (BIBLIOGRAPHY)


1. తెలుగుబోధన పద్ధతులు (డి.ఎడ్) – తెలుగు అకాడమి, హైదరాబాదు
2. తెలుగుబోధన పద్ధతులు ( బి.ఎడ్) – తెలుగు అకాడమి, హైదరాబాదు
3. డిప్లొమో ఇన్ ఎడ్యుకేషన్ (దూరవిద్యావిధానం) – రాష్ట్ర విద్యాపరిశోధనాశిక్షణ సంస్థ, హైదరాబాదు.
4. తెలుగుబోధన ప్రదీపిక – డా రావిరంగారావు
5. తెలుగుబోధన పద్ధతులు – చింతా దీక్షితులు
6. తెలుగుభాషలో మెలకువలు – డా॥ తూమాటి సంజీవరావు
7. ఆంధ్రభాషాబోధన సర్వస్వం – రామచంద్రుని వెంకట శేషయ్య
8. అభినవాచార్యకం – గొడవర్తి సూర్యనారాయణ
9. తెలుగుబోధన పద్ధతులు – ఇలపావులూరి కామేశ్వరరావు
10. భాషాబోధన – వై.కె. బ్రహ్ నందం
11. తెలుగుభాషా చరిత్ర – భద్రిరాజు కృష్ణమూర్తి
12. విన్నంత – కన్నంత – బూదరాజు రాధాకృష్ణ
13. సాహిత్య రింఛోళి – చేకూరి రామారావు
14. తెలుగు సాహితీ చరిత్ర – ద్వా .నా .శాస్త్రి
15. సాహిత్య సంస్థలు – ద్వా .నా .శాస్త్రి
16. మాతృభాషలో ప్రాథమిక విద్య – అట్లూరి పురుషోత్తం
17. ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు – పి.ఎస్. సుబ్రహ్మణ్యం
18. సాహిత్యశిల్పసమీక్ష – పింగళి లక్ష్మీకాంతం
19. ఆంధ్రవాజ య చరిత్ర – ఆచార్యదివాకర్ల వేంకటావధాని
20. ఆంధ్రసాహిత్య చరిత్ర (రెండుభాగాలు) – డా.జి.నాగయ్య
21. ఆంధ్ర భాషా వికాసం – డా. గంటిజోగి సోమయాజులు
22. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం – ఆచార్య వేల్చేరు నారాయణరావు
23. తెలుగు సాహిత్యంలో కవిత్వోద్యమాలు – తెలుగు అకాడమీ ప్రచురణ
24. తెలుగుబోధన పద్ధతులు – డా డి. సాంబమూర్తి
25. భాషా నైపుణ్యాలు – కొంపెల్ల ఆంజనేయశాస్త్రి
26. భాషా శాస్త్ర పరిచయం – ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తం
27. తెలుగు భాషా చరిత్ర – స్ఫూర్తిశ్రీ
28. తెలుగు పసిడి – కృష్ణాజిల్లా రచయితల సంఘం

**ENGLISH**

| | | | |
|---|---|---|---|
| 1. | Taxonomy of Educational Objectives | - | Benjamin Bloom |
| 2. | The Teaching of Mother Tongue in Secondary Schools | - | Gurrey |
| 3. | Teaching of Mother Tongue | - | W.M.Rhyburn |
| 4. | The Teaching of Mother Tongue | - | P.B. Ballard |
| 5. | Micro - Teaching | - | Allen & Ryan |
| 6. | Universals in Linguistic Theory | - | Emman Bach |
| 7. | Language | - | Leonard Bloom Field |
| 8. | Syntactic Structures | - | Noam Chomsky |
| 9. | A Course in Modern Linguistics | - | Charles Hocket |
| 10. | An Introduction to the Study of Speech | - | Edward Sapire |
| 11. | An Introduction to Linguistic Science | - | Sturtevart |
| 12. | National Policy on Education | - | 1986 |